
# అవతార్ మెహెర్ బాబా
# జీవిత చరిత్ర



సంకలనం : **బి. రామకృష్ణయ్య**

ప్రథమ ముద్రణ : అక్టోబర్ 1998
కాపీలు : 3000
ద్వితీయ ముద్రణ : జూన్ 2002, 2006, 2008, 2011, 2015
కాపీలు : 3000

ISBN : 81-88224-03-0

**పబ్లిషర్స్**
మెహెర్ మౌనవాణి పబ్లికేషన్స్
16-8-240/7, మలక్‌పేట, హైదరాబాదు-500 024.

**సఫలీకృతం**
మెహెర్ బుక్ హౌస్
www.meherbookhouse.com
email : meherbookhouse@gmail.com

అవతార్ మెహెర్ బాబా చిత్రపటములు, సందేశముల హక్కు దారులు అవతార్ మెహెర్ బాబా పర్పెట్యువల్ పబ్లిక్ చారిటబుల్ ట్రస్ట్, కింగ్స్‌రోడ్, అహమద్ నగర్, మహారాష్ట్ర.

## ప్రథమ ముద్రణలోని - ఆంతర్యము

'నా పని నేనే చేసుకుంటాను - అయినా నా పని చేయడానికి మీ కవకాశం కల్పిస్తుంటాను' అన్నారు మెహెర్ బాబా. అలాంటి అవకాశాన్ని పొంది, మెప్పు కూడా కోరకుండా ఆ అవకాశాన్ని వినియోగించుకొన్న ప్రేమికులు ధన్యులు.

గత పది సంవత్సరాలుగా స్వల్ప పరిమాణంలో అందరికి అందుబాటులో ఉండే విధంగా, చిన్నదైన బాబా జీవితానికి సంబంధించిన ముఖ్య ఘట్టాలన్నింటినీ కలిగియుండే జీవిత చరిత్రను క్లుప్తంగా ఒక పుస్తకమును ప్రచురించాలనే తలంపు కలిగింది. ఆ రోజుల్లో కీ.శే. శ్రీ చాగంటి సుబ్బారావు గారు నాకు సన్నిహితంగా ఉండి అన్ని కార్యక్రమాల్లో నాతో పాల్గొనేవారు. వారితో చెప్పగానే ఆయన బాబా జీవిత చరిత్రను ఒక వంద పేజీల ఇతివృత్తంగా వ్రాసి ఇచ్చారు. దానిని అచ్చు వేయించేలోగా 'లార్డ్ మెహెర్' పుస్తకం ఆంగ్లంలో ప్రచురింప బడింది. దానిలో కొన్ని సంఘటనలను, వివరాలను, సందేశాలను తీసుకొని బాబా జీవిత చరిత్రను మళ్ళీ సంక్షిప్తంగా వేరే వ్రాయాలనే భావనకు ప్రతి రూపమే ఈ చిన్న పుస్తకం. దీనిని రచన అనే దాని కంటే సంకలనం అంటేనే సమంజసంగా ఉంటుందని నా భావన. కీ.శే. చాగంటి సుబ్బారావు గారిచే వ్రాయడ మారంభించబడింది కావున ఈ పుస్తకము ఆయన వ్రాసిన పద్యంతోనే ప్రారంభించబడింది. వ్రాత ప్రతిని ఆమూలాగ్రం చదివి, పరిశీలించిన కీ.శే. శ్రీ వై.ఎల్. వెంకయ్య గారు నిండు హృదయంతో నాకు ఎన్నో సవరణలను సూచించారు. వారి ఆరోగ్యం బాగా లేకపోయినా ఆఖరి రోజుల్లో అమితంగా శ్రమించి, సో.బాల్‌నాటు గారి 'గ్లిమ్ప్సెస్ ఆఫ్ గాడ్ మ్యాన్' మొదలగు గ్రంథాలలోని విషయాలను పురస్కరించు కొని సవరణలను వ్రాసి ఇచ్చారు. వారిద్దరు ఈ సందర్భంగా సంస్మరణీయులు.

ఈ పుస్తకాన్ని నేను పూర్తి చేసి ప్రచురించగలనా అనే సందేహం కలిగింది. అదే సమయంలో నాకు కర్నూలుకు బదిలీ అయి నేనొక్కడినే కర్నూలులో ఉండటం వల్ల సమయంతో బాటు ధైర్యం కూడా చిక్కడంతో ఈ పుస్తకం పూర్తి చేసే భాగ్యాన్ని ప్రియతముడనుగ్రహించాడు. పుస్తక ప్రచురణ కోసం మెహెర్ మౌనవాణి

సంపాదకుడు సో. బాలాజీ సహాయాన్నర్థించి ఆ బాధ్యత మొత్తం ఆయన కప్పగించాను. మాసపత్రికకు సంబంధించిన పని భారం ఒకవైపు, ఇతర సేవా కార్యక్రమాలు ఇంకొక వైపు ఆయనకు తీరిక లేకుండా చేసినా నా ఈ అల్పకార్యాన్ని అనుకున్న సమయంలో ప్రచురించ గలగడానికి ఆయన ముఖ్య కారకుడైనాడు. అలాగే కంప్యూటర్‌లో చక్కగా విషయాన్ని పొందుపరచి తప్పొప్పులను సవరించి సాధ్యమైనంత వరకు సరియైన డి.టి.పి. కాపీలను చేసి ఇచ్చిన శ్రీమతి రేవతి మెహెర్ చంద్ నోరి గారి సహకారాన్ని కూడా పేర్కొనకుండా ఉండలేను. ఈ ముద్రణలో సహకరించిన నా కార్యాలయ సిబ్బందికి, సోదర బాబా ప్రేమికులందరికీ కృతజ్ఞతలు చెప్పడమే కాక వారికి బాబాయొక్క ప్రేమాశీస్సులు లభించాలని కోరుకుంటున్నాను.

ఏ పుస్తకమైనా అది పాఠకుల హృదయాలను రంజింపజేస్తేనే దాని ప్రయోజనం నెరవేరుతుంది. ఈ చిన్న పుస్తకంలో అనంతుడైన అవతార్ మెహెర్ బాబా చరిత్రను ఇమడ్చడానికి ప్రయత్నం చేయడమైంది. ఆకాశాన్ని కాగితం చేసుకొని, చెట్లను కలాలుగా, సముద్రాల నీటిని సిరాగా చేసుకొని వ్రాసినా సనాతనుడైన అవతారుని చరిత్రను వ్రాయలేమని ఓ ప్రేమికుడు వాపోయాడు. అలాంటిది ఇంత చిన్న పుస్తకములో అవతార్ మెహెర్ బాబా పూర్తి చరిత్రను కుదించడం దుస్సాధ్యమే. వేల పేజీలలో ఆంగ్లంలో ముద్రింపబడుతున్న 'లార్డ్ మెహెర్' అనే బాబా సమగ్ర జీవిత చరిత్ర పుస్తకంలోని వివరాలు కూడా కొన్ని ఇంకా విపులంగా లేవు. 'కొండ అద్దమందు కొంచమై ఉండదా' అనే సూక్తి ప్రకారం అపరిమితమైన బాబా జీవిత చరిత్రను సుమారు 220 పేజీల సంపుటిలో అన్ని ముఖ్యఘట్టాలు, సందేశాలు, తత్సంబంధిత కొన్ని ముఖ్యమైన చిత్రములతో (ఫోటోలతో) కూర్చబడింది.

దీనిని చదివిన ప్రేమికులకు, కొత్తవారికి ఇంకా ఎన్నో వివరాలు కలిగిన ప్రేమసాగరుడు, లార్డ్ మెహెర్ వంటి పుస్తకాలను చదవాలనే ఆసక్తి కలిగితే నా యీ చిన్న ప్రయత్నానికి ప్రయోజనం చేకూరినట్లే. అలా బాబా విషయాలను వారు ఎప్పుడూ చదువుతూ బాబాను ఎదలో నిల్పుకొని ఆయన ప్రేమాశీస్సులకు పాత్రులగుదురు గాక.

**బి. రామకృష్ణయ్య**

# ద్వితీయ ముద్రణ – పరిచయము

ప్రథమ ముద్రణలో ముద్రించిన 3000 కాపీలు దాదాపు మూడు సంవత్సరాల కాలంలో అయిపోవడం వలన నా ఈ అల్ప ప్రయత్నంలో అనల్ప ప్రయోజనం ఆశించిన దానికంటే ఎక్కువగానే చేకూరిందని విశ్వసిస్తున్నాను. తత్ఫలితంగానే ఈ రెండవ ముద్రణ కార్యరూపం దాల్చింది. ఈ కార్యం రూపుదిద్దుకోవడానికి ప్రేరణ మరియు సహాయ సహకారం అందించిన వారెందరో ఉన్నారు. వారిలోని కొందరిని పేర్లతో గుర్తు చేసుకోవడం మరచిపోలేని బాధ్యతగా భావిస్తున్నాను. ఎప్పుడూ ప్రియతమ బాబా పనికి ముందుండే సో. ఆంధ్ర బాలాజీ ఈ పనికి ప్రధాన ప్రేరకుడే గాక సహకారి. ఇక్కడ ఆంధ్ర బాలాజీ అని అనడంలో బాలాజీ అనే వ్యవహార నామం గల మెహెర్‌బాదులోని బాలనాటుగారిని గుర్తు చేసుకుంటూ ఈ బాలాజీ  ఆ బాలాజీ కంటే భిన్నమైన వాడని చెప్పడం కోసమే. ఆ బాలాజీ కూడా ట్రస్టుకు సంబంధించి బాబా సాహిత్య ముద్రణ విషయాలు చూచుకుంటూ ఎన్నో పుస్తకాలు ప్రచురించిన వారే. ఆరు మాసాలనుండి సో. బాలాజీ ద్వితీయ ముద్రణ కోసం ప్రోత్సహించి తొందర పెడుతూనే ఉన్నాడు. అది ఈనాటికి కార్యరూపం దాల్చింది. మొదటి ముద్రణకు తోడ్పడిన సో. శ్రీమతి రేవతి మెహెర్ చంద్ నోరి గారే ఈ ద్వితీయ ముద్రణ కోసం అసలు ప్రతికి కంప్యూటరులో ఎన్నో ఫోటోలు అదనంగా చేర్చి అందంగా తీర్చిదిద్ది సిద్ధం చేసి ఇచ్చారు. వారి సహాయ సహకారాలకు సహనానికి జోహార్లు.

అలాగే చదువరులు అనేకులు ప్రోత్సహించారు. ఈ పుస్తకం చదివిన తర్వాత బాబాలోని వారి విశ్వాసం దృఢతరమైనదని కొందరు చెప్పితే క్రొత్త వారికి ఈ పుస్తకం చదవడం ద్వారా స్వల్ప సమయంలో అధిక విషయాలు బాబా గురించి తెలుసుకునే అవకాశం లభించిందని మరియు స్నేహితులకు బంధువులకు పలు

సందర్భాలలో బహూకరించు కోవడానికి, రోజూ పఠించి బాబా జీవిత విశేషాలను మళ్ళీ మళ్ళీ గుర్తు తెచ్చుకోవడానికి చక్కగా ఉపకరించిందని చాలా మంది తెలిపి ప్రోత్సాహం ఇచ్చారు.

సో. బాలాజీ అమ్మగారైన శ్రీమతి సీతామహాలక్ష్మి గారు ఈ పుస్తకాలను ఎందరికో అందించడానికి చేసిన కృషి, వెచ్చించిన సమయం మరువరానిది.

ఈ చిరు కార్య నిర్వహణలో ఎన్నో విధాలుగా తోడ్పడిన మెహెర్ బాబా ప్రేమికులను, నాతో పని చేసే అధికారులను, సిబ్బందిని గుర్తు చేసుకోకుండా ఉండలేను. అలాగే బాబా పనులన్నింటిలో సహకరించే కుటుంబ సభ్యులను, ముఖ్యంగా నా అర్ధాంగి శ్రీమతి బి. జయప్రదను మరువలేను. ఇకనుండి ఈ పుస్తకాలను అందరికీ పంపించే బాధ్యతను ఆమెకు అప్పగించాను. ఎవ్వరు గుర్తించినా – గుర్తించక పోయినా, నమ్మినా – నమ్మక పోయినా, కోరినా – కోరక పోయినా అందరి ఆధ్యాత్మిక పురోగతి కోసం ప్రతి యుగంలో అవతరించే ఆ సనాతనుడే ఈ యుగంలో అవతార్ మెహెర్ బాబాగా అవతరించి అందరి కోసం మానవ రూపం ద్వారా ఎన్నో బాధలనుభవించారు. ఆయన దివ్య ప్రేమాశీస్సులకు వారందరూ పాత్రులగుదురు గాక యని ఆకాంక్షిస్తున్నాను.

గుంటూరు<br>31.05.2002

**బి. రామకృష్ణయ్య**<br>సంకలన కర్త





# అవతార్ మెహెర్ బాబా జీవిత చరిత్ర

భగవంతుడు ఒక్కడే. ఆయన నిరాకారుడు, సాకారుడు కూడాను. సృష్టికి పూర్వము భగవంతుడు ఆది స్థితిలో నిరాకారుడు మాత్రమే. ఆ స్థితిలోని భగవంతునికి ఏ నామము, రూపము లేవు. అనంత అస్తిత్వమే ఆ నిరాకార స్వభావము. ఆయనను పరబ్రహ్మ, పరమాత్మ, అల్లాహ్, యాజ్దాన్ అంటారు. ఆ స్థితిలో ఆయనకు తన గుణాలైన అనంత శక్తి, జ్ఞానానందముల ఎరుక కూడా లేదు. అట్టి స్థితిలో కలిగిన ఇచ్ఛ (లహర్) వల్ల ఆ స్థితిలో ఇమిడియున్న భగవంతుని అనంత శక్తి ప్రకటిత మవడంతో వాయు రూపము నుండి పరిణామ క్రమంలో రాయి, ఖనిజము, వృక్ష జాలము, కీటకములు, చేప, పక్షి, జంతువులు మరియు మానవులనే వివిధ రూపాల సృష్టి జరిగినది. భగవంతునిలోనే భగవంతుని శక్తి వల్ల ఉద్భవించిన ఈ చరాచర రూపాలన్నీ భగవంతుని సాకార స్వరూపాలే. అయినా పరిమితమైన బుద్ధి, అహంకారములచే నేర్పడిన మనస్సు ద్వారా అనుభవాలను పొందే ఈ సాకార రూపాల్లో భగవంతుని అనంత శక్తి, జ్ఞానానంద స్వరూపాల ఎరుకగాని అనుభవంగాని లేవు. మానవ రూపంలో సత్యాన్వేషణకై తపన ఏర్పడిన తరువాత పరిమిత మనస్సు నశించి తద్వారా మానవునిలోని పరిమితమైన అస్తిత్వము అనంత అస్తిత్వంతో ఎరుకతో ఏకత్వము పొందుతుంది. అట్టి ఏకత్వానుభవము పొందిన మానవుడు భగవంతుని అనంత శక్తి, జ్ఞానానందములను, అనగా సచ్చిదానంద స్థితిని ఎరుకతో అనుభవిస్తాడు. దీనినే దైవ సాక్షాత్కారము లేదా మోక్షము అంటారు. అట్టి మానవుడు తానే దేవుడనని చెప్పుకొనగలడు. ఆ విధంగా దైవ సాక్షాత్కారము పొందిన వారిలో ఐదుగురు మాత్రమే సద్గురువులుగా అధికారం కలిగి ఆధ్యాత్మిక పరిపాలన చేసెదరని మొదటి సారిగా మెహెర్ బాబా వెల్లడి చేశారు. అలాంటి సద్గురువులు ఎప్పుడూ భగవంతునికై తపించే వారికి సహాయాన్నందిస్తూ సృష్టిలో ఆధ్యాత్మిక పరిపాలన నిర్వర్తిస్తుంటారు. మొట్టమొదటి సారిగా సృష్టి జరిగిన తరువాత అనంత శక్తి జ్ఞానానందములను అనుభవ పూర్వకముగా తెలుసుకొని దైవంతో ఏకత్వం పొందిన ఆది సద్గురువునే సనాతనుడు, అవతారుడు. మెస్సయ్య, రసూల్ అని అంటారు.

అతడు అవసరమైనప్పుడల్లా సద్గురువుల పిలుపు మేరకు ఈ సృష్టిలో అవతరిస్తుంటాడు.

ఆ. ధర్మహానిచే నధర్మంబు పెంపొంద
భూమి భరముచేత బొగులుచుండ
నేనే అవతరింతు నెల్ల యుగంబుల
ధర్మముద్ధరించి ధరణి గావ

అని కృష్ణ భగవానుడు భగవద్గీతలో అన్నాడు. 'ధర్మజ్యోతి సన్నగిల్లి కాంతి తగ్గినప్పుడు దానిని ప్రజ్వలింపజేసి ప్రజలను సన్మార్గము ననుసరింప జేయుటకు కాల చక్రమునందు 700 మొదలు 1400 సం. ల మధ్య కాలములో నేను మరల మరల మానవ పురుష రూపములో జన్మించు చుందును' అన్నారు మెహెర్ బాబా. గతంలో జోరాష్టర్‌గా, రాముడుగా, కృష్ణుడుగా, బుద్ధుడుగా, జీసస్ క్రీస్తుగా, మహమ్మద్ ప్రవక్తగా అవతరించిన ఆ సనాతనుడే నేడు అవతార్ మెహెర్ బాబాగా అవతరించాడు.

'నేను ఏ మతమునకు చెందను – అన్ని మతములు నావే. నేను కొత్త మతమును గాని కొత్త సంస్థనుగాని స్థాపించుటకు రాలేదు – అన్ని మతములను పునరుజ్జీవింపజేసి ఒకదారమున నున్న పూసల వలె చేర్చి సమన్వయ పరచెదను. దానిలో జ్ఞానపేటిక యొక్క తాళము చెవి కలదు. నేను బోధించుటకు రాలేదు – అజ్ఞానమను గాఢనిద్ర నుండి ప్రజలను మేల్కొలుపుటకు వచ్చితిని' అని అన్నారు ఆవతార్ మెహెర్ బాబా.

## జననము – బాల్యము

మెహెర్ బాబా తండ్రి షెహెరియార్ ముండేగార్ ఇరానీ, తల్లి షిరీన్‌బాన్ అను పార్శీ దంపతులు. వీరు పర్షియా దేశస్థులు. జోరాష్టర్ మతస్థులు. వీరు అగ్నిని పూజించే వారు. షెహెరియార్ చిన్నతనంలో తన తండ్రితో పాటు పార్శీల స్మశానమైన 'సైలెంట్ టవర్' వద్ద చాలా సమయము గడిపేవాడు. పార్శీ వారు మృత దేహాలను పక్షుల కాహారంగా ఈ సైలెంట్ టవర్‌లో ఉంచుతారు. బాల్యమునుండే

షెహెరియార్ ఆధ్యాత్మిక చింతన కలిగి విరక్తి భావంతో ఉండేవాడు. భగవదన్వేషణలో దాదాపు 20 సంవత్సరములు పర్షియాలోను, భారత దేశంలోను సాధకుడుగా సంచరించాడు. ఎన్నో సాధనలు, కఠిన నియమాలు ఆచరించాడు. ఒక రోజు అలసి సొలసి చైతన్య రహితుడై పడియుండగా అశరీరవాణి పలుకులు ఇలా వినిపించాయి – 'నీవు ఎవరిని చూడాలని ఎవరిని పొందాలని సాధన చేస్తున్నావో అది నీకు సాధ్యము కాదు – నీ కుమారుడు దానిని పొందుతాడు – అతని ద్వారా నీవు పొందుతావు'.

పైమాటలే హృదయంలో మళ్ళీ మళ్ళీ వినిపిస్తుండగా కఠిన నియమాల సాధనలతో అలసిపోయిన షెరియార్జీ పూనాలో నున్న తన సోదరి ఫిరోజా యింటికి చేరాడు. ఆయనకు వివాహము చేసుకోవాలనే కాంక్ష లేనప్పటికీ ఫిరోజా ప్రోద్బలంతో తనకంటే 25 సంవత్సరములు చిన్నదైన షిరీన్ అనే ఒక అందమైన అమ్మాయిని వివాహము చేసుకొనుటకు తన అంగీకారాన్ని వెలిబుచ్చాడు. ఆ వివాహానికి అమ్మాయి తల్లిదండ్రులు ఒప్పుకోరన్న ధీమాతో అంగీకరించాడు గాని దైవ నిర్ణయం ఎవరు తప్పించగలరు? సోదరి ఫిరోజా అమ్మాయి తల్లిని ఒప్పించి తండ్రికి ఇష్టము లేకున్నా వివాహము జరిపించింది. 1892 సంవత్సరములో 39 సం. ల షెరియార్జీకి, 14 సం.ల షిరీన్ మాయితో పూనాలో వివాహము జరిగింది.



కుటుంబము నడుపుటకు షెరియార్జీ వివిధ వృత్తుల నవలంబించాడు. వారిది అనుకూల దాంపత్యము.

షిరీన్‌బాన్‌కు 1893 సం. లో మొదటి కాన్పున జంషెడ్ అను కుమారుడు పుట్టాడు. కొలది మాసములకే మళ్ళీ షిరీన్ గర్భము

ధరించెను. ఈ గర్భము ధరించినప్పటి నుండి గర్భమందున్న శిశువు యొక్క దివ్యత్వాన్ని సూచించే ఎన్నో అనుభూతులు, స్వప్నాలు షిరీన్‌బాన్‌కు కలిగాయి. ఒక రోజు ఆమె ఆరు బయట కూర్చుని యుండగా చుట్టూ వేలాది జనులు చేరి ఆమె వైపు చూస్తున్నట్లు కలగన్నది. ఆమె గర్భములోని శిశువుకై జనులు వేచి చూస్తున్నారని ఆమె తల్లి గోలాందూన్ ఆ కలకు వివరణ చెప్పింది. ప్రసవానికి ముందు రాత్రి షిరీన్‌బాన్‌కు డేవిడ్ ససూన్ ఆసుపత్రిలో నుండగా ఒక స్వప్నము వచ్చింది. ఆ స్వప్నములో తేజోమూర్తియై సూర్యుని వలె ప్రకాశించే దివ్య పురుషుడొకడు రథముపై కూర్చుని యుండగా కొందరు దానిని లాగుతూ ఊరేగింపుగా తీసుకొని వెళ్తున్నారు. వాతావరణం ప్రశాంతంగా ఆహ్లాదకరంగా ఉంది. వేలమంది ఆయనతో ఊరేగింపుగా వెళ్తున్నారు. అందరు ఆ తేజో మూర్తిని చూస్తున్నారు. ఆయన ప్రకాశంలో అన్నీ మరచి అందరు ఆయననే చూస్తున్నారు. నేను కూడా ఆ ఊరేగింపులో ఉన్నాను అని షిరీన్ ఆ స్వప్నాన్ని తన తల్లికి వివరించగా ఆమె నీ గర్భంలో ఉన్న శిశువు అలాంటి గొప్పవాడవుతాడని అందరి మన్ననలను చూరగొనేంతటి లోకోత్తర పురుషుడవుతాడని ఆనందంతో చెప్పింది. మరుసటి ఉదయం ఫిబ్రవరి 25 వ తేది 1894 సంవత్సరం పూనా నగర వాసులంతా ఇంకానిద్రలో ఉండగా ఉదయం 5 గం. ల సమయంలో డేవిడ్ ససూన్ ఆసుపత్రిలో జనన మరణాలనుండి అందరిని తప్పించే ఆ అవతారునికి షిరీన్‌బాన్ జన్మనిచ్చింది. ఆమె ఎంతటి అదృష్టవంతురాలో గదా! దివ్య ప్రేమయే మూర్తీభవించి పురుష రూపము గొన్నదా యన్నట్లు శిశువు తేజోరాశియై అందరికి తెలియని ఆనందమును కలుగ జేశాడు. తల్లిదండ్రులా పిల్లవానికి 'మేర్వాన్' అని నామకరణం చేశారు. తల్లిదండ్రులు మేర్వాన్‌ను 'మిరోగ్' అని ముద్దుగా పిలిచేవారు. మేర్వాన్ అంటే ఇంట్లోవారికే గాక ఇరుగుపొరుగు వారికి కూడా ఎనలేని ప్రేమానురాగాలు కలిగాయి. ఆ పిల్లవానిలో గల అసాధారణ తేజస్సు, ఆకర్షణ అందరిని ముగ్ధులను చేశాయి. షిరీన్‌బాన్ తండ్రి దోరాబ్‌కు ఆమెను షెరియార్జీ కిచ్చి పెళ్ళి చేయటం ఇష్టం లేకుండెను. ఆయన పెళ్ళికి వెళ్ళలేదు. పెళ్ళి తర్వాత షెరియార్జీతో ఎప్పుడు మాట్లాడలేదు. అంతేగాక షెరియార్జీ తన యింటికి

రాకూడదని శాసించాడు. అదేమి విచిత్రమోగాని మేర్వాన్ జన్మించిన తర్వాత అనిర్వచనీయమైన ఆకర్షణతో ప్రేరేపింప బడినవాడై వెళ్ళి మేర్వాన్‌ను చూశాడు. అంతే – రోజూ వెళ్ళకుండా, మేర్వాన్‌ను చూడకుండా ఉండలేక పోయాడు. షెరియార్జీపై గల విరోధం సమసిపోయి ఆయనను గౌరవించ సాగాడు. విశ్వ మానవాళికి ప్రేమను ప్రసాదించి, స్వార్థాన్ని నశింప జేయడానికి అరుదెంచిన అవతారుని కార్యక్రమము ఊయలలూగే వయస్సునుండే ప్రారంభమైనదేమోనని విస్మయం కలిగిస్తుంది.

షిరీన్‌బాన్‌కు మేర్వాన్ అంటే ఎనలేని ప్రేమానురాగాలు కలిగాయి. కాని షెరియార్జీకి మాత్రము ఆకాశవాణి సూచించినట్లుగా తన ఆశయాన్ని సిద్ధింపజేసి జనన మరణ చక్రాన్నుండి తనకు విముక్తిని ప్రసాదించే తనయుడితడే యనే దృఢవిశ్వాసం కలిగింది. ఈ క్రింద పేర్కొన్న సంఘటనలు ఆయన విశ్వాసాన్ని బలపరిచాయి.

ఒకరోజు రాత్రి స్వప్నములో షిరీన్‌బాన్ మేర్వాన్‌ను ఎత్తుకొని గుమ్మంలో నిలబడి ఉంది. ఎదురుగా ఉన్న బావిలోనుండి ఒక స్ఫురద్రూపియైన స్త్రీ ఆకుపచ్చని పట్టుచీర ధరించి ఆకుపచ్చని గాజులు వేసుకొని చేతిలో హారతి పళ్ళెము పట్టుకొని దానిలో వెలిగే కర్పూరంతో హిందూ దేవతా స్త్రీని బోలి ప్రకాశిస్తూ పైకి వచ్చి మేర్వాన్‌ను తనకిమ్మని సంజ్ఞ చేసింది. షిరీన్‌బాన్ మేర్వాన్‌ను గట్టిగా హృదయానికి అదిమి పట్టుకున్నది. ఇంతలో మెలకువ రాగా స్వప్నం చెరిగి పోయింది.

మేర్వాన్ పదకొండు నెలల ప్రాయంలో నుండగా నొకరోజు షిరీన్‌బాన్ మేర్వాన్‌ను చెట్టుక్రింద ఊయలలో పరుండబెట్టి వంటగదిలోకి వెళ్ళింది. ఒక నల్లని త్రాచుపాము ఊయలలోకి ప్రాకి మేర్వాన్‌ను పొట్టచుట్టూ చుట్టుకుంది. మేర్వాన్ ఆనందంగా ఆ పాముతో ఆడుకుంటున్నాడు. తల్లి షిరీన్ వచ్చి చూచి భయంతో కేక వేసింది. నెమ్మదిగా పాము ఊయలనుండి దిగి మాయమై పోయింది. షిరీన్ మేర్వాన్‌ను ఎత్తుకొని అతనివైపు చూడగా 'నా ఆటనేల భగ్నము చేశావు' అన్నట్లుగా ప్రశాంత వదనంతో తల్లిని చూశాడు. ఆమె కేక విని వచ్చిన పొరుగువారికి ఈ విషయము చెప్పగా వారు ఆమె నోదార్చి అది చాలా శుభప్రదమైన విషయమని

బాలుని అసాధారణ భవిష్యత్తు కది నిదర్శనమని జెప్పారు. మేర్వాన్ దుడుకు తనాన్ని భరించ లేక షిరీన్ తరచూ బాలుణ్ణి మంచము కోడుకు కట్టి ఉంచేది. కృష్ణావతారంలో రోలుకు కట్టిన యశోద అలవాటు ఈ విధంగా షిరీన్‌కు అబ్బినదేమో గదా! మేర్వాన్ బాల్యములో తండ్రి జేబులో నుండి డబ్బును తీసుకొని పేదలకు పంచేవాడు. వంటయింటి నుండి స్వీట్లు తల్లికి చెప్పకుండా తీసుకెళ్ళి స్నేహితులకు పంచేవాడు. కృష్ణావతారంలోని వెన్న దొంగలించే నైజం కూడా వదలలేదేమో!

చిన్నతనము నుండే మేర్వాన్ మేధాశక్తిచే తండ్రికి వచ్చిన భాషలన్ని నేర్చుకున్నాడు. 5వ ఏట బాలునికి అక్షరాభ్యాసము చేయించి పాదమ్‌జీ గుజరాతీ స్కూల్‌లో చేర్చారు. తరువాత దస్తూర్ స్కూల్‌లో చేర్పించారు. ఆ తర్వాత క్యాంప్ గవర్నమెంట్ స్కూల్‌లో 5 సంవత్సరములు చదివాడు. ఈతడు విద్యార్థి దశలో సంగీతములోనే గాక క్రికెట్, హాకీ, గోటి బిళ్ళ ఆటలలో కూడా ప్రావీణ్యం సంపాదించాడు. చదువులో సత్ప్రవర్తనలో కూడా మేటి అనిపించుకున్నాడు. తరువాత యితడు సెయింట్ విన్సెంట్ హైస్కూల్‌లో చేరెను. మేర్వాన్ తోడి బాలురందరకు నాయకుడై వారి తగాదాలను తీర్చుచుండెను.

మేర్వాన్‌కు తన తర్వాత జాల్, జెహ్రామ్, ఆర్దేషీర్ అను సోదరులును, ఫ్రెణి, మణి యను చెల్లెళ్ళును కలిగిరి. 1911 సం. లో హైస్కూల్ విద్య పూర్తికాగా మేర్వాన్ ప్రసిద్ధి కెక్కిన దక్కను కళాశాలలో చేరి చదువసాగెను. ఈ సమయంలోనే మేర్వాన్ కాస్మో పాలిటన్ క్లబ్బును స్థాపించెను. దీని సభ్యులకు నియమ నిబంధనలను ఏర్పరచెను. జూదములు, పరుషముగా మాట్లాడుట, తగవులాడుట నిషేధింపబడెను. అనేక ఆంగ్ల కవుల గ్రంథములను పఠించి పద్యములను వ్యాసములను రచించుచుండెను. పర్షియన్ కవి సద్గురువు అయిన హాఫీజ్ రచనలను ఆసక్తితో చదివి తన్మయుడగుచుండెను.

విద్యాభ్యాసము చేయు రోజులలోనే మేర్వాన్‌కు స్ఫురద్రూపము, జ్ఞాపక శక్తి, శ్రావ్యముగా పాడుట, ప్రేమ, దయ, ఔదార్యములతో పాటు ఆటలలో ప్రావీణ్యత, సహాధ్యాయులనే గాక అధ్యాపకులను గూడా ఆకర్షింపజేసే నాయకత్వ



లక్షణములు అలవడెను. అన్నింటిని మించిన వినయ శీలత మేర్వాన్‌కు తలమానికమై నిలిచెను. అతడు ప్రాతః కాలమున తొందరగా లేచి కాలకృత్యములు తీర్చుకొని మృదు మధుర గాత్రముతో ప్రార్థనా గీతములను ఆలపించెడివాడు. పొరుగువారు మేర్వాన్ ఆలపించు ప్రార్థనా గీతములు వినుట కొరకై త్వరగా లేచెడివారు. అతనికి తల్లిదండ్రులపై గౌరవము, ప్రేమ మెండుగా నుండెను. ఉదయము, సాయంత్రము వారి పాదములకు ప్రణమిల్లెడివాడు.

తన దివ్యత్వానుభూతిని మరుగుపరిచే తెరను 18వ ఏట బాబాజాన్ ముద్దుతో తొలగింపబడినను ఏ సంస్కారములు లేని విశుద్ధ చైతన్యము పరిశుద్ధ హృదయము కలిగిన మేర్వాన్‌కు బాల్యంలో కూడా తన దివ్యానుభూతి కలిగిన సంఘటనలు గలవు.

ఐదు సంవత్సరముల ప్రాయంలో పాదమ్‌జీ గుజరాతీ స్కూల్‌లో చదువుకొనుచుండగా నొకరోజు అధ్యాపకురాలు గణిత పాఠము చెప్పుచుండెను. ఆ సమయమున మేర్వాన్‌ను పరవశింపజేసే అద్భుతమైన దివ్యానుభూతి కలిగెను. ఆ అనుభవము గురించి బాబా ఈ విధంగా చెప్పారు. 'నేను ఆ సమయంలో ప్రకాశించే వలయాలను చూశాను. వాటి మధ్యలో నుండి సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు వెలువడుతున్నాయి'. ఆ సమయంలో అధ్యాపకురాలు మేర్వాను పరధ్యానంలో నీరసించినట్లు కనుగొని చూడగా అతడు స్పృహతప్పి పడిపోయాడు. అతనిని ఒక బెంచిపై పరుండబెట్టి నీళ్ళు చల్లి స్పృహ వచ్చేటట్లు చేశారు.

'ఏమైంది మేర్వాన్ – బాగున్నావా? అని ఆమె అడిగింది.

'శూన్యం – శూన్యంలో దివ్యత్వాన్ని చూశాను' అని మేర్వాన్ గొణిగాడు.

'ఎలావుంది – ఇంటికి వెళతావా?' అని అధ్యాపకురాలు అడిగింది.

'అవసరం లేదు – నేను బాగానే వున్నాను' అన్నాడు మేర్వాన్.

కాని ఆ దివ్యప్రకాశాన్ని చూసిన అనుభవం తర్వాత మళ్ళీ అధ్యాపకురాలు ప్రారంభించిన గణితం అతనికి నిరర్ధకంగా తోచింది.

చదువుకొనే రోజుల్లో బాబా కాస్మోపాలిటన్ క్లబ్ నడిపేవాడు. ఆ క్లబ్‌లో రామనాధ్ అనే బౌద్ధమతస్థుడు సభ్యుడుగా వుండేవాడు. మేర్వాన్, రామనాధ్ ఇద్దరు కలిసి హిందూ స్మశానవాటికకు వెళ్ళి ధ్యానము చేసేవారు. ఆధ్యాత్మిక విషయాలు ముచ్చటించుకునేవారు. ఒకరోజు రామనాధ్ మేర్వాన్‌కు 'బుద్ధభగవాన్' అనే గౌతమ బుద్ధుని జీవిత చరిత్ర గల పుస్తకాన్ని చూపించాడు. దాని పేజీలు తిరగేస్తుండగా మేర్వాన్ బుద్ధుడు చెప్పిన ఈ క్రింది మాటలు చదివాడు.

'నేను మళ్ళీ భూమిపైకి వచ్చినప్పుడు దయామయుడుగాను, మైత్రేయుడు గాను పిలువబడుదును'.

వెంటనే ఆ మైత్రేయుడను తానే అన్న అనుభూతి మేర్వాన్‌కు కలిగింది. బుద్ధుని చిత్రపటాన్ని చూడగానే 'నేనే ఆ బుద్ధుడను' అనే అనుభూతి కలిగింది. వెనువెంటనే 'నేను నిజంగానే బుద్ధుడనేనా?' అని తనను తాను ప్రశ్నించుకోగా అంతర్వాణి 'నిజమే – నీ అనుభవం సత్యం' అని ధృవపరచింది.

మేర్వాన్ దయార్ద్ర హృదయుడు. తాను స్థాపించిన కాస్మోపాలిటన్ క్లబ్బులో ప్రోగు చేసిన ధనాన్ని బీదలకు, అనాధలకు వెచ్చించేవాడు. అవసరమైనప్పుడు తన అవసరాలు కూడా మానుకొని మేర్వాన్ డబ్బును పేదవారికై ఖర్చు చేసేవాడు.

స్వయంగా చదువుకోక పోయినా, మేర్వానుకు తన తండ్రిద్వారా విన్నంతనే హాఫీజు దీవాన్, భగవద్గీత, రామాయణాలు, భక్తతుకారాం, రామదాసుల కీర్తనలు కంఠ పాఠ మయ్యాయి. మేర్వాన్ స్వయంగా గుజరాతీ, హిందీ, ఉర్దూ పార్శీ భాషలలోను, ఆంగ్లంలోను కవిత్వం వ్రాసేవాడు. 'హ్యూమా' అనే కలం పేరుతో వ్రాసిన రచనలు, గజల్స్, పాటలు పత్రికలలో ప్రచురితమవ్వగా, బహుళ ప్రచారం పొంది ఇప్పటికీ ప్రశంసించబడుతున్నాయి. ఆ రచనలలోని

ఆధ్యాత్మిక విషయాలు బహుధా ప్రశంసించబడ్డాయి. రచించినవాడు పిన్నవయస్కుడైన బాలుడని కూడా ఎవరికి తెలియదు.

1912వ సంవత్సరం ఒక రోజు మేర్వాన్ ఇంటిముందు కూర్చుని యుండగా తలవని తలంపుగా అతని దృష్టి అంతర్లీనమయ్యెను. భగవంతుని దివ్య ప్రకాశమును స్పష్టముగా తిలకించెను. వెంటనే బాహ్యప్రపంచ స్పృహ కోల్పోయెను. కళ్ళు తెరిచే యున్నను బాహ్యచైతన్యము ఏమాత్రము లేకుండా పోయెను. దివ్యమహదానందములో లీనమయ్యెను. ఆ సమయములోనే మేర్వాన్ పినతల్లి దౌలా, ఇంటిలోనికి పోతూ నిశ్చేష్టుడై వున్న మేర్వాన్‌ను పలకరించెను. కాని అతనికి వినిపించలేదు. ఆమె వెంటనే షిరీన్‌ను పిలిచి విషయము చెప్పగా ఆమె మేర్వాన్‌ను తట్టి 'మిరోగ్, మిరోగ్' అని గట్టిగా అరచెను. నెమ్మదిగా మేర్వాన్ స్పృహలోనికి వచ్చి 'అమ్మా! నా గురించి ఆదుర్దా పడకు, నాకేమీ కాలేదు, నేను బాగానే వున్నా' అని చెప్పి అక్కడినుండి లేచి వెళ్ళెను. ఈ విధంగా దివ్యప్రకాశాన్ని వీక్షించిన మేర్వాన్‌కు తన జీవితము మిగిలిన మనుషుల కంటె భిన్నమైనదనే అనుభూతి గలిగెను. అతనికి తన నిజ స్వరూప జ్ఞానము కలుగకున్నను బాల్యమునుండే దివ్యత్వపు ఛాయలు ప్రస్ఫుటమగు చుండెను.

**దివ్యానుభూతి – బాబాజాన్ చుంబనము**

అవతారుడు మామూలుగానే జన్మించి అందరివలె బాల్యము గడుపుతాడు. తగిన సమయం రాగానే సద్గురువులు ఆయనకు అతని నిజ స్వరూపానుభవము కలుగజేస్తారు. అవతారుని ఆగమనానికి కూడా పంచ సద్గురువులే కారణభూతులవుతారు. తగిన సమయం వచ్చినతర్వాత అవతారుని దివ్యత్వాన్ని మరుగుపరచే తెరను తొలగించి విశ్వ కార్య భారాన్ని ఆయనకు అప్పగిస్తారు. అవతారుని కాలం సృష్టికి వసంతకాలము. ఆయన సమకాలీనులైన మానవులు అదృష్టవంతులు. సాకార దైవస్వరూపాల్లో అవతారుడు ఉన్నతోన్నతుడు. ఆయన ఈ భువిపై అవతరించి మన మధ్య మానవుడుగా నున్నప్పుడు ఆయనను పొందడం చాలా సులభం. అలాగే ఆయనను గుర్తించడం, ఆయన మీద అచంచల విశ్వాసం కలగడం కూడా అంత కఠినమైనది. 'గత రూపాలలో ఆరాధింపబడి

వర్తమానము నందు అలక్ష్యము చేయబడి భవిష్యదాగమనము కొరకై వేచి చూడబడే ఆ సనాతనుడనే తాన'ని మెహెర్ బాబా చెప్పారు.

మెహెర్ బాబా సనాతన పరమాత్మ అవతరించడానికి కారణమైన ఐదుగురు సద్గురువులు – షిరిడీ సాయిబాబా, హజ్రత్ బాబాజాన్ (పూనా), ఉపాసనీ మహరాజ్ (సాకోరీ), నారాయణ్ మహరాజ్ (ఖేడ్‌గాం) మరియు తాజుద్దీన్ బాబా (నాగపూర్).

మేర్వాన్ దక్కను కళాశాలలో చదువుకొను చుండగా సైకిల్‌పై వెళ్ళి వచ్చేదారిలో, మాల్కమ్ టాంకురోడ్డులో చార్‌బావుడీ వద్ద ఒక వేప చెట్టుక్రింద దాదాపు 120 సం.ల వృద్ధురాలు కూర్చుని యుండేది. అమె ఎప్పుడూ గుంపులుగా చేరిన భక్తులచే పరివేష్ఠింపబడి యుండేది. శీత వాతా తపములను లెక్కచేయక బాబాజాన్ ఎప్పుడూ ఆ వేప చెట్టు క్రిందనే కూర్చునియుండేది. సందర్శించే భక్తుల సంఖ్య పెరగడంతో, వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుచుండడంతో మున్సిపాలిటీ వారామెకు దగ్గర్లో ఒక యిల్లు నిర్మించి యిచ్చారు. అయినా ఆమె ఎప్పుడూ ఆ వేప చెట్టు క్రిందనే కూర్చుని యుండేది. ఆమెను కోరికలు తీర్చే దైవంగాను, సద్గురువుగాను కొందరు ఆరాధిస్తే కొందరామెను మతిభ్రమించిన దానిగా భావించేవారు. కానీ హజ్రత్ బాబాజాన్ మాత్రము సచ్చిదానంద స్థితిని నిరంతరం అనుభవిస్తూ యుగావతారునికి దివ్యత్వానుభూతి కలుగ చేయడమనే ప్రముఖపాత్ర నిర్వహించడానికి పూనాలో వేచి కూర్చుంది. ఆమె బలూచిస్తాన్‌లోని ఒక రాచ కుటుంబంలో 1790–1800 మధ్య కాలంలో జన్మించింది. ఆమె ఆసలు పేరు గుల్‌రుఖ్ – చాలా అందంగా వుండేది. చిన్నతనంలోనే ఖురాన్ కంఠ పాఠంగా చదివేది. ఎప్పుడూ ధ్యానంలో ఏకాంతంగా గడిపేది. ఎందరో రాజకుమారులు ఆమెను కోరుకున్నారు. తల్లిదండ్రులు ఆమెకు వివాహము చేయడానికి నిశ్చయించుకోగా ఆమె యిల్లు విడిచి సత్యాన్వేషణకై హృదయం పరితపించగా, నిరాశ్రయురాలైన బాటసారిగా కొండల్లో, కోనల్లో పరిభ్రమించింది. చివరకు సద్గురువు కృపవల్ల సాక్షాత్కారం పొంది 'అహం బ్రహ్మాస్మి' అనే

అనుభవంతో వివిధ పట్టణాలు ప్రదేశాలు తిరిగింది. ఒకసారి రావల్పిండిలో తన దివ్యత్వాన్ని ప్రకటిస్తూ 'అనల్ హక్' అనగా 'అహం బ్రహ్మాస్మి' అని చాటుతూ తిరుగాడుచుండగా కొందరు బలూచీ సైనికులు అది ఇస్లాము మతానికి విరుద్ధమనే ఛాందస భావంతో ఆమెను బలవంతంగా పట్టుకొని ఒక గొయ్యి తవ్వి అందులో సజీవంగా పాతి పెట్టారు. ఇస్లాము మతం కాపాడటానికి చాలా గొప్ప పని చేశామని పొంగిపోయారు. కాని వారు కొన్ని సంవత్సరాల తర్వాత పూనా వెళ్ళినప్పుడు అక్కడ భక్తులచే పరివేష్ఠింపబడి వేపచెట్టు క్రింద కూర్చునియున్న బాబాజాన్‌ను చూచి భయభ్రాంతులై పరితపించి ఆమె పాదాలకు ప్రణమిల్లి క్షమాపణ వేడారు.

మేర్వాన్ కాలేజీకి వెళ్ళి వచ్చే సమయాల్లో తరచూ దూరాన్నుండి ఆమెను చూసేవాడు కాని ఆమె విషయంలో ఎప్పుడూ శ్రద్ధ వహించలేదు. 1913వ సం. మే నెలలో ఒక రోజు మేర్వాన్ బాబాజాన్ వైపు చూడగా ఆమె మేర్వాన్‌ను తన వద్దకు రావలసిందిగా సంజ్ఞ చేసింది. అయస్కాంతముతో ఆకర్షింపబడిన ఇనుప ముక్క లాగా మేర్వాన్ ఆమె దగ్గరికి వెళ్ళాడు. దరికి జేరిన మేర్వాన్‌ను అక్కున జేర్చుకొని ఎంతో కాలంగా ఎదురుచూసిన సన్నిహితుని చూచినట్లుగా ఆనందాశ్రువులు పొంగి రాగా 'నా ప్రియమైన కొడుకా!' అని పిలుస్తూ కౌగలించుకున్నది. ఆ రోజునుండి మేర్వాన్ బాబా జాన్ వైపు ఆకర్షింపబడ్డాడు. శరీరంలో తెలియని పారవశ్యం కలుగగా ప్రాపంచిక విషయాలపైనా, చదువుపైనా శ్రద్ధ తగ్గిపో సాగింది. ఒంటరిగా నుండటానికిష్టపడేవాడు. ఒక్క బాబాజాన్‌తో కలయిక తప్ప మిగిలిన వన్నీ నిస్సారంగా తోచసాగాయి. బాబాజాన్ ఆలింగనముతో మేర్వాన్‌లోని వ్యక్తిత్వము దివ్యత్వంలో లీనమవుతున్నట్లు మేర్వాన్ అనుభవించసాగాడు. మేర్వాన్ ఎల్లప్పుడూ బాబాజాన్ వద్ద మౌనంగా కూర్చునేవాడు.

ఇలా కొంతకాలం గడిచిన తర్వాత 1914 సంవత్సరం జనవరి నెలలో నొక రాత్రి మేర్వాన్ బాబాజాన్ వద్ద సెలవు తీసుకొని బయలుదేరే సమయంలో ఆమె చేతిపై ముద్దు పెట్టుకున్నాడు. వెంటనే ఆమె మేర్వాన్ తలను చేతులలోనికి తీసుకొని నుదుట భ్రూ మధ్యంలో ముద్దు పెట్టుకున్నది. ప్రేమ పూర్వకంగా మేర్వాన్




కళ్ళలోకి తన దృష్టి నిలిపింది. ఆ క్షణం కోసవే ఆమె పూనా నగరంలో అంత కాలంగా నిరీక్షిస్తున్నది. ఈ యుగావతారుడైన మెహెర్ బాబా (మేర్వాన్) కు యుక్త వయస్సు వచ్చే వరకు కప్పబడిన మాయ ముసుగును తొలగించి తాను సనాతనుడనే దివ్యానుభూతిని కలిగించే విశిష్టపాత్రను నిర్వహించింది. ఆమె చుంబనముతో నిశ్చేష్టుడై యున్న మేర్వాన్ వైపు చూస్తూ బాబాజాన్ యిలా చెప్పింది – 'నాకు ప్రీతి పాత్రుడైన యీ కుమారుడు ప్రపంచాన్నే కదిలించి వేస్తాడు. ఇతని వల్ల మానవాళి అంతా ఉద్ధరింపబడుతుంది'.

బాబాజాన్ ముద్దుతో మేర్వాన్ ప్రపంచ స్పృహను కోల్పోయాడు. ఎలాగో ఇంటికి చేరి పడుకున్నాడు. శరీరమంతా ఎన్నో వేల వాట్ల విద్యుత్తు ప్రవహిస్తున్నట్లు అనుభూతి కలుగసాగింది. ఆ విద్యుత్తులో శరీరము, మనస్సు కరిగిపోతున్నట్లు అనుభవం కలుగసాగింది. ఆయన శరీరం ప్రకాశంలో కలిసిపోయినట్లనిపించింది. ప్రపంచ స్మృతి పోయి తాను భగవంతుడ ననే అనంత చైతన్య స్థితి కలిగింది. ఆ స్థితిలో మూడు రోజులు చైతన్య రహితంగా పడుకునే ఉన్నాడు. కళ్ళు తెరిచే ఉన్నాయి కానీ ఆయన కేదీ కనిపించటం లేదు. వైద్యులు పరీక్షలు చేశారు. నిద్ర రావటానికి ఇంజక్షనులు ఇచ్చారు కానీ ఏ మందు పనిచేయలేదు. పరీక్షలు చేసి శరీరంలో ఏ రుగ్మతా లేదని నిర్ధారించారు. అనంతత్వంతో ఏకత్వం పొంది ఆ అనంత ఆనందంలో లీనమై బాహ్య చైతన్యాన్ని కోలోయిన ఆయన ఆంతరంగ స్థితి నెవరు గుర్తించగలరు?

నాల్గవ రోజున బాబా లేచి తిరుగ నారంభించాడు కానీ బాహ్య చైతన్యము రాలేదు. గంటల తరబడి ఒంటరిగా కూర్చునేవాడు. ఏ ఆహారం తీసుకునేవాడు కాదు. తల్లి బలవంతంగా పెట్టిన ఆహారం కుక్కలకు, పిల్లులకు, కాకులకు

వేసేవాడు. తరచూ బాబాజాన్ వద్దకు వెళ్ళేవాడు. దీనికి కారణం బాబాజానేనని బాబా తల్లి షిరీన్‌బాన్ ఒకరోజు వెళ్ళి ఆమెను నిలదీసింది. ఆమె ఇలా చెప్పింది –'మేర్వాన్ నా ప్రియమైన బిడ్డడు. ఒక రోజు ప్రపంచాన్నంతా ఊపివేస్తాడు. అజ్ఞానమనే నిద్రనుండి ప్రపంచాన్ని మేల్కొల్పుతాడు'. కాని ఆ మాటలు షిరీన్‌బాన్‌కు అర్థం కాలేదు కాని అమె తల్లి గోలాందూన్ బాబాజాన్ దివ్యత్వాన్ని గ్రహించింది. తొమ్మిది మాసాలు మేర్వాన్ అదే స్థితిలో నున్నాడు. అందమైన అతని శరీరం కళావిహీనమైనది. కళ్ళు లోతుగా ఎప్పుడూ శూన్యంలోకి చూస్తూ రెప్పవేయకుండా ఉండేవి. వాతావరణం మార్పుకై కొద్ది రోజులు బాబాను పూనా నుండి బొంబాయికి తీసుకువెళ్ళారు. ఆయన సోదరుడు జంషెడ్ వద్ద కొంతకాలం ఉంచి మళ్ళీ పూనాకు తీసుకొని వచ్చారు. నవంబర్ 1914 నుండి మేర్వాన్‌కు కొంత బాహ్యచైతన్యం రావడం ప్రారంభమైంది.



పూనాలో చాలా సమయం తన గదిలోనే గడిపేవాడు. అప్పుడప్పుడూ తన పాత స్నేహితులతో వాహ్యాళికి వెళ్ళి వచ్చేవాడు. బాబాకు ఈ సమయంలో బెహ్రాంజీ ( బెహ్రాం హోషంగ్ ఫరేదూన్ ఇరానీ) తో స్నేహం ఏర్పడింది. ఈతనికి బాబా భగవంతుని గురించి ఆధ్యాత్మిక విషయాల గురించి చెప్పేవాడు. ఇద్దరూ కలిసి పవిత్ర యాత్రా స్థలాలు దర్శించి వచ్చేవారు.

## పంచ సద్గురువుల సందర్శనం

1915 వ సంవత్సరం ఏప్రిల్ మాసంలో బాబా దూరప్రయాణానికి వెళ్తున్నానని బెహ్రాంజీకి చెప్పి వెళ్ళాడు. రైలు ఖేడ్గాం ప్రాంతం చేరగానే ఆకర్షింపబడిన వాడై అక్కడి సద్గురువు నారాయణ మహారాజ్ ఆశ్రమానికి వెళ్ళాడు. నారాయణ మహారాజ్ బంగారు కిరీటాన్ని ధరించి వెండి సింహాసనంపై కూర్చుని భక్తులకు దర్శనమిస్తున్నాడు. మేర్వాన్‌ను చూడగానే దర్శనమాపి భక్తులను

బయటకు పంపించాడు. సింహాసనం దిగి వచ్చి మేర్వాన్‌ను తీసుకెళ్ళి తాను కూర్చునే వెండి సింహాసనంపై కూర్చోబెట్టాడు. తాను ధరించిన పూలదండను మేర్వాన్ మెడలో వైచి మామిడి పండ్ల రసాన్ని యిచ్చాడు. అవతారుని దివ్యత్వాన్ని ఆచరణలో వెల్లడించాడు. ఆరాత్రి అక్కడే దత్తాత్రేయాలయములో విశ్రమించి మేర్వాన్ మళ్ళీ పూనాకు తిరిగి వచ్చాడు. ఈ విధంగా ఆసమయంలో గల ఐదుగురు సద్గురువు లలో నొకరైన నారాయణ మహారాజ్‌ను బాబా సందర్శించెను.



నారాయణ మహారాజ్ భోగపరాయణుని వలె జీవించెను. పట్టు వస్త్రములను, వజ్రపుటుంగరములను, బంగారు కిరీటమును ధరించి, వెండి సింహాసనముపై కూర్చుండి భక్తులకు దర్శనమిచ్చెడివాడు. ఈయన మహారాష్ట్ర దేశములో నొక బ్రాహ్మణ కుటుంబమున 25 మే, 1885 వ సం.లో జన్మించెను. ఇతని తండ్రి భీమ్ రావు, తల్లి లక్ష్మి. 14 మాసాల వయస్సులో తండ్రిని, 5 సం.ల ప్రాయంలో తల్లిని కోల్పోయాడు. అతని నాయనమ్మ వద్ద తన బాల్యం గడిపాడు. బాల్యం నుండి దైవభక్తి మెండు. తొమ్మిది సంవత్సరముల వయస్సులోనే యిల్లు విడిచి సన్యసించి దత్తాత్రేయుని స్మరిస్తూ సత్యాన్వేషణలో సంచరించాడు. గంగాపురంలో ఒక వృద్ధుని రూపంలో దర్శనమిచ్చిన దత్తాత్రేయుని కృపకు పాత్రుడై సాక్షాత్కారం పొంది సద్గురువయ్యాడు.

మేర్వాన్ తన స్నేహితులతోను బెహ్రాంజీతోను కలిసి నాగపూర్‌లోని తాజుద్దీన్ బాబాను దర్శించుటకు వెళ్ళాడు. మేర్వాన్ తాజుద్దీన్ బాబాను సమీపించగా గమనించిన తాజుద్దీన్ గులాబీ పువ్వులను చేబూని మేర్వాన్ వైపు నడచి వచ్చాడు. ఇద్దరు ఎదురెదురుగా నిలచి మౌనంగానే మాట్లాడుకున్నారు. గులాబీల పరిమళం గుబాళించే ఆ వాతావరణంలో అనంతత్వంతో ఏకత్వమైన ఆ యిద్దరి కలయిక నిశ్శబ్దంగా సాగింది. తన చేతిలోని గులాబీలతో మేర్వాన్

చెక్కిళ్ళను, ఫాలభాగాన్ని స్పృశిస్తూ 'నాగులాబీ నా పరలోకపు గులాబీ' అని మేర్వాన్ దివ్యత్వాన్ని కొనియాడాడు.

తాజుద్దీన్ బాబా ఆ కాలంలోని సద్గురువులలో నొక్కడు. ఇతడు 17వ తేది 1861 వ సంవత్సరం మధ్యపరగణాలలోని కాంప్టీ అనే పట్టణంలో బద్రుద్దీన్ మరియు మరియంబీ అనే మహమ్మదీయ దంపతులకు జన్మించాడు. ఈతని మొదటి సంవత్సరంలోనే తండ్రి, తొమ్మిదవయేట తల్లి గతించారు. 18 ఏళ్ళు రాగానే ఇతడు మిలిటరీలో సిపాయిగా చేరాడు. ఇతడు పాఠశాలలో విద్యాభ్యాసము చేయుచుండగా హజ్రత్ అబ్దుల్లా షా అనే సత్పురుషుడు తాజుద్దీన్‌ను పాఠశాలలో చూసి దివ్యజ్ఞానము కలిగియుండగా ఇతనికి విద్యాభ్యాస మేల? అని సూచించి ఒక బిస్కట్టు సగము తిని మిగిలిన సగము బాలునికిచ్చాడు. ఆ బిస్కట్ తిన్నవెంటనే తాజుద్దీన్ బాబా యెదలో అశ్రుధారలతో పొంగిపొరలే ఆనందాతిశయంతో ప్రియతముని కలయికకై తపన ప్రారంభమైంది. మిలిటరీలో పనిచేయుచుండగా నొకరాత్రి అశరీరవాణి ప్రేరణతో దగ్గరలోనున్న అడవికి వెళ్ళి అక్కడ ఒక చెట్టు క్రింద కూర్చునియున్న హజరత్ దావూద్ చిష్టి అనే కుతుబ్‌ను కలిసెను. అతడు సగము త్రాగిన టీ కప్పును తాజుద్దీన్ కిచ్చెను. మిగిలిన ఆ టీ త్రాగినంతనే తాజుద్దీన్‌కు సాక్షాత్కారము లభించెను. పది సంవత్సరములు పిచ్చివాని వలె వీధులలో గడిపెను. కావాలని నగ్నముగా బ్రిటిష్‌వారు టెన్నిస్ ఆడే ప్రాంతమున తిరిగి పిచ్చి ఆసుపత్రిలో చేర్పించుకున్నాడు. అచ్చట చాలాకాలము గడిపెను. ఆసుపత్రి అధికారులు అతని దివ్యత్వాన్ని గుర్తించి అచ్చటనే దర్శనార్థులకు ఆయనతో సమావేశమునకు ఏర్పాట్లు చేసిరి. రాజా రఘూజీరావు భోస్లే తాజుద్దీన్‌పై గల భక్తితో ఆయనను పిచ్చి ఆసుపత్రి నుండి విడిపించి తన అంతఃపురము నందొక భవనములో నుంచెను. కానీ తాజుద్దీన్ బాబా నాగపూర్‌కు 18 కి.మీ. దూరంలో గల వాకీ వద్ద స్థిర నివాస మేర్పరచుకొనెను.


తాజుద్దీన్ బాబా దర్శనానంతరం మేర్వాన్ పూనాకు తిరిగి వెళ్ళెను. హజరత్ బాబాజాన్ ప్రేరణతో షిర్డీలో నున్న సాయిబాబాను దర్శించుటకు వెళ్లెను. మేర్వాన్‌తో ఖోడు అను అతని స్నేహితుడు కూడా వెళ్ళెను. షిరిడీలో సాయిబాబా



అనుజ్ఞ లేనిదే ఎవ్వరూ వెళ్ళకూడదని గ్రామస్థులు నిరోధించగా ఆ రాత్రంతా చెట్టుక్రింద చలిలో గడిపారు. మరునాడు సాయిబాబా వారిద్దరినీ పిలిచారు కానీ ఖోడును మాత్రము దగ్గరికి పిలిచి వీపుపై గట్టిగా తట్టాడు సాయిబాబా. అతని దగ్గర డబ్బులన్నీ తీసుకున్నాడు. మేర్వాన్‌ను మాత్రము దగ్గరకు రావద్దని పంపివేశాడు.

తరువాత బహిర్దశకు ఊరేగింపులో వెళ్ళే 'లెండి' అనే కార్యక్రమము ముగించుకొని వచ్చే సమయంలో మేర్వాన్ ఆయనకు సాష్టాంగ ప్రణామం చేశాడు. షిరిడీ సాయి బాబా వచ్చి 'పర్వర్ దిగార్' అని గట్టిగా ఉచ్చరించి మేర్వాన్‌కు తాను ప్రణమిల్లి 'పర్వర్‌దిగార్' అని మళ్ళీ రెండు సార్లు సంబోధించాడు. పర్వర్‌దిగార్ అనగా 'సర్వరక్షకా, సృష్టిపాలకుడా' అని అర్థము. కానీ దానిలోని అంతరార్థము గాని, విశేషము గాని ఆ సమయంలో ఎవ్వరు అర్థం చేసుకోలేదు.

షిరిడీ సాయిబాబా గురించి తెలియని వారుండరు. ఆయన పుట్టుక, వంశము గురించి భిన్నాభిప్రాయములు కలవు. నిజానికి ఏకులానికి మతానికి చెందని సాయిబాబా యొక్క మతం గురించిన ఆలోచన నిరర్థకమైనది కాదా! అతడు కడు పేదయైనా ఆధ్యాత్మికంగా అమిత శక్తిశాలి. ఆ సమయంలోని పంచ సద్గురువులలో మేటియైన సాయి 'కుతుబ్ – ఎ – ఇర్షాద్' గా ప్రతీతి. ప్రాపంచిక సమస్యలకు పరిష్కారాన్ని, ఇహ సౌఖ్యాలకై ఆశీస్సుల నాశించి మాత్రమే సాయిబాబా నారాధించే వారికి ఆయన ఆధ్యాత్మి కౌన్నత్యము ఏమి తెలియును? మొదటి ప్రపంచ యుద్ధ మాతడు తన కనుసంజ్ఞలతో నడపగలిగాడంటే నమ్మశక్యము కాదు గదా! సాయిబాబా బ్రాహ్మణ కుటుంబములో జన్మించాడని, తల్లి దండ్రులు బాల్యంలోనే మరణించగా నొక మహమ్మదీయ భక్తుడు పెంచాడని చాలా మంది అభిప్రాయం. బాల్యంలో తల్లితో 5 సంవత్సరాలు సంచరించి ఆకలి



తీర్చుకోవడానికి భిక్షాటనము చేసాడు. నేడు అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడిగా స్తుతింపబడే సద్గురు సాయినాథుడు బాల్యములో ఎన్నో కష్టాలకు, బాధలకు గురియైనాడు. విధి విలాస మెటువంటిదో తెలియదు గదా! గోపాల్‌రావు దేశ్‌ముఖ్ అనే సత్పురుషుడు శేల్‌వాడిలో అందరిచే గౌరవింపబడే మహాత్ముడు. ఆయన సాయిబాబాను చేరదీసాడు. సాయిబాబా లోని గొప్పతనాన్ని బహిర్గతం చేశాడు. కాని ఆయన అనుచరులు ఈర్ష్యతో సాయిబాబాను హతమార్చాలని చూశారు.

గోపాల్‌రావు మరణానంతరం సాయిబాబా శేల్‌వాడి వదిలి వెళ్లి అడవుల్లో, కొండల్లో సంచరించాడు. ఔరంగాబాదులోని జర్‌జరీబక్ష్ అనే సద్గురువు సమాధి వద్ద ఆయనకు సాక్షాత్కారం లభించింది. కొంతకాలం తరువాత షిరిడీలో స్థిరనివాసమేర్పరచుకున్నాడు. ఆయన చేసి చూపించిన మహిమలతో ఆకర్షితులైన వారు ఆయన శిష్యులుగా చేరి అనుసరించారు. సాయిబాబా దినచర్యలో ప్రముఖమైనది బహిర్దశకు మేళతాళాలతో భక్తులు వెంటరాగా వెళ్ళే 'లెండి' అనే కార్యక్రమం. ఈ సమయంలో తన ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించి అబ్దల్స్ అనే తన ఏజెంట్లతో సంప్రదించేవాడు. సాయిబాబా అసాధారణమైన అలవాట్లలో ఆయన రాత్రి నిదురించే పద్ధతి చెప్పవచ్చు. ఆయన ఆ సమయంలో 'గౌస్' స్థితిలో నుండేవాడు. ఆయన కాళ్ళు చేతులు విడిగా పెట్టి మొండము విడిగా పెట్టి నిదురించేవాడు. దీనిని చూచిన బాబా శిష్యుడొకడు అంధుడైనాడు. సాయిబాబాను

సందర్శించడానికి వచ్చిన వారినుండి డబ్బు వసూలు చేసి ఆర్తులకు పంచేవాడు. తన దగ్గర పెట్టిన గులకరాళ్ళను దర్శనార్థులపైకి విసిరేవాడు. అవి తాకిన వారు ప్రసాదము లభించినట్లుగా సంతసించేవారు. అక్టోబర్ 15వ తేది 1918వ సంవత్సరం విజయ దశమి పర్వదినం రోజున సాయిబాబా పరమ పదించారు.

సాయిబాబ ప్రేరణతో మేర్వాన్ సద్గురు ఉపాసనీ మహరాజ్‌ను దర్శించడానికి ఖండోబా ఆలయానికి ఖోడు అనే సహచరునితో వెళ్ళాడు. షిరిడీ సాయిబాబా కృపతో దైవసాక్షాత్కారం పొందిన ఉపాసనీ మహరాజ్ ఖండోబా ఆలయంలో ఉన్నారు. దైవ సాక్షాత్కారానికి ముందు రెండు సంవత్సరాల నుండి కఠిన నియమములతో ఉపవసించి తేళ్ళు పాముల మధ్య ఆ ఆలయంలో నివసించాడు. కేవలం గోనె గుడ్డ మాత్రం ధరించి అర్ధ నగ్నంగా ఉండేవాడు. ఉపాసనీ మహరాజ్ బ్రాహ్మణ వంశమందు సతానా పట్టణంలో మే 15వ తేది 1870 సం.లో జన్మించాడు. ఆయన తండ్రి గోవింద శాస్త్రి, తల్లి రుక్మిణి. తల్లిదండ్రులు ఉపాసనీకి మొదట పెట్టిన పేరు కాశీనాథ్. తాత గోపాల శాస్త్రి పండితుడు. బాల్యంలో ఆనారోగ్యంతో బాధపడే పిల్లవానిని వైద్యుల వల్ల రక్షించబడే ఆశ కోల్పోయిన తల్లి పిచ్చిదానిగా ప్రవర్తించే ఒక యోగినీ స్త్రీ వద్దకు తీసుకొనిపోగా ఆమె అతని తుంటరి తనానికి కోపగించి రోజు తన వద్దకు వచ్చి కూర్చుంటే బాలుడు రక్షింప బడతాడని చెప్పింది. ఆమె సాంగత్యంలో కాశీనాథ్‌కు ప్రపంచంపై విరక్తి కలిగి దైవసాక్షాత్కారం కొరకు తపన ఏర్పడింది. మూడు సార్లు వివాహం చేసుకొని సంసార జీవితం గడిపిన కాశీనాథ్ యెదలో రగుల్కొన్న సత్యాన్వేషణ జ్వాల ఆయనను నిరంతరం దైవసాక్షాత్కారం కొరకే తపించేటట్లు చేసింది. ఒకసారి బోర్‌గడ్ అనే గ్రామం వద్ద గల కొండపై గుహలో సమాధి స్థితిలో ఒక సంవత్సరం తెలియకుండానే



గడిపాడు. సాయిబాబా అబ్దుల్స్ ద్వారా నిరంతరం కాశీనాథ్ యోగక్షేమాలు చూసేవాడు. సాయిబాబా పర్యవేక్షణలో ఆయన ఆదేశానుసారం ఖండోబా ఆలయంలో కఠిన నియమాలతో ఘోరతపస్సు చేసి సాయిబాబా కృపకు పాత్రుడై సద్గురువయ్యాడు నేటి ఉపాసనీ మహరాజ్‌గా పిలువబడే నాటి కాశీనాథ్. తర్వాత షిరిడీ దగ్గరలోనే గల సాకోరీలో తన ఆశ్రమాన్ని స్థాపించాడు. ఈ ఆశ్రమ స్థాపనలో మేర్వాన్ కూడా మహరాజ్‌కు సహకరించి సాయపడ్డాడు.

## మహరాజ్ సాంగత్యంలో పరిపూర్ణత్వం

తన దరికి వచ్చే మేర్వాన్‌ను చూచి మహరాజ్ ఒక గులకరాయితో కొట్టాడు. అది మేర్వాన్ ఫాలభాగంలో బాబాజాన్ ముద్దు పెట్టుకున్న చోట తగిలి గాయ పర్చింది. రక్తం కూడా స్రవించింది. రాయి తగిలిన వెంటనే మేర్వాన్ అశ్రువులతో నిండిన కళ్ళతో మహరాజ్‌ను సమీపించాడు. మహరాజ్ బాబా నుదుటిపై గాయాన్ని చుంబించి మేర్వాన్‌ను తనతో తాను నివసించే దేవాలయంలోనికి తీసుకొని వెళ్లాడు. ఖోడు మేర్వాన్‌కై వేచిచూస్తూ బయట ఉండిపోయాడు. రెండు రాత్రులు, పగళ్ళు గడచిన తరువాత ఉపాసనీ మహరాజ్‌తో కలిసి మేర్వాన్ బయటికి వచ్చాడు. మేర్వాన్‌ను క్షేమంగా పూనాకు చేర్చవలెనని ఉపాసనీ మహరాజ్ ఖోడుకు చెప్పాడు. మేర్వాన్‌కు భౌతిక చైతన్యం తిరిగి కలగడానికిది తోడ్పడింది. మేర్వాన్ మహరాజ్‌తో సలుపు సాంగత్యము జరుగబోవు మహత్తర కృషికి నాంది యనదగును. మరల మేర్వాన్ మహరాజ్ వద్దకు వెళ్ళినప్పుడు ఆయన సాకోరీలో ఆశ్రమము స్థాపించుకొని యుండెను. మహరాజ్ ఆజ్ఞ ప్రకారం మేర్వాన్ తరచూ సాకోరీ వెళ్ళి ఆయన సాంగత్యము చేయుచుండెను. ఆయనకు మేర్వాన్ పూనానుండి ఉత్తరములు వ్రాయగా సాకోరీ నుండి మహరాజ్ మేర్వాన్‌కు సమాధానములు వ్రాయుచుండెను.

తల్లి మాటను పాటించి, దివ్యచైతన్యములో లీనమై బాహ్యాచైతన్యాన్ని మహరాజ్ సాంగత్యంలో నెమ్మదిగా పొందే సమయంలో మేర్వాన్ అనేక ఉద్యోగాలు చేశాడు. 1916 సం.లో లాహోర్ వెళ్ళి ఒక నాటక కంపెనీలో మేనేజర్‌గా

పనిచేశాడు. జగన్నాటకాన్ని నడిపించే కార్యక్రమానికది నాంది యేమో! తన తండ్రి షెరియార్జీ నడిపే సారాయి దుకాణంలో మరియు బెహ్రాంజీతో కలిసి ప్రారంభించిన సారాయి దుకాణంలో పనిచేసి సారా త్రాగడానికి వచ్చే వారిని త్రాగడం మాన్పించే ప్రయత్నం చేశాడు. సూఫీలు దివ్యప్రేమను మధువుతో పోలుస్తారు. దివ్యప్రేమయనే మధువును పంచే అవతారుడు మధువును పంచడం ద్వారానే తన పని ప్రారంభించాడు. ఒక కంట్రాక్టర్ వద్ద గుమాస్తాగా చేర్పించగా అతడు చెప్పిన తప్పుడు పనులు చేయక మేర్వాన్ ఆ ఉద్యోగం మానేశాడు.

'నేను భగవంతుడను' అనే అనుభవంలో దివ్యచైతన్యంలో లీనమై ద్వంద్వానుభవాలతో కూడి బాహ్య ప్రపంచ జ్ఞానము లుప్తమై కేవలం ఆనందానుభూతి పొందుతున్న మేర్వాన్ సద్గురువుల సాంగత్యంవల్ల మళ్ళీ బాహ్యచైతన్యం పొందే సమయంలో కలిగెడి ఆనందంతో సమ్మిళితమైన ఆవేదన మూలంగా తలను రాతిగోడలకు బాదుకునేవాడు. తల ఫాలభాగం గాయపడి రక్తం కూడా చిందేది. సప్తభూమిక లధిరోహించి 'అహం బ్రహ్మాస్మి' స్థితిని పొందిన వారిని మజ్జూబ్‌లని బ్రాహ్మీ భూతులని అంటారు. దైవసాక్షాత్కారం పొందిన వీరు మళ్ళీ బాహ్య చైతన్యం పొందకుండానే శరీరం వదలి అనంతత్వంతో లీనమౌతారు. పంచ సద్గురువులు మాత్రం మళ్ళీ బాహ్య చైతన్యాన్ని పొంది దివ్యచైతన్యం బాహ్య చైతన్యంతో మేళవించిన పరిపూర్ణత్వాన్ని సాధించి సృష్టిలోని దైవప్రేమికులకు మార్గదర్శులై వారి పాత్ర నిర్వహిస్తారు. అలాగే అవతారుడు కూడా తన దివ్యత్వానుభవాన్ని సద్గురువుల ద్వారా పొందిన తర్వాత బాహ్య చైతన్యాన్ని తిరిగి పొందడానికి ఎంతో వేదనకు గురి కావలసి యుంటుంది. ఈ వేదన యొక్క ఉపశమనానికి చేసే బహిర్గత ప్రక్రియయే మేర్వాన్ తలను బాదుకునే సంఘటన.

ఈ సమయంలోనే మేర్వాన్‌కు సదాశివ పటేల్‌తో పరిచయ మేర్పడింది. ఒకసారి మేర్వాన్ సదాశివ యింటికి వెళ్ళి భోజనం పెట్టమని అడిగాడు. అది సమయం కానందున అందరు తినగా మిగిలిన ఆహారాన్ని అడిగి పెట్టించుకొని తిన్నాడు మేర్వాన్. ఆ తర్వాత సదాశివ పటేల్‌కు కొన్ని విచిత్రమైన ఆధ్యాత్మిక

అనుభూతులు కలిగాయి. ఆయనకు మేర్వాన్‌పై గౌరవము ప్రేమ పెరిగాయి. కాస్బాపేటలో బాబా ఒక గది అద్దెకు తీసుకొని అందులో ప్రముఖంగా ఉపాసనీ మహరాజ్ ఫోటో మరియు సద్గురువుల ఫోటోలు పెట్టి దానిలో సమావేశములు, భజనలు ఏర్పాటు చేశాడు. మేర్వాన్ దివాన్–ఎ–హాఫీజ్ మొదలగు గ్రంథములనుండి ఆధ్యాత్మిక విషయాలు చెప్పేవాడు. సయ్యద్ సాబ్ మరియు మున్షీ రహీమ్ అనువారు బాబాను చూడగానే ఆయనలోని దివ్యత్వాన్ని గుర్తించి అనుసరించారు. మున్షీ రహీమ్ యింటిలో కూడా మేర్వాన్ సమావేశాలు జరిపేవాడు.

తరచూ మేర్వాన్ మహరాజ్ వద్దకు వెళ్ళి చాలా రోజులుండుట తల్లి షిరీన్ మాయి భరింపజాలక మహరాజ్ వద్దకు వెళ్ళి 'నాకుమారుని ఇట్లు మీ వద్ద ఉంచు కొనుట న్యాయము కాదు, పంపండి – వానికి పెండ్లి చేయాలి' అని బ్రతిమాలెను. 'నీ కుమారుడని నీవు భ్రాంతి చెందుచున్నావు కానీ అతడు లోకోత్తర పురుషుడు' అని ఉపాసనీ మహరాజ్ చెప్పెను. కానీ ఆమె కా మాటలు రుచించ లేదు.

1915 వ సంవత్సరమునుండి 1921 వ సంవత్సరము వరకు మేర్వాన్ దివ్య చైతన్యముతో పాటు మామూలు మానవ చైతన్యమును పొందే పరిణామములో సాకోరీకి ఉపాసనీ మహరాజ్ వద్దకు తరచూ వెళ్ళెడివాడు. సద్గురు ఉపాసనీ మహరాజ్ కృపతో ఆయన పర్యవేక్షణలో మేర్వాన్ పరిపూర్ణుడై మెహెర్ బాబాయని పిలువబడెను. ఈ కాలములోనే మెహెర్ బాబా తన శిష్యులను సహచరులను ప్రోగుచేసుకున్నాడు. ఆఖరుసారిగా 1921 సం. మెహెర్ బాబా సాకోరీలో ఆరు మాసములు మహరాజ్ సాంగత్యములో గడిపాడు. సాకోరీలోనే బాబా కార్యదర్శియైన ఆది.కె.ఇరానీ తల్లి గుల్మాయి మేర్వాన్ దివ్యత్వానికి, ప్రేమకు ఆకర్షితురాలైంది. ఆమె తన 'ఆధ్యాత్మిక జనని' అని బాబా అన్నారు. మేర్వాన్ ఆ రోజులలో మొదటి శిష్యులను చేరదీసుకున్న మార్గాలు చిత్రముగా నుండేవి. తన దివ్యత్వాన్ని, సర్వజ్ఞత్వాన్ని సహజంగా వారికి తెలియజేసి ప్రేమతో వారి హృదయాలను వశపరుచుకున్నాడు.

బెయిలీ అను బాల్యస్నేహితుడు మిలిటరీలో కోర్టు మార్షల్ చేయబడి తొలగించబడగా అందరూ అతనిని చూచి ఈసడించు కొనుచుంటే ఆత్మహత్య చేసుకొనుట కుద్యమించెను. సరిగ్గా అదే సమయంలో మేర్వాన్ బెయిలీ అన్నయైన హోమీని పంపించి బెయిలీని తన వద్దకు పిలిపించుకొని తన ఆలింగనంతో ప్రేమతో అతని హృదయాన్ని తేలిక పరచి నవ జీవనాన్ని ప్రసాదించాడు. అట్లే జీవితంలోని సంఘటనలతో విరక్తి పొంది సినిమాలలో నటించుటకు అవకాశం లభించలేదని ఆత్మహత్యకు పాల్పడుచున్న సమయంలో ఖోదాదాద్ ఫరేదూన్ ఇరానీ (నర్వస్) అనునతనిని చేరదీసి తానొక సినిమా నిర్మాతనని తన సినిమాలో అతనికి పాత్రనిచ్చెదనని తీసుకొని వచ్చెను. మేర్వాన్ సాంగత్యంలో అతనికి కొత్త జీవనము ప్రసాదింపబడెను. మెహెర్ బాబా యొక్క జగన్నాటకములో అతనికి పాత్ర లభించింది.

1922వ సం. జనవరి మాసంలో ఉపాసనీ మహరాజ్ గుస్తాద్‌జీ మొదలగు శిష్యులను పిలచి 'మేర్వాన్ పరిపూర్ణుడయ్యాడు. నా తాళము చెవిని ఇతనికిచ్చి వేసితిని. ఇతడు దివ్య సనాతనుడు. ఇతనినాశ్రయించండి. ఏ పరిస్థితులలోను ఇతనిని విడువకండి' అని చెప్పెను. మేర్వాన్‌ను తన కుటీరములోనికి తీసుకొనివెళ్ళి 'మేర్వాన్ నీవు ఆది శక్తివి అవతారుడవు' అని చేతులు జోడించి చెప్పగా మేర్వాన్ మహరాజ్ పాదములకు ప్రణమిల్లెను. అతనిని లేపి ఆలింగనము చేసుకొని పొంగి వచ్చే అశ్రువులతో మహరాజ్ మేర్వాన్‌కు వీడ్కోలు చెప్పెను.

పరిపూర్ణుడైన మేర్వాన్‌ను ఆయన శిష్యులలో నొకడు 'మెహెర్ బాబా' యనే నామముతో పిలువగా మేర్వాన్ మెహెర్ బాబా యనగా కరుణ గల తండ్రి యనే పేరుతో తన అవతార కార్యక్రమాన్ని నిర్వర్తించి అవతార్ మెహెర్ బాబాగా నేడు అందరిచే ఆరాధింప బడుచున్నాడు.

## పూనా కుటీరం – మొదటి ఆశ్రమం

పరిపూర్ణుడై ఉపాసనీ మహరాజ్ వద్ద సెలవు తీసుకొని వచ్చిన మెహెర్

బాబా పూనాలో ఫెర్గూసన్ కాలేజీ రోడ్డులోని ఒక తోటలో సదాశివ పటేల్ ద్వారా నిర్మింపబడిన ఒక కుటీరంలో 27వ జనవరి 1922 సంవత్సరము నుండి నివసించ సాగాడు. బాబా మళ్ళీ తన యింటిలో కాపురముండలేదు కాని అప్పుడప్పుడు వెళ్ళి వచ్చేవాడు. బాబా చేర దీసిన తన స్నేహితులు, ఉపాసనీ మహరాజ్ పంపిన కొందరు శిష్యులు మెహెర్ బాబాకు అనుచరులుగా చేరారు. సాయంత్రము, రాత్రి సత్సంగ కార్యక్రమాలు ఆ కుటీరం వద్ద నిర్వహింపబడేవి.

ప్రతి ఆదివారం చాలా మంది దర్శనార్థం ఆ కుటీరం వద్దకు వచ్చేవారు. రాత్రి సమయంలో ఒక సహచరుడు కాపలాగా ఉండటం ఆనాటినుండే ప్రారంభమైంది. బెయిలీ, అర్జున్ సూపేకర్ కాపలాగా వుండేవారు. రాత్రి బాబా విశ్రమించే సమయంలో ఎవ్వరూ రాకూడదని బాబా నియమ మేర్పరచారు. దానికి అవిధేయతతో రాత్రి సమయంలో బాబా ఆ కుటీరంలో ఏమి చేస్తారో తెలుసుకోవాలనే కుతూహలంతో జంషెడ్ ఆర్ ఇరానీ (జంబూ మామ) అను నతడు ఒకనాటి రాత్రి ఫెర్గూసన్ రోడ్డుకు వెళ్ళి కుటీరాన్ని కనుగొనలేక పోయాడు. సుపరిచితమైన ఆ ప్రదేశంలో ఎంత తిరిగినా బాబా కుటీరాన్ని కనుగొన లేక పోయాడు. మరునాడు బాబాను కలువగా 'రాత్రి నిద్ర పోలేదా! అలా వున్నావేమిటి? అని బాబా అడిగాడు. కాని అతడు అసలు విషయం చెప్పలేదు. అక్కడ వున్న శిష్యులను సంబోధిస్తూ బాబా ఇలా అన్నారు 'ఎవరైనా తప్పు చేసినా నన్ను మోసం చేసినా ఒప్పుకొని క్షమాపణ వేడుకుంటే రక్షింపబడతారు. లేకుంటే పర్యవసానం కఠినంగా ఉంటుంది'. అయినా జంబూమామ రాత్రి జరిగిన విషయం చెప్పలేదు. రెండు రోజుల తర్వాత అతనికి గల ఒక్క కుమారుడు మరణించాడు. ఆ తర్వాత జంబూమామ పశ్చాత్తాపముతో పరితపించి బాబాను క్షమాపణ కోరాడు. అతనికంత కఠినమైన శిక్ష ఎందుకు వేయబడిందని అందరూ చింతించారు. ఆ తర్వాత బాబా ఒక రోజు ఈ క్రింది కథను తన అనుచరులకు చెప్పారు.

ఒకసారి ఒక సద్గురువు శిష్యులతో భిక్షాటనానికి బయలుదేరాడు. ఒక ధనికుడైన వ్యాపారి వద్దకు వెళ్ళారు. అతడు భిక్ష యిచ్చే బదులు దూషిస్తూ అరిచాడు. సద్గురు వాతని వ్యాపారము ఇనుమడించుగాక అని దీవించాడు. ఆ

తర్వాత ఇంకొక సంపన్నుని యింటికి వెళ్ళగా అతను ఇంకనూ అసభ్యకరంగా ప్రవర్తించాడు. అతని లాభాలు నాలుగింతలగు గాక అని గురువుగారు దీవించారు. ఆ తర్వాత గురువు గారొక వృద్ధుడైన బీద వ్యాపారి వద్దకు వెళ్ళారు. అతడు భక్తి శ్రద్ధలతో గురువు గారి నాహ్వానించి తన దగ్గర గల కొలది సరుకులను గురువు గారిని స్వీకరించమని కోరాడు. గురువు గారు బయలు దేరుతూ ఆ బీద వ్యాపారికి గల ఏకైక కుమారుడు మృతి చెందాలని తాను భగవంతుని ప్రార్థిస్తానన్నాడు. అలాగే అతని కుమారుడు మరుసటి దినము మరణించాడు. ఆ గురువుగారి శిష్యులు విస్మయమంది, అదేమి న్యాయమని గురువుగారి నడిగారు. అప్పుడు గురువుగారు ఈ విధంగా విశదీకరించారు. 'మొదటి యిద్దరూ భౌతిక సంపదలపై మమకారం పెంచుకొని ఆ బంధనాలనుండి విముక్తిని కాంక్షించుట లేదు. కావున వారు ఆ బంధనాలలో ఇంకను ఎక్కువగా చిక్కుకొనునట్లు ఆశీర్వదించాను. పెరిగిన బంధనాల వల్ల సంక్రమించే బాధలతో ఎప్పటికైనా విముక్తి కోసం ఆర్తనాదం చేస్తారు. ఇక మూడవ వాడైన బీద వ్యాపారస్తుడు ఆధ్యాత్మికంగా ఎదిగినవాడు కానీ తన కుమారునిపై గల మమకారంతో ఆధ్యాత్మిక మార్గంలో పురోగమించలేక పోతున్నాడు. అతని కుమారుడే అతని పాదంలో ముల్లుగా పరిణమించాడు. అందుకే అతనినుండి అతని కుమారుని వేరుచేసి ఆధ్యాత్మిక పురోగతికి మార్గం సుగమం చేశాను'.

బాబా చెప్పిన ఈ కథవల్ల జంబూమామ కుమారుని మృతికి అంతరార్థం గ్రహించ గలిగారు. అదే విధంగా జంబూమామ బాబాకు సర్వార్పణ చేసి ఆయన సాంగత్యంలో తన దుఃఖాన్ని పుత్ర వియోగాన్ని అధిగమించ గలిగాడు. బాబా ప్రేమకు పాత్రుడైనాడు.

బాబా కుటీరం వద్ద కాపలాగా ఉన్న అర్జున్ సూపేకర్ ఒక రాత్రి రెండు వింత ఆకారాలు తన వైపు వస్తున్నట్లు చూచాడు. అవి నెమ్మదిగా 20 అడుగుల ఎత్తు ఎదిగాయి. భీతిల్లిన అర్జున్ స్థితిని గ్రహించిన బాబా కుటీరం నుండి బయటకు వచ్చి విషయం తెల్సుకొని భయపడవలసిన పనిలేదని అవి ఆత్మహత్య చేసుకొని

పునర్జన్మకై చాలాకాలం నుండి తపన పడుచున్న ప్రేతాత్మలని చెప్పారు. ఎప్పుడూ అలాంటి ప్రేతాత్మలు తన చెంతకు వస్తుంటాయని వాటి గురించి భయపడ వలదని చెప్పారు. ఒక రాత్రి బాబా కుటీరం నుండి బయటకు వెళ్ళి వస్తూ ఆ ప్రేతాత్మలకు జన్మ ప్రసాదించానని చెప్పారు. ఆ తర్వాత అర్జున్‌కు ఆ ఆకారాలు మళ్ళీ కనిపించ లేదు.

పూనా కుటీరంలో నుండే సమయంలో బాబా తన తొలి శిష్యులను చేరదీసుకున్నారు. ఒక్కొక్కరికి తన దివ్యత్వంలో విశ్వాసాన్ని కలుగజేసి తన ప్రేమతో వారి హృదయాలను తన వైపున కాకర్షింప జేసుకొని మున్ముందు తన విశ్వ కార్యక్రమంలో భాగస్వాములై వారి సర్వస్వాన్ని ధారపోయునట్లు వారినీ తీర్చి దిద్దారు.

కొలది మాసములలోనే బాబా వద్ద అన్ని మతములకు చెందిన వారు బాబాకు బాల్య స్నేహితులు సహాధ్యాయులు శిష్యులుగా జేరారు. 22 మంది హిందువులు, 12 మంది మహమ్మదీయులు, 11 మంది జోరాష్ట్రియన్లు మొత్తం 45 మంది సర్వము త్యజించి బాబాతో నుండుట కంగీకరించారు. 1922 వ సంవత్సరం, మే 22వ తేదీన ఉదయం 2 గంటలకు బాబా 45 మంది శిష్యులతో కాలినడకన బొంబాయి నగరానికి బయలుదేరారు. పూనాలోని కుటీరాన్ని కూల్చివేశారు.

## మంజిల్ – ఎ – మీమ్

'నా పని నేనే చేసుకుంటాను. కాని నాపనిలో పాల్గొనే అవకాశం పొందడం అదృష్టం' అన్నారు బాబా. బాబా పనిలో పాల్గొనడానికి సంపూర్ణ విధేయత, ప్రియతముని ఇచ్ఛకు బద్ధుడై సర్వము ఆయన కర్పించే భావంతో చేయడం అవసరం. లేకపోతే ప్రేమికులు ప్రియతమునికి, శిష్యులు గురువునకు ఆయన విశ్వకార్యంలో అవరోధంగా మాత్రమే ఉంటారు. తన శిష్యులను తన విశ్వకార్యంలో సహకరించి పాల్గొనే లాగున తీర్చిదిద్దడానికి యిచ్చిన కఠిన నియమములతో కూడిన శిక్షణయే 'మంజిల్ – ఎ – మీమ్' అను పేరుతో

బొంబాయిలో బాబా తన శిష్యులతో గడిపిన రెండవ ఆశ్రమ ఘట్టం. దాదరులో నొక భవనము నద్దెకు తీసుకొని దానికి మంజిల్ - ఎ - మీమ్ అనే పేరుపెట్టి దానిలో బాబా తన శిష్యులతో 7.6.1922 వ తేదిన చేరారు.

మంజిల్‌లో అందరూ కులమత విచక్షణ లేక కలసి ఉండేవారు. అన్ని సదుపాయాలు చేయబడ్డాయి. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు తమతమ ఉద్యోగాలకు వెళ్ళి వచ్చి సాయంత్రం 7 గంటల నుండి ఉదయం 7 గంటల వరకు మంజిల్‌లో ఉండాలి. వేకువనే లేచి కాల కృత్యాలు తీర్చుకొని ఒక గంటసేపు వారికిష్టమైన భగవన్నామాన్ని జపించాలి. సాయం సమయాల్లో ఆటలు ఆడించేవారు. మంజిల్ బయట ఎవ్వరితో మాటలాడకూడదు. ఎట్టి సంబంధములు పెట్టుకోరాదు. మంజిల్‌లో ఉండే సంవత్సరం పాటు మాంసాహారం మద్యపానం నిషేధింపబడింది. పెళ్ళయిన వారితో సహా అందరూ బ్రహ్మచర్యం పాటించాలి. ఎట్టి పరిస్థితులలోను ప్రపంచమంతా ఎదురు తిరిగినా వారు మాత్రం బాబాను వదలి పెట్టరాదు.

బాబా మంజిల్‌లో ఉండే తన శిష్యులు నూటికి నూరు పాళ్ళు విధేయులుగా ఉండాలని చెప్పారు. బాబా పిలవగానే వెంటనే రావాలి. గడ్డం గీసుకునే వారు అలాగే సగంలో ఆపి రావాలి. అలా విధేయులుగా ఉండ లేకపోతే ప్రయోజనం లేదని తాను యివ్వదలచింది పొందలేక పోతారని బాబా చెప్పారు.

మంజిల్‌లో ఉండే రోజుల్లో బయట పరిచయస్థులు కలసినా మాట్లాడ కూడదనే నియమం ఉండేది. సరోష్ ఒక వర్క్ షాప్‌లో పనిచేసేవాడు. ఒకరోజు మంజిల్‌కు తిరిగి వస్తుండగా రైలులో సహాధ్యాయి అయిన బాల్య స్నేహితుడు కనిపించాడు. అతను సరోష్‌ను గుర్తించి 'సరోష్ ఎలా ఉన్నావు చాలా రోజుల తర్వాత కనిపించావు' అని పలుకరించాడు. సరోష్ ముఖము వేరొక ప్రక్కకు తిప్పుకొని మౌనంగా ఉండి పోయాడు. ఆ స్నేహితుడింకా దగ్గరిగా వచ్చి మళ్ళీ పరీక్షించి 'ఔను నీవు సరోష్‌వే! ఏమైంది సరోష్ - చదువుకునే రోజుల్లో చాలా చురుకుగా ఉండేవాడివి. ఎందుకు మాట్లాడడం లేదు?' అని విచారించి

పిచ్చివాడైనాడేమోనని మిగిలిన రైలు ప్రయాణీకులతో చెప్పి బాధ పడ్డాడు. ఈ విషయం బాబాకు చెప్పగా బాబా సంతసించి ఆ స్నేహితుణ్ణి మంజిల్‌కు పిలిపించి తన దర్శనమిచ్చి పిచ్చివాడు కాలేదని చూపించాడు.

బాబా మంజిల్‌లో ఉన్న తన శిష్యులను తరచూ ఆకస్మికంగా 'ఏమి ఆలోచిస్తున్నావు' అని అడిగేవాడు. వెంటనే వారు తమ మనస్సులో మెదిలే ఆలోచనను సంకోచించకుండా చెప్పాలి. ఒకసారి బాబా దర్శనానికి ఒక కుటుంబ సభ్యులు మంజిల్‌కు వచ్చారు. వారిలో ఒక అందమైన యువతి ఉంది. బాబా ప్రక్కనే ఆది నిలబడి యున్నాడు. వెంటనే బాబా ఆదీని 'ఏమి అలోచిస్తున్నావు' అని అడిగాడు. ఆది 'ఏమీ లేద'ని చెప్పాడు. వారు వెళ్లిపోయిన తరువాత మళ్ళీ అడిగాడు బాబా. వారం రోజులదాకా బాబా ఆ విషయం గురించి ఆదీని అడుగుతూ వచ్చాడు. ఆ సమయంలో అందమైన యువతిని చూడగానే ఆదీ మనస్సులో కామవాంఛ పొడసూపింది. కాని వారి ముందు తన దురాలోచన గురించి చెప్పలేక ఏమీ లేదన్నాడు. అబ్దుల్ ఘనీకి కూడా అలాంటి ఆలోచనలే వచ్చాయి. వారిద్దరినీ బాబా తన గదిలోకి తీసుకుని వెళ్ళి ఇలా అన్నారు 'మీరు అబద్ధమాడి నా నుండి తప్పించుకోలేరు. నన్ను మతిలేని వానిగా భావించకండి. నిన్న మీరేమి ఆలోచించారో నాకు తెలుసు. ఈ రోజు ఏమి ఆలోచిస్తున్నారో, రేపు ఏమి ఆలోచిస్తారో కూడా నాకు తెలుసు. భూత భవిష్య ద్వర్తమానాలు నాకు తెరచి పెట్టిన పుస్తకం లాంటివి.' అంటూ బాబా వారిద్దరి జీవితంలో జరిగిన సంఘటనలు వారికి తప్ప యితరులెవ్వరికీ తెలియని వాటిని తేదీలతో సహా చెప్పారు. దానితో వారికి బాబా సర్వజ్ఞుడనే విషయం రూఢీయైనది.

బాబా సర్వజ్ఞత్వాన్ని బహిర్గతం చేసే సంఘటనలెన్నో మంజిల్‌లో జరిగాయి. ఒకసారి సాయాని అనే ప్రొఫెసర్ అతని గురువుగారి ఆదేశం మేరకు బాబా తలపై ఎలాంటి టోపీ ధరిస్తాడో తెలుసుకొనడానికి వచ్చాడు. బాబా దర్శనం చేసుకొని బాబా ముందు కూర్చున్నాడు. ఆ రోజు బాబా తలపై ఏమీ ధరించలేదు. ఎలా అడగాలో తోచక సందిగ్ధంలో ఉన్న సమయంలో బాబా తన శిష్యులనుద్దేశించి 'నేనీ

మధ్యన బయటకు వెళ్ళే టప్పుడు టర్కిష్ కుచ్చు టోపీ ధరిస్తున్నాను కదా!' అన్నాడు. సందర్భంలేని ఆ ప్రస్తావన వారికి అర్థం కాలేదు. కానీ ప్రొఫెసర్ గారి సమస్య తీర్చబడింది. ఆయన వెళ్ళేముందు బాబా సర్వజ్ఞత్వంతో తన మనస్సులోని సందేహాన్ని ఎవరినీ అడిగే అవసరం లేకుండానే తీర్చాడని చెప్పాడు.

ఒకరోజు బాబా తన శిష్యులతో మంజిల్‌నుండి కళ్యాణ్‌కు వెళ్ళి రాత్రి తిరిగి వచ్చారు. ఆరోజు మంజిల్‌లో ఉన్నవారికి భోజనం కొరకు ఒక్కొక్కరికి రెండు రూపాయలు యివ్వబడ్డాయి. బాబా తిరిగి వచ్చిన తర్వాత బాబా లేని సమయంలో మంజిల్‌లో ఎవరో తప్పుడు పని చేశారని మూడు రోజుల్లో ఆ వ్యక్తి వచ్చి చేసిన తప్పు ఒప్పుకొని క్షమాపణ చెప్పాలని నోటీస్ బోర్డ్‌పై వ్రాయించారు. అందరికీ చెప్పారు. ఈ విషయంలో బాబా కనపర్చిన కోపానికి మంజిల్‌వారు భయ భ్రాంతులైనారు. మూడవ రోజు బాబా తన గది నుండి వేటాడే సింహంలాగా వచ్చి మహబూబ్ అనే పనివాడివైపు తిరిగి 'మేము లేని సమయంలో మంజిల్‌లో ఏమి చేశావు చెప్పు' అన్నారు. మహబూబ్ వణికిపోతూ నేనేమీ చేయలేదని అబద్ధం చెప్పాడు. బాబాయే స్వయంగా జరిగిన విషయం చెప్పారు. మరుగుదొడ్లు శుభ్రం చేయడానికి వచ్చిన స్త్రీతో వాడు చేసిన సంపర్కాన్ని ఆ సమయాన్ని బాబా చెప్పి 'అబద్ధం చెప్పినందుకు సిగ్గుగా లేదా' అని చీవాట్లు పెట్టారు. గత్యంతరం లేక వాడు తన తప్పిదాన్ని ఒప్పుకున్నాడు. బాబా వానిని ఉద్యోగం నుండి తొలగించి మున్షీ రహీమ్ యింటికి పంపించారు. అలాగే కాశీనాథ్ అను చాకలి, బాబా మాటలు వినకుండా పనిచేసే ఒక స్త్రీతో అక్రమ సంబంధం మానక, అవిధేయత వల్ల కుష్ఠువ్యాధితో బాధపడి బాబా దయతో మళ్ళీ ఆరోగ్యవంతుడైనాడు.

మంజిల్‌లోనే శిష్యులకు బాబా తాను చెప్పింది మాత్రం చేయాలని కాని తాను చేసింది చేయరాదని చెప్పాడు. ఒకరోజు బాబా శిష్యులతో కలిసి పేకాట ఆడారు. బాబా ఆడుతూ ఒక ముక్కను తీసుకొని కార్డులతో కలిపి గెలిచాడు. అది చూచి డాక్టర్ ఘని కూడా ఎవరూ చూడకుండా ఒక కార్డు మార్చుకున్నాడు. బాబా చీవాట్లు పెట్టి అలా చేయకూడదన్నాడు కానీ బాబాయే స్వయంగా చేసినప్పుడు

తానెందుకు చేయకూడదు అనే సందిగ్ధంతో బాబానే అడగాలని నిర్ణయించుకున్నాడు ఘనీ. బాబా అందరినీ సమావేశపరచి ఈ కథ చెప్పాడు.

ఒకసారు ఒక సద్గురువు శిష్యులతో బయలు దేరి వెళ్ళుతూ ఒకచోట స్వీట్లు అమ్మే యింటికెళ్ళాడు. అక్కడ ఉన్న స్వీట్లనుండి ఒకటి తీసుకొని తిన్నాడు. వెంటనే ఉన్న శిష్యులందరూ స్వీట్లు తీసుకొని తిన్నారు. గురువుగారి అనుమతి గాని, స్వీట్ల యజమాని ఇచ్చేవరకు చూడకుండానే తీసుకుని తిన్నారు. గురువుగారు అక్కడి నుండి కొలిమిలో సీసం కరిగించే కంసాలి శిష్యుని యింటికి వెళ్లాడు. అక్కడ మూసలలో కరిగించి యున్న సీసం ద్రవాన్ని తీసుకుని త్రాగారు. శిష్యులందరూ ఏమీ తోచక ఒకరినొకరు చూస్తూ నిలబడి పోయారు. అంత గురువు గారు 'కానీయండి – సీసం కూడా త్రాగేయండి – స్వీట్లు తినగానే సరిపోదు' అన్నారు. శిష్యులు వారి తప్పిదాన్ని గ్రహించి క్షమాపణ వేడుకున్నారు.

మంజిల్‌లో నుండగా బాబా ఉపాసనీ మహరాజ్ జీవిత చరిత్రను బీదలకు 'ఆలంబన' అనే పేరుతో ముద్రణ చేయించి అమ్మకం చేయించారు. ఈ పనిలో నవసారికి చెందిన ప్రముఖ రచయిత సోరాబ్జీ దేశాయి మొదట తిరస్కరించి తర్వాత హ్యూమా పేరుతో రచనలు చేసింది బాబాయేనని తెలుసుకొని ఉపాసనీ మహరాజ్ చరిత్రను సంకలనము చేసి బాబా కృపకు పాత్రుడైనాడు. ఉపాసనీ బాబా చరిత్రను సవరించి సంకలనం చేసే సమయంలో సోరాబ్జీ దేశాయి గారికి ఎన్నో అనుమానాలు వచ్చేవి. వాటికై బాబా సూచనలు కోరుతూ ఉత్తరం వ్రాసేవారు. ఆయన ఆ ఉత్తరం పోస్టులో వేసిన రోజే బాబా నుండి ఆ సందేహాలను నివృత్తి చేస్తూ సూచనలిచ్చే జవాబు వచ్చేది. తన ఉత్తరం చేరకముందే బాబా తనకు జవాబు వ్రాయించడం చూచి బాబా సర్వజ్ఞుడని సర్వుల హృదయాలను మనస్సుల నెరింగిన వాడని సోరాబ్జీకి దృఢశ్వాస మేర్పడింది. బాబా అబ్దుల్ ఘనీని, రంజూ అబ్దుల్లాను మహమ్మదీయులు నివసించే ప్రాంతంలో ఉపాసనీ మహరాజ్ జీవిత చరిత్ర పుస్తకాలు అమ్మడానికి పంపారు. వారిని చూచి మహమ్మదీయ సోదరులు అసహ్యించుకొని తూలనాడారు. ఎట్టి అవమానమైనా సంతోషంగా నిర్లిప్తతతో స్వీకరించి బాబా ఆదేశించిన పని చేయడానికి బాబా తన శిష్యులను సంసిద్ధులుగా చేశారు.



మంజిల్‌లో నుండగా బాబా శిష్యులతో అజ్మీర్, పుష్కర్ పలు ప్రాంతాలను పర్యటించి వచ్చేవారు. శిష్యులను తీర్చిదిద్దే కార్యక్రమంలో వారి సంస్కారాలను, బలహీనతలను క్షాళనం చేసే పనిలో తాను స్వయంగా బాధలకు గురియైనాడు బాబా. శిష్యులు తప్పులు చేస్తే ఆయన జ్వరంతో బాధ పడటం, తన గదిలో కొద్ది రోజుల దాకా ఉపవాసం చేసి బయటకు రాకుండా ఉండటం ఎప్పుడూ జరుగుతూ ఉండేవి.

మంజిల్‌లో ఉండగానే ఒక రోజు శిష్యులతో సమావేశమైయుండగా మనకు ఒక 'మోటో' ఆదర్శవాక్యం ఉండాలి అనే ప్రతిపాదన రాగా ఎవరూ సరియైన వాక్యాన్ని సూచించలేక పోవడంతో బాబాయే 'మాస్టరీ ఇన్ సర్విట్యూడ్' (సేవలో పరిపూర్ణత) అను వాక్యాన్ని సూచించగా అందరూ దానిని అంగీకరించారు. ఈ ఆదర్శమే బాబా చేసిన విశ్వ కార్యక్రమానికి ప్రతీకగా నిలచింది. బాబా సమాధిపై గూడా ఈ వాక్యము వ్రాయబడి భావి తరాల వారికి ఆదర్శంగా సూచించబడింది. పేదవారు, మస్తులు మరియు కుష్ఠువారికి బాబా చేసిన సేవలు మంజిల్ నుండే ప్రారంభమయ్యాయి.




## మెహెరాబాద్ ఆశ్రమం

1923 వ సంవత్సరం ఏప్రిల్ 19 వ తేది బాబా మంజిల్‌ను ఎత్తివేసి అహమద్‌నగర్ కు ప్రయాణమయ్యారు. కఠిన దేహ పరిశ్రమకోర్చే శక్తి, సంసిద్ధత

గల 13 మంది శిష్యులను మాత్రం వెంట తీసుకుని వెళ్ళారు. మిగిలిన వారిని వారి వారి యిండ్లకు పంపివేశారు. ఇండ్లకు వెళ్ళిన వారు బాబాతో సంబంధం పెట్టుకొని బాబాకు విధేయులై జీవితాలు గడపటానికి నియమాలేర్పరచారు. మంజిల్‌లో అన్ని మతాలకు చెందిన విభిన్న మనస్తత్వాలు గల శిష్యులందరు కలిసి జీవించి బాబాకు విధేయులై తమ యిష్టాయిష్టాలు, అభిప్రాయ భేదాలు వదులుకొని ముమ్మందు సర్వార్పణ తో అవతారుని కార్యక్రమంలో పాల్గొనడానికి కావలసిన సామర్థ్యాన్ని పెంపొందించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఆ స్వల్ప కాలంలో బాబాతో గడిపిన రోజులు అనుభూతి మరచిపోలేక ఇండ్లకు పంపబడిన శిష్యులు మళ్ళీ బాబా సహవాసంలో గడపి ఆయనకు సేవ చేసే భాగ్యం ఎప్పుడు కలుగుతుందా యని వేచి చూస్తుండే వారు.

బాబా రైలులో బొంబాయి నుండి అహమద్‌నగర్‌కు వెళ్లారు. మార్గ మధ్యలో పూనాలో బాబా బంధువులు, స్నేహితులు, శిష్యులు బాబాను కలుసుకొని పూలమాలలతో సత్కరించారు. అహమద్‌నగర్‌లో బాబా అదీ. కె. ఇరానీ తండ్రి కైఖుస్రూకు చెందిన ఖుస్రూ క్వార్టర్స్‌లో నున్నారు. ఆయన భార్య గుల్మాయి. ఉపాసనీ మహరాజ్ ఆశ్రమంలో బాబాకు ఆప్తురాలైంది. వారి కుమారుడు బాబాకు కార్యదర్శియైనాడు. ఏప్రిల్ మాసాంతమున శిష్యులతో బాబా 'హాపీ వ్యాలి' లో (నేటి మెహెరాబాద్‌కు 10 కి.మీ. దూరంలో గల సీతాకుండ్ అని పిలువబడే లోయలో) మూడు రోజులు గడిపారు. ఆ సమయంలో ఉపాసనీ మహరాజ్ 53వ జన్మ దినోత్సవం చేశారు. శిష్యులచే ఉపవాసం చేయించి పేదలకు అన్నదానం చేయించారు బాబా. అహమద్‌నగర్ తిరిగి వెళ్ళి రైలు స్టేషన్ వద్ద గల ధర్మశాలలో కేవలం ద్రవ పదార్థాలు మాత్రం తీసుకొని గడిపారు. ఒకనాడు (13.05.1923 రోజు) బాబా అరణ్‌గాం గ్రామ సమీపమున అహమద్‌నగర్‌కు ఆరు మైళ్ళ దూరంలో గల మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో సైనికుల స్థావరమైన ప్రదేశానికి వెళ్ళి అక్కడి రోడ్డు ప్రక్కనే గల ఒక బావి దగ్గర చెట్టు క్రింద విశ్రమించారు. అక్కడ ఒక మహమ్మదీయ సత్పురుషుడు తన సమాధిని నిర్మించుకున్నాడు. బాబా విశ్రమించిన ఆ స్థల సమీపాననే నేడు ధుని వెలిగించ

బడుచున్నది. బాబా అక్కడి పోస్టాఫీస్ భవనంలో బస చేశారు. ఇది చాలా కాలం బాబా నివాస స్థలంగా ఉన్నది. తర్వాత దానిని పడగొట్ట వలసి వచ్చి నందున దానిని నేలమట్టం చేయించి ఆ రాళ్ళను బాబా సమాధి నిర్మించడానికి వాడుకున్నారు. మెహెరాబాద్‌లో బాబా నివాసానికి వాడుకున్న ఆ పోస్టాఫీస్ భవనము, దాని రాళ్ళు కూడా ప్రాముఖ్యం సంతరించుకున్నాయి. 'ఈ ప్రదేశం నాకు నచ్చింది. నా ఆశ్రమం ఇక్కడే స్థాపిస్తాను' అని బాబా చెప్పారు. ఆ స్థలాన్ని కాంట్రాక్టర్ ప్రోద్బలంతో లాభదాయకం కాకున్నా, ఆది తండ్రియైన కైఖుస్రూ కొన్నాడు. ఆ విధంగా బాబా విశ్వ కార్యానికి కేంద్ర స్థలమైన మెహెరాబాద్ ఆశ్రమ స్థలాన్ని కొని బాబా కర్పించుకొనే భాగ్యాన్ని బాబా కైఖుస్రూ కుటుంబానికి ప్రసాదించారు. అహమద్‌నగర్‌లో నేడు ట్రస్టు కార్యాలయాలు గల ఖుస్రూ క్వార్టర్స్ కూడా బాబాకు ఆ కుటుంబం ద్వారా సంక్రమించినవే. బాబాకు జీవితాంతం సేవ చేసి వారి సర్వస్వాన్ని ధారపోసిన కైఖుస్రూ, గుల్మాయిల కుటుంబమెంత ధన్యమైనదో గదా!




'మెహెరాబాద్' అనే పేరుతో బాబా కార్యానికి కేంద్రమైన ఆ ప్రాంతం మధ్యలో రహదారి రైలు మార్గం ఉన్నందున ఎగువ మెహెరాబాద్, దిగువ మెహెరాబాద్‌గా విభజింప బడ్డాయి. ఎగువ మెహెరాబాద్‌లో రాతితో నిర్మించిన ఒక నీళ్ళ ట్యాంక్, దిగువ మెహెరాబాద్‌లో శిథిలమైన కొన్ని ఇళ్ళు ఉండేవి. ఎగువ మెహరాబాద్‌లో నేడు బాబా సమాధి, మెహెర్ రిట్రీట్, మ్యూజియం, గ్రంథాలయం మరియు దిగువ మెహెరాబాద్‌లో ధర్మశాల, యాత్రికుల నివాసాని కేర్పరచిన వసతి గృహాలు ఉన్నాయి. నీళ్ళ ట్యాంక్‌కు రెండు ద్వారాలు. కిటికీలు పెట్టించి, తుప్పలు, ముళ్ళ పొదలు నరికించి, ఆ ప్రదేశాన్ని శుభ్రం చేయించి బాబా నివాస యోగ్యంగా చేశారు. దిగువ మెహెరాబాద్‌లో గల ఇళ్ళను బాబా శిష్యులు బాగు చేసి బాబా

ఆదేశం మేరకు వ్యవసాయం ప్రారంభించారు.

అరణ్‌గాం గ్రామంలో విఠోబా మందిరం ఉంది. దీనికి రెండవ పండరీపురం అనే పేరు ఉంది. ఈ మందిరంలో బువాజీ బువా అనే ఉన్నతాత్మ గల మహాత్ముడుండేవాడు. ఈ ప్రాంతం అవతారుని విశ్వకార్యానికి కేంద్రం కాబోతుందని తెలిసిన గిలోరిషా అనే సత్పురుషుడు బాబా రావడానికి చాలా సంవత్సరాలు ముందుగానే తన భౌతిక కాయాన్ని మెహెరాబాద్ ప్రాంతంలో సమాధి చేయ వలసిందిగా శిష్యుల నాదేశించాడు. నేటి ధుని సమీపంలో ఉన్న సమాధి ఆయనదే.

1923 వ సంవత్సరం నుండే బాబా విస్తృత పర్యటనలు ప్రారంభించారు. ఆగ్రా, కరాచీ, క్వెట్టా, నవసారి పలుపట్టణాలలో పర్యటించారు. బాబా నవసారీలో సోరాబ్జీ దేశాయి ఇంట్లో బస చేశారు. ఆయన సోదరి భర్తను కోల్పోయి 25 ఏళ్ళనుండి అస్వస్థతతో బాధ పడుచుండెను. నడువ లేని స్థితిలో నుండెను. అత్యంత భక్తి శ్రద్దలతో ఆమె బాబా దర్శనము చేసుకొని బాబా అనుగ్రహముతో మళ్ళీ నడువసాగెను. నవంబరు మాసంలో బాబా పర్షియా దేశ పర్యటనకై వీసాలు పొందుటకు మండలిలోని ఒక శిష్యుని బొంబాయికి పంపించారు. బాబా మండలితో కరాచీలో ఉన్నారు. వీసాలకై వెళ్ళిన శిష్యునికి ఒక వింత సంఘటన తెలిసింది. వీసాకై దరఖాస్తుదారుడు స్వయంగా ఆఫీసుకు వెళ్ళి సంతకాలు చెయ్యాలని చెప్పి బాబా వచ్చి మాట్లాడి వెళ్ళినందున ఆయన రానవసరం లేదని సంబంధిత అధికారి చెప్పారు. కాని బాబా మండలి వారిని వదలి వెళ్ళనే లేదని తెలిసికొని అందరూ ఆశ్చర్యపడ్డారు.

1924 వ సంవత్సరములో ఫిబ్రవరి 19వ తేదీన బాబా 30వ జన్మదినోత్సవం జరుపుకొన్నారు. 1923లో ప్రారంభించిన పర్యటనలు కొనసాగించారు. పర్యటనల ద్వారా మెహెరాబాద్‌లో పలు కార్యక్రమములు ప్రారంభించడం ద్వారా బాబా తన విశ్వ కార్యక్రమానికి మెహెరాబాద్ కేంద్రము నుండి సంబంధాలు ఏర్పరచుకునే కార్యక్రమం ప్రారంభించారు. ఆ రోజుల్లోనే

బాబా ఏకాంతవాసం, ఉపవాసం అనే ప్రక్రియలు విశ్వభారాన్ని వహించే ఆంతరంగిక కార్యక్రమానికి బాహ్యంగా కనిపించే కార్యక్రమాలను ప్రారంభించారు. శిష్యులు నియమ పాలనలో విఫలులైనా లేక బాబా ఆదేశానుసారం నడచుకొన లేకపోయినా బాబాయే స్వయంగా దండన విధించుకొని శిక్ష ననుభవించేవారు.

## సప్తవర్ణ పతాకము

బాబా మెహెరాబాద్‌లో 'ఝోప్డి' అనబడే గదిలో ఉండేవారు. బాబా కార్యక్రమాలకు ప్రతీకగా ఒక పతాకం ఉంటే బాగుంటుందని అనుకున్నారు. బాబా మండలి వారిని ఆ పతాకం ఎలా ఉంటే బాగుంటుందని అడిగారు. ఆకుపచ్చ రంగు పతాకం బాగుంటుందని మహమ్మదీయ మతానికి చెందిన శిష్యులు, కాషాయ రంగు బాగుంటుందని హైందవ శిష్యులు వారి వారి యిష్టానుసారం శిష్యులు సూచనలు చేశారు. అందరి అభిప్రాయాలు విన్న తర్వాత బాబా సప్తవర్ణ పతాకాన్ని సూచించారు. ఇంద్ర ధనుస్సులో మాదిరిగా ఏడు రంగులున్నా వాటి క్రమం మాత్రం బాబా సూచించిన పతాకంలో భిన్నంగా ఉంటుంది. పైన నీలిరంగు, అడుగున చివర ఎరుపు రంగు ప్రధానంగా ఉంటాయి. మిగిలిన ఐదు రంగులు మధ్యలో ఉంటాయి. నీలి రంగు ఆకాశానికి, అనంతానికి చిహ్నమైతే, ఎరుపు రంగు గాఢమైన భౌతిక సంస్కారాలకి చిహ్నం. ఏడు రంగులు చైతన్యం యొక్క సప్త భూమికలను సూచిస్తాయి అన్నారు బాబా. ఈ ఏడు రంగులు సంస్కారాలను కూడా సూచిస్తాయి. ఎరుపు కామ క్రోధాల వంటి గాఢమైన భౌతిక సంస్కారాలకు చిహ్నమైతే ఆధ్యాత్మిక మార్గంలో ఉన్నత స్థితియైన భగవదైక్యాన్ని సూచించేది ఆకాశ వర్ణాన్ని పోలిన నీలి రంగు. మానవుడు ఎరుపు సూచించే గాఢమైన భౌతిక సంస్కారాల అథమ స్థితి నుండి నీలిరంగు సూచించే భగవదైక్యమనే ఊర్ధ్వస్థితికి ఎదిగే ప్రయాణాన్ని ఈ పతాకంలోని రంగుల పొందిక సూచిస్తుంది అన్నారు బాబా. ఈ పతాకాన్ని మొదటి సారిగా 23.04.1924 వ తేదీన, నవల్ తలాటి అనే బాబా శిష్యుడు తయారు చేయగా, బాబా నివసించే 'ఝోప్డి' వద్ద ఎగురవేశారు. నాటి నుండి నేటి వరకు బాబా ప్రేమికులు పలు కార్యక్రమాల్లో ఈ సప్తవర్ణ పతాకాన్ని

ఎగురవేస్తుంటారు. బాబా సమాధి ప్రక్కనే గల మెహెర్ రిట్రీట్ భవనంపైన ఈ సప్తవర్ణ పతాకం నింగిలో ఎగురుతూ ఉంటుంది.

## ధర్మాసుపత్రి

25.01.1925 వరకు చేసిన పర్యటనలకు కొంత విరామమిచ్చి బాబా మెహెరాబాద్‌లో తన కార్యక్రమాన్ని విస్తృతం చేశారు. ఆ రోజుల్లో వైద్య సదుపాయం చాలా కొద్ది మందికి మాత్రమే అందుబాటులో నుండేది. 21.03.1925వ తేదీన బాబా మెహెరాబాద్‌లో ఒక ధర్మాసుపత్రిని ప్రారంభించారు. ఇచ్చట కుల, మత, ధనిక, పేద తేడా లేకుండా అందరికీ ఉచితంగా బాబా పరిరక్షణలో చికిత్స చేయబడింది. ఆసుపత్రిలో డా. వై. జి. కర్‌కాల్ అనే పట్టభద్రుడైన వైద్యుణ్ణి రోగులకు చికిత్స చేయడానికి నియమించారు. బాబా శిష్యులు పాద్రి మరియు పెండూ డాక్టరుకు సహాయముగా నుండి ఈ ఆసుపత్రిలో ఇతర సేవలు చేసేవారు. ఈ ఆసుపత్రి 15 మాసాల పాటు నిర్విరామంగా సాగింది. దాదాపు 7500 రోగులు చికిత్స పొందారు. బాబా చేసిన ప్రతి పనికి అంతరార్థం – ఆ పనిని విశ్వవ్యాప్తంగా జరిగేలా చేయడం. కేవలం మెహెరాబాద్‌లో గాని లేక ఏక్కడో ఆయన ప్రారంభించిన మరో చోటులో గాని జరగటం కాదు. అనేక ధర్మార్థ సంస్థలు వెలసి వైద్యాన్ని ఉచితంగా అందజేసే పనిని చేపట్టడం, రాజ్యాధినేతలు ప్రజలకోసం ప్రభుత్వం వైపునుండి ఆసుపత్రులను నెలకొల్పడం బాబా ప్రేరణ వల్ల వచ్చిన మార్పులే.

## హజ్రత్ బాబాజాన్ స్కూల్

అదే విధంగా చాలా కొద్దిమందికి మాత్రమే విద్య అందుబాటులో ఉన్న ఆ రోజుల్లో బాబా మెహెరాబాద్‌లో 'హజ్రత్ బాబాజాన్ స్కూల్' అనే పేరుతో ఒక ఉచిత పాఠశాలను 25.03.1925 తేదీన (ఆసుపత్రి ప్రారంభించిన 4 రోజులలోనే) ప్రారంభించారు. ఈ పాఠశాలలో కుల, మత, విచక్షణ లేకుండా అందరికీ ప్రవేశం ఉచితంగా ఇవ్వబడింది. అందరికీ ఉచిత భోజన సదుపాయం కూడా ఏర్పాటు

చేయబడింది. ఆ రోజుల్లో అస్పృశ్యత అనే దురాచారం సమాజంలో చోటు చేసుకొని ఉంది. అలాంటి అస్పృశ్యులైన హరిజన బాలురకు హజ్రత్ బాబాజాన్ స్కూల్‌లో ప్రవేశం కల్పించారు బాబా. బాబా స్వయంగా హరిజన బాలురకు స్నానాలు చేయించే వారు. వారి గుడ్డలుతికేవారు. వారి భోజనాలకు కావల్సిన పిండి విసిరేవారు. అవతారుడు స్వయంగా ప్రారంభించిన ఈ పనుల వల్లనే అస్పృశ్యతా నివారణకు తర్వాత కాలంలో కృషి ప్రారంభమై స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగంలో హక్కులు రూపొందించబడి ప్రభుత్వాలు ఈ విషయంలో అనుసరించే విధానాలకు మూలమై ప్రాధాన్యత ఇవ్వబడినది.

20 మంది బాలురతో ప్రారంభించబడిన ఈ పాఠశాల సంఖ్య కొద్ది రోజులలోనే 150 కి పెరిగింది. ప్రాథమిక పాఠశాల ఉన్నత పాఠశాలగా మారింది.

## కుష్టువారి ఆశ్రమం

ఆ కాలంలో కుష్ఠువ్యాధి ప్రబలంగా ఉండేది. కుష్ఠువారిని సమాజంలో అందరూ అసహ్యించు కొనేవారు. వారిని పాపాత్ములుగా కూడా భావించేవారు. మన దేశంలో బాబా ఎన్ను కొన్న మహారాష్ట్రలో ఈ వ్యాధి గ్రస్థులు ఎక్కువగా ఉండే వారు. బాబా 1925 సంవత్సరం మే మాసంలో కుష్ఠువారి కొరకు ఒక ఆశ్రమాన్ని స్థాపించారు. వారికి బాబా స్వయంగా సేవచేశారు. తరువాత కాలంలో కూడా అనేక సందర్భాలలో బాబా కుష్ఠువారికి పాదాలు కడిగి వారికి దైవదక్షిణ రూపకంగా డబ్బు ఇచ్చేవారు.





పార్వతి అనే కుష్ఠువ్యాధిగ్రస్థురాలు ఈ ఆశ్రమ పర్యవేక్షకురాలిగా ఉండేది.

## మెహెరాశ్రమ పాఠశాల

హజ్రత్ బాబాజాన్ స్కూల్ ప్రారంభమైన 2 సంవత్సరాలకు అనగా 01.05.1927వ తేదీన బాబా మెహెరాశ్రమాన్ని ప్రారంభించారు. కేవలం భౌతిక జ్ఞానాన్నే కాకుండా అర్హులైన వారికి ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ప్రసాదించి, తద్వారా ఆధ్యాత్మికానుభవాలను కలుగ జేయడం ఈ మెహెరాశ్రమ



ధ్యేయం దీనిలో చేరడానికి పిల్లలను దేశవ్యాప్తంగా ఆహ్వానించారు. విదేశాల నుండి కూడా విద్యార్థులను ఆహ్వానించారు. ప్రభుత్వామోదంతో హజ్రత్ బాబాజాన్ ఉన్నత పాఠశాల అనే పేరుతో 01.07.1927 నుండి నడుప బడింది. బాబా అనుదినం కొన్ని గంటలు పాఠశాలలో గడిపి పాఠశాల పనిని పర్యవేక్షించేవారు. మండలి వారికి బాధ్యత లేర్పరచి కఠిన నియమాలతో పాఠశాల పనిచేసే ఏర్పాటుచేశారు. అక్టోబర్ మాసాంతానికి విద్యార్థుల సంఖ్య 170కి చేరుకొంది. అన్ని మతాలకు చెందిన వారు పర్షియా దేశమునుండి వచ్చినవారు కూడా ఈ పాఠశాలలో చేరారు. పాఠ్యాంశాలే కాకుండా ఆధ్యాత్మిక విషయాలు కూడా బోధించేవారు. ఆధ్యాత్మిక విషయాలు బాబా స్వయంగా విద్యార్థులు సులభంగా అర్థం చేసుకొని జ్ఞాపక ముంచుకునే విధంగా వివరించి చెప్పేవారు. అసలైన జ్ఞానం బాబా ద్వారా ఆయన సహవాసంలో ఆయన మౌనం ద్వారా తెలుసుకొనే అవకాశం కలిగిన పిల్లలు బాబా సహవాసాన్ని, ధ్యానాన్ని పాఠశాలలోని బోధన కన్నా మిన్నగా అశించేవారు.

## సాధకాశ్రమం

మెహెరాశ్రమం ప్రారంభించిన ఏడు మాసాల తరువాత అనగా 02.12.1927 తేదీన సాధకాశ్రమాన్ని ప్రారంభించారు. సత్యాన్వేషకులకు

ఆధ్యాత్మిక పురోగతి కల్పించడమే ఈ సాధకాశ్రమ లక్ష్యం. ఎంచుకొన్న ఐదుగురు వ్యక్తులను బాబా సమాధి ప్రక్కన నిర్మించిన గదులలో నుండి ధ్యానము చేయమన్నారు. కేవలం ద్రవ పదార్థాలను మాత్రమే తీసుకొంటూ వారి గదుల నుండి బయటకు రాకుండా ఉండి ధ్యానం చేయాలి. వారి అవసరాలకు బాబా ఏర్పాటు చేశారు. ఒక వ్యక్తి మాత్రం 26 రోజుల తరువాత గదిలో నుండి బయటకు వచ్చాడు. మిగిలిన నలుగురు రెండు మాసాల వరకు ఉపవాసం చేస్తూ గదులలోనే ఉన్నారు. వారికి చాలా అనుభూతులు కలిగాయి. మానేకర్ అను నతనికి చీకటి గదిలో అన్నిటినీ స్పష్టంగా చూచే ప్రకాశవంతమైన కాంతి కనపడింది. ఇది ఆధ్యాత్మికానుభవం కాదని సాధకుని మార్గం వైపున కాకర్షించే సంఘటనలు మాత్రమేనని బాబా చెప్పారు.

## ప్రేమాశ్రమం

10.12.1927వ తేదీన పాఠశాలలోని అర్హులైన పిల్లలను ఆధ్యాత్మిక మార్గంలో ప్రవేశ పెట్టి వారి సంసిద్ధతను బట్టి ఆధ్యాత్మికానుభవాలను కలుగ జేయడమే ఈ ప్రేమాశ్రమ ముఖ్యోద్దేశం. బాబా యెడల అపారమైన ప్రేమాను రాగాలు గల పిల్లలను ప్రేమాశ్రమంలో చేర్చుకున్నారు. వారికి బాబా తన దివ్యత్వానుభవాన్ని కొద్ది కొద్దిగా యిచ్చి పరీక్షించారు. ఈ ప్రక్రియలో వారికి కలిగిన అనుభూతులు వర్ణనాతీతాలు పిల్లలందరిలోనూ అబ్దుల్లా అనే పిల్లవాని అనుభవం అత్యున్నతమైనది. 1928 వ సంవత్సరం జనవరి మాసారంభంలో మెహెరాబాద్‌లోని వాతావరణం దేవదూతలకు కూడా ఈర్ష్య కలిగించేదిగా మారింది. పిల్లల పసిహృదయాలలో బాబా కలుగ జేసిన ప్రేమ వల్ల ఏర్పడిన తపన కారణంగా పిల్లలందరూ 'బాబా! బాబా!' యని గట్టిగా ప్రియతముని కోసం అరవడం ప్రారంభించారు. మూడురోజుల వరకు కన్నీటి ధారలతో పిల్లలు వారి హృదయాలలో కలిగిన దివ్యప్రేమానుభూతులతో పారవశ్యాన్ని అనుభవించారు. బాబా ఇచ్ఛ ప్రకారం మూడు రోజుల తర్వాత వారు మామూలు స్థితికి వచ్చారు.

అవతారుడు విశ్వంలోని అందరికై అవతరిస్తాడు. ఒక ప్రదేశానికి గాని, ఒక

దేశానికి గాని, ఒక గ్రహానికి గాని పరిమితం కాకుండా ఆయన పని విశ్వవ్యాప్తం, ఆయన ఆగమనం అందరికీ వసంతం. కావున ఆయన మెహెరాబాద్‌లో ప్రారంభించిన సంక్షేమ కార్యక్రమాలు మిగిలిన ధర్మ సంస్థలు చేపట్టి నిర్వహించే సాంఘిక సేవల వలె భావిస్తే పొరబాటు. విశ్వవ్యాప్తంగా బాబా తీసుకొని రాదలచిన మార్పులకివి సంకేతాలు మాత్రమే. ఆ రోజుల్లో సంపన్నులకు మాత్రమే విద్యావైద్య సౌకర్యాలు లభ్యమయయేవి. అస్పృశ్యత అనే దురాచారం సమాజంలో వర్గవిభేదాల్ని సృష్టించి బడుగు వర్గాల వారి బ్రతుకులను దుర్భరం చేసింది. బాబా మెహెరాబాద్‌లో స్థాపించిన పాఠశాలలో ఏ తారతమ్యం లేకుండా అందరికీ ఉచిత విద్య, భోజన వసతి సౌకర్యాలు కల్పించారు.

1927 వ సంవత్సరం డిసెంబర్ 29 వ తేదీన బాబా అవతారుని గురించిన ప్రవచనం యిచ్చారు. అవతారుడు సద్గురువు వలె తన సన్నిహిత శిష్యబృందాన్ని (సర్కిల్‌ను) ఏర్పరచుకొంటాడు. ఆయన ఒక ప్రత్యేకమైన పని కూడా చేస్తాడు.



కృష్ణుడు తన అవతార కాలంలో సర్కిల్‌లో లేని వారికి (17మందికి) దైవసాక్షాత్కారం కలుగజేసి మళ్ళీ మామూలు స్థితికి తీసుకొని వచ్చాడు. వీరు అదనంగా దైవ సాక్షాత్కారం పొందారు. అంటే ఎప్పుడూ దైవ విధానం ప్రకారంగా ఉండే 56 మంది జీవన్ముక్తుల (మజ్జూబ్‌ల) కంటె వీరు అదనం. ఇది కేవలం అవతారుని కాలంలో మాత్రమే అవతారుని అభీష్ట ప్రకారం సాధ్యపడగలదు. తన శిష్య బృందంలో (సర్కిల్‌లో) లేని వారికి కూడా అవతారుడు సాక్షాత్కారం కలుగజేయగలడు.

12.06.1926 వ తేదీన బాబా డాక్టర్ కర్‌కాల్ యింటికి తన మండలి

సభ్యులతో వెళ్ళారు. అక్కడ వారు తయారు చేసిన పదార్థాలను, టీని బాబా అందరికీ పంచారు. 'అన్నీ ఎలా అయిపోయాయో చూడు' అన్నారు బాబా. 'మీ చేతిలోనే తాళము చెవి ఉంది బాబా' అని డాక్టర్ అన్నాడు. ఆ సందర్భంగా పంచ సద్గురువుల గురించి ఈ విధంగా చెప్పారు బాబా.

'ప్రపంచానికి ఒకే తాళము చెవి ఉంది. అది పంచ సద్గురువుల చేతిలో ఉంది. మరే యితర తాళము చెవితో తెరిచే వీలులేని, ఒకే తాళము చెవి గల ఆ నిధిని ఐదుగురు సద్గురువులు పర్యవేక్షిస్తుంటారు. ఒక సద్గురువు వద్ద తాళము చెవి ఉంటే రెండవ సద్గురువు అధీనంలో ఆ నిధి ఉంటుంది. ఆయన అంగీకారంతోనే దానిని తెరవాలి. మూడవ సద్గురువుకు దానిని తెరిచే అధికారం ఉంటుంది. నాల్గవ సద్గురువుకు దానిని పంచే అధికారం, ఐదవ సద్గురువుకు నిధిని పంచే విధానాన్ని సూచించే అధికారం ఉంటాయి. పంచ సద్గురువులు, 51 మంది జీవన్ముక్తులు కలిసి ఈ ప్రపంచపు తాళపు చెవిని నిగ్రహిస్తారు. ఈ 56 సంఖ్య అనగా పంచ సద్గురువులు + 51 మంది జీవన్ముక్తుల సంఖ్య, అవతారుని కాలంలో తప్ప ఎప్పుడూ మారదు. వారితో ఈ జగన్నాటకం కొనసాగించ బడుతుంది. ఇది నేను మీకు చెప్పే ఆధ్యాత్మిక రహస్యము' అన్నారు బాబా.

'నాకు ఇచ్ఛ కలిగితే ప్రేమాశ్రమంలోని పిల్లలకు ఈ క్షణంలో దైవ సాక్షాత్కారాన్ని ఇచ్చి మళ్ళీ మామూలు స్థితికి తీసుకొని రాగలను' అన్నారు బాబా. అబ్దుల్లాకు కలిగిన అనుభవము బాబా అతనికిచ్చిన ప్రేమ ప్రసాదమే. ఎన్నో ఏళ్ళ నుండి కఠిన నియమాలతో తపస్సు చేసే వారి కంటె ఈ ప్రేమాశ్రమం బాలురు చాలా అదృష్టవంతులు. వారికి గల ప్రేమానుసారంగా వారు ఆధ్యాత్మి కోన్నతి పొందగలరన్నారు బాబా. మరునాడు సాయంత్రం బాలురందరూ ఉద్వేగంతో వెక్కి వెక్కి ఏడ్వడం ప్రారంభించారు. కారణం ఎవరికీ అర్థం కాలేదు. బాబా వారిలో మేలు కొలిపిన ప్రేమ ఫలితంగా ఆయన విరహాన్ని భరించలేక యేడ్వడ మారంభించారు. ఉపవాసంలో ఏకాంత వాసంలో ఉన్న బాబా వారి వద్దకు వచ్చి నిలబడగానే వారు ప్రసన్నులై ప్రశాంతంగా ఉన్నారు. అంత వరకు వారిని ఎవ్వరూ

ఆపలేకపోయారు. పాఠశాలలో విద్యాభ్యాసం కొరకు చేరిన పసిహృదయాలను దివ్య ప్రేమానుభూతితో స్పందింపజేసి ఆధ్యాత్మిక పథంలోని శిఖరాల నధిరోహింప జేసిన బాబా కార్యక్రమం నభూతో న భవిష్యతి యనుటలో సందేహము లేదు.

బాబా స్వయంగా వారికై పిండి విసిరే వారు. అస్పృశ్య బాలుర గుడ్డలు బాబా స్వయంగా ఉతికే వారు. వారికి స్వయంగా స్నానం చేయించేవారు. ఒకరోజు బాబా హరిజన బాలుర గుడ్డలు ఉతికే సమయంలో కొందరు బ్రాహ్మణ పండితులాయన దర్శనానికి వచ్చారు. బాబా వారిని తన వద్దకు పిలిచి తను చేసే పని చూపిస్తూ 'అలాంటి తన దర్శనము వారికిష్టమేనా' అని ప్రశ్నించారు. వారు తమ అజ్ఞానానికి సిగ్గుపడి హరిజన బాలుర గుడ్డలుతకటంలో బాబాకు తోడ్పడి ఆ తర్వాత ఆయన దర్శనం చేసుకున్నారు. అస్పృశ్యత గురించి బాబా యిలా అన్నారు.

'హృదయాంతరాళాల్లోకి చొచ్చుకు పోయి అచ్చట నివసించియున్న దేవుని వీక్షించ లేని వారే అస్పృశ్యులు'.

బాబా స్థాపించిన పాఠశాలకు విద్యార్థులను ఇంగ్లాండ్ నుండి సేకరించుటకు బాబా రుస్తుమ్ అనే శిష్యుడిని పంపించారు. విద్యార్థుల మిషతో బాబా పశ్చిమ దేశాలతో సంబంధ మేర్పరిచారు. రుస్తుమ్ ద్వారా మెరిడిత్ స్టార్ అనే ఆంగ్లేయుడు బాబా దర్శనానికి వచ్చి దీవాన్ షైర్‌లో ఒక ఆశ్రమం స్థాపించి బాబా ఇంగ్లాండ్‌కు వెళ్ళినప్పుడు తొలి ప్రేమికులను దీవాన్ షైర్‌లో బాబాతో కలిపే అదృష్టానికి నోచుకున్నాడు.



బాబా మెహెరాబాద్‌లో చేసిన కార్యక్రమాల ఫలితమే నేడు అందరికీ లభ్యమైన విద్యా వైద్య సౌకర్యాలు. బాబా కార్యక్రమం ఆంతరంగికం – బహిర్గతం కానిది, సామాన్యులు తమ మనస్సుతో గుర్తించరానిది. ఎవరు గుర్తించకపోయినా

నమ్మకపోయినా అవతారుడు తన విశ్వకార్యాన్ని అనగా ధర్మస్థాపనను తానేర్పరచుకున్న విధంగా నిరాటంకంగా పూర్తి చేస్తాడు. మానవులలోని స్వార్థాన్ని రూపుమాపి ప్రేమను స్థాపించి ప్రపంచపు క్షణభంగు రత్వాన్ని అందరిలో అవిభాజ్యంగా నున్న ఆత్మయొక్క అనంత అస్తిత్వాన్ని తెలియజేసి అనుభవైక వేద్యంగా అందివ్వడమే అవతారుని విశ్వకార్యం.

ఈ క్రింద సూచించిన ఘట్టాలు బాబా జీవితంలో బాహ్యంగా గోచరించేవి. ఆయన చేసిన కార్యాల్లో ముఖ్యంగా పేర్కొన్న వలసినవి.

1. 10.07.1925 నుండి 31.01.1969 వరకు సాగిన అఖండ మౌనము. ఈ అవతారంలో ప్రముఖంగా పేర్కొన్న దగినది బాబా మౌనము.

2. 1931 నుండి బాబా గావించిన ప్రపంచ పర్యటనలు.

3. 1937 నుండి బాబా అవిరామంగా పర్యటించి చేసిన దైవ చింతనలో ప్రపంచ స్మృతిని కోల్పోయి పిచ్చివారిగా కన్పించే 'మస్తు'ల సంరక్షణ సాంగత్యం.

4. 1949 వ సంవత్సరం అక్టోబర్ 16వ తేదీ నుండి ఫిబ్రవరి 1952 వరకు కొంతమంది శిష్యులతో భిక్షాటన చేస్తూ గడిపిన 'నవ జీవనం'.

5. 1952 నుండి 1965 వరకు సహవాసములు ప్రజా దర్శనాలతో అర్హులైన వారి యెదలో ప్రేమజ్వాల వెలిగించడం.

6. 1965 సంవత్సరమునుండి 1969 సంవత్సరం జనవరి 31 వరకు జరిపిన ఏకాంతవాసం.

## అఖండ మౌనము

బాబా సచ్చిదానంద స్వరూపాన్ని నిరంతరం అనుభవించే సనాత నవతారుడు, ఆయన తన కోసం చేసుకోవలసిన దేమీ లేదు. బాబా అవతార కాలంలో చేసిన ప్రతి

కార్యక్రమం మానవులందరిలోనూ అజ్ఞానం వల్ల బంధింప బడిన 'తన'ను ఆ బంధాల నుండి విముక్తుణ్ణి చేసుకోవడం కొరకే. 10.07.1925 నుండి బాబా ప్రారంభించిన మౌనం కూడా అలాంటిదే. 08.07.1925 రోజున తన మండలి వారిని సమావేశ పరచి 10.07.1925 నుండి తాను ప్రారంభించ బోయే మౌనాన్ని గురించి చెప్పారు బాబా. పరిపూర్ణత్వాన్ని పొంది నిరంతరం సచ్చిదానంద స్వరూపాన్ని అనుభవిస్తున్న బాబాకు ఏ నియమంతో గాని సాధనతో గాని పనిలేదు. ఆయన ధరించిన భౌతిక కాయం ద్వారా ఆయన చేసిన పనులు, పడిన బాధలు విశ్వమానవ శ్రేయస్సు కొరకే. తన మౌనం ఒక వ్రతము కాని, తపస్సు కాని, సాధన కాని కాదనియు, మానవ శ్రేయస్సు కోసమే తానెంచుకున్న విధానమని బాబా చెప్పారు. మాట ఒక హృదయంలోని భావాన్ని ఒక మనస్సులోని ఆలోచనను మరొక హృదయానికి చేర్చుట కవసరమయ్యే సాధనం. హృదయాలతో మాట్లాడుకో గలిగే వారికి మాటతో పనిలేదు. 'నా మౌనం మాట్లాడక పోతే మాటలతో చేకూరే ప్రయోజనమేమిట'ని చెప్పారు బాబా. అంతేగాక 'ఈ అవతారంలో ఆయన తన పనికి యెంచుకొన్న సాధనం మౌనం, తన మౌన విరమణపైన మానవాళి యొక్క ఉద్ధరణ ఆధారపడి ఉన్నద'ని బాబా చెప్పారు.



ప్రారంభంలో ఒక సంవత్సరం కొరకని చెప్పిన మౌనం దాదాపు 44 సంవత్సరములు, ఆయన భౌతిక శరీరాన్ని మెహెరాబాద్ సమాధిలో 31.01.1969 రోజున నిక్షిప్తం చేసే వరకు అఖండంగా సాగింది. శుక్రవారం 10.07.1925 రోజున బాబా ఉదయం కాలకృత్యములు తీర్చుకొని మౌనంగా ఆశ్రమమంతా తిరుగుతూ మండలి వారిని సంజ్ఞల ద్వారా పలకరించారు. ఒక సంవత్సరము వరకు పలక, కాగితాలపై వ్రాసి చూపుతూ వచ్చారు. ఆ తరువాత 'ఎ' నుండి 'జడ్' వరకు ఆంగ్ల అక్షరములతో పాటు 1 నుండి 9 వరకు అంకెలు మరియు సున్న వ్రాయించిన ఒక అక్షర ఫలకమును ఉపయోగించారు. 1954 సంవత్సరము అక్టోబర్ 7 వ తేదీ

నుండి అక్షర ఫలకమును కూడా త్యజించి కేవలం సంజ్ఞలతోనే మాట్లాడ నారంభించారు. ఆయన కార్యక్రమాలన్నీ మౌనంలోనే జరిగాయి. మౌనంలోనే సందేశాలు, ప్రవచనాలు, ఆధ్యాత్మిక విషయాలన్నీ ఇవ్వబడ్డాయి. అవి ఎన్నో గ్రంథాలుగా నేడు వెలువడుతున్నాయి.

## ధుని

1925 వ సంవత్సరం నవంబర్ మాసంలో చుట్టుప్రక్కల గ్రామాలనుండి రైతులు వచ్చి పైర్లు ఎండిపోతున్నాయని, త్రాగే నీటికి కష్టపడుతున్నామని వారి కష్టాలు వివరించి వర్షాలకై బాబా నర్థించారు. సహనంతో నుండమని చెప్పి బాబా వారిని పంపించారు.

నవంబర్ 10వ తేదీ రాత్రి బాబా మండలితో కూర్చుని యుండగా గ్రామస్థులు మళ్ళీ వచ్చి వర్షాలకై వేడుకున్నారు. ఉపాసనీ మహరాజ్ ఆరతి చేసి ఒక గోయి త్రవ్వించి అందులో అగ్నిని ప్రజ్వలింప జేశారు. 'భగవంతుడు మీ ప్రార్థన విన్నాడు. మీరు నేరుగా మీ ఇళ్ళకు వెళ్ళండి' అన్నారు బాబా. ధుని వెలిగించక ముందు ఆకాశం నిర్మలంగా ఉంది. మేఘాలు లేవు. అయినా ఒక గంట తర్వాత కుంభ వృష్టి కురిసింది. ఆ వాన జల్లులు 15 గంటల పాటు కొనసాగాయి. రైతులు వారి పంటలు కాపాడబడినందులకు సంతోషించారు.

ఆ రకంగా ప్రారంభించ బడిన ధుని ఈనాటికీ మెహెరాబాద్‌లో ప్రతి నెల 12వ తేది సాయంత్రం వెలిగించడం జరుగుతున్నది.

మెహెరాబాద్‌లో జరిగిన సహవాస కార్యక్రమాల్లో బాబా ధుని వెలిగించి స్వయంగా తానక్కడ కూర్చుని ధునిలో వేసే సమిధల ద్వారా ప్రేమికులు తమను వేధించే కోరికను గాని బలహీనతను గాని వదులుకొనుటకు నిర్ణయించు కోవలసినదిగా ఆదేశించారు. అట్టి కోరికను లేదా బలహీనతను వదలు కోవడంలో తన సహాయముంటుందని బాబా చెప్పారు.

అనుభవ పూర్వకంగా బాబా కృపతో ఎందరో తమను వేధిస్తున్న బలహీనతలు వదులుకోగలిగారు. నేటికీ యిది ఆచరణ యోగ్యమే.

## రహస్య గ్రంథం


మౌనం ప్రారంభించిన నాల్గవ రోజు నుండే అనగా 13.07.1925 నుండి బాబా తన స్వదస్తూరితో ఒక రహస్యగ్రంథాన్ని వ్రాయడమారంభించారు. మెహెరాబాద్‌లోని 'ఝోప్డి' లో స్నానంచేసిన తరువాత నిత్యం ఉదయం 5 గంటల నుండి 8.30 గం.ల వరకు వ్రాసేవారు. ఆ తర్వాతే బాబా ఇతర పనులు చూచేవారు. వివిధ భాషల్లో వివిధ స్థలాల్లో వ్రాసిన ఈ పుస్తకం కొన్ని నెలల తర్వాత పూర్తి చేయబడింది. బాబా తీవ్రమైన జ్వరంతో బాధ పడుతున్నా పుస్తకం వ్రాసే పనిని మాత్రం ఆపలేదు. సమయానుసారంగా వ్రాసేవారు. 11.11.1925 నుండి 28.03.1926 వరకు బాబా రాత్రులంతా ఒక టేబుల్ సొరుగులో గడిపారు. ఈ టేబుల్ ఇప్పటికీ మెహెరాబాద్‌లో ఒక షెడ్డు క్రింద భద్రంగా ఉంచబడి ఉంది. మార్చి 29వ తేదీ నుండి సాయి దర్బార్‌లో గల పెట్టెలాంటి ఒక క్యాబిన్‌లో గడిపారు. కాని రహస్య గ్రంథ రచన మాత్రం సమయానుసారంగా చేస్తూనే ఉన్నారు. మధ్యాహ్న సమయంలో మాత్రం మెహెరాబాద్‌లో జరిగే కార్యక్రమాలను పరిశీలించడానికి బయటకు వచ్చి తిరిగేవారు.



బాబా వ్రాసిన రహస్య గ్రంథంలో ఏమి వ్రాసారో చెప్పకపోయినా అప్పుడప్పుడు స్వయంగా దానిలోని ఆధ్యాత్మిక రహస్యాల గురించి సూచనలు చేస్తుండేవారు. పుస్తకం వ్రాయడం ముగియగానే దానిని ఒక పెట్టెలో పెట్టి ప్రయాణాల్లో తన వెంట తీసుకు వెళ్ళేవారు బాబా. ఆ పెట్టెకు తాళము వేసి తాళము చెవి ఒక దారాని కట్టి దానిని హారంలాగా బాబా తన మెడలో వేసుకునేవారు. తన మండలి వారు ఆ పుస్తకాన్ని చదవకూడదని బాబా హెచ్చరించారు. వారి మనస్సులు ఆ పుస్తకం చదవడానికింకా సిద్ధం కాలేదని బాబా చెప్పారు. అందువల్ల ఎవ్వరూ ఆ పుస్తకాన్ని చదివే అవకాశం లేకపోయింది.

దానిలోని కొన్ని పేజీలు మాత్రం బాబా తన శిష్యుడు, కార్యదర్శియైన ఆదీ. కె. ఇరానీ గారికి చూపించారు. ఆయన చదివాడు గాని చదివినది కూడా ఆ తర్వాత ఆయనకు జ్ఞాపకానికి రాలేదు. మరచి పోయాడు. 26.11.1926వ తేదిన బాబా ఉపదేశాలను టైప్ చేసే ఛాంజీ నుద్దేశించి బాబా యిలా అన్నారు.

'నేను యిచ్చిన ప్రవచనాలను చూచి అవి చాలా ఆసక్తికరంగా ఉన్నట్లు మీరు భావిస్తున్నారు. కాని నేను రహస్య గ్రంథంలో వ్రాసిన విషయాలతో పోలిస్తే వాటిలో ఏ ప్రాధాన్యత కనిపించదు. దానిలో క్లుప్తంగా వ్రాసింది 300 పేజీలే అయినా వివరించి వ్రాసినప్పుడు ఎన్నో పెద్ద గ్రంథాలుగా తయారవుతాయి. గతంలో ఏ సాధువుగాని, దేవదూతగాని, అవతారుడు గాని తెలియజేయని ఎన్నో రహస్యాలు ఆ రహస్య గ్రంథంలో ఉన్నాయి'.



ఇంకొక సందర్భంలో 07.08.1927 వ తేదీన ఆ రహస్య గ్రంథం గురించి బాబా ఇలా చెప్పారు. 'నేను వ్రాసిన ఆ పెద్ద పుస్తకము రాబోయే తరాల వారికి బైబిల్, ఖురాన్, అవెస్టా మరియు వేదంగా పరిణమిస్తుంది. ఎందుకంటే అన్ని కులాలు, మతాలకు చెందిన వారికి విశ్వవ్యాప్తంగా ఆమోదయోగ్యమవుతుంది. ఆ గ్రంథం వ్రాసిన తర్వాత నేను వ్రాయడం మానేశాను. ఆందువల్ల ఆ గ్రంథం శక్తివంతమైనది'.

05.05.1932వ రోజు బాబా యూరప్‌లోని లుగానాలో ఉండగా ఆధ్యాత్మికానుభవాల గురించి పాశ్యాత్య ప్రేమికులకు తెలియజేస్తూ యిలా అన్నారు. 'సృష్టి మళ్ళీ మళ్ళీ జరుగుతూనే ఉంటుంది. అది అంతం కాని జగన్నాటకం. దానిని వివరంగా నేను పుస్తకంలో వ్రాశాను. నేను వివరించిన రహస్యాలను చదివి

శాస్త్రవేత్తలు కూడా ఆశ్చర్యచకితులవుతారు. శాస్త్రీయ వాదనలతో వివరించబడి, బలవర్చ బడినప్పుడది ముమ్ముందు వాగ్రూపకంగా కాకుండా అన్ని మతాల వారికి అవగాహన రూపంగా బైబిల్‌గా మారుతుంది'.

బాబా 1931వ సంవత్సరం సెప్టెంబర్ మాసంలో రాజపుటానా ఓడలో ఇంగ్లాండ్‌కు వెళ్ళారు. అదే ఓడలో మహాత్మాగాంధీ గారు ఇంగ్లాండ్‌లో రౌండ్ టేబిల్ సమావేశంలో పాల్గొనడానికి ప్రయాణం చేస్తున్నారు. బాబా తన వెంట తాళం వేసిన ఒక పెట్టెలో ఆ రహస్య గ్రంథాన్ని తీసుకొని వెళ్ళారు. ఆ పుస్తకంలోని కొన్ని పేజీలను స్వయంగా తీసి యిచ్చి గాంధీజీ చదవడానికనుమతించారు. ఆ పుస్తకం అమెరికాలోనే (5) సంవత్సరాల వరకు భద్ర పరచబడింది. తరువాత భారత దేశానికి తీసుకొని రాబడి ఒక బ్యాంక్‌లో భద్రపరచ బడింది. బాబా ఆదేశానుసారం అది నిగూఢంగా నిక్షిప్తం చేయబడి ఉంది కాని ఎక్కడ ఎవరి వద్ద ఉందో ఎవరికీ తెలియదు. బాబా ఇచ్ఛానుసారం అది అందరికీ అందుబాటులోకి తేబడుతుంది.

మెహెరాబాద్ ఆశ్రమంలో దర్శనార్థుల సంఖ్య దినదినం వృద్ధి చెంద సాగింది. ఆదివారాలు సెలవు దినాల్లో మెహెరాబాద్ యాత్రా స్థలంగా మారిపోయేది. అధిక సంఖ్యాకులు బాబా వద్దకు వస్తే కోరికలు నెరవేరుతాయని వచ్చేవారు. ఆధ్యాత్మికంగా మోక్షప్రాప్తిని కోరి వచ్చేవారు చాలా కొద్దిమంది మాత్రమే. వారిలో చాలా మంది భోజన సదుపాయాలు సరిగా లేవనో లేదా సమయానుసారంగా ధ్యానాది సాధనలు లేవనే కారణంగానో మెహెరాబాద్ వదిలి చెప్పకుండా వెళ్ళిపోయేవారు.

ఒకసారి ఒక సాధువు బాబా దర్శనం కోసం వచ్చి, దర్శించుకొని తనకు కేవలం మోక్షమే కావాలని బాబా చెప్పినట్లు నడుచుకుంటానని వేడుకొనగా బాబా అతనిని తన మండలి వారితో ఉండమన్నాడు. ధుని వద్ద గల వేపచెట్ల క్రింద నున్న కుటీరంలో ఒక పూట మాత్రం భోజనం చేస్తూ నిర్ణీత సమాయాల్లో మౌనంగా ఉంటూ ఉండమన్నారు బాబా. లక్ష్య సాధనలో పట్టుదల, సంసిద్ధత లేని కారణంగా ఉన్నతాశయముతో వచ్చినా అతను బాబా ఆదేశానుసారం ఉండలేక పోయాడు.

కొంత సేపటి తర్వాత ఆ సాధవును 'ఏమిటి ఆలోచిస్తున్నావు?' అని బాబా అడిగారు 'షిరిడీలో ఉంటే బాగుండునని ఆలోచన వచ్చింది' అన్నాడు ఆ సాధువు. బాబా వెంటనే అతనిని షిరిడీకి పంపించి వేశారు.

అలాగే మరొక సాధువు వచ్చి దర్శనం చేసుకొని తనకు దైవ సాక్షాత్కారం కావాలని దానికి ఏదైనా బాబా చెప్పినట్లు చేయడానికి సంసిద్ధంగా ఉన్నానని చెప్పాడు. మండలి వారితో కలిసి ఉండడానికి బాబా అనుమతించారు. ఒక 10 రోజులు ఉన్న తర్వాత ఇక ఉండలేనని చెప్పి వెళ్లిపోయాడు. కారణం తెలుసుకోగా ఆయనకు మెహెరాబాద్‌లో పెట్టే భోజనం సరిపోక వెళ్ళి పోయాడని తేలింది. దేవుడి కోసం వచ్చి రొట్టె కోసం వెళ్ళిపోయాడని అందరూ పరిహసించారు.

మెహెరాబాద్‌లో బాబా దర్శనానికై వచ్చే అన్వేషకులు, సాధకులలో నిజాయితీతో బాబాకు సేవ జేయడానికి నిష్కాముకమైన ప్రేమతో వచ్చినవారు కూడా కలరు.

ఛార్లెస్ నెల్ హామ్స్ అనునతడు యిట్లు బాబా మండలిలో చేరిన తొలి ఐరోపా దేశస్థుడు. పూనాలో సైకిల్‌షాపులో బాబా చిత్రపటాన్ని చూసి ఆకర్షితుడై బాబా చెంత చేరాడు. 20.06.1925 మొదలు 27.07.1925 వరకు బాబాకు రాత్రి కాపలాదారుగా సేవచేశాడు. దిగువ మెహెరాబాద్ నుండి ఎగువ మెహెరాబాద్‌కు కావడిలో నీళ్ళు మోసేవాడు. తనను మండలివారు వారితో సమానంగా చూడడం లేదని బాబాతో చెప్పాడు. కారణమేమిటని బాబా విచారించగా మండలివారు తినే భోజనం ఆయనకు పెట్టకుండా ఆయనకు ప్రత్యేకంగా చేసిపెడుతున్నారని పాశ్చాత్యుడని ఆయనను ప్రత్యేకంగా చూస్తున్నారని తెలిసింది. బాబా ఆదేశం మేరకు అతనికి ఆ రోజునుండి మండలివారు భుజించే ఆహారాన్ని మాత్రమే పెట్టడం ప్రారంభించారు. అతని బూట్లు అరగిపోయి గాజుపెంకు గుచ్చుకొని పాదంలో గాయమేర్పడి అస్వస్థుడైనాడు. అయినా ఆ విషయం ఎవ్వరికీ చెప్పకుండా తన పని చేసుకుంటూ పోయాడు. బాబా స్వయంగా డాక్టర్ నీలూతో పరీక్ష చేయించి అహమద్ నగర్‌లో ఆస్పత్రిలో చేర్పించారు. ఒకరోజు బాబా స్వయంగా ఆసుపత్రికి

వెళ్ళి ఛార్లెస్ నెల్‌హామ్స్ ప్రక్కనే కూర్చుని అతని ననునయించి మరుసటిరోజు అతని బాధ నివారింప బడుతుందని చెప్పారు. బాబా తనపై చూపించిన ప్రేమకు పరవశుడై తృప్తితో మరునాడాతడు మరణించాడు. బాబా తన సమక్షంలో అతని భౌతిక కాయాన్ని ఖననం చేయించారు.

బాబా తన అనంత శక్తిని, దివ్యత్వాన్ని అరుదుగా ఉపయోగించే వారు. దర్శనార్థులు విశ్వసించుటకెట్టి మహిమలు, చమత్కారములు చేసేవారు కాదు. ఒకసారి ఒక యోగి బాబా దర్శనానికి వచ్చి బాబా సర్వజ్ఞత్వము గురించి సందేహముతో కొన్ని ప్రశ్నలు అడగాలని ఉందన్నారు. బాబా అతనికొక పలక నిచ్చి దానిపై ప్రశ్నలు వ్రాయమన్నారు. ఇంకొక పలక తీసుకొని దానిపై ఆ యోగి ప్రశ్నలు వ్రాయక ముందే వాని జవాబులను వ్రాసి ఆ యోగి చేతికిచ్చారు. తన అజ్ఞానానికి సిగ్గుపడి బాబాకు ప్రణమిల్లి ఆ యోగి బాబా సర్వజ్ఞత్వాన్ని గ్రహించి వెళ్ళిపోయాడు.

బాబా మెహెరాబాద్‌లో ఏ ధ్యాన సాధనలు, నియమాలు తన శిష్యులకు నిర్ణయించ లేదు. బాబా పని ఆంతరంగికమైనది. అవకాశము వచ్చినప్పుడల్లా బాబా వారికి అతి సహజంగా హృదయాల్లో శాశ్వత ప్రభావ మేర్పరచుకునే విధంగా ఆధ్యాత్మిక విషయాలు తెలిపేవారు.

ఒకసారి శిష్యులతో కూర్చుని యుండగా బాబా 'ప్రపంచంలో కల్లా పెద్ద జైలు (కారాగారము) ఏది' అని అడిగారు. శిష్యులందరూ వివిధ కారాగారాల పేర్లు సూచించగా బాబా 'ఈ శరీరమే అన్నిటి కన్న పెద్ద కారాగారము' అని చెప్పారు.

అహమద్ నగర్‌లో పేరుమోసిన బందిపోటు సత్యమాంగ్. ఒకరోజు తన అనుచరులతో బాబాను దర్శించడానికి వచ్చాడు. తన వృత్తిలో ఆటంకాలు లేని అభివృద్ధి సాధించడానికి బాబా ఆశీస్సులు పొందాలని వచ్చాడు. ఆ సమయంలో బాబా ఏబది మంది మండలివారితో సమావేశమై మెహెరాబాద్‌లో ఉన్నారు. ఈ వచ్చిన దర్శనార్థుల గురించి వారికి తెలియదు. బాబాకు ప్రణామం చేసి సత్యమాంగ్ తన అనుచరులతో నేలపై బాబా ఎదుట కూర్చున్నాడు. బాబా కొన్ని క్షణాలు మౌనంగా ఉండి 'ఎక్కడి నుండి వస్తున్నారు? ఎక్కడికి వెళ్తారు?' అని అడిగారు. ఆ

తర్వాత సంభాషణ ఇలా జరిగింది –

బాబా : మీరు గాజులు వేసుకోవాల్సింది.

మౌనంలో సంజ్ఞల ద్వారా చెప్పి బాబా మాటలు అర్థం కాక సత్యమాంగ్ బాబా ఏమంటున్నారు అని మండలి వారిని అడిగాడు. బాబా మళ్ళీ ఇలా చెప్పారు.

బాబా : మీ చేతులకు గాజులు వేసుకోవాలి. ఎందుకు వేసుకో లేదు?

సత్యమాంగ్ : ఎందుకు? మేమేం చేశాము?

బాబా : నీవొక పిరికి వాడివి.

సత్యమాంగ్ : మీ మాటల కర్థం ఏమిటి – అరిచాడు.

బాబా : నీలాంటి ధృడకాయుడు రాళ్ళ నుండి నీళ్ళను తీయగలడు (అంటే కష్టించి పనిచేయగలడని అర్థం) కాని నీవు బందిపోటువై జనులను దోచుకుంటున్నావు. స్త్రీలు, పిల్లలు నీ పేరు వింటే భయపడుతున్నారు. నిద్రించడంలేదు. (అంతవరకూ వచ్చిన వారెవరో తెలియని మండలి వారికి వచ్చినవాడు సత్యమాంగ్ అనే విషయం అప్పుడు తెలిసింది.) అన్యాయంగా సంపాదించిన డబ్బుతో జీవించే నీవు పెద్ద మీసాలు పెట్టుకొనడం సిగ్గుగా లేదా?

సత్సమాంగ్ : నాకిది వారసత్వంగా సంక్రమించింది. భార్యాబిడ్డలను పోషించుకునేదెలా?

బాబా : దొంగతనం తప్ప వేరే వృత్తి లేదా జీవించడానికి – అయితే ప్రపంచంలో అందరూ దొంగిలించిన సొమ్ముతోనే జీవితం గడుపుతున్నారనా నీ భావన!

పోలీసులు కూడా సత్యమాంగ్ ముఠా అంటే భయపడతారు. అలాంటిది బాబా మాటలకు మండలి వారాశ్చర్య పడుతుంటే పులిలాంటి సత్యమాంగ్ పిల్లిలాగా మారి బాబాను మహరాజ్ అని సంబోధిస్తూ మాట్లాడసాగాడు.

సత్యమాంగ్ : నాకు వేరే మార్గం చూపించండి. కుటుంబ పోషణకు వేరే మార్గం లభిస్తే నేనీ దొంగతనాన్ని మానుకోవడానికి సిద్ధంగా ఉన్నాను.

బాబా : అది వెంటనే జరుగుతుంది. కాని నరనరాన జీర్ణించుకున్న నీ నేర ప్రవృత్తిని మానుకోగలవా?

సత్యమాంగ్ : మహరాజ్ ! నాకు కుటుంబ పోషణకు మార్గం దొరికితే నేను దొంగతనం మానేస్తానని ప్రమాణం చేస్తున్నాను.

బాబా : నీకు తెలుసా ఎవరిముందు ప్రమాణం చేస్తున్నావో? ఎవరికి నీవు ప్రమాణం చేస్తున్నావో? భగవంతునికి చేసే ప్రమాణానికి భంగం కలిగితే నీ జీవితం నాశనమై పోతుంది. భగవంతుడు సర్వవ్యాపి. ఆయనకు అన్నీ తెలుసు. నీవేమీ దాచలేవు.

అని బాబా గంభీరంగా చెప్పి చేతిలోచెయి వేయించుకొని సత్యమాంగ్‌తో ప్రమాణం చేయించుకున్నాడు.

'నిజం మహరాజ్! నాకు తెలుసు. నేనెప్పుడూ నా ప్రమాణాన్ని భంగం కాకుండా చూసుకుంటాను' అన్నాడు సత్యమాంగ్.

'నీ వాగ్దానాన్ని నీవు నిలబెట్టు కోకపోతే నీవు పక్షవాతానికి గురైపోతావు. జాగ్రత్త!' అన్నారు బాబా.

బాబా అతని కుటుంబ పోషణకు కావలసిన ఏర్పాటు చేశారు. సత్యమాంగ్ దోపిడీలు మానేశాడు. అహమద్ నగర్ జిల్లా వాసులకు ఊరట కలిగింది. పోలీసుల కళ్ళు గప్పి ఎన్నో ఏళ్లనుండి ప్రజలను భయభ్రాంతులను చేస్తున్న సత్యమాంగ్ మెహెర్ బాబా ఎదుట లొంగిపోవడం, ఈ విషయంలో బాబా కలుగజేసుకోవడం అందరినీ ఆశ్చర్యచకితులను చేసింది.

కొంతకాలం తరువాత ఒక రోజు సత్యమాంగ్ పాత జ్ఞాపకాలతో ప్రేరేపింప బడి బాబా కిచ్చిన వాగ్దానాన్ని భంగం చేసి దొంగతనానికి పాల్పడ్డాడు. ఒక రాత్రి ఒక యింట్లో కన్నం వేసి విలువైన వస్తువులు చేజిక్కించుకొని వాటిని మూట గట్టుకొనుట కుపక్రమించాడు. వెంటనే అతని ఎదుట బాబా సాక్షాత్కరించి ఎదురుగా నిలబడ్డాడు. బాబా చెప్పిన "భగవంతుడు సర్వవ్యాపి. ఆయనకు అన్నీ

తెలుసు. నీవేమీ దాచలేవు" అన్న మాటలు గుర్తుకు రాగా వణకి పోయాడు. కళ్ళు చీకట్లు క్రమ్ముకున్నాయి. ఏమీ కనిపించ లేదు. నిస్సత్తువతో కళ్ళు మూసుకున్నాడు. కొంతసేపటికి తేరుకొని ఆభరణాలు అక్కడే వదలి నేరుగా మెహెరాబాద్‌కు వెళ్ళాడు. బాబాను చూడగానే గద్గద స్వరంతో పొంగి వచ్చే కన్నీళ్ళతో బాబాకు ప్రణమిల్లి 'బాబా ఈ సారికి క్షమించు. మరెప్పుడూ పొరబాటు చేయను. ప్రమాణాన్ని భంగం చేయను.' అన్నాడు. 'ఏమి జరిగింది' అని ఏమీ తెలియనట్లు బాబా ప్రశ్నించారు. 'దేవా! నీకన్నీ తెలుసు నన్ను క్షమించు' అన్నాడు. అతనిలోని పశ్చాత్తాప తీవ్రతను గ్రహించి బాబా అతనిని క్షమించాడు. ప్రతి గురువారం మెహెరాబాద్ వెళ్ళేవాడు. మరెన్నడూ దొంగతనానికి పాల్పడలేదు. వాల్మీకి వలె బాబా కృపకు పాత్రుడై బాబాకు సేవచేసే అవకాశము కూడా పొంది తరించాడు సత్యమాంగ్.

1926 ఫిబ్రవరి మాసంలో బాబా అన్నయైన జంషెడ్ మరణించగా బాబాకు టెలిగ్రామ్ యిచ్చారు. మండలి వారందరూ దుఃఖముతో విచారిస్తున్నట్లు కనబడగా, 'ఎందుకు విచారిస్తున్నారు?' అని బాబా అడిగారు. 'మీ అన్న మరణించారు కదా! అందువలన విచారిస్తున్నాము' అని వారు బదులు చెప్పారు. 'అతడు నాలో విశ్రాంతి పొందుచున్నాడు. అతడు నిజంగా మరణించలేదు. నిజంగా మరణించిన వారికి మళ్ళీ జననం ఉండదు. మరణించిన వారి బంధువులు మరణించిన వారు తమ అవసరాలకు లేకుండా పోయాడని వారి స్వార్థం కోసమే దుఃఖిస్తారు గాని మరణించిన వారి కోసం కాదు' అన్నారు బాబా. కొందరు శిష్యులకు పూనాకు పరామర్శ నిమిత్తం పంపించి, సాయంకాలం అందరికీ టీ పార్టీ ఇచ్చి పనులు మామూలుగా చేశారు బాబా.

ఒకరోజు ఒక శిష్యుడు పాత ఇళ్ళు బాగుచేసే పనిలో ఉండగా అతనికి తేలు కుట్టింది. బాధతో బాబా ! బాబా ! అని పిలిచాడు. తరువాత సాయిబాబాను, ఉపాసనీ మహరాజ్‌తో సహా వరుసగా అందరు సద్గురువు లనూ పిలిచాడు. బాధ తగ్గలేదు. మరునాడు బాబా వద్దకు వెళ్ళినప్పుడు తనకు తేలు కాటు వలన కలిగిన

బాధ గురించి చెప్పి ఎవ్వరూ తన పిలుపు విని బాధను నివారించలేదని చెప్పాడు. అప్పుడు బాబా ఈ విధంగా చెప్పారు.

'నీవు పిలిచిన సమయంలో నేను సాయిబాబా మిగతా సద్గురువులం కలసి విశ్వకార్యక్రమం గురించి చర్చించు కుంటున్నాము. బాబా అని పిలవగానే సహాయం చేయడానికి నేను లేచాను. ఈ లోగా నీవు సాయిబాబా అని పిలిచావు. వెంటనే సాయిబాబా లేచాడు. నేను కూర్చున్నాను. ఈలోగా ఉపాసనీ బాబాను పిలిచావు. ఆయన లేచాడు. సాయిబాబా కూర్చున్నాడు. అలా వెనువెంటనే అందరినీ పిలిచి నందువల్ల ఎవ్వరమూ నీకు సహాయం చేయలేక పోయాము'.

భగవంతుడొక్కడే. ఏ పేరుతో పిలిచినా ఉన్న ఒక్కడికే అది చేరుతుంది. ఒకే దేవుని భిన్న రూపాలను వేర్వేరుగా తలచి అన్ని నామ రూపాల ద్వారా భగవంతుని స్మరిస్తే అధిక ఫలం లభిస్తుంది అనే అజ్ఞానాన్ని తొలగించడానికి ఏ రూపం ద్వారా అచంచలమైన విశ్వాసం దేవునిపై కలుగుతుందో, ఏ నామాన్ని స్మరించడం ద్వారా యెదలో ప్రశాంతత, తన్మయత్వం కలుగు తాయో ఆ ఒక్క రూపం (నామం) ద్వారా దేవుని స్మరించడం ద్వారానే ఆధ్యాత్మికంగా అధిక ఫలం సిద్ధిస్తుందని చెప్పడానికి బాబా చమత్కారంగా పై విధంగా చెప్పి ఆ శిష్యునికి అనన్యమైన విశ్వాసాన్ని కలిగేటట్లు చేశారు.

1929వ సంవత్సరంలో ఒకరోజు తన శిష్యులలో నొకడైన రావు సాహెబ్‌ను పిలుచుకొని రావలసిందిగా బాబా విష్ణు మాస్టర్‌ను పంపించారు. అది మధ్యాహ్న సమయం. ఎండ తీవ్రంగా ఉంది. విష్ణుమాస్టర్ చెప్పులు లేకుండా వెళ్ళడం చూసి బాబా తన చెప్పులు వేసుకొని వెళ్లమని చెప్పారు. విష్ణుమాస్టర్ బాబా చెప్పులను తన కళ్ల కద్దుకొని మళ్ళీ బాబా కాళ్ళ వద్ద పెట్టి చెప్పులు లేకుండానే వెళ్ళబోయాడు. పవిత్రమైన బాబా పాదరక్షలను తను ధరించడం తప్పుగా భావించిన విష్ణుమాస్టర్ ఆ విధంగా చేశాడు. అది చూచి బాబా గంభీరంగా అతనిని మందలించారు. 'తన పాదరక్షలు పవిత్రమైనవే. అయితే తన మాటతో పోలిస్తే వాటికేమీ విలువ లేదని, ఆ విధంగా ఛాందస భావాల కధికమైన ప్రాముఖ్యత నిచ్చి శిష్యులు బాబా చెప్పినట్లు

చేయలేకపోతే లాభానికి బదులు నష్టమే వారికి కలుగుతుందని, బాబాతో ఉండికూడా ఏ ప్రయోజనం పొందలేక పోతారని చెప్పారు. విష్ణు చేసిన పని వల్ల నాకు గౌరవం కలుగక పోగా బాధ కలుగుతుంది' అన్నారు బాబా.

1929 సంవత్సరం జూలై మాసంలో బాబా ధులియా వెళ్ళారు. అచ్చట కాలేమామ మునిసిపల్ ఇంజనీర్. బాబా ఉనికికి కావలసిన ఏర్పాట్లు చేసాడు. ధులియాలో నుండగా బాబా చాలా ఆధ్యాత్మిక విషయాల గురించి ప్రసంగించారు.

అంతటా ఆనందమే నిండి ఉన్నదని మానవుడు ఆ ఆనందాన్ని అనుభవించడం తెలియక అజ్ఞానంతో క్షణికానందంకై పరుగిడుతున్నాడని చెప్పారు. నేను ఆనంద స్వరూపాన్ని. మీకు కనబడే 5 అడుగుల 6 అంగుళాల శరీరాన్ని కాదు. అది నశ్వరమైనది. అందరూ దానిని విధిగా పొందవలసిందే. దానికి అందరూ శ్రమించ వలసిందే అని చెప్పారు బాబా. ఒక భక్తుడు భక్తి యోగం గురించి వివరించమని కోరాడు. భక్తి యోగం గురించి చెబుతూ బాబా ఇలా అన్నారు.

'భగవంతుని చూడాలనే అత్యంతాకాంక్షతో భగవంతునితో ఐక్యం కావాలనే ఏకోన్ముఖమైన భక్తి దైవాని కర్పించాలి. అట్టి ఏకాగ్రతలో భక్తుని మనస్సు లీనం కావాలి. అట్టి భక్తి పారవశ్యంలో పరిసరాలు, బంధువులు మరియు ప్రాపంచి కాలోచన లేవీ ఉండ కూడదు. పవిత్ర గ్రంథాలు పఠించడం, గంటల తరబడి నామ జపం చేయడం భక్తి కాదు. అది వంచన, బాహ్యాడంబరం మాత్రమే. హృదయం భగవంతునితో అనుసంధానించబడాలి. అన్యాలోచనలు లేకుండా కేవలం దేవునిపై ఏకాగ్రతతో లగ్నం చేయబడిన మనస్సుతో చేసిన 5 నిమిషాల భక్తియైనా మేలు' అని చెప్పారు బాబా.

'ధ్యానంలో ఏ నామాన్ని స్మరించాలి? కొందరు రామ నామమని, కొందరు కృష్ణ నామమని, పరమాత్మ లేదా ఈశ్వరుని నామమని రకరకాలుగా చెబుతున్నారు' అని ఒక భక్తుడు బాబాని అడిగాడు. అప్పుడు బాబా ఈ విధంగా వివరించారు.

‘ఏనామాన్నైనా స్మరించండి. రామ, కృష్ణ, జీసస్, బుద్ధ, మహమ్మద్ లేదా భగవాన్ ఏదైనా సరే. కాని దైవ నామాన్ని ఎలా స్మరించాలి? రామ, కృష్ణ, బుద్ధ ఏ నామాన్ని స్మరిస్తున్నా ఆ రూపాన్ని మనస్సులోని అంతర్చక్షువుల ముందు సాక్షాత్కరించు కోవాలి. మరి దైవం విషయం ఏమిటి? కేవలం నామ స్మరణలో అర్థం లేదు. ఏకోన్ముఖమైన భక్తితో భగవంతుని స్వరూపాన్ని ఏ రూపం ద్వారానైనా ఏర్పరచుకొంటే అది సులభమవుతుంది. అనన్యంగా దేవుని మాత్రమే స్మరించుట ఎలా సాధ్యమవుతుంది? దానికి తగిన ఏదేని అవతారుని లేదా సద్గురువు రూపాన్ని యెంచుకోవాలి’.

‘చంచలమైన మనస్సుతో రామ రామ రామ యని చిలుక పలుకుల్లాగా 12 సంవత్సరాలు వల్లించినా ఫలితం శూన్యం. నీకొక గురువుంటే ఆయన రూపాన్నే యెంచుకోవడం ఉత్తమం’.

ఏకాగ్రత కుదరడంలేదని దానికి బాబా ఆశీస్సులను కోరిన ఒక భక్తునికి తన అభయాన్నిస్తూ బాబా ఇలా అన్నారు ‘అది నేను చూసుకుంటాను. స్మరించే వేళలో నా రూపాన్నే ధ్యానించు. నాపైనే మనస్సు లగ్నము చెయ్యి. మిగిలినదంతా నేను చూచుకుంటాను.’

మెహెరాబాద్‌లో బాబా జన్మదినోత్సవాలు జరుపుకొనే సందర్భంగా, అన్నదానం చేయడం, బీదలకు స్వయంగా బాబా కాళ్ళు కడిగి, దైవదక్షిణ ఇచ్చే కార్యక్రమాలు చేసేవారు. ‘ధనవంతులలో నధిక ధనవంతుడను, బీదలలో నందరికంటె బీదవాడి’ నని బాబా చెప్పారు. సమాజంలో బీదవారు ధనికుల పాదాక్రాంతులై ఉన్న ఆ సమయంలో బాబా వారి కాళ్ళు కడగడం వల్ల పేదరిక నిర్మూలనానికి నాందిగా బాబా చేసిన పనికి నేటి సమాజంలోని మార్పులే నిదర్శనం.

1927వ సంవత్సరంలోనే బాబా మెహెరాబాద్ కొండపై తన భావి సమాధిని నిర్మింప జేశారు. నేడు ఆయన భౌతిక కాయాన్ని నిక్షిప్తం చేసుకొని అది విశ్వబాబా ప్రేమికులకు పవిత్ర యాత్రాస్థలమై విలసిల్లుచున్నది.

1927వ సంవత్సరం ఏప్రిల్ మాసంలో బాబా ఎగువ మెహెరాబాద్‌లో తిరిగే సమయంలో ఒక ప్రత్యేక స్థలాన్ని ఎంపిక చేసి అక్కడ ఒక గొయ్యి త్రవ్వమన్నారు. ఆరడుగుల పొడవు, నాలుగడుగుల వెడల్పు, ఆరడుగుల లోతు గల ఒక గొయ్యి త్రవ్వారు. దానిపై తాత్కాలికమైన ఒక నిర్మాణం చేసారు. గొయ్యిచుట్టూ ఉండే ప్రదేశం దాని ఆచ్ఛాదనలో ఉండే విధంగా దానిని నిర్మించారు. ఆ గోతిలో బాబా ఏకాంత వాసం చేయాలని కోరగా, దానికి మెట్లు కట్టించి, నేలపై రాళ్ళతో ఫ్లోరింగ్ చేయించి సిమెంట్‌తో ప్రక్కలను బాగుచేశారు. ఆగష్టు మాసంలో తాత్కాలిక నిర్మాణం పూర్తికాగా, బాబా అప్పుడప్పుడూ ఆ గోతిలో విశ్రాంతి తీసుకునే వారు. 1927వ సంవత్సరం డిసెంబర్ 20వ తేదీ నుండి 1928వ సంవత్సరం ఫిబ్రవరి 26వ తేదీ వరకు బాబా ఆ గోతిలో ఏకాంతవాసం చేసారు. బాబా స్త్రీ మండలిలోని ముఖ్యులు రైల్వే లైను దగ్గరలో గల పోస్టాఫీస్ భవనంలో ఉండేవారు. ప్రభుత్వాదేశాల మేరకు 1930 దశకంలో పోస్టాఫీస్ భవనం కూల్చివేయ బడింది. 1938 వ సంవత్సరంలో తాత్కాలికంగా చేసిన నిర్మాణం తీసివేసి పోస్టాఫీస్ కూల్చగా మిగిలిన రాళ్ళతో సమాధిని నిర్మించారు. బాబా మెహెరాబాద్‌లో మొదటి నివాస మేర్పరచుకొన్న పోస్టాఫీస్ శిధిలాలలో మిగిలిన రాళ్ళతో సమాధి నిర్మింప జేసి దానికి మెహెరాబాద్‌లోని తన తొలి నివాసంతో సంబంధమేర్పరచారు. బాబా




ఆదేశానుసారం దానిపై 'డోమ్' అనబడే శిఖరము, నాలుగు మూలలా ప్రముఖ మతాలకు చిహ్నాలైన ఒక గుడి, మసీదు, శిలువ, అగ్ని శిఖలను నిర్మించారు. 'సేవలో పరిపూర్ణత' (మాస్టరీ ఇన్ సర్విట్యూడ్) అనే వాక్యాన్ని ఒక శిలా ఫలకంపై చెక్కించి సమాధి ముఖ ద్వారంపై గోడలో అమర్చారు. సమాధి లోపలి భాగంలో ఎగుడు దిగుడుగా నున్న గోడల ఉపరితలంపై నేడు గోచరించే చిత్రాలను పెయింట్ చేసే అవకాశము నాడు

మెహెర్ రిట్రీట్‌లో ఉంటున్న విదేశీ వనిత 'హెలెన్ దామ్' కు కలిగింది. గోతిలోని పార్శ్వ భాగాలపై గూడా జంతువులు, పువ్వుల బొమ్మలతో పెయింటింగ్ చేసింది. బాబా ఆమె చేసిన చిత్ర లేఖనాన్ని మెచ్చుకున్నారు. 1954 మరియు 1955వ సంవత్సరాలలో 'ఆ నిర్మాణమే తన భౌతిక కాయాన్ని నిక్షిప్తము చేసి దానికి శాశ్వత విశ్రాంతిని కల్పించే సమాధి'యని పేర్కొన్నారు. తన ప్రేమికులను సమాధిలోనికి వెళ్ళి లోపల గొయ్యి చుట్టూ ప్రదక్షిణ చెయ్యమన్నారు. 1955వ సంవత్సరంలో అక్కడ సమావేశ మయిన ప్రేమికులతో 75 సంవత్సరాల తర్వాత ఈ చిన్న సమాధి ప్రపంచంలోని యాత్రాస్థలాలు అన్నింటికి కేంద్రమవుతుంది' అని చెప్పారు. బాబా ఆదేశానుసారం ఆయన భౌతిక కాయాన్ని ఇచ్చటి సమాధిలో నిక్షిప్తం చేశారు. ఆ



రోజు జొరాష్టర్ జన్మదినము ఆయినది. 31.01.1969 నుండి 07.02.1969 వరకు ఈ సమాధిలో ప్రపంచ నలుమూలల నుండి వచ్చిన ప్రేమికుల దర్శనార్థం బాబా భౌతిక కాయాన్నుంచి 07.02.1969 రోజున భౌతిక కాయాన్ని నిక్షిప్తం చేసి సమాధిలోని గొయ్యిని పూడ్చి కప్పివేశారు. ఆ ఏడు రోజులలోను ప్రపంచం నలుమూలలనుండి వచ్చిన ప్రేమికులు బాబా ప్రేమతో నిండిన హృదయాలతో ప్రియతముని భౌతిక సాన్నిధ్యము నుండి దూరమౌతున్నామనే భావోద్వేగంతో ఆఖరి దర్శనం చేసుకొన్నారు.

మోహెరాబాద్‌లో స్థిరనివాస మేర్పరచుకొన్న తరువాత బాబా 1929వ సంవత్సరములో పర్షియా దేశానికి వెళ్ళి వచ్చారు. చిన్నచిన్న విదేశీ పర్యటనలు చేసినా విస్తృతమైన ప్రపంచ పర్యటనలు 1931 నుండి ప్రారంభమైనాయి.

## ప్రపంచ పర్యటనలు (1931 - 1941)

1931వ సంవత్సరం సెప్టెంబర్ మొదటి తేదీన బాబా రుస్తుం, ఆలీ, దాదాఖాంజీ అనే ముగ్గురు శిష్యులతో రాజపుటానా ఓడలో మొదటి ప్రపంచ పర్యటనకు ఇంగ్లండుకు ప్రయాణమై వెళ్ళారు. అదే ఓడలో మహాత్మాగాంధీ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొనడానికి ఇంగ్లండుకు ప్రయాణమయ్యాడు. కరాచీ మేయరైన జంషెడ్ మెహెతా బాబా ప్రేమికుడు. అతడు గాంధీజీకి కేబుల్ ఇచ్చి ఓడలో మెహెర్ బాబా ఉన్నారని, ఆయనను తప్పకుండా దర్శించమని కోరాడు. కేవలం కొద్ది నిమిషాలు మాత్రమే బాబా దర్శనానికి వెచ్చించ గలనని గాంధీ, బాబాతో 2 గంటలు వెచ్చించాడు. గాంధీజీ ప్రశ్నలన్నింటికీ బాబా తన అక్షర ఫలకం ద్వారా సమాధానాలు ఇచ్చారు. బాబా దివ్యత్వంతో ఆకర్షితుడైన గాంధీజీ ప్రతిరోజు రాత్రి కొన్ని గంటలు బాబాతో గడిపారు. బాబా వ్రాసిన రహస్య గ్రంథం నుండి కొన్ని పేజీలు గాంధీజీకి చూపించారు. బాబా సాంగత్యంలో ఉత్తేజితుడైన గాంధీజీ ఇంగ్లండుకు వెళ్ళిన తర్వాత పూర్ణ స్వరాజ్యమే తమ లక్ష్యమని ప్రకటించారు. ఇంగ్లండుకు ప్రయాణమగుటకు పూర్వం తమ లక్ష్యాన్ని నిర్ణయించుకోలేదని గాంధీ విలేకరులతో చెప్పారు.



12.09.1931వ రోజు బాబా లండన్ చేరారు. కేన్సింగ్టన్‌లో కిట్టీడేవీ ఇంటిలో బసచేసి అక్కడి నుండి దీవాన్ షైర్‌లో మెరిడిత్ స్టార్ స్థాపించిన ఆశ్రమానికి వెళ్ళారు. కిట్టీడేవీ ఇంటిలో కిట్టీడేవీ తల్లిదండ్రులు, సోదరుడు హెర్బర్ట్ డేవీ, సోదరి మే, ఆమె కూతురు జల్లా, రష్యన్ బ్యాలెట్ డాన్సర్ మార్గరెట్ క్రాస్కి, మెరిడిత్ స్టార్ మొదలగు వారు బాబాను కలసి ఆయనతో ఉన్నారు. ఈస్ట్ చల్లా కూంబ్‌లో చాలా మంది బాబా దర్శనం చేసుకున్నారు.

కొందరు ఆశ్రమంలో ఉండి బాబా సహవాస భాగ్యాన్ని పొందారు. వారిలో ప్రముఖులు ఛార్లెస్ పర్దమ్, థామస్ వాట్సన్. ఛార్లెస్ పర్దమ్ ప్రఖ్యాతి చెందిన విమర్శకుడు. బాబా దివ్యమంగళ విగ్రహాన్ని చూచి బాబా దివ్యత్వంలో అచంచల విశ్వాసాన్ని పొందాడు. ఆంగ్లంలో 'ది పర్ఫెక్ట్ మాస్టర్', 'గాడ్‌మన్' అనే బాబా జీవిత చరిత్రను మొదట రచించి ప్రచురించిన అదృష్టవంతుడు. థామస్ అగస్టస్ వాట్సన్ అను నతడు అబ్రహం గ్రాహెంబెల్‌తో కలిసి టెలిఫోన్ శోధనలో పని చేసిన శాస్త్రవేత్త. అనేక ప్రాక్పశ్చిమ దేశాల ఆధ్యాత్మిక గ్రంథాలు పఠించి అనేక సందేహాలతో బాబా దర్శనానికి వచ్చాడు. అందరితో బాటు వరుసలో నిలబడియున్న థామస్ వాట్సన్ తలపై నెమ్మదిగా తట్టారు బాబా. ఆయన చేతి దివ్యస్పర్శతో ఆ వృద్ధ శాస్త్రవేత్త పసిపిల్ల వాడిలా ఏడ్వడం ప్రారంభించాడు. ఆయన హృదయంలో బాబా స్పర్శచే పొంగి పొరలిన ప్రేమ ప్రవాహం కన్నీటి ద్వారా వ్యక్తమయ్యింది. ఛాంజీ ఆయనను గ్రంథాలయం లోనికి తీసుకొని వెళ్ళి కూర్చోబెట్టాడు. ఆయన పావు గంట సేపు కన్నీళ్ళతో పారవశ్యంలో గడిపాడు. 'నా 78 ఏళ్ళ వయస్సులో మొదటిసారిగా దివ్యప్రేమ అంటే ఏమిటో అనుభవించాను ఆది కేవలం మెహెర్ బాబా స్పర్శతో లిప్తకాలంలో పొందాను' అన్నారు వాట్సన్. థామస్ వాట్సన్ ప్రోద్బలంతో బాబా ఇంగ్లండ్ నుండి అమెరికా వెళ్ళారు. మాల్కమ్ స్లాష్, జీన్ ఆడ్రియల్ దంపతులు బాబా రాకకై అమెరికాలో ఏర్పాట్లు చేసారు.

బాబా గాంధీజీ కోరిక మేరకు ఇంగ్లండులో ఆయన నివాసానికి వెళ్లి దర్శనమిచ్చారు. అది అక్టోబర్ 2వ తేదీ – గాంధీజీ పుట్టిన రోజు. గాంధీజీ బాబాను సాదరంగా ఆహ్వానించి ఎన్నో విషయాలలో బాబా సలహాలను పొందారు. తన బరువు దించు కోవడానికి బాబా సహాయాన్నర్థించాడు. చివరగా బాబా ఇలా చెప్పారు –

'విధి విధానం ప్రకారం జరుగ వలసింది జరుగుతుంది. నీ సామర్థ్యాని కనుగుణంగా నీ ప్రయత్నం చెయ్యి. ఫలితాన్ని దైవనిర్ణయానికి వదిలి చింతించ కుండా ఉండు. నీ విచ్చిన మాటను మరువకు. నేను చేయవలసింది చేస్తాను'.

'అంతటా ఆనందమే నిండి ఉంది. ఆ పెన్నిధి యొక్క మర్మము (తాళము చెవి) నా వద్ద ఉంది' అని బాబా చెప్పగా ఆ తాళము చెవి నాకివ్వరా అని గాంధీ అడిగాడు. 'ఇస్తాను – నిజానికది నీదే అయినా నీ ప్రయత్నాన్ని బట్టి నీకు లభ్యమవుతుంది. అన్నిటి కన్న మిన్నగా దానికై ప్రయత్నిస్తేనే అది సాధ్యపడుతుంది'.


ఆ మరుసటి రోజే బాబా ఇంగ్లాండ్ నుండి టర్కీకి వెళ్ళాలి. బాబా లండన్‌లో వృద్ధాశ్రమానికి వెళ్ళి చాలా సేపు అచ్చటి వృద్ధులతో మాట్లాడారు. ఆ సంభాషణ మాటలలో కాదు – మౌనంలో సాగింది. అది హృదయాలు మాట్లాడుకునే భాష. హృదయాలు విప్పిన వారికి అర్థమయ్యే భాష. ఆఖరు రోజున ఎందరో మేధావులు, శాస్త్రవేత్తలు, పత్రికా విలేఖరులు బాబాను దర్శించారు. బాబా అందరికీ తన ప్రేమను పంచారు.

కిట్టీదేవీ బాబా సహవాసంలో పొందిన ప్రేమాతిశయంలో ఆమె కళ్ళ నుండి ప్రవహించే అశ్రువులను చూచి ఆమె సోదరి మే ఎగతాళి చేసింది. స్వయంగా బాబాతోనే ఆయనపై తనకు విశ్వాసం లేదని చెప్పింది. 'రెండురోజుల్లోనే నీవు నన్ను ప్రేమించడం ప్రారంభిస్తావు. అప్పుడు తెలుస్తుంది నీకీ కన్నీళ్ళ రహస్యం' అన్నారు బాబా. ఆ రాత్రి బాబా ఎదుట అందరితో కలసి కూర్చునియుండగా అకస్మాత్తుగా ఆమె కళ్ళ నుండి అశ్రుధారలు ప్రవహించ సాగాయి. మూడు గంటల వరకు తనను తాను నిగ్రహించుకో లేకపోయింది. ఈ అనుభవంతో ఆమె ఏర్పరచుకొన్న పరిమిత భావం హరించుకుపోయింది. బాబా ప్రేమ యేమిటో అర్థమయ్యింది.

మూడవ తేదీ బాబా టర్కీ వెళ్లారు. అక్కడి నుండి ఇటలీలోని మిలాన్ నగరానికి వెళ్ళారు. అక్టోబర్ 11వ తేది టర్కీనుండి ఇటలీకి వెళ్ళేముందు బాబా రుస్తుం మరియు ఛాంజీలకు ఇలా చెప్పారు –

'నేను ఇక్కడికి చాలా ముఖ్యమైన పనిమీద వచ్చాను. బాహ్యంగా ఎవరినీ కలుసుకోక పోయినా అంతరంగికంగా చాలా పని చేస్తున్నాను. గతంలో వైభవంగా నున్న దేశం ఇప్పుడు ప్రాముఖ్యత కోల్పోయింది. ఆధ్యాత్మికంగా స్థానాన్ని

పోగొట్టుకుంది. సైనిక శక్తిని, భౌతిక శక్తిని పెంపొందించుకుంది కాని అవినీతి పరులు, అనర్హుల చేతిలో చిక్కుకుంది. ఇచ్చట ప్రబలియున్న దుష్టశక్తుల నుండి రక్షింపబడుటకు ఆధ్యాత్మిక శక్తి అవసరమై ఉన్నది. అందుకే నేను స్వయంగా వచ్చాను.'



ఇటలీలో బాబా 10 రోజులు ఉన్నారు. అక్కడినుండి అక్టోబర్ 25వ తేదీన రైలులో జెనీవాకు వెళ్ళారు. ఇటలీలో బాబా నివాసానికి ఏర్పాట్లు ఎనిడ్ కార్ఫ్ అను వనిత చేసింది. మిలాన్ నగరంలో బాబా 'సెర్టోసా కాథడ్రల్' అనే చర్చిని దాని ప్రక్కనే ఉన్న ఆశ్రమాన్ని (మోనాష్టరీని) దర్శించారు. ఆ స్థలం బాబాకు నచ్చింది. చాలా ప్రశాంతంగా ఏకాంతమునకు అనువుగా ఉంది. తన ఆధ్యాత్మిక కార్యాన్ని గురించి బాబా తనతో ఉన్న ఎనిడ్ కార్ఫ్ మరియు ఆమె స్నేహితురాలు ధియోలకు ఇలా చెప్పారు.

'సాధారణ మానవునకు నా పని యేమిటో అర్థం కాదు. నా విశ్వ వ్యాప్తమైన మనసుతో విశ్వం కోసం అనంతంగా కొలలేని పని చేస్తాను. నా పనిని అర్థం చేసుకోవడం మానవ మేధస్సుకు సాధ్యపడదు. నేను అనుక్షణం చేసే పని విశ్వం కొరకే. నాకై చేసుకోవలసినదేమీ లేదు. నా పనిని ఎన్నో విధాలుగా చేస్తాను. ఆ ధ్యేయంతో నేను ఎన్నో ప్రదేశాలకు వెళ్తాను. ఎన్నో పర్యాటక స్థలాలు సందర్శిస్తాను. సినిమాలకు వెళ్తాను. అలా ఎన్నో చేస్తుంటాను. నేను సినిమాలు చూడడం మీలాగా కాదు. మీకు కనపడే ఈ సినిమా చూడడం లాంటి బాహ్యక్రియ ద్వారా నా ఆధ్యాత్మిక పని చేసుకుంటాను. నా ప్రతి శ్వాస ద్వారా ఆంతరంగికమైన విశ్వకార్యం చేయబడుతుంటుంది. ఇది మీకు అర్థం కాదు.

మానవాళి సంక్షేమానికి నేను బృహత్తరమైన పని చేయాల్సి ఉంది. అది నా

కర్తవ్యం. ఇవి చాలా గడ్డు రోజులు. పరిస్థితులను బట్టి నా బాధ్యత నేను చేయాల్సిన విశ్వకార్యం యొక్క మోతాదులు పెరిగాయి. నేను విశ్వ ఆధ్యాత్మిక సామ్రాజ్యానికి చక్రవర్తిని. విశ్వం నలుమూలలల్లో యున్న ఏజెంట్ల నుండి సమాచారాలు నిరంతరం స్వీకరిస్తుంటాను. వారికి నా ఆదేశాలను ఆంతరంగికంగా అందజేస్తుంటాను. నేడు నెలకొనియున్న ఉద్రిక్త పరిస్థితులవల్ల అన్నీ బాధాకరమైన వార్తలు, చైనా జపాన్ దేశాల మధ్య స్పర్థలు మొదలైన సందేశాలు వస్తున్నాయి. వాటికి సరియైన ఆదేశాలు యివ్వాలి. ఎవరికీ గ్రహింప వీలులేకుండా ఆంతరంగికంగా అంతులేని ఆధ్యాత్మిక విషయాలను పర్యవేక్షిస్తుంటాను. బాహ్యంగా అది ఎవ్వరికీ గోచరం కాదు. కానీ నా అంతరంగిక కార్యం యొక్క సూచనల ప్రభావం బాహ్యంగా కూడా అప్పుడప్పుడు గోచరిస్తుంటుంది. ఉన్నట్టుండి నేను గంభీరంగా, కోపంగా మరుక్షణం సౌమ్యంగా సంతోషంగా కన్పించడానికి అదే కారణం. అప్పుడప్పుడు నేను భౌతికంగా మీ యెదుటనున్నా ఏదో పరధ్యానంలోకి వెళ్ళినట్లు కన్పించడానికి కూడా అదే కారణం. అందుకే నాలో కలిగే ఆకస్మిక మార్పులకు మీ మనస్సుల్లో అనేక సందేహాత్మక భావనలు వస్తాయి. మీ అజ్ఞానం వల్ల మీరు అసలు విషయాన్ని అర్థం చేసుకోలేరు. మనస్సు ద్వారా గాని, బుద్ధి ద్వారా గాని నా ఆధ్యాత్మిక కార్యాన్ని మీరెప్పుడూ అర్థం చేసుకోలేరు. అది మనస్సుకు, బుద్ధికి గోచరం కానిది'.

జెనీవా నుండి రోమా అనే ఓడలో అక్టోబర్ 27వ తేదీన బాబా న్యూయార్క్‌కు బయలుదేరారు. ఇంగ్లండ్ నుండి వచ్చిన తర్వాత అక్కడి ప్రేమికులతో ఛాంజీ ద్వారా ఉత్తర ప్రత్యుత్తరాలు నెరపుతూ బాబా తనతో సంబంధమేర్పరచుకున్నారు. న్యూయార్క్‌కు ఓడలో ప్రయాణం చేస్తుండగా నవంబర్ 3వ తేదీన ఇటలీకి చెందిన ఆర్థిక శాస్త్రవేత్త బాబాను ఆయన క్యాబిన్‌లో దర్శించాడు. ఆయనకు బాబా ఈ క్రింది సందేశాన్ని యిచ్చారు.

'ప్రపంచంలో ఉండు కాని ప్రపంచానికి అంటకుండా ఉండు. నీ కర్తవ్యాన్ని విధులను నిర్వహించు కాని మాయకు బద్ధుడవు కాకు. ఎప్పుడూ చింతించకు. బాధలలో నున్నా కూడా ఎప్పుడూ సంతోషంగా ఉండడానికి ప్రయత్నించు'. బాబా

ఆయనకు ఐదు నిమిషాల పాటు సత్యమును తలుస్తూ ధ్యానము చేయమన్నారు.

1931వ సం. నవంబర్ 6వ తేదీ శుక్రవారం రోజు మొట్ట మొదటి సారి బాబా న్యూయార్క్ రేవులో ఓడ దిగి అమెరికా దేశంలో కాలు పెట్టారు. ఓడ దిగే సమయంలో ఒక మూర్ఖుడైన (ఇమ్మిగ్రేషన్) అధికారి బాబాను ఆయన మౌనాన్ని శంకించి రెండు గంటల పాటు బాబాను దిగకుండా నిరోధించాడు. న్యూయార్క్ నగర వాసులు ఎవరైన వచ్చి జామీను ఇవ్వాలని పట్టుబట్టాడు.

బాబా ఏ మాత్రము చలించక ఆ అధికారి అడిగే ప్రశ్నలకు అక్షర ఫలకం ద్వారా బదులిస్తూ కూర్చున్నారు. అంతలో అకస్మాత్తుగా తెల్లని యూనిఫారంలో ఉన్న ఒక ఓడ అధికారి వచ్చి వారినెందుకు ఆపివేశావని ప్రశ్నించాడు. తనకు సంతృప్తి కలుగ లేదని బదులివ్వగా ఆయన వారి పత్రాలను పరిశీలించి అవి సరిగానే ఉన్నవని వారిని ఆపి వేయడంలో అర్థం లేదని అధికార దర్పంతో చెప్పి కావాలంటే తాను వారికి జామీను యివ్వ గలనని, వెంటనే వారు ఓడ దిగి వెళ్ళుటకు ఏర్పాటు చేయమని చెప్పి వెళ్ళాడు. ఆ విధంగా తోడ్పడిన అధికారికి కృతజ్ఞతలు తెలియజేయడానికి ఛాంజీ ఓడలోనికి వెళ్ళి విచారించగా అట్టి అధికారి ఎవ్వరూ కనబడలేదు. తన అక్షర ఫలకం వెనుక నున్న శక్తిని మాట్లాడకుండానే బాబా ఆ మూర్ఖపు అధికారికి తెలియజెప్పారు.

బాబా అమెరికాలో నెలరోజులు ఉన్నారు. హార్మనులో ఆయన బస ఏర్పాట్లు మాల్కమ్, జీన్ ఆడ్రియల్ దంపతులు చేశారు. వారు దాదాపు 350 మందిని బాబా దర్శనానికై ఆహ్వానించారు. బాబా అందరికీ దర్శనం యిచ్చారు. బాబా న్యూయార్క్, బోస్టన్, మాన్ హాటన్ పట్టణాల్లో పర్యటించారు. బాబా పర్యటన గురించి మాల్కమ్ స్లాష్ 'ఆయన మౌనంగా ఉన్నారు కానీ తుఫాన్ కూడా అంత చురుకుగా, ఉధృతంగా ఉండదు. ఆయనను దర్శించి ఆ గదిలో నుండి బయటకు వచ్చిన స్త్రీ పురుషులందరు ఎవ్వరితో మాట్లాడటానికి ఇష్టపడక ఒంటరిగా కూర్చుని వారికి కలిగిన అనుభవాల్ని ఇమిడ్చుకొన యత్నించే వారు. బాబా ఉదయం నుండి రాత్రి వరకు రోజంతా దర్శనార్థులను కలిసేవారు. మేము అనుకోనంత మంది అతిథులు

రావడంతో వారికి బస, భోజనాల ఏర్పాట్లు చేయవలసి వచ్చింది. హార్మనులో బాబా అడుగు పెట్టిన మరుక్షణం నుండి ఆయన దివ్యప్రేమ ప్రవహించి మా హృదయాలను ముంచెత్తింది. ఆ ప్రేమను పొందిన తరువాత గత అవతారాలలో క్రీస్తుతో ఆయన అనుయాయులు, తక్కిన అవతారుల శిష్యులు ఎలా ప్రేమానుభూతులు పొందారో అవగాహన కలుగనారంభించింది' అని వారు చెప్పారు.

అమెరికాలో బాబాను కలిసి బాబా ప్రేమను పొంది ఆయన సేవకు అంకితమైన వారిలో ముఖ్యులు: (1) రాణీ నోరీనా మాచెబెల్లీ – ఈమె క్రీస్తు నాటకంలో మాడోనా పాత్ర ధరించేది. (2) ఎలిజబెత్ పాటర్సన్ – ఈమె నేడు మిర్టిల్‌బీచ్‌లో గల 500 ఎకరాల స్థలంలో నిర్మించిన బాబా సెంటర్‌కు స్థాపకురాలు. మస్తు కార్యక్రమంలో నీలిరంగు బస్సును నడిపింది. (3) నడీన్ టాల్ స్టాయ్ – 'యుద్ధము – శాంతి' యనే ప్రముఖ గ్రంధాన్ని రచించిన రష్యన్ తత్త్వవేత్త టాల్ స్టాయ్ కోడలు. (4) ఐ.వి. డ్యూస్ – ఈమె బాబా ఆజ్ఞ ప్రకారం సూఫిజమ్ బృందానికి సారధ్యం వహించింది. 'సద్గురువు ఎలా పనిచేస్తాడు?' (హౌ ఎ మాస్టర్ వర్క్స్) అనే గ్రంధాన్ని రచించింది. ఇంగ్లండ్‌లో విల్ బాకెట్ మరియు మేరీ బాకెట్ అనే వృద్ధదంపతులు బాబా ప్రేమికులైనారు. బాబా వీరిని నా దేవదూతలు (ఆర్కాంజిల్స్) అని చెప్పారు.

నొరీనా మాచెబెల్లి తన స్నేహితురాలైన జీన్ ఆడ్రియల్ ద్వారా బాబా గురించి విని, బాబా స్పర్శతో కలిగిన పారవశ్యాన్ని పర్యవసానంగా ప్రవహించిన అశ్రుధారలను ఆమె చెప్పగా విని 'ఆయనను గురువుగా నీవెలా ఆరాధిస్తావు? నీవు స్త్రీవి గదా' అని ఆడ్రియల్‌ను ప్రశ్నించి అపహాస్యంగా 'మీ గురువు గారు అమెరికాకు వస్తే చెప్పు – నేను కూడా ఆయనను కలిసి ఏడవాలనుకుంటున్నాను' అని చెప్పింది. ఆమె అమెరికాలో బాబాను కలుసుకొన్నప్పుడు కలిగిన అనుభూతిని వర్ణించలేనని చెప్పింది. నేను కూడా ఏడుస్తానని అపహాస్యంగా మాట్లాడిన నొరీనా బాబా దర్శనానికై గదిలో అడుగుపెట్టగానే అనిర్వచనీయమైన సంభ్రమాశ్చర్యాలతో

కలిగిన అనుభూతిలో హృదయం ద్రవించగా అశ్రుధారలతో బాబా పాదాలపై వాలిపోయింది. 'నేను ఏకకాలంలో స్త్రీని, పురుషుడిని. నాకు లింగభేదము లేదు' అని బాబా చెప్పారు. ఆమె తన జీవితాన్ని బాబాకు అంకితం చేసింది.

భారతదేశము నుండి వచ్చిన స్వామి పరమానంద అనే యోగి అమెరికాలో తన విద్యార్థులను, మరల తన కోడలును తీసుకొని వెళ్లి బాబా దర్శనం చేసుకున్నాడు. ఆయన వ్రాసిన పుస్తకాలను బాబాకు కానుకగా యివ్వాలనుకున్నాడు. బాబాకు తేనెను బహూకరించాడు.

'అనంతమైన అస్తిత్వం తప్ప వేరేమీ లేదు. నేను అస్తిత్వంతో నిరంతరం ఏకత్వాన్ని అనుభవిస్తుంటాను. ఎప్పుడూ అనంత ఆనందానుభూతితో ఉంటాను' అన్నారు బాబా. 'బుద్ధితో (తెలివితేటలతో) కలిగే విశ్వాసం సరిపోదు. సత్యం అంతరంగంలో కలిగే ఆత్మానుభూతి వల్ల మాత్రమే గోచరము. ఇదంతా నీలోనే ఉంది. సత్యములో జీవించడానికి మాయకు మరణించాలి' అన్నారు బాబా. ఆధ్యాత్మికత గురించి బోధలు చేసే తెలివి యున్నా తనకు ఆ అనుభవం లేదని తనకు బాబా కృప ఆశీస్సులు అందుల కవసరమని చెప్పి బాబాకు ప్రణామం చేసి ఆ యోగి వెళ్ళిపోయాడు.

నెల రోజులు అమెరికాలో గడిపిన తర్వాత బాబా ప్యారిస్ వెళ్ళి అక్కడి నుండి భారతదేశానికి ఓడలో జనవరి 1వ తేదీ 1932 సంవత్సరం మొత్తం నాలుగు మాసాల పర్యటన ముగించుకొని తిరిగి వచ్చారు. ప్యారిస్ నుండి బయలుదేరే ముందు రోజు బాబా ఈ సందేశం యిచ్చారు –

'మీరు నా నిజ స్వరూపాన్ని చూడలేరు. నేను మీకు కనబడే నా యీ భౌతిక శరీరాన్ని కాదు. నా నిజ స్వరూపం ఇంకా అతి సుందరమైనది. నేను అనంత సత్యాన్ని అనంత ప్రేమను అనంత శక్తిని. నేను శాశ్వత జీవనాన్ని. నేనే రాముడుగా, కృష్ణుడుగా, బుద్ధుడుగా, జీసస్‌గా వచ్చి యుంటిని. ఇప్పుడు మెహెర్‌బాబాగా వచ్చాను'.

ఆ తర్వాత 1930వ దశకంలో పలు మార్లు బాబా ప్రాక్పశ్చిమ దేశాల్లో పర్యటించారు. మొదటి పర్యటనలో బాబా దర్శనం చేసుకొన్న ప్రేమికులే గాక పలువురు కొత్తగా బాబా దర్శనం చేసుకొని ఆయన ప్రేమను పొందారు. ఆయన ప్రేమ ప్రవాహంలో మునిగి పరవశించిన హృదయాల ప్రేమానుభూతులు వర్ణించనలవి కానివి. ఎందరో పత్రికా విలేఖరులు బాబాతో సమావేశమయ్యారు. ఎన్నో ప్రశ్నలడిగారు. వార్తా పత్రికలలో ప్రచురించారు. బాబా ఫోటోలతో మూవీలు తీశారు. ఈనాడు కూడా మనం బాబా నడవడం, దర్శనాలివ్వడం ప్రత్యక్షంగా వాటి ద్వారా చూడగలుగుతున్నాము.

1932వ సంవత్సరములో రెండవ ప్రపంచ పర్యటనలో ఆగస్టు 5వ తేదీన బాబా ఇటలీలోని ఆసిసీ పట్టణంలో కొండపైన (మోంటిసుబాసియా) సెయింట్ ఫ్రాన్సిస్‌కు చెందిన ఒక గుహలో ఏకాంతవాసం చేశారు. ఆ సమయంలో ఆయన ప్రపంచంలోని ఉన్నతాత్మలతో సమావేశమయ్యారని సూక్ష్మశరీరాలతో వారు హాజరయ్యారని 2000 సంవత్సరాల వరకు జరుగవలసిన భవిష్యత్ప్రణాళికను నిర్ణయించామని బాబా చెప్పారు. ఆ సమావేశం తర్వాత బాబా భౌతికంగా చాలా నీరసించి పోయారు. బాబాతో నున్న అనుచరులకు కూడా బాబా వహించే విశ్వ కార్యపు భారం అర్థం కాకున్నా ఆ బాధల పర్యవసానంగా భౌతిక శరీరంలో వచ్చే మార్పులను గుర్తించగలిగేవారు.

## చలన చిత్ర నిర్మాణం

1932వ సం. మే మాసం నుండి ఆధ్యాత్మిక సత్యాలను బహిర్గతం చేసే ఒక చలనచిత్ర నిర్మాణాన్ని చేయించాలనే ప్రగాఢ వాంఛను ఆసక్తిని కనబరిచారు. ఈ చలనచిత్ర నిర్మాణమనే కారణంతో అమెరికా (లాస్ ఏంజిల్స్) లో చలనచిత్ర పరిశ్రమతో సంబంధం కలిగిన కార్ల్ వాల్ మొయిలర్, గ్యారెట్ ఫోర్ట్, గాబ్రియల్ పాస్కల్ మొదలగు వ్యక్తులు బాబా సంపర్కములోకి వచ్చారు. 1936వ సం. వరకు చలనచిత్ర నిర్మాణం గురించిన కార్యంలో పాల్గొని వీరు బాబాతో సాంగత్యం చేసారు. ఆ తర్వాత బాబా ఈ విషయంపై శ్రద్ధ వహించలేదు. 21.10.47వ



రోజున మళ్ళీ గాబ్రియల్ పాస్కల్, జీన్ అడ్రియల్, రాబర్ట్ క్లీర్‌తో కలిసి వ్రాసిన దృశ్యకావ్యాన్ని ఆధారంగా తీసుకొని అవతార్ అనే చిత్రాన్ని నిర్మించాలనే అభిలాష వ్యక్తం చేశాడు. కాని బాబా పూర్తిగా విరమింప జేశారు.

మెహెర్ బాబా ఒక్కొక్క సమయంలో ఒక్కొక్క కార్యక్రమంలో అమిత శ్రద్ధ చూపించేవారు. ఆ సమయంలో ఆ పనికి తప్ప వేరే ఏపనిపైనా ఆయన కాసక్తి లేనట్లుగా గోచరించేది. కొన్ని రోజులు, నెలలు లేదా సంవత్సరాల తర్వాత అమిత శ్రద్ధతో చేసిన ఆ పనిని పరిపూర్ణమైన బంధ రాహిత్యంతో నిలిపి వేసేవారు. బాహ్యంగా బాబా చేసే ఏ పని ఆయనకు ప్రాముఖ్యం కాదు. అది



పరంజా లాంటిది. ఆ కారణంగా ఆయన దరికి చేరిన వారి ద్వారా ఆధ్యాత్మిక జాగృతిని కలుగజేయడమే ఆయన నెరవేర్చే అసలు ప్రయోజనం. ఆయన ఏపని చేసినా పూర్తి శ్రద్ధతో సహజమైన ఆయన సమక్షంలో పరిపూర్ణతతో చేసేవారు. ఆధ్యాత్మిక ప్రయోజనం కోసం దైవీ మానవుడు గా అవతరించే పరమాత్మ ఈ విశ్వంలోని జీవన స్రవంతిని ఆ సమయంలో అన్ని విధాల త్వరితం చేస్తాడు.

మోహెర్ బాబా రెండవ సారి అమెరికాకు వెళ్ళినప్పుడు 30.05.1932 రోజున 'లాస్ ఏంజిల్స్ టైమ్స్' అనే పత్రికా సంపాదకుడు బాబాను కలుసు కొని కొన్ని ప్రశ్న లడిగాడు. ఆ సందర్భంగా 'మీరు అమెరికాలో ఏమి చేయ దలుచు కున్నారు?' అని బాబాను అడిగాడు. బాబా యిలా అన్నారు – 'యావత్తు మానవాళిని ప్రభావితం చేసే మేలు కొలుపు – అది నేటి ప్రపంచంలో చోటు చేసుకున్న నిర్లిప్తతను, అసంతృప్తిని లేకుండా చేస్తుంది'.

మరుసటి రోజు హాలీవుడ్‌లో నిక్కర్ బాకర్ అనే హోటల్‌లో బాబా కోసం స్వాగత సమావేశం ఏర్పాటు చేయబడింది. వేయిమంది ప్రముఖులు ఆ ప్రేమ సహవాసంలో పాల్గొన్నారు. వచ్చిన వారందరు బాబాకు పరిచయం చేయబడ్డారు. బాబాతో కరచాలనం చేసే అవకాశం పొందారు. బాబా ప్రకాశవంతమైన మందహాసంతో దివ్యసుందరమైన వీక్షణంతో అందరి దృష్టిని, హృదయాలను తన వైపునకు ఆకర్షించుకున్నారు. అందరు మంత్ర ముగ్ధులై, ప్రేమోన్మత్తులై బాబా సమక్షంలో నుండి ఆ హాలు విడిచి వెళ్ళ నిచ్చగించక పలికిన మాటలు ఆ హాలులో ప్రతిధ్వనించి ఆశ్చర్యము కలుగజేశాయి. ఆ మాటలు యిలా ఉన్నాయి.

– క్రీస్తు జీవించి ఉన్నట్లయితే ఆయన ఇలాగే ఉండేవారు.

– ఆయన వదనంలో ప్రకాశించే ఆ దివ్య తేజస్సు ఏమిటి?

– ఆయన ఈ ప్రపంచానికి చెందిన వారు కాదు.

– ఆయనే జీవించియున్న క్రీస్తు.

– ఆయన దివ్య ప్రభావం, ఆకర్షణ అమోఘమైనది.

– నాకు ఆయననే ఎప్పుడు చూస్తు ఉండాలనిపిస్తుంది.

– ఆయన సౌందర్యాన్ని చూచి నా కన్నులు మిరుమిట్లు గొలుపుతున్నాయి.

– నేను ఇక్కడి నుండి వెళ్ళలేను. నా జీవితంలో ప్రప్రథమంగా దివ్యత్వాన్ని చూచాను.

– విద్యుత్తు ప్రవహించినట్లు ఎంత ప్రభావితంగా ఉంది ఆయన స్పర్శ. నాలో విద్యుద్ఘాతము కలిగినట్లు తోచింది. భగవంతుడా! నేను నిశ్చేష్టుడనయ్యాను.

ఇలా ఎందరో ఆయన స్పర్శతో చలించి ముగ్ధులై ఆనందానుభూతిని పొంది భౌతిక ప్రపంచాన్ని మరచి పోయారు.

బాబా మొదటి పాశ్చాత్య దేశ పర్యటనలో లండన్ నగరంలో దర్శన మిచ్చారు. బాబా దర్శన కార్యక్రమము వార్తాపత్రికలలో ప్రకటించ బడింది. బాబా తాను మెస్సయ్య అని అంటున్నారని వ్రాశారు. ఆరోజు దర్శనానికి చాలా మంది వచ్చారు. ఆలస్యంగా వచ్చిన ఒక యువకుడు కుర్చీలు ఖాళీ లేక నిలబడియున్నాడు. బాబా తానే స్వయంగా ఆ యువకుడిని దగ్గరకు రమ్మని పిలిచారు. బాబా ఒక జాలరి. ప్రేమవల విసిరి తనకు కావలసిన వారిని దరికి చేర్చుకుంటాడు. ఆ యువకుడు ముందు ముందు బాబా సన్నిహిత మండలిలో నొకడు కాగలడని సర్వజ్ఞుడైన బాబాకు తెలుసు. కానీ ఆ యువకునికేమి తెలుసు? బాబా అనుసరించే రీతి కడు విచిత్రము గదా! ఆ యువకుడితో సంభాషణ యిలా సాగింది –

యువకుడు : ఏమిటి మీరు భగవంతుడా?

బాబా : అవును

యువకుడు : అయితే నా భవిష్యత్తును గురించి మీరేమైన చెప్పగలరా?

బాబా : ఓ – నాకంతా తెలుసు.

యువకుడు : మీరు భగవంతుడే అయితే నేను చేయబోయేదేమిటో చెప్పండి. మీరు చెప్పినట్లే అంతా జరిగితే మీరు భగవంతుడని నమ్ముతాను.

బాబా : నీ పేరు విలియమ్ డాంకిన్. నీవు వైద్యశాస్త్రము (మెడిసిన్) చదువుతున్నావు. ఆ చదువు పూర్తి చేస్తావు.

యువకుడు : ఏమిటి నేను మెడిసన్ పూర్తి చేస్తానా! ఆ తర్వాత

బాబా : హౌస్ సర్జన్‌గా మాత్రము నీకిక్కడ సీటు దొరకదు. ఎక్కడో మారుమూల గ్రామంలో దొరుకుతుంది.

యువకుడు : ఆ తర్వాత ఏం జరుగుతుంది?

బాబా : అది పూర్తయిన తర్వాత నీకు గవర్నమెంట్ ఉద్యోగం దొరుకుతుంది.


యువకుడు : ఆ తర్వాత ఏం చేస్తాను ?

బాబా : ఆ ఉద్యోగంలోనే ఇండియాకు వస్తావు. మళ్ళీ నన్ను చూస్తావు.

ఆ యువకుడు విలియమ్ డాంకిన్. బీదవాడు. ఆర్థిక పరిస్థితి బాగోలేక చదివే మెడిసిన్ మధ్యలో మానుకొనే పరిస్థితిలో బాబా చెప్పిన మాటలు విని ఆశ్చర్యం కలిగింది. బాబా చెప్పిన మాటలు తన డైరీలో వ్రాసుకున్నాడు. కొద్దిరోజుల తర్వాత వార్తాపత్రికలలో వచ్చిన వ్యక్తిగత ప్రకటన ప్రకారం ఒక ఊరికి వెళ్ళి విచారించగా ఆయన సుదూర బంధువైన ఒక వృద్ధవనిత చనిపోతూ తన ఆస్తికి డాంకిన్‌ను వారసుడుగా వ్రాసిపోయింది. అనుకోకుండా అదృష్టం కలిసివచ్చి ఆస్తి చేజిక్కడంతో చదువు పూర్తిచేశాడు. హౌస్ సర్జన్‌గా ఎంత ప్రయత్నించినా లండన్‌లో మాత్రం అవకాశం దొరకలేదు. మారుమూల గ్రామంలో హౌస్ సర్జన్ కోర్సు పూర్తిచేసి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ కూడా సంపాదించి ప్రభుత్వోద్యోగంలో చేరాడు. బాబా మాటలను మర్చిపోయాడు కూడా.

ఇంతలో రెండవ ప్రపంచ యుద్ధం వచ్చింది. ఆయనను మిలిటరీ డాక్టర్‌గా తీసుకొని ఆస్ట్రేలియాకు బదిలీ చేశారు. స్టీమర్‌లో బయలు దేరాడు. స్టీమర్ మధ్యధరా సముద్రం దాటి సూయజ్ కెనాల్‌లో ప్రయాణిస్తోంది. ఒక సాయంత్రం ఓడ డెక్ పైన తిరుగుతున్న డాంకిన్ మదిలో ఒక ఆలోచన తళుక్కుమంది. వెంటనే వెళ్ళి తన డైరీలో వ్రాసుకున్నది చదువుకున్నాడు. బాబా చెప్పిన మాటలన్నీ యదార్థమైనాయి. కాని బాబా ఇండియాకు వస్తావన్నాడు. తను ఆస్ట్రేలియాకు బదిలీ అయ్యాడు. బాబా దేవుడి నన్నాడు కదా! ఎలా అవుతాడు? ఆయన మాట తప్పింది కదా అనుకుని వెంటనే ఒక ఉత్తరం వ్రాసి పోస్ట్ చేయడానికి బయలుదేరాడు. ఇంతలో పోస్ట్‌మాన్ ఆయనను వెతుక్కుంటూ వచ్చి ఒక టెలిగ్రామ్ అందించి వెళ్ళాడు. 'ఆస్ట్రేలియాకు వేసిన ఆర్డర్ రద్దు చేశాం. ఇండియాకు వెళ్ళి బెంగుళూరులో మిలిటరీ హాస్పిటల్‌లో చేరవలసింది' అని ఉంది. డాంకిన్ నిర్ఘాంత





పోయాడు. అతని ఆశ్చర్యానికి అంతులేదు. బాబా చెప్పినవన్నీ నిజమైనవి. నిస్సందేహంగా బాబా భగవంతుడే అని నిర్ణయించుకున్నాడు. బెంగుళూరులో పనిలో చేరిన కొద్ది రోజులకే బాబా బెంగుళూరులోనే మస్తులకు, పిచ్చివాళ్ళకు ఆశ్రమాన్ని ఏర్పరచి ఉన్నారని తెలుసుకొని వెళ్ళి బాబా దర్శనం చేసుకున్నాడు. తరచుగా బాబా వద్దకు వెళ్ళేవాడు. కొన్నాళ్ల తర్వాత ఆయన కొక గట్టి ఆలోచన కలిగింది – దేవుడైన బాబాను వదిలి పెట్టి ఎంత సంపాదించి ఏమి చేసుకోవాలి? ఏమిటి ప్రయోజనం అని. బాబా సేవలోనే బాబా సమక్షంలోనే జీవితం గడపాలని నిర్ణయించుకున్నాడు. బాబాకు తెలియజేశాడు. 'నీవు ఉండలేవు, చాలా కష్టాలు పడవలసి వస్తుంది' అని అన్నారు బాబా. కానీ డాంకిన్ తన ఆలోచన వదలలేదు. అయితే నీ ఆస్తి అంతా నీ తల్లిదండ్రుల కిచ్చేసి కేవలం కట్టుకున్న గుడ్డలతో శిష్యుడుగా నా ఆశ్రమంలో ప్రవేశించు అన్నారు. డాంకిన్ అలాగే చేశాడు. ఆస్తినంతయూ త్యజించి జీవితంలో పెద్ద డాక్టర్‌గా సంక్రమించిన భోగాలను, సుఖాలన్నిటినీ వదులుకొని బాబా ఆశ్రమంలో ఒక మామూలు మనిషిగా చేరాడు. ఏ సౌకర్యము లేని జీవితం గడిపాడు. ఒకరోజు బాబా డాంకిన్‌ను పిలిచి కలకత్తాకు వెళ్ళి అక్కడ ఒక ఆసుపత్రి (క్లినిక్) పెట్టమని అదేశించారు. బాబా ఆదేశాన్ని శిరసావహించి ఎవరూ పరిచయం లేని కొత్త నగరానికి చేతిలో డబ్బు లేకున్నా ఒక డాక్టర్‌ని ఆశ్రయించి ఆయన భవనంలోనే ఆసుపత్రి ప్రారంభించాడు. కొద్దిరోజులలోనే ఆయన ప్రాక్టీస్ దినదినాభివృద్ధి పొందింది. మళ్ళీ డబ్బు, పేరు సమకూరాయి. వెంటనే అన్నీ వదిలి రావలసిందిగా బాబా ఆదేశించారు. సంపాదించినవన్నీ తనకాశ్రయమిచ్చిన డాక్టర్ గారికిచ్చేసి బాబా వద్దకు చేరాడు. మరి కొద్ది రోజుల తర్వాత బాబా డాంకిన్‌ను పిలిచి బొంబాయికి వెళ్ళి అక్కడ చాకలి దుకాణం (లాండ్రీ) నడపమని, దుస్తులు అతడే స్వయంగా ఉతకాలని చెప్పారు. బాబా ఆజ్ఞ ప్రకారం డాక్టర్ బొంబాయికి వెళ్ళి చాకలి వృత్తి చేపట్టాడు. ఆయన స్వయంగా ఉతకాల్సి వచ్చినందున తనకు చేతనైనంత పనిని మాత్రమే స్వీకరించి శ్రమించాడు. ఆ వృత్తి కూడా రాణించి డబ్బు, పేరు సమకూర్చుకున్నాడు. ఆ వృత్తి కూడా మాని రావలసిందిగా బాబా కబురు చేశారు. వెంటనే అన్నింటినీ వదిలి వెళ్లి

బాబా చెంత చేరాడు. 'నా పని అహంకార నాశనం' అన్నారు బాబా. ఆయన చేసే పనుల కర్థం సామాన్య మానవ మేధస్సుకు గోచరించదు. మనస్సు ద్వారా తర్కించడం మానివేసి బాబా ఆజ్ఞలను విధేయతతో నెరవేర్చి బాబాకు ప్రీతిపాత్రుడైన డా. డాంకిన్ ధన్యజీవి.

అవిశ్రాంతంగా జరిపిన ప్రపంచ పర్యటనల పర్యవసానంగా బాబా ప్రాక్పశ్చిమ దేశాలకు ఆధ్యాత్మిక సంబంధాలను ఏర్పరచి దృఢపరిచారు. విశ్వకార్యంలో తనకు తోడ్పడేందుకు దరిజేర్చారు. అర్హత ప్రకారం అందరికీ తన ప్రేమను పంచి వారి హృదయాలను తేలిక పర్చారు. భౌతికవాదంతో కరడు గట్టిన వారి హృదయ క్షేత్రాలను తన ప్రేమ ప్రవాహంలో ముంచి ప్రేమ బీజాలు నాటారు. ఎంతో మంది పాశ్చాత్యులు భారతదేశం వచ్చి బాబాకు సర్వార్పణ చేసుకొని ఆయన విశ్వ కార్యంలో తోడ్పడ్డారు. డా. విలియమ్ డాంకిన్ మరియు ఫ్రాన్సిస్ బ్రాబజాన్ వారిలో ముఖ్యులు. హాలీవుడ్ సినిమా తారలు, నిర్మాతలు బాబా దర్శనం చేసుకొని ఆయన ప్రేమలో తన్మయత్వం పొందారు. తల్లూలా బాంక్ హెడ్ వారిలో ముఖ్యురాలు.

## మస్తు కార్యక్రమం

సాధారణంగా ప్రాపంచిక విషయాలపై విరక్తి కలిగినవారికి సత్యాన్వేషణకై (భగవదైక్యానికై) తపన పెరుగుతుంది. అట్టి వ్యక్తి ఆధ్యాత్మిక మార్గంలో అడుగు పెడతాడు. సంసిద్ధత అర్హతలను బట్టి అతనికి సప్తజ్ఞాన భూమికల అనుభూతి కలుగుతుంది. ప్రాపంచిక చైతన్యము లుప్తమై సూక్ష్మ మనో ప్రపంచాలతో అనుభూతి ద్వారా సంబంధ మేర్పడి సప్త భూమికల కాధార భూతమైన శక్తి జ్ఞానానందములను ఎరుకతో అనుభవిస్తాడు. ఆ ఆనందానుభూతిలో ప్రపంచ స్మృతి కోల్పోతాడు సాధకుడు. వారే మస్తులు అనబడే సాధకులు అందుకే మస్తులు పిచ్చివారి లాగా సాధారణ మానవులకు కనిపిస్తారు కాని ఆధ్యాత్మికంగా అభివృద్ధిచెందిన ఉన్నతాత్మలు. అందుకే వారిని అసహ్యమైన పంజరాలలో చిక్కుకున్న అందమైన ఆత్మలు అన్నారు బాబా. మస్తులు బాహ్యప్రపంచము, భౌతిక శరీరాలకు



సంబంధించిన స్మృతి కోల్పోయి నందున వారు ఆధ్యాత్మిక మార్గంలో పురోగమించలేక ఉన్న స్థితిలోనే నిలిచిపోతారు. కావున బాబా చేసిన మస్తు కార్యక్రమంలో సిద్ధించిన ప్రయోజనాలు రెండు. ఒకటి వారిని వారు చిక్కుకున్న స్థితినుండి పై స్థితి చేరుకునే ప్రయాణానికి సంసిద్ధులుగా చేయుట. రెండవది బాబా అవతార కార్యమైన విశ్వమానవ జాగృతికి ఎరుకతో వారు తోడ్పడునట్లు చేయుట. కొంతమంది మస్తులు తమ స్థితినుండి బాహ్య స్మృతికి రావడానికి బాబా విశ్వకార్యంలో భాగస్వాములవడానికి నిరాకరించే వారు. కాని బాబా సహనంతో వారిని కలిసి తన స్పర్శతో సహనాసంతో వారిని సంసిద్ధులుగా చేసేవారు. ఈ మస్తులలో జమాలీ మరియు జలాలీ ముఖ్యమైన తెగలు. జమాలీ మస్తులు శాంతంగా వినమ్రులై ఉంటే జలాలీ మస్తులు దురుసుగా కోపోద్రిక్తులై ఉంటారు. సప్తజ్ఞాన భూమికలలో నుండే బాటసారులు 7000 మంది. అందరూ మస్తులుగా నుండ వలసిన అవసరం లేదు.

మనస్సు వేగంగా పని చేస్తే – పిచ్చి వాడు.

మనస్సు మామూలుగా పని చేస్తే – సాధారణ మానవుడు.

మనస్సు నెమ్మదిగా పని చేస్తే – మస్తు.

మనస్సు పూర్తిగా నశిస్తే – దేవుడు.

అని బాబా మానసిక స్థితుల గురించి వివరించారు. ప్రేమోన్మత్తులైన ఈ మస్తులకు శీత వాతా తపముల బాధలుండవు. వీరు సంవత్సరముల తరబడి స్నానము చేయక పోయినను, తిండి తినకపోయినను, ఎండవానల నుండి రక్షణ

లేక పోయినను, వారి ఆరోగ్యము చెడదు. వీరిలో చాలా మంది పట్టణములలో నివసించే వారు. చింపిరి గుడ్డలు కట్టుకొని, చింపిరి గుడ్డల మూటలను చంకలో బెట్టుకొని దుర్గంధమున కాలవాలమైన ప్రదేశాలలో నివసిస్తారు. బాబా వీరి కొరకు రాహూరీ, అజ్మీర్, జబల్పూర్, రాంచి, సతారా, మహాబలేశ్వర్, నాసిక్, మెహెరాబాద్, బెంగుళూరు మొదలగు పలు ప్రదేశాలలో ఆశ్రమాలు స్థాపించారు.

మస్తులతో పాటు పిచ్చివారిని కూడా చేర్చుకొని బాబా వారికి కూడా సేవలు



చేశారు. వారితో కొద్ది గంటలు సహవాసం చేసి వారికి స్నానం చేయించి క్రొత్తగుడ్డలు తొడిగి తన స్వహస్తాలతో అన్నం తినిపించేవారు బాబా. వారి శౌచాలయాలు కూడా బాబా శుభ్రం చేశారు. వారిని సంసిద్ధులను చేయుటకు అడిగింది యిచ్చి పుచ్చుకొనే వారు. ఒకసారి రాహూరీలో ఒక మస్తు అభీష్టాను సారము బాబా ఒకటి తర్వాత ఒకటి పన్నెండు కప్పుల టీ త్రాగవలసి వచ్చింది. రెండు కప్పుల తర్వాత బాబా మళ్ళీ మళ్ళీ త్రాగుతున్నట్లు నటించవలసి వచ్చింది.

1937వ సం. లో బాబా పాశ్చాత్యుల కొరకు నాసిక్‌లోఆశ్రమము స్థాపించారు. బాబాతో ఉండడానికి వచ్చిన పాశ్చాత్య ప్రేమికులను ఆశ్రమంలో ఉంచారు.

1940 దశకంలో బాబా మస్తు సాంగత్యం చేసే కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు. 1949వ సంవత్సరం వరకు అవిరామంగా భారతదేశంలోని పలు పట్టణాలకు వెళ్ళి అనేక వేల మైళ్ళ దూరం బస్సుల్లో, రైళ్ళల్లో, టాంగాలలో, కాలినడకన ప్రయాణించి మస్తుల సాంగత్యం చేశారు. ఈ సమయాల్లో బాబా దీర్ఘకాలిక ఉపవాసాలు చేసేవారు. ఈ ప్రయాణాలకు ప్రత్యేకంగా తయారు చేయించిన బస్సును ఎలిజబెత్ పాటర్సన్ నడిపింది. ఈ మస్తుల సాంగత్యం గురించి బాటసారులు (ది వే ఫేరర్స్) అనే గ్రంథంలో డా. విలియన్ డాంకిన్స్

వివరంగా తేదీలతో పాటు ప్రచురించారు. అహమద్ నగర్‌లోని అలీషా, నాగపట్నంకి చెందిన చట్టిబాబా, రత్నగిరినుండి తెచ్చిన మహమ్మద్ మస్తు బాబాకు ప్రీతిపాత్రులలో ముఖ్యులు. ఇప్పటికీ బాబా అభీష్టం మేరకు మహమ్మద్ మస్తును మెహెరాబాద్‌లోనే ఉంచారు. మస్తులు ఉన్నతాత్మలు ఆధ్యాత్మిక పథంలో పురోగతి సాధించిన వారు. బాబా వారి సాంగత్యం చేసినప్పుడు బాబాను చూడగానే వారు బాబా దివ్యత్వాన్ని గుర్తించడం సహజం. పంచ సద్గురువుల తర్వాత బాబా దివ్యత్వాన్ని ప్రకటించే పాత్ర దానికి అర్హత గలవారు మస్తులే. వారు బాబా గురించి అన్న మాటలలో బాబా యొక్క దివ్యత్వం వ్యక్తమవుతుంది. ఈ క్రింది సంఘటనలు దానికి నిదర్శనాలు:

1. 1946వ సంవత్సరములో అక్టోబర్ 14వ తేదీన బాబా (మధురాలో) ఆజీమ్ ఖాన్ అనే మస్తును కలుసుకొన్నారు. అతడు ఉన్నత దశలో ఉన్న ఒక మస్తు. బాబాను చూసి 'నీవు అల్లావు – ఈ సృష్టి నీవల్లనే వచ్చింది – వేయి సంవత్సరాల కొకసారి నీచే సృజింపబడిన ఈ జగన్నాటకాన్ని చూడటానికి వస్తుంటావు' అని చెప్పాడు.

2. అదే రోజు బాబా బ్రహ్మానందజీ అనే మస్తును కలిసారు. ఇతను ఐదవ భూమికలో నున్న ఉన్నతాత్మ. ఇతను బాబా పాదాలను తాకి – 'కృష్ణ పరమాత్మని నా వద్దకు గొని తెచ్చిన ప్రేమ ప్రభావము ఎంతటి ఆశ్చర్యకరమైనది? పూర్ణ పురుషుడు ఇచ్చుట ప్రత్యక్షమైనాడు' అని చెప్పి తన తలదిండు క్రింద ఉన్న 'ఫర్‌ఫెక్ట్ మాస్టర్' అనే పుస్తకాన్ని తీసి తెరచి దానిలోని బాబా చిత్రపటాన్ని ఒకదాన్ని చూపించారు.

3. 1942వ సం.లో బాబా మురాదాబాద్‌లోని మౌలానా షంషొద్దీన్ ఉలేమీ అనే ఆరవ భూమికలోని మస్తును రాత్రి కలుసుకొన్నారు. అతను నిద్రనుండి లేచి ఆ చీకటిలో బాబాను చూచి 'నిశా సమయంలోని చీకటిలో భగవంతుని ప్రకాశాన్ని చూస్తున్నాను' అన్నాడు.

మస్తులకు ఆంతరంగికంగా బాబా దివ్యత్వం అనుభవైక వేద్యమే. వారిలో కొందరు బాబా వద్దకు రావడానికి అంగీకరించే వారు కాదు. మార్చి 1941 లో

క్వెట్టాలోని నాదిర్ అలీ షా అనే మస్తును బాబా వద్దకు రమ్మని పిలువగా ఆయన ఇలా అన్నారు. 'నా నావ ఆ అనంత సముద్రంలో మునిగి లీనమై పోతుంది' – బాబా యొక్క స్పర్శతో ఆయన తన శరీరాన్ని వదిలి అనంతానందంతో ఏకమై పోతానని చెప్పారు.

1942వ సంవత్సరంలో బాబా మండలిలో ఒకరైన కాకా బొంబాయిలోని పఠాన్ మస్తును బాబా వద్దకు రావలసిందిగా కోరాడు. ఆయన కాకాతో యిలా అన్నాడు 'నీ ఆత్మ, నా ఆత్మ రెండూ బాబాలోనే ఉన్నాయి – అక్కడికి రావలసిన అవసరం ఏమిటి?' ఆ మస్తు బాబాకు ఒక కమలా ఫలం యిచ్చి ఇలా చెప్పాడు 'ఈ సృష్టి యొక్క తాళము చెవి బాబా చేతిలో ఉంది. రష్యా, జర్మనీ మొదలగు దేశాలన్నీ ఆయన ఆదేశానుసారం నడచుకుంటాయి'. బహుశా జర్మనీ దేశాల విలీనం, రష్యాలో జరిగిన సాంఘిక విప్లవాలు ఆ రోజే ఆ మస్తు ఇవన్నీ బాబా ఆదేశానుసారం జరుగుతాయంటూ ఈ రెండు దేశాల పేర్లు చెప్పాడేమో!

కొంత మంది మస్తులు బాబాను చూడగానే ఆనందాతిశయంతో తన్మయత్వంతో నృత్యం చేసేవారు. 1939వ సంవత్సరంలో బాబా స్త్రీ మండలి వారితో మధురాలోని బృందావనంలో గల ఆలయం వద్దకు వెళ్ళారు. అక్కడ నున్న ఒక మస్తు, తన చేతిలోని పిల్లన గ్రోనిని మ్రోగిస్తూ, నృత్యం చేస్తూ 'రండి, చూడండి. కృష్ణుడు తన గోపికలతో వచ్చాడు' అని గట్టిగా అరుస్తూ చెప్పాడు. అతడు తన నిజమైన ప్రేమికుడు అని బాబా చెప్పాడు. అదే సంవత్సరంలో బాబా ఒక రోజు అజ్మీర్ వీధుల్లో మస్తుల సాంగత్యం కోసం తిరుగుతున్నాడు. 'ఓహోహో! సాక్షాత్తు శంకరుడే వచ్చాడు – రండి – అందరూ రండి – వచ్చి దర్శనం చేసుకోండి' అని అరిచాడు ఆ మస్తు.

బాబా ఈ అవతారంలో చేసిన మస్తు కార్యక్రమం అనిర్వచనీయమైనది. ఆధ్యాత్మికంగా ఉన్నత దశలో నున్న మస్తుల జీవితాలు, ప్రపంచంలో జరిగే సంఘటనలతోను, సమకాలీన మానవుల స్థితి గతులతోను సంబంధం కలిగి ఉంటాయి. 1940వ సం.లో మెహెరాబాద్‌లో చట్టీబాబా అనే మస్తును నాగపట్టణం

నుండి బెంగుళూరు ఆశ్రమం ద్వారా తీసుకొని వచ్చి ఉంచారు. ఆ సమయంలో చట్టీ బాబా అక్షరాస్యుడైనాగాని దినపత్రికలు ఎప్పుడూ చదివేవాడు కాదు. ఎప్పుడూ చట్టీబాబా క్రిష్ణతో ఇలా చెప్పేవాడు. 'ఐరోపా దేశ ప్రజలు చాలా బాధల్లో ఉన్నారు. అయినా ముమ్ముందు గడపవలసి యున్న ఆనంద మయమైన సమయం కోసం జీవించి యుంటారు' ఆ సమయంలో రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతోంది. ఐరోపాలోని అన్ని దేశాలపై జర్మన్ సైన్యాలు దాడి జరిపి భీభత్సం సృష్టించాయి. 1940వ సం. జూన్ 9వ తేదీ రాత్రి చట్టీబాబా తన చిన్నగదిలో నుండి బయటకు వచ్చి బాధతో గాభరాతో అరుస్తూ నేరుగా బాబా గది వద్దకు వెళ్ళి 'నా యిల్లు నాశనమైపోయింది – నాకు రక్షణ కల్పించు' అని అరిచాడు. ఆయన గది ఉన్నట్లుగానే ఉంది. ఏమీ మార్పు లేదు. చట్టీబాబా ఎందుకు అలా అరుస్తున్నాడో ఎవరికీ అర్థం కాలేదు. కొంతసేపు చట్టీబాబాను తన సమక్షంలో ఉంచుకొని బాబా అనునయించాడు. కొంతసేపటి తర్వాత చట్టీబాబా ఉపశమించాడు. మరుసటి రోజు బాబా ఈ విషయంలోని రహస్యం తెలియజేస్తూ చట్టీబాబాకు ఫ్రాన్స్ నగరంతో సంబంధం ఉందని, ఫ్రాన్స్‌లో జరిగే సంఘటనల వల్ల ఆయనలో అలాంటి ప్రవర్తన కలిగిందని చెప్పారు. రెండవ ప్రపంచ యుద్ధ సంఘటనలను పరిశీలిస్తే ఫ్రాన్స్ నగరాన్ని జర్మన్ సైన్యాలు జూన్ ఐదవ తేదీ నుండి ముట్టడించి ఎనిమిది రోజుల తర్వాత 13వ తేదీన ఫ్రాన్స్‌లో ప్రవేశించాయి.

చట్టీబాబాకు రోజు 150-200 బకెట్ల నీటితో బాబా స్నానం చేయించే వారు. స్నానం చేయగానే తలపై మట్టి చల్లుకునేవాడు చట్టీబాబా. దీనికి చట్టీబాబా గదిలో మట్టిని కూడా గంపలలో పెట్టి ఉంచేవారు. చట్టీబాబా బాబాను 'పెద్దన్నయ్య' అని పిలిచేవాడు. 'నా పెద్దన్నయ్య ప్రపంచంలో ఇంకా చాలా పని చేయాల్సి ఉంది. నాకు బాబా చేసే పనిని చేసే శక్తి లేదు' అని చెప్పేవాడు చట్టీబాబా. చట్టీబాబా సంరక్షణ చూస్తూ ఉన్న కృష్ణతో ఒక రోజు చట్టీబాబా ఇలా అన్నాడు –

'నీవు బాబాను వదిలి పోదామనుకుంటున్నావా? ప్రపంచమంతా బాబాలోనే ఉంది. ఆయన లేని చోటేలేదు. ఎక్కడికి వెళతావు? బాబా సేవ చేయి. ఆయన అవధులు లేని ప్రేమసాగరం. వేల మంది ఆయన దర్శనం కోసం ముమ్ముందు

వస్తారు . అప్పుడు ఆయనను దర్శించే భాగ్యం కూడా లభించదు'.

బాబా సాంగత్యం వల్ల మస్తులు పొందే ఆధ్యాత్మిక ప్రయోజనం మాటలతో చెప్ప లేనిది. బాబా దర్శన భాగ్యంతో వారి జన్మకు ప్రయోజనం సిద్ధించడంతో కొందరు మస్తులు వెంటనే శరీరం వదిలేసే వారు. గంగా తీరంలో నంగావాలా బాబా అనే మస్తు ఒంటికాలిపై నిలబడి తపస్సు చేస్తూ ఉండేవాడు. ఆరు నెలల కొకసారి కాలు మార్చుకునే వాడు. బాబా హరిద్వార్‌లో బసచేసి అక్కడి నుండి టాంగాలో నంగాబాబాను కలుసుకోవడానికి వెళ్ళారు. నంగాబాబా గంగానదీ తీరంలో ఒంటి కాలిపై తపస్సు చేసుకుంటున్నాడు. వెనక వైపునుండి బాబా వెళ్ళి నిలబడ్డారు. వెంటనే నంగాబాబా వెనుదిరిగి రెండు కాళ్ళు నేలపై మోపి సాష్టాంగపడి బాబాకు ప్రణామం చేసి 'హే భగవాన్! ఇన్నాళ్ళకి నాపై దయ కలిగిందా!' అని గట్టిగా అరిచాడు. బాబా అతని వద్దకు వెళ్ళి భుజంపై తట్టి 'మన పని అయి పోయింది – పద' అని కృష్ణతో పాటు బాబా తిరిగి వెళ్ళిపోయారు. తన శిష్యులతో నంగాబాబా 'మెహెర్‌బాబా తన కంటె మహిమాన్వితుడని, దైవస్వరూపుడని, తన తర్వాత ఆయననే ఆశ్రయించ' మని చెప్పాడు.

రెండు రోజుల తర్వాత బాబా కృష్ణను వెళ్ళి నంగాబాబా శిష్యులను కలుసుకోమన్నాడు. వారు తన వద్దకు రానవసరం లేదని వారి గురువు గారు చెప్పినట్లు నడుచుకుంటూ అక్కడే ఉండమన్నానని తన ఆదేశంగా చెప్పమన్నారు. ఎందుకు తనను వెంటనే బాబా వెళ్ళమంటున్నారో కృష్ణకు బోధపడలేదు. రెండు రోజుల క్రితమే వెళ్ళి వచ్చాము కదా – ఈ చెప్పే మాటలు అప్పుడే చెప్పి ఉండవచ్చు కదా అనుకున్నాడు. కాని బాబా ఆజ్ఞను శిరసావహించి నంగాబాబా ఆశ్రమానికి వెళ్ళాడు. కృష్ణను చూడగానే నంగా బాబా శిష్యులు లేచి వచ్చి తమ సమస్య ఆయన రావడంతో తీరిపోయిందని చెప్పారు. వారి గురువు గారు శరీరం వదిలేశారు. వారి గురువు గారి మాట ప్రకారం మెహెర్‌బాబా వద్దకు వెళ్ళాలని నిశ్చయించుకున్నారని, మెహెర్‌బాబా ఎక్కడ ఉన్నదీ తెలియక ఏమి చేయాలో తోచని స్థితిలో ఉండగా కృష్ణ రావడంతో తమ సమస్య పరిష్కారమైందని చెప్పారు. బాబా మాటలు వారికి చెప్పి తిరిగి వచ్చాడు. బాబా సర్వజ్ఞుడు. ఆయన కన్నీ తెలుసు కాని ఆయన విధానం చాలా

గుప్తంగా చిత్రంగా ఉంటుంది. కృష్ణను పంపే ముందే బాబాకు నంగాబాబా శరీరం వదిలేసినట్లు తెలిసినా చెప్పలేదు. ఆశ్రమానికి వెళ్ళిన తర్వాత కాని కృష్ణకు నంగాబాబా మరణం గురించి తెలియలేదు. అంతవరకు ఆయన మనస్సులో ఎన్నో ఆలోచనలు వచ్చాయి. బాబా దర్శన భాగ్యంతో సిద్ధించిన జీవితాశయంతో నంగాబాబా తనువు చాలించాడు.

## విశ్వ ఆధ్యాత్మిక కేంద్రం

మస్తుల కార్యక్రమంలో భాగంగా బాబా హైదరాబాదు, బెంగుళూరు నగరాలను దర్శించారు. బెంగుళూరులో మస్తుల ఆశ్రమం కూడా నిర్వహించారు. ఆ సమయంలో బాబా ఒక విశ్వ ఆధ్యాత్మిక కేంద్రాన్ని నెలకొల్పాలనే అభిలాషను వెలిబుచ్చారు. దాని కోసం హైదరాబాదు నగర శివారు ప్రాంతంలో కూడా ఒక స్థలాన్ని బాబా చూశారు. ఆ స్థలం రెండు తటాకాల మధ్యలో అడవిలో కనుగొన్నారు. జీసస్ క్రీస్తు శిష్య పరం పరలో ఒకడు జీసస్ యొక్క చొక్కాను భద్రపరుచుకొని ఆ స్థలంలో ఉండేవాడట. అతని గురువుగారు మరణించే ముందు ఆ చొక్కాను అతని కిచ్చి ఎట్టి



పరిస్థితులలోను ఆ స్థలాన్ని వదిలి పోవద్దని, ఒక వేళ వదిలిపోయే పరిస్థితి ఏర్పడితే జీసస్ ధరించిన ఆ చొక్కాను ఆ స్థలంలో పాతిపెట్టి వెళ్ళిపోవలసిందిగా ఆదేశించారు. ఆ శిష్యుడు అక్కడ నివసించే సమయంలో ఆ అడవి ప్రాంతానికి ఆధిపత్యం వహించే నవాబు సైనికులను పంపించి అక్కడినుండి అతనిని వెళ్ళి

పోవలసిందిగా ఆజ్ఞాపించాడు. కాని అతడు నిరాకరించాడు. నవాబు పంపిన సైనికులందరూ అతని ముందుకు వెళ్ళగానే వినమ్రులై అతనికి నమస్కరించి వెనుదిరిగి వచ్చేవారు. అది విని నవాబు స్వయంగా వెళ్ళి అతని దివ్యత్వానికి వశుడై ఆయన ఇష్టానుసారం అక్కడే ఎంతకాలమైనా ఉండవచ్చునని కోరుకున్నాడట. కాని పరిస్థితుల ప్రభావం వలన అతడాస్థలం విడిచిపోతూ తన వద్దనున్న ఆ జీసస్ చొక్కాను భూ స్థాపితం చేసి వెళ్ళిపోయాడు. బాబా ఆ స్థలంపై మక్కువ చూపడానికి అదే కారణం కావచ్చునని ఎలిజబెత్ పాటర్సన్ ఆ స్థలం చూసివచ్చిన తర్వాత అభిప్రాయపడ్డారు.

కాని బాబా విశ్వ ఆధ్యాత్మిక కేంద్రానికి బెంగుళూరు సమీపంలో మైసూరు రోడ్డులో గల బిదడి నుండి 7 కి.మీ. దూరంలో గల బైరామంగళ వద్ద స్థలాన్ని నిర్ణయించారు. ఆనాడు మైసూరు రాజ్యానికి దివానుగా నున్న మీర్జా ఇస్మాయిల్ బాబా తలపెట్టిన విశ్వ ఆధ్యాత్మిక కేంద్రం కొరకు బైర మంగళ వద్ద 430 ఎకరాల స్థలాన్ని మంజూరు చేశారు. ఆ కేంద్రానికి బాబా 1939వ సంవత్సరం డిసెంబర్ 17వ తేదీన తన స్వహస్తాలతో శంఖుస్థాపన చేశారు. వృత్తాకారంలో ఐదుగురు సద్గురువులకు, జోరాష్టర్‌తో మొదలుకొని బాబా వరకు 7 అవతారాలకు మొత్తం కలిపి 12 ఆలయాలకు 12 గదుల నిర్మాణం ప్రారంభించారు. దీనిలో 9 గదులు మాత్రం పూర్తి చేయబడినవి. అవి రెండవ ప్రపంచ యుద్ధం జరిగే రోజులు. మొదటి ప్రపంచ యుద్ధాన్ని షిరిడీ సాయిబాబా పర్యవేక్షించి నడిపించారు. రెండవ ప్రపంచ యుద్ధాన్ని మెహెర్ బాబా నడిపించారు. ఆ కార్యక్రమంలో భాగంగానే బాబా బైరా మంగళలో చేపట్టిన విశ్వ ఆధ్యాత్మిక కేంద్ర నిర్మాణ కార్యక్రమం. ఆంతరంగికంగా బాబా చేసే



కార్యక్రమం మన అవగాహన కతీతమైనది. ఆంతరంగిక కార్యక్రమానికి చేపట్టే కార్యక్రమాలు జరుపబడేవి. ఆంతరంగికంగా ఆయన ఆశించిన పని నెరవేరగానే బాహ్య కార్యక్రమాలు ఆపివేయబడేవి. ఇది కేవలం బాహ్య కార్యక్రమాన్ని మాత్రమే చూడ గలిగే అనుచరులకు వింతగా తోచేది.

రెండవ ప్రపంచ యుద్ధం జరిగే రోజులలోనే బాబా మెహెరాబాద్‌లో మతి స్థిమితం లేని పిచ్చివారికొక ఆశ్రమం ఏర్పాటు చేశారు. మస్తుల ఆశ్రమంలాగే పిచ్చివారికి మానసిక రోగాలతో బాధపడే వారికోసం కూడా బాబా ఆశ్రమాలు నెలకొల్పారు. మానసిక రుగ్మతలతో బాధపడే వారిని కలిపి ఉంచి నిగ్రహించడం చాలా కష్టమైన పని. బాబా తన దివ్య ప్రేమతో పిచ్చివారిని సైతం ఆశ్రమంలో కలిపి ఉంచడమే గాక వారితో 'రాజా గోపీ చంద్' అనే నాటకాన్ని వేయించారు. ఆ పిచ్చివారికి ప్లీడర్ శిక్షణ నిచ్చారు. ఆ నాటకాన్ని చూడటానికి బాబా ప్రేమికులను పిలిపించారు. ఎంత శిక్షణ యిచ్చినా పిచ్చివారు స్టేజీపైన ఏమి చేస్తారో అనే అనుమానం ఉండేది. కాని బాబా సమక్షంలో ఆయన దివ్యప్రేమ ప్రభావంతో వారు నాటకాన్ని విజయవంతంగా ప్రదర్శించారు. ఈ ప్రక్రియను కూడా పరోక్షంగా బాబా రెండవ ప్రపంచ యుద్ధ పరిణామాలను నిగ్రహించడానికి ఉపయోగించారు.

అమృతం కోసం సముద్రమథనం చేసే సమయంలో అమృతానికి ముందు హాలాహలం బయల్వెడలింది. అందరూ వెనుదిరిగారు. ఆ విషాన్ని శివుడు ద్రింగి తన కంఠంలో నిలుపుకొన్నాడట. అలాగే అవతార్ మెహెర్ బాబా విశ్వమానవులను బాధలనుండి విముక్తులను చేయడానికి తన శరీరం ద్వారా బాధలననుభవించి సమాజంలో ప్రేమకు నోచుకోని వ్యాధి పీడితులను మానసిక రోగులను పేదవారిని చేరదీసి, ప్రత్యక్షంగా సేవచేసి పరోక్షంగా వారి స్థితిని విశ్వ వ్యాప్తంగా బాగు చేయడానికి శ్రమించారు.

బైరమంగళలో బాబా ప్రారంభించి వదిలి వేసిన విశ్వ ఆధ్యాత్మిక కేంద్ర పునరుద్ధరణ 1983లో కె.కె. రామకృష్ణన్ గారికి బాబా కలుగజేసిన ప్రేరణ వల్ల చేపట్టబడింది. అసంపూర్తిగా మిగిలిన గదులు, కేంద్ర స్థానంలో వలయా కారంలో

ఒక హాలు శిఖరము (డోమ్) నిర్మించబడ్డాయి. పరాధీనంలో ఉన్న స్థలాన్ని కొని నిర్మాణాలు గావించబడ్డాయి. 1939లో బాబా వద్ద బెంగుళూరులో వాచ్‌మన్‌గా చేరి సేవ చేసిన వెంకోబారావు ఆయన కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో శ్రద్ధ వహించి ఈ కేంద్రాభివృద్ధికి పాటుబడుతున్నారు. కేంద్ర స్థానంలో నిర్మించిన కట్టడము యొక్క ప్లాను ఆర్కిటెక్ట్ తన స్వంత ఊహతో తయారు చేశారు. ఆ ప్లాను 1939లో బాబా తయారు చేయించిన ప్లానుకు ('గ్లో' పత్రిక సంపాదకుని ద్వారా లభ్యమైనది) సరిపోయేదిగా ఉండటం అందరికీ అశ్చర్యాన్ని కలిగించి బాబా ప్రేరణ వల్లనే పునరుద్ధరణ జరిగిందనే విశ్వాసాన్ని కలుగజేసింది.

## మెహెరాజాద్

బాబా 1923వ సంవత్సరంలో మెహెరాబాదును కేంద్ర స్థానంగా ఎన్నుకున్న తర్వాత ప్రపంచ పర్యటనలు, మస్తుల కొరకు చేసిన పర్యటనల కాలంలో కూడా 26 సంవత్సరాల కాలం బాబా విశ్వకార్యక్రమానికి కేంద్రంగా ఉన్నది మెహెరాబాద్.





1944వ సంవత్సరంలో బాబా మకాము మెహెరాబాదు నుండి మెహెరాజాదు (పింపలగావ్) కు మార్చారు. అది అంతకు ముందు ఒక గుఱ్ఱపుశాల. ఎడారిలో ఒయాసిస్సులాగా అందమైన తోట తో నిరాడంబరమైన చిన్న గృహాలతో అనంతుని నివాసానికి అనువైన స్థలంగా ఎన్నుకోబడిన మెహెరాజాద్ నేటికీ బాబా ప్రేమిక

లోకానికి అమరధామం. బాబా దర్బారు నిర్వహించే మండలి హాలు, బాబా నివాసగృహం నేటికి ప్రేమికులకు బాబా నిర్వహించిన కార్యక్రమాల గత స్మృతులను గుర్తు చేస్తాయి.

## నవజీవనం

బాటసారుల వలె భిక్షాటన చేస్తూ రేపటి గురించిన ఆలోచన లేకుండా ఏదీ ఆశించక ఏ సహాయాన్నర్థించకుండా ఎక్కడికి వెళ్తాము, ఎప్పుడు తిరిగి వస్తాము అనే ఆలోచన లేకుండా గడిపే 'నవజీవనాన్ని' 16.10.1949 రోజు నుండి ప్రారంభించనున్నట్లు బాబా రెండు మాసాల ముందుగానే తెలియచేసి అందరినీ సమావేశపరిచి ఈ నవజీవనంలో ఆయనతో వెళ్ళదల్చుకున్నవారి అభిమతాన్ని సేకరించారు. అన్ని ఏర్పాట్లు చేయించారు. ఈ నవజీవనాన్ని విశదీకరిస్తూ బాబా క్రింది సందేశాన్ని యిచ్చారు. బాబా గడిపిన ఈ నవజీవన ఘట్టం రామావతారంలోని 14 ఏళ్ళ అరణ్య వాసాన్ని తలపిస్తుంది.

'ఈ నవజీవనం అనంతమైనది. నా భౌతిక మరణానంతరం కూడా ఈ నవజీవనం ఎవరు భ్రాంతి, అసత్యము, ద్వేషము, క్రోధము, లోభము మరియు కామమును పూర్తిగా త్యజించిన జీవనము గడిపెదరో మరియు అట్టి జీవనము గడుపుటకు ఎవరు కామపూరితమైన పనులు చేయరో, ఎవ్వరికీ ఎట్టి హాని కలుగజేయరో, పరోక్ష నిందలు చేయరో, ప్రాపంచిక సంపదలను అధికారాన్ని కాంక్షించరో, ఎవరు ఎట్టి మర్యాదల నంగీకరించరో, సత్కారముల కుప్పొంగి, అవమానముల తిరస్కరించరో, ఎవరికీ దేనికీ భయపడరో, ఎవరు సంపూర్ణముగా భగవంతుని పైన మాత్రమే భారముంచి కేవలము ప్రేమించుట కొరకు మాత్రమే భగవంతుని ప్రేమించి దైవప్రేమికులను, వ్యక్తరూపాలను విశ్వసించెదరో మరియు ఎట్టి ప్రాపంచిక, ఆధ్యాత్మిక ప్రతిఫలాన్ని ఆశించరో ఎవరు సత్యము యొక్క ప్రాపు విడనాడరో, ఎవరు ఎట్టి ఆపదలలోనైనను చలించక ధైర్యముతో హృదయపూర్వకంగా అన్ని కష్టములను నూటికి నూరు పాళ్ళు సంతోషంగా ఎదుర్కొందురో మరియు కులగోత్రాలకు మత పరమైన కర్మకాండలకు

ప్రాధాన్యమివ్వరో అట్టివారి చేత నిరంతరాయంగా జీవింపబడుచుండును. శాశ్వతమైన ఈ నవజీవనం ఆధ్యాత్మిక జీవితాన్ని సూచించే మార్గాలన్నిటికి మూలము, సారమై సత్యాన్వేషకులైన సాధకులందరికీ ఆచరణ యోగ్యమైనది' అని బాబా చెప్పారు.

ఈ నవజీవనంలో పాటించవలసిన నియమాలను బాబా సూచించారు. డబ్బు ముట్టుకోకూడదు. ఆహారాన్ని మాత్రం భిక్ష ద్వారా స్వీకరించవచ్చు. దేనికి దుఃఖించగూడదు. బాబాను పెద్దన్నయ్యగా భావించాలి. అవతారుడుగా భావించి ఆయననుండి ఎట్టి సహాయాన్ని ఆశించగూడదు. ఎవరు తప్పు చేసినా శిక్ష బాబాయే అనుభవించే వారు. బాబా ఆదేశించగానే ఆదేశము పొందిన వారు బాబాను మెల్లగా కాకుండా గట్టిగా కొట్టాలి. అలా చేయకపోతే బాబాకు అవిధేయత చూపిన వారవుతారు.



నవజీవనంలో పాల్గొనుటకు బాబా 16 మంది పురుషులను 4 గురు స్త్రీలను వారి అంగీకారాన్ని బట్టి ఎంపిక చేశారు. 16.10.1949 ఉదయం 3 గంటలకే అందరూ సిద్ధమై ప్రయాణానికి బయలుదేరారు. సూపా, నారాయణ గామ్, ఘోడ్ నది, పూనా, సతారా, కొల్హాపూర్‌ల మీదుగా బెల్గాం చేరారు. 22.10.1949 రోజున బెల్గాంలో ఉన్నారు. అప్పటికి నవజీవన నియమాలింకా కఠినంగా అమలుపరచలేదు. వర్షాలు ఇతర కారణాల వల్ల కాలినడకతో బాటు బస్సు, రైలు ప్రయాణాలు అనుమతించబడ్డాయి.

ఇచ్చట నవజీవన నియమాలు ఎంత కఠినంగా బాబా అనుసరించేవారో తెలిపే ఉదంత మొకటి జరిగింది. నవజీవనంలో బాబా ననుసరించిన పురుషులలో డా. దౌలత్ సింగ్ ఒకడు. ఇతడు నవజీవనంలో బాబా ననుసరించుటకు

అంగీకారము తెలియజేసిన తర్వాత అతని కుమార్తె వివాహము (17.10.1949వ తేదిన) నిర్ణయించబడినది. అందరూ 15.10.1949 నాటికే మెహెరాబాద్ చేరుకొన వలెనని బాబా ఆదేశించారు. బాబా ఆదేశాన్ని పాటించుటకు తాను వెళ్ళుట కంగీకరించమని దౌలత్‌సింగ్ భార్యను, కుమార్తెను కోరాడు. వివాహానికి కావలసిన ఏర్పాట్లన్నీ చేశాడు. అయినా వారందుల కంగీకరించ లేదు. బాబాకు యిచ్చిన వాగ్దానం ప్రకారంగా దౌలత్‌సింగ్ బయలుదేరి మెహెరాబాద్ వెళ్ళడానికే నిశ్చయించుకున్నాడు. ఆయన కూతురు, భార్య 'కూతురు వివాహానికి ఉండకుండా వెళతాననే నీవు తండ్రి వేనా? అని నిష్ఠూరంగా మాట్లాడి ఆయనను నొప్పించారు. అయినా వారి మాటలను లెక్క జేయకుండా దౌలత్‌సింగ్ బాబాతో గడపటానికి వెళ్ళిపోయాడు.

బెల్గాంలో బస చేసిన రోజున దౌలత్ సింగ్‌ను ఉదాసీనంగా ఉండి దుఃఖించడం గుర్తించారు బాబా. కూతురు వివాహానికి ఉండలేక పోయిన దానికన్నా తన యిష్టాన్ని గుర్తించక తన్ను తూలనాడి తన వారనుకునే వారే తనను నొప్పించారు కదా అనే భావన వల్ల ఆ దుఃఖము కలిగింది. మరునాడు అందరినీ సమావేశ పరిచి నవజీవన నియమాల నతిక్రమించి దుఃఖించడం వల్ల దౌలత్ సింగ్ కుటుంబ వ్యవహారాలను చూసుకోవడానికి బెంగుళూరు వెళ్ళడానికి బాబాను సెలవు కోరాడు. నవజీవన నియమాలకు ఆయన కోరిక విరుద్ధమైనదే యైనా బాబా అతనిని క్షమించి వెళ్ళవలసిందిగాను, కాని నవజీవన నియమాలను పాటిస్తూ గడపాలని ఆదేశించారు. తిరిగి యింటికి వెళ్ళిన దౌలత్ సింగ్‌కు అమర్యాద, అనాదరణ మాత్రమే లభించాయి. యింటిలో కూడా నవజీవన నియమాలే పాటించవలసి వచ్చినందున దౌలత్ సింగ్ క్రింద పడుకోవడమూ, భిక్ష అడిగి తింటూ యింటిలో తినకపోవడమూ చూచి ఆయన కుటుంబ సభ్యులు ఆయనకు పిచ్చి పట్టిందని, తమ కుటుంబ గౌరవాన్ని అప్రతిష్ఠ పాలు చేస్తున్నారని వారి మత గురువులకు చెప్పి అతనిని మందలించమన్నారు. పరిస్థితులను చూచి యింటిని వదిలి ఊరూరా తిరుగుతూ భిక్షాటనంతో ఉదర పోషణ చేసుకుంటూ బాబా స్మరణలో జీవనం సాగించాడు. చాలా కాలం గడిచిపోయింది.

ఒక రోజు దౌలత్‌సింగ్ మాసిన గుడ్డలతో, పెరిగిన గడ్డంతో ఒక చెట్టు క్రింద కూర్చునియుండగా ఒక వ్యక్తి దగ్గరగా వచ్చి 'ఎవరూ! నీవు దౌలత్‌సింగ్‌వేనా?' అని అడిగారు. అతని ముఖంలోకి చూస్తూ 'ఔను. నేను దౌలత్‌సింగ్‌నే, మరి నీవు ఈరుచ్‌వి కదా! ఆహా! ఎంతటి అదృష్టము. బాబా ఇక్కడనే ఉన్నారా?' అని అడిగాడు దౌలత్‌సింగ్. ఈరుచ్ బాబాతో దౌలత్‌సింగ్ యొక్క దయనీయమైన స్థితిని చెప్పి అతడు కూడా అదే ఊరిలో నున్నట్లు చెప్పాడు. బాబా దౌలత్‌సింగ్ వద్దకు వెళ్ళి, తన ఆలింగన భాగ్యాన్ని కలుగజేసి ఇలా అన్నారు – 'నాతో ఉండి నవజీవనం గడపిన వారికంటే, నా నుండి దూరంగా ఉండి అవమానాలను కూడా సంతోషంగా భరించి నవజీవన నియమాలను తప్పక పాటిస్తూ నా ఆదేశానుసారం నడచుకున్న నీవే అధికుడవు, ధన్యుడవు. నీ విధేయతకు నేను సంతసించాను. ఈ రోజు నుండి నిన్ను నవజీవనం నుండి విముక్తుణ్ణి చేస్తున్నాను. ఇక మళ్ళీ నీ ఇష్ట ప్రకారం పాత జీవనం గడపవచ్చును' అని బాబా చెప్పారు. కరుణామయుడైన బాబా ఆలింగన భాగ్యంతో పరమానందాన్ని పొంది బాబా ప్రశంసతో తాననుభవించిన అవమానాన్ని, కుటుంబ సభ్యుల తిరస్కారాన్ని స్వప్న ప్రాయంగా మరచిపోయాడు. బాబా ప్రశంసను చూరగొని ఆయన మెప్పు బడసి, బాబా ఆలింగనతో పునీతుడైన దౌలత్‌సింగ్ ధన్యజీవి.

నవజీవనంలో బెల్గాంలో ఉన్న కాలం మొదటి శిక్షణా శిబిరంగా జరిగింది. నవజీవనంలో నిరాశా నిస్పృహలతో గడిపే జీవనం కాకుండా బాబాకు పరిపూర్ణమైన విధేయతతో శిష్యులు మెలగాలి. ఆ తర్వాత మకాము కాశీ (బెనారస్)లో శిక్షణ ఇంకా కఠినంగా ఉంటుదన్నారు బాబా. బాబా ఆదేశం చెప్పిన వెంటనే అమలు పర్చాలి. బాబా ఆదేశం గురించి వాదించకూడదు. బాబా కోపగిస్తే వారు తప్పు చేసినా చేయకపోయినా బాధపడకూడదు, ఉత్సాహంగా ఉండాలి.

బాబా సహచరులతో నవంబర్ 12వ తేదిన రైలులో కాశీకి వెళ్ళారు. పూనా, బొంబాయి, మొగల్ సరాయిల మీదుగా ప్రయాణం చేసి నవంబర్ 15వ తేదీ ఉదయం 5.30 గం.లకు కాశీకి చేరారు. కాశీలో బాబాకు, ఆయన సహచరులకు

డా. నాథ్, కంటి వైద్యుడు, డా. ఖరే ఇద్దరు కలిసి వసతి, భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారు. బాబా వారికి రూ. 600 మాత్రము ఇచ్చారు. వారెవ్వరూ బాబా దర్శనానికి రాకూడదని, బాబాదాస్, ఈరుచ్, ఆదీ – ఈ ముగ్గురితో తప్ప ఎవరితో మాట్లాడకూడదని చెప్పారు. వారికి ఇష్టం లేకున్నా బాబా ఆదేశానుసారంగా వారుచేసిన సదుపాయాలకు, భోజనాలకు బాబా యిచ్చిన రూ. 600 పుచ్చుకున్నారు. యిద్దరు డాక్టర్లు కలిసి బాబా, వారి సహచరులు ఉండటానికి ఇమ్లీ అనే చోట నిచిబాగ్‌లో బంగళాలు ఏర్పాటు చేశారు. అవి పాత బంగళాలైనా, ఉండటానికి చాలా అనువుగా ఉండేవి.

కాశీకి చేరే ముందు మొగల్‌సరాయి స్టేషన్లో సామాన్లు దింపిన తర్వాత, ఆ సామాన్లను వేరే రైల్లో ఎక్కించడంలో పొరపాటు వల్ల సామాన్లు దింపిన చోట బాబాతో ఎవ్వరూ లేకుండా పోయారు. బాబా వద్ద ఎప్పుడూ ఒకరైనా ఉండాలి. ఈ విషయంలో బాబా వారిని కోప్పడ్డారు. నవజీవనంలో ఎవరూ కోపగించుకోరాదు. బాబా కూడా నవజీవనంలో అందరికీ అన్నయ్యగా అందరితో సమానంగా నడుచుకునేవారు. వారిని కోపగించుకున్నందులకు వెంటనే తన చెవులు గిల్లి లెంపకాయ కొట్టమన్నారు. ఈ విషయంలో కూడా శిష్యులు సందేహించినా, లెంపకాయ నెమ్మదిగా కొట్టినా అవిధేయులుగా లెక్కించబడతారు కాబట్టి సహచరులు బాబా ఆదేశించగానే ఆయన చెవులు మెలివేసి లెంపకాయ కొట్టారు. ఈ ఆదేశం ఎవరికి యిచ్చినా వారు వెంటనే ఆ పని చెయ్యాలి.

కాశీనుండి బయలుదేరి నవజీవనాన్ని కఠిన నియమాలతో ఆచరించాలని బాబా నిర్ణయించారు. దానికి ప్రారంభంగా కాశీలోనే బాబా ఆ నవజీవనానికి శిక్షణ యిచ్చారు. ఆహారం భిక్ష అడిగి పొందడం ఎలాగో కాశీలోనే నేర్పించబడింది. బాబా స్వయంగా డా. నాథ్ యింటి వద్ద నవంబర్ 24వ తేదీన భిక్ష అడిగి పుచ్చుకున్నారు. డా. ఖరే యింట్లో నవంబర్ 25వ తేదీన బాబా భిక్ష అడిగి పుచ్చుకున్నారు. అలాగే సహచరులను ఇద్దరిద్దరిని కలిపి భిక్షకై పంపించారు బాబా. భిక్షాటనకు కూడా బాబా నియమాలేర్పరచారు.

కాళ్ళజోళ్ళు లేకుండా ఉట్టి పాదాలతో వెళ్ళాలి. చేతిలో ఇత్తడి అక్షయ పాత్ర ధరించాలి. కాషాయరంగు గుడ్డతో చేసిన ఒక జోలె భుజానికి తగిలించుకోవాలి. ఈ జోలెలో వండిన ఆహారానికి, గోధుమపిండికి, బియ్యానికి వేర్వేరు సంచీలుండాలి. భిక్షలో డబ్బులు తీసుకోరాదు. ఎవరైనా పొరపాటున భిక్షాపాత్రలో డబ్బులు వేస్తే వారే మళ్ళీ తీసుకోవాలి. సహచరులు వారి చేతితో డబ్బు తాకరాదు. భిక్ష ఆడవారి నుండి, మగవారి నుండి కూడా పొందవచ్చును. కాని ఆడవారిని తాకరాదు. మగవారిని 'భాయీ! ప్రేమ్‌సే భిక్షా దీజియే!' అని, ఆడవాళ్ళనైతే 'మాయి! ప్రేమ్‌సే భిక్షా దీజియే!' అని అడగాలి. ఒక ఇంట్లోనే భిక్ష అడగాలి. ఆ యింటిలో భిక్ష దొరకక పోతే ఇంకొక యింటికి వెళ్ళాలి. భిక్షలో తీసుకున్న ఆహారం ఎంత ఉన్నదీ, ఎలా ఉన్నది పరీక్షించకుండా భిక్ష దొరకగానే జోలెలో వేసుకొని తెచ్చి బాబా ముందు పెట్టాలి. సహచరులందరూ భిక్షగా తెచ్చిన ఆహారాన్ని బాబా కలిపి అందరికీ ఒక ముద్ద యిచ్చేవారు. అదే వారికి ఆ రోజుకు ఆహారము.

బాబా డా. నాథ్ ఇంట్లో భిక్ష పుచ్చుకునే సమయంలో ఆహారంలోని బంగాళ దుంప ముక్కలు క్రింద పడ్డాయి. బాబా వంగి అవి తీసుకొని జోలెలో వేసుకున్నారు. 'భగవంతుడు నీ యింటికి భిక్షకు వస్తే అతడు క్రింద పడిన ఆహార పదార్థాలను కూడా తీసుకొని జోలెలో వేసుకుంటాడ'ని డా. నాథ్ ఎప్పుడో పురాణాల్లో చదివాడు. అంత వరకు బాబా దివ్యత్వం గురించిన అవగాహన లేకుండానే బాబాకు, ఆయన సహచరులకు బాబా విధించిన షరతులన్నింటికీ ఒప్పుకొని ఏర్పాట్లు చేశాడు. కాని ఈ సంఘటన వల్ల బాబా సాక్షాత్తు భగవంతుడని నమ్మకం కలిగింది. తన నమ్మకం బాబా ప్రేమికుడైన డా. ఖరే గారి తండ్రి ద్వారా ఆయన ఈ యుగావతారుడైన మెహెర్‌బాబాయని రూఢియైనది. డా. ఖరే, నాథ్ ఇంట్లో బాబా భిక్ష తీసుకునే సమయంలో బాబా అనుమతి లేకుండా ఫోటో తీయించాడు. కాని బాబా చిత్రం ఆ ఫోటోలో పడలేదు. మరునాడు బాబా అనుమతితో తీసుకున్న ఫోటోలో బాబా చిత్రం స్పష్టంగా వచ్చింది.

కాశీ (బనారస్) నుండి బాబా తన సహచరులతో సారనాథ్ వెళ్ళి అక్కడ 12 రోజులున్నారు. సారనాథ్ బౌద్ధమతస్థులకు పవిత్ర క్షేత్రం. గౌతమ బుద్ధుడు తన శిష్యులకు మొట్టమొదట ఉపదేశం చేసిన స్థలం సారనాథ్‌లోనే ఉంది. అశోక చక్రవర్తి బౌద్ధమతావలంబకుడైన తర్వాత నిర్మించిన మూడు స్థూపాలు సారనాథ్‌లోనే ఉన్నవి, ఈ స్థలంలోనే బాబా కాలినడకన కఠోరమైన నవజీవనం ప్రారంభించే ముందు తన సహచరులతో కలిసి ప్రార్థన చేశారు. సారనాథ్‌లో కూడా బాబాకు, వారి సహచరులకు వసతి సౌకర్యాలు డా. నాథ్ ఏర్పాటు చేశారు. బాబాకు నివాస మేర్పరచిన బంగళాలో ఒక ముసలి తోటమాలి ఉండేవాడు. అతడు నిరంతరం రామ నామాన్ని స్మరించేవాడు. ఎంతో తృప్తిగా జీవించేవాడు. బాబా సహచరులు స్త్రీ మండలిలోని డా. గోహెర్ ఆ తోటమాలిని 'నీ కేమైనా కావాలా?' అని అడిగితే నాకు ఠాకూర్ (కృష్ణుడు) అన్నీ ఇచ్చాడు, ఏమీ అవసరం లేదు అని చిరునవ్వుతో చెప్పాడు. బాబా సహచరులు మరీమరీ అడుగగా ఒక అగ్గిపెట్టె ఇవ్వమన్నాడు. బాబా సంతోషించి అతనికి ఒక శాలువా బహూకరించారు. భగవంతుడే తనకా శాలువా యిచ్చాడని తోటమాలి చెప్పాడు.

డిసెంబర్ 12వ తేదీన ఉదయం సారనాథ్ నుండి కాలినడకన బాబా తన సహచరులతో ప్రయాణం ప్రారంభించారు. వారితోబాటు ఒంటె బండి, ఎద్దుల బండి, సవారీ బండి, రెండు ఆవులు, రెండు గాడిదలు, ఒక తెల్ల గుఱ్ఱము ఉన్నాయి. సహచరులందరూ తెల్ల కఫ్నీ, ఆకుపచ్చ తలపాగా, తెల్ల చెప్పుల జోళ్ళు వేసుకున్నారు. ఈ బృందాన్ని చూచి ప్రజలు యాత్రీకులు గాను, ఆధ్యాత్మిక బాటసారులుగాను భావించి గౌరవించేవారు. కొందరు సర్కస్ బృందంగా భావించేవారు. కొత్తప్రదేశానికి చేరగానే పిల్లలు, స్త్రీలు వీరిచుట్టూ చేరేవారు. స్త్రీలు మాత్రం ఎద్దుల బండిలో కూర్చునేవారు. ఉదయమే నడక ప్రారంభించి మధ్యాహ్నానికి ముందు ఊరు వస్తే అందరూ ఊరు బయట మకాము చేసి కొందరిని భిక్షకై ఊరిలోకి పంపించేవారు. వచ్చిన దానిని బాబా కలిసి అందరికీ పంచేవారు. రాత్రిళ్ళు చెట్లక్రిందనో ఆరు బయటనో విశ్రమించేవారు.



ఈ భిక్షాటనలో వింతానుభవాలు పొందారు బాబా సహచరులు. పట్టణాల్లో విద్యావంతులుగా కనిపించే పెద్దమనుషులు వీరిని చూచి 'భిక్ష ఆడగటానికి సిగ్గుగా లేదా, ఏదో పని చేసుకొని జీవనోపాధి గడిపించుకోవచ్చు గదా' అని తిట్టి పంపేవారు. అవతారునికి ఆయన సహచరులకు భిక్ష పెట్టే భాగ్యానికి నోచుకోవాలి గదా! పల్లెటూళ్ళలో బీదవారి ఇళ్ళలో భిక్ష ప్రేమతో గౌరవ భావంతో పెట్టేవారు.

ఒక రోజు ఊరు సమీపించగానే బాబా స్త్రీలను 'ఆకలిగా ఉందా' అని అడిగారు. వారు 'ఔను' అనగానే బాబా ఈరుచ్‌ను భిక్షకై దగ్గరిలోని ఊరికి పంపించారు. ఈరుచ్ వెళ్ళి ఒక ఇంటి ముందు ఆగి 'మాయీ! ప్రేమ్‌సే భిక్షా దీజియే!' అని అడిగాడు. ఆ ఇంటిలోని స్త్రీ ఇంటిలో పిండి ఏమీలేదని చెప్పడానికి వచ్చింది. నిజంగానే ఆమె ఇంట్లో ఏమీ లేదు. కాని ఈరుచ్‌ను చూచిన తర్వాత ఆమె అతనిని ఊరికే పంపించడానికి మనసొప్పక పొరుగింటికి వెళ్లి గోధుమపిండి అప్పుగా తెచ్చి వేడివేడి రొట్టెలు, కూర చేసి ఈరుచ్‌కు భిక్ష పెట్టింది. వేరే ఇంటికి వెళ్ళ వద్దని ఆమె ఈరుచ్‌ని అంతవరకు బ్రతిమిలాడి కూర్చోబెట్టింది. అవతారునికి ఆయన సహచరులకు ప్రేమతో భిక్ష పెట్టిన ఆ యిల్లాలు ఎంతటి ధన్యురాలో గదా! ఆ రొట్టెలను బాబా అందరికీ పంచారు. ఆ రోజు తిన్న ఆ రొట్టెలు, కూర రుచించినంతగా మరెన్నడూ ఎంతమంచి ఆహారమైనా రుచించలేదని సోదరిమణి చెప్పారు.

రోజు 17 నుండి 20 మైళ్ళు నడిచేవారు. నాలుగు రోజుల ప్రయాణం తర్వాత జువాన్‌పూర్ చేరుకున్నారు. అక్కడ నాలుగు రోజులున్నారు. ఊరి బయట

చెట్ల క్రింద ఉన్నారు. జువాన్‌పూర్ నుండి మొరాదాబాద్‌కు రైలులో వెళ్ళారు. నవజీవనంలో ఉన్నందున వారు డబ్బు ముట్టుకోగూడదు. బాబా ఈరుచ్‌ను ఇంకొక సహచరుడిని పంపించి ఊళ్ళో వారి మనస్సుకి మంచి దాతగా తోచిన వ్యక్తిని మొరాదాబాద్‌కు టికెట్లు ఏర్పాట్లు చేయవలసిందిగా అడగమన్నారు. అలాగే వారిద్దరూ ఒక వర్తకుని దగ్గరకు వెళ్ళి తాము యాత్రీకులమని హరిద్వార్‌కు వెళ్తున్నామని చెప్పి వారికి మొరాదాబాద్ వరకూ రైలు ఛార్జీలు ఏర్పాటు చేయాలని కోరారు. తమ పెద్దన్నయ్య మరియు నలుగురు స్త్రీలకు మొదటి తరగతి టికెట్లు, మిగిలిన వారికి మూడవ తరగతి టికెట్లు కావాలని అడిగారు. ఆ వర్తకుడు అంగీకరించి దానికి కావలసిన డబ్బు లెక్కించి ఇవ్వమని గుమాస్తాకు చెప్పాడు. మేమా డబ్బు ముట్టుకో కూడదు. మీరే రైలు స్టేషన్‌కు వచ్చి టికెట్లు కొని ఇవ్వాలని చెప్పారు. ఆ వర్తకుడు అన్ని షరతులకు అంగీకరించి ఉదయం మూడు గంటలకే గుమాస్తాని పంపించి వారికి కావలసిన టికెట్లు కొనియిచ్చే ఏర్పాటు చేశాడు. నిరాశా నిస్పృహలతో గడిపే నవజీవనంలో కూడా సర్వజ్ఞుడైన బాబా తన నుండి నవజీవనంలో ఏ సహాయాన్ని కోరరాదని చెప్పినా వారి అవసరాలన్నీ అలా తీర్చబడుతుండేవి.

సహచరులందరికీ ఒక గొంగళి మాత్రమే ఉంది. చలి బాగా ఉండటంతో ఆరుబయట, తోటల్లో పండుకోవలసి యున్నందున వారు చలి బాధకు గురియైనారు. మొరాదాబాద్ నుండి బయలుదేరే ముందు ఢిల్లీ నుండి ఒక వర్తకుడు అతని కొడుకు టాంగాలో పెద్దపెద్ద సరుకుల మూటలు తెచ్చి బాబా వాటిని భిక్షగా స్వీకరించాలని కోరాడు. బాబా అనుమతితో మూటలు విప్పి వారు తెచ్చిన దుప్పట్లు, రగ్గులు, ఉన్ని బట్టలు ఆ సహచరులందరికీ పంచారు. అందరికీ సరిపోయాయి. అవసరానికి ఆ వస్తువులను కానుకగా తీసుకొని వచ్చిన వారి ప్రేమకు బాబా సంతోషించారు.

మొరాదాబాద్ నుండి నజీబాబాద్ మీదుగా డెహ్రాడూన్‌కి వెళ్ళారు. డెహ్రాడూన్‌లో కాలినడకన చేసిన ప్రయాణం అంతమైంది. కాని బాబా విధించిన

నవ జీవనం అలాగే సాగింది.

నవజీవనంలో బాబా సహచరులకు ఆహారం మీద ఉండే ఇష్టాయిష్టాలను లేకుండా చేసిన సంఘటనలెన్నో ఉన్నాయి. భిక్ష ద్వారా వచ్చిన ఆహారాన్ని అందరికీ సమానంగా పంచేవారు. అది కొంత మందికి రుచించేది కాదు. ముఖ్యంగా డా. ఘనీకి. ఒకసారి డా. ఘనీని హోటల్‌కి వెళ్ళి అతని కిష్టమైన ఆహారాన్ని భుజించడానికి బాబా అనుమతించారు. అతనితోపాటు డా. నీలుని కూడా పంపి డా. ఘనీ ఏమి తింటే అదే ఆహారం నీలుని కూడా తినమన్నారు బాబా. డా. నీలు బ్రాహ్మణుడు. ఎప్పుడూ మాంసాహారం తినలేదు. ఆ రోజు ఘనీ మాంసాహారం తిన్నందున బాబా అజ్ఞ ప్రకారం అతడు కూడా డా. ఘనీతో పాటు మాంసాహారం తిని బాబా ఆజ్ఞను శిరసావహించి బాబా మెప్పుపొందాడు. మనం నోటి ద్వారా లోనికి తీసుకునే ఆహారం కంటే నోటి ద్వారా బయటకు వచ్చే (మాట్లాడే) మాటకు చాలా ప్రాధాన్యం ఉందన్నారు బాబా. మరొకసారి డా. ఘనీ కోరిక మన్నించి బాబా అతనికి ఇష్టమైన ఆహారం తినడానికి అనుమతి నివ్వడమే కాకుండా తగినంత డబ్బు కూడా ఇపించారు. డా. ఘనీ మంచి హోటల్‌కి వెళ్ళి సుష్టుగా భోజనం చేసి సర్వర్‌కి బహుమానం (టిప్) కూడా యిచ్చి దర్జాగా వచ్చాడు. మరునాడు బాబా అతనిని పిలిచి క్రితం రోజు తిన్న హోటల్‌కి వెళ్ళి భిక్ష అడిగి తీసుకొని రమ్మన్నారు. అలాగే వెళ్ళి భిక్ష అడిగాడు. హోటల్‌లోని సర్వర్ అతనిని గుర్తించి నిన్న టిప్ ఇచ్చినతడు ఈ రోజు భిక్ష అడుగుతున్నాడేమిటా అని ఆశ్చర్యంగా ఆయనకేసి చూస్తున్నా లెక్కచేయకుండా భిక్షమడిగి బాబా ఆజ్ఞను పాటించాడు డా. ఘనీ. మానావమానాలను సమంగా భావించి అహాన్ని పోగొట్టుకొనే శిక్షణ మండలి వారందరూ బాబా పర్యవేక్షణలో పొందారు.

నజీబాబాద్‌లో ఉండగా బాబాకు వారి పరివారానికి భిక్ష ఇవ్వడమే కాకుండా బాబా నజీబాబాద్‌లో ఉన్నన్నాళ్ళూ ఒక ధనికుని కుటుంబంలోని స్త్రీలు, బాబా దర్శనం కూడా కోరగూడదనే షరతు విధించినా సమ్మతించి, బాబా ఆహారం ప్రతి పూట శ్రద్ధగా తయారుచేసి పెట్టారు. వారు శ్రద్ధాసక్తులతో ప్రేమతో చేసిన సేవకు

బాబా సంతసించి వారికి తన దర్శనభాగ్యాన్ని కలుగజేశారు. నవజీవనంలో ఉన్నా ఆయన కరుణామయుడే గదా! బాబా ప్రీతికి పాత్రులైన ఆ కుటుంబ సభ్యులెంత ధన్యులో గదా!

బాబా డెహరాడూన్‌కు చేరక పూర్వమే బాబా ప్రేమికులలో నొకడైన నలావాలా యింటికి క్రొత్తవ్యక్తి వచ్చాడు. నలావాలా యింటిని ఎంతో శ్రమతో వెదుక్కుంటూ వచ్చి ఆయింటిని చూడగానే 'ఔను ఇదే ఇల్లు – ఇదే ఇల్లు' అని పోల్చుకుంటూ ఆ యింటిలోని బాబా ఫోటోను గుర్తించి ఆయనే – అని చెప్పాడు. నలావాలా 'మీరెవరు? మీరు చెప్పేది నాకు సరిగా అర్థం కావడంలేదు. దయజేసి వివరంగా చెప్పండి' అన్నాడు. ఆ వ్యక్తి 'నా పేరు తోడిసింగ్. నేను అలీఘర్‌లో వెన్న వ్యాపారం చేస్తాను. నాకు కలలో ఒకరోజు ఆ ఫోటోలోని మహానుభావుడు కనిపించి నాకు నా సహచరులకు భోజనాలేర్పాటు చేయకూడదా అని అడిగారు. ఎవరో తెలియక పోయినా ఆ తేజస్సును బట్టి సత్పురుషుడని భావించాను. అది దైవానుగ్రహంగా అనుభూతి పొంది నేనాయన పాదాలను స్పృశించాను. ఆయన నన్ను లేవనెత్తి 'నేనిప్పుడు డెహరాడూన్‌లో ఉంటున్నాను. అక్కడికి వచ్చి నాకు సేవ చేయి, మాకు భోజనాలు ఏర్పాటు చేయి' అని మీ యిల్లు బాబా చూపించారు. అన్ని సామాన్లు తీసుకొని వెతుక్కుంటూ మీ యింటికి వచ్చాను. మీరు ఈ సరుకులను ఆ మహాత్మునికి యిప్పించాలి' అన్నాడు. నలావాలా తోడిసింగ్‌కు నవజీవనంలోని నియమాల ననుసరించి బాబా గురించి చెప్పకూడదు కావున మొదట తనకేమి తెలియదని చెప్పినా బాబా కలలో యిచ్చిన ఆదేశాలపై ఆయనకు (తోడీసింగ్‌కు) గల విశ్వాసం శ్రద్ధాసక్తులను చూచి బాబా వచ్చేదాకా వేచియుండమని, బాబా అనుమతిస్తే అతనిని బాబా వద్దకు తీసుకెళ్తానని చెప్పాడు.

బాబా డెహరాడూన్‌కు వచ్చిన తర్వాత నలావాలా తోడీసింగ్ గురించి చెప్పాడు. బాబా తోడీసింగ్‌ను తన వద్దకు తీసుకొని రావడానికి అంగీకరించారు. తోడిసింగ్ శ్రద్ధాసక్తులకు, ప్రేమకు బాబా ముగ్ధులై అతడు తెచ్చిన వెన్న, ఆహార పదార్థాలను స్వీకరించి తోడీసింగ్‌తో 'ఈ అపక్వమైన ఆహార పదార్థాలతో మా

కడుపులెలా నిండుతాయి? ఎవరు వండి పెడతారు?' అని అన్నారు. ఆ వెంటనే తోడీసింగ్ 'బాబా! మీరు అనుమతిస్తే నా కుటుంబ సభ్యులందరినీ తీసుకొని వచ్చి మీకు కావలసిన ఆహార పదార్థాలను తయారు చేసిపెట్టి, మీ సేవ చేసుకుంటా' నన్నాడు. బాబా అనుమతించారు. తోడీసింగ్ వెళ్ళి ఆయన భార్య, పిల్లలను, సోదరిని తీసుకొని వచ్చి బాబాకు ఆయన సహచరులకు రుచికరమైన ఆహారం వండి పెట్టి డెహరాడూన్‌లో బాబా ఉన్నన్నాళ్ళూ ఆయన సేవ చేసుకున్నాడు. ప్రతిరోజు తాజా కూరలు, సరుకులు టాంగాలో తీసుకొని వచ్చి కావలసిన పదార్థాలను తయారు చేయించేవాడు. నవజీవనంలో భిక్షతో ఆకలి తీర్చుకున్న బాబా బృందానికి మంచి రుచికరమైన ఆహారాన్నందించి బాబా కృపకు పాత్రుడైనాడు తోడీసింగ్. డెహరాడూన్ నుండి వెళ్ళిన తర్వాత కూడా తోడీసింగ్ వ్యాపారంలో ఆసక్తి మాని ఇంటిలో అన్నసత్రాన్ని నడిపి అందరికీ అన్నదానం చేశాడు. సంపాదన లేకుండా అంతా అన్న దానానికి ఖర్చు చేస్తే ఎలా గడుస్తుందని అడిగిన వారందరికి 'బాబా జానే' అని చెప్పేవాడు. బాబా ప్రేమలో మస్తుగా మారిన తోడీసింగ్ అతని కుటుంబ సభ్యులు ధన్యులు కదా! ఆయన పేరు అప్పటి నుండి బాబాజానే అని వ్యవహారంలోకి వచ్చింది.

బాబా డెహరాడూన్‌కి రాక పూర్వమే అక్కడ కొన్నిమాసాలు ఉండటానికి ప్రత్యేకమైన ఒక స్థలాన్ని సేకరించి బాబా నివాసానికి యోగ్యమైన ఇళ్ళు నిర్మించాలని సూచించారు. ఈ కార్యం నిమిత్తం మండలి వారు డెహరాడూన్ – హరిద్వార్ రోడ్డుపైన పట్టణానికి రెండు కి.మీ. దూరంలో ఉన్న 'మంజిరీ మాఫీ' అనే స్థలాన్ని యెంచుకొని ఆ దగ్గరలో నివాసముంటున్న ఒక వ్యక్తి వద్దకు వెళ్ళి ఆ సమీపంలో తమకు స్థలం కావాలని అడిగారు. అతను ఆ దగ్గరలోనే స్థలం యిప్పించాడు. ఆ స్థలంలో ఇళ్ళ నిర్మాణం కూడా ఆయన పర్యవేక్షణలో చేయించాడు. ఆ స్థలానికి తరువాత మెహెర్ మాఫీ అనే పేరు కూడా వచ్చింది.

ఆ వ్యక్తి శతృఘ్న కుమార్. ఆయన కమ్యూనిస్ట్ భావాలు కలవాడు. ఆంగ్లేయుల పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్రోద్యమంలో పాల్గొని చాలా సార్లు

జైలుకు వెళ్ళాడు. ఆయన యవ్వనంలో చాలా భాగం జైలులోనే గడిచింది. అలా జైలులో మ్రగ్గుతున్న అతనికి ఒకనాడు ఒక ఆలోచన వచ్చింది. 'అందరూ భగవంతుడున్నాడని, ఆయనను తలుచుకొని ఏది కోరితే అది నెరవేరుతుందని అంటారు. నేనెందుకు పరీక్షించుకోకూడదు?' వెంటనే ఆయన ఇలా అనుకున్నాడు – 'ఓ భగవంతుడా (మిస్టర్ గాడ్)! నిజంగా నీవంటూ ఉంటే రేపు ఉదయం ఏడు గంటలకు నన్నీ జైలునుండి విడుదల చేయించు. అప్పుడు నీవంటూ ఉన్నానని నమ్ముతాను. ఆ తర్వాత నీవు కనబడితే నీకు జీవితాంతం సేవ చేసుకుంటాను'. అది రాత్రి సమయం. ఆ సాయంత్రం వరకూ ఎలాంటి ఉత్తర్వులూ రాలేదు. ఉదయం 7 గంటల వరకు జైలు కార్యాలయానికి ఎవ్వరూ రారు. తాను కోరుకున్న విడుదల అసాధ్యమైనదే. మానవాతీతమైన దైవశక్తి నిజంగా ఉండి పని చేస్తే తప్ప తన విడుదల సాధ్యం కాదు. అనే భావాలు మనస్సులో మెదులుతుండగా హృదయాంత రాళాలలో మాత్రం 'నీ మొర ఆలకించి దైవం నిన్ను విడుదల చేస్తాడు' అనే ఆశ ప్రోత్సహించ సాగింది. ఈ భావాలతో రాత్రంతా నిద్ర పోకుండానే గడిపాడు. పదేపదే తనకున్న కొద్దిపాటి వస్తువులను సర్దుకుంటూ విడుదలైతే వెళ్ళడానికి సిద్ధంగా ఉండాలి అని తాపత్రయపడ్డాడు. ఉదయం ఐదు గంటలైంది. మనస్సు సందేహంగా ఇంకా ఎలా సాధ్యమవుతుంది నీ విడుదల అంటుంటే అంతరంగ నుండి ఆశ మాత్రం ఆగిపోకుండా ధైర్యాన్ని చెబుతూంది.

ఇంతలో ఒక జవాను తనవైపుకే రావడం చూశాడు. తన వద్దకే వచ్చి 'నీవు అదృష్టవంతుడివి. నీ విడుదల కోసం పైనుండి టెలిగ్రామ్ ద్వారా ఆదేశాలు వచ్చాయి. జైలర్ గారు ఉదయం గం.6.30లకే ఆఫీసుకు వస్తారు. వెళ్ళిపోవడానికి సిద్ధంగా ఉండు' అని చెప్పి వెళ్ళిపోయాడు. శతృఘ్న కుమార్ నమ్మలేక పోయాడు. ఇది కలా? నిజమా? అయితే దేవుడనే వాడు ఉన్నాడన్న మాట. అంతే కాదు. నా మొర ఆలకించి అసాధ్యమైన నా కోరిక నెరవేర్చి నన్ను విడుదల చేశాడు. జైలర్ వద్దకు వెళ్ళి చేయవలసినవన్నీ నెరవేర్చి గేటు బయటకు అడుగు పెట్టాడు. సమయం సరిగ్గా ఏడు గంటలైంది ఆహా! నేను పెట్టిన పరీక్షలో నెగ్గి భగవంతుడు తానున్నాని

నిరూపించుకున్నాడు. అయితే భగవంతుడెక్కడ ఉన్నాడు? నా వాగ్దానం ప్రకారం నేను ఆయనకు సేవ చేయడమెలా అని యోచిస్తూ ఇంటికి వెళ్ళిపోయాడు. కాలక్రమేణా తన వాగ్దానాన్ని మరిచిపోయాడు.

బాబా అనుచరుల కోరిక మేరకు బాబాకు మంజరీ మాఫీలో స్థలం యిప్పించి యిళ్ళు నిర్మించి యివ్వడంలో శతృఘ్న కుమార్ తోడ్పడ్డాడు. బాబాకు, బాబా మండలి వారికి భోజనాలు వసతి ఏర్పాటు చేశాడు. బాబాను చూడగానే ఆయన తనకు ఆత్మీయుడైనట్లు, ఎప్పటినుండో తనకు తెలిసి ఉన్నట్లు అనుభూతి పొందాడు. ఇలా కొంతకాలం బాబాకు సేవచేసుకున్నాడు శతృఘ్న కుమార్. ఒకసారి అతడు సతారాలో బాబా వద్ద బాబా మండలి వారితో కలిసి ఉన్నాడు. ఒకరోజు బాబా వాహ్యాళికి వెళ్తుంటే గొడుగు పట్టుకొని బాబా వెంట నడుస్తున్నాడు. అప్పుడు బాబా యిలా అన్నారు – 'నీవు చేసిన వాగ్దానం గుర్తుందా?' – శతృఘ్న కుమార్‌కు ఏమీ అర్థం కాలేదు. తానెప్పుడు బాబాకు ఏ వాగ్దానం చేయలేదే అనుకున్నాడు. 'జైలులో చేసిన వాగ్దానం మరిచిపోయావా?' అన్నారు బాబా. వెంటనే అతనికి జైలు విడుదల కోసం తాను పెట్టిన పరీక్ష, వాగ్దానం గుర్తుకొచ్చాయి. బాబా మళ్ళీ వెంటనే ఇలా అన్నారు – 'నేనే ఆ భగవంతుడను. ఎప్పుడూ మరచిపోకు'. శతృఘ్న కుమార్‌కు ఎంతో ఆశ్చర్యం, సంతోషం కలిగాయి. తను ఏదో పెద్ద బరువు దించి వేసుకున్నట్లుగా అనుభూతి పొంది తనకు తెలియకుండానే తన వాగ్దానం ప్రకారంగా తనను జైలునుండి విడిపించిన దైవానికి సేవ చేసుకునే భాగ్యాన్ని బాబా కలుగజేసినందులకు ఆనందభరితుడైనాడు. జీవితాంతం బాబా సేవ చేసుకుని ధన్యుడైనాడు.

బాబా దివ్యత్వాన్ని ధృవపరిచే అనుభవాలెన్నో శతృఘ్న కుమార్‌కు కలిగాయి. బాబా నవజీవనంలో డెహరాడూన్‌కు రైలులో వచ్చి స్టేషన్‌లో ప్రయాణీకుల విశ్రాంతి గదిలో ఉన్నారు. బాబాకు స్థలం యిప్పించినందున బాబా మండలి వారు శతృఘ్న కుమార్‌ను రైలు స్టేషన్‌కు తీసుకొని వచ్చారు. కుమార్‌ను చూచి 'మాకు వెంటనే భోజనాలు ఏర్పాటు చేయగలవా?' అని బాబా అడిగారు. ఒక గంట

సమయం ఇస్తే చేయగలనని చెప్పాడు కుమార్. సరే అలాగే. తొందరగా ఏర్పాటు చేయి అన్నారు బాబా. బాబా టేబిల్ వద్ద కూర్చుని ఉన్నారు. ఈరుచ్ బెడ్డింగ్ సర్దుతున్నాడు. ఒక మండలి సభ్యుడు బాత్‌రూమ్‌లో నుండి వస్తున్నాడు. బాబా వద్ద నుండి సెలవు తీసుకొని మోటార్ సైకిల్‌పై తన యింటికి వెళ్ళి త్వరత్వరగా అన్నం వండించి తీసుకొని వచ్చాడు. విశ్రాంతి గదిలో ప్రవేశిస్తూ తను వెళ్ళే సమయంలో ఎలా ఉందో అదే దృశ్యం తన కంటబడింది. తన ఇంటికి వెళ్ళడం. ఆహారం తయారు చేసి తీసుకొని రావడం అంతా ఒక క్షణంలో జరిగిపోయిన అనుభూతి కలిగింది. బాబా సమయాన్ని అలా స్థంభింపజేసి ఉంచారేమో అనిపించింది. కృష్ణావతారంలో నారదునికి యమునా నదిలో మునిగి లేచే క్షణ కాలంలోనే కలిగిన సుదీర్ఘ అనుభవం (వివాహం జరగడం, 60 మంది పిల్లలు పుట్టడం, సంసారంతో విసిగి తనను కాపాడమని కృష్ణుని వేడుకోవడం) లాంటి సంఘటన, అనుభవం శతృఘ్న కుమార్‌కు కలిగింది.

ఆ అన్నం తెచ్చిన గిన్నెను తెచ్చి బాబా ముందు టేబిల్‌పైన ఉంచాడు శతృఘ్న కుమార్. బాబా స్వయంగా దాని మూత తీసి సహచర మండలి వారందరినీ పిలిచి 'బాగా తినండి' అంటూ అందరికీ వడ్డించాడు. ఒక్కొక్కరుగా వచ్చిన వారందరినీ చూచి శతృఘ్న కుమార్‌కు మనస్సులో ఆందోళన ప్రారంభమైంది. బాబా బృందంలో ఎంతమంది ఉన్నారనే విషయం తెలుసుకోకుండా వెళ్ళి ఆహారం తయారు చేయించి తెచ్చాడు. ఇప్పుడు చూస్తే తాననుకున్న దానికన్నా చాలా ఎక్కువ మంది ఉన్నారు. తాను తెచ్చిన ఆహారం సరిపోదు ఏంచేయాలి అని మనస్సులో మధన పడుతుండగా బాబా ఆయన్ని కూడా పిలిచి నీవుకూడా మాతో బాటే తిను అని అతనికి ఒక పళ్ళెంలో తన స్వహస్తాలతో అన్నం వడ్డించి యిచ్చాడు. తత్తరపాటుతో వెళ్ళి పళ్ళెము అందుకున్నాడు. అన్న సరిపోలేదనే అపవాదు భరించవలసి వస్తుందని కుమార్ ఆందోళన పడుతున్నాడు. అందరికీ వడ్డించి బాబా అన్నం గిన్నెపై మూత పెట్టేసి, ప్రక్క గదిలో నున్న స్త్రీ మండలి వారికి దానిని తీసుకొని వెళ్ళి యివ్వమన్నారు. ఇంకా స్త్రీమండలి వారు కూడా ఉన్నారని

తెలుసుకొని శతృఘ్న కుమార్ తనకు అపవాదు తప్పదని ఆ గిన్నెలో ఏమీ మిగిలి లేదని, స్త్రీమండలి వారు ఏమి తింటారని గాభరా పడ్డాడు. స్త్రీమండలి వారి గదిలోకి తీసుకొని వెళ్ళి గిన్నెపై నుండి మూతతీసి చూస్తే ఆ గిన్నెలో అన్నం నిండుగా ఉంది. కేవలం ప్రక్కన ఒక చెంచాతో కొంచెం మాత్రం తీసినట్లుగా ఉంది. శతృఘ్న కుమార్‌కు ఆశ్చర్యంతో బాటు కలిగిన ఆనందానికి అవధులు లేవు.


ఇలాగే మంజరీ మాఫీలో జరిగిన కార్యక్రమాల్లో ఎన్నో సార్లు ప్రసాదం అక్షయమైపోయి ఊహించిన దానికంటే ఎన్నో రెట్లు ఎక్కువగా వచ్చిన ప్రేమికులందరికీ బాబా చేతితో పంచగా సరి పోవడమే కాకుండా మిగిలి పోయేది. అలా బాబా చేతితో పంచగా ఒకసారి 'బజ్జీలు' అక్షయమైనందున ప్రతి సంవత్సరం మార్చి మాసంలో జరిగే మేళాకార్యక్రమంలో ఆ రోజు గుర్తుగా 'బజ్జీల' నే నేటికీ ప్రసాదంగా చేసి పంచుతారు డెహ్రాడూన్ ప్రేమికులు.

ఒకసారి శతృఘ్న కుమార్ ఋషీకేశ్‌లో బాబాతో కలిసి నడుస్తూ వెళుతున్నాడు. బాబా అల్లంత దూరాన గల ఒక చెట్టును చూపిస్తూ సంజ్ఞలతో ఇలా చెప్పాడు – నీవు ఆ చెట్టు క్రింద పుట్టావు గదా – అని. ఆయన ఈ విషయం బాబాకు ఎప్పుడూ చెప్పలేదు. శతృఘ్నకుమార్ గర్భంలో ఉండగా ఆయన తల్లి ఋషికేశ్‌కు వెళ్ళి అక్కడ లక్ష్మణ్ ఝూలా వద్ద గల శతృఘ్న దేవాలయంలో బసచేసింది. అనుకోకుండా ఆమెకు ఆ రోజే ప్రసన వేదనతో నొప్పులు ప్రారంభమైనాయి. ఆలయంలో ప్రసవించడం సాంప్రదాయం ప్రకారం సమ్మతం కానందున ఆమెను దగ్గరలోని చెట్టుక్రిందికి తీసుకొని వెళ్ళి చుట్టూ చీరలు కట్టి అక్కడే ప్రసవానికి ఏర్పాటు చేస్తే అక్కడ చెట్టు క్రింద పుట్టాడు శతృఘ్న కుమార్. శతృఘ్న దేవాలయం వద్ద జన్మించినందున ఆయన పేరు శతృఘ్న కుమార్ అని పెట్టారు. ఈ సంఘటన వల్ల బాబా సర్వజ్ఞుడని, భూత భవిష్య ద్వర్తమానాల్లో జరిగినవి, జరిగేవి అన్నీ బాబాకు తెలుసనే విషయం కుమార్‌కు రూఢీ అయింది. జీవితాంతం బాబా సేవ చేసి ధన్యుడైనాడు.

బాబా హరిద్వార్ వద్ద గల మోతీచూర్‌లో కూడా ఒక యిల్లు నివాసానికేర్పరచుకున్నారు. తనకు కావలసిన కొంత మంది అనుచరులను మాత్రమే తనతో ఉంచుకొని మిగిలినవారిని బాబా ఆదేశాల ప్రకారం ఏదైనా వృత్తి గాని, ఉద్యోగం గాని చేపట్టి జీవితం గడుపుతూ మిగిలిన డబ్బును బాబా సేవకై వినియోగించాలని చెప్పి పంపించి వేశారు. వారి యిష్టానుసారం వారు తమ జీవితాలను గడపటానికి ఐదు రకాల విధానాలను బాబా సూచించారు. బాబా అనుచరులు సామూహికముగా గాని వ్యక్తిగతంగా గాని బాబా ఆదేశాల ప్రకారం జీవితాలు గడుపవచ్చును. సామూహిక జీవితం గడిపే వారు వారికిష్టమైన భోజనం చేయవచ్చును. దుస్తులు వారి యిష్టానుసారం ధరింప వచ్చును కాని వారికి వ్యక్తిగతమైన ఆస్తి ఏదీ ఉంచుకోకూడదు. అందరూ సంపాదించినది సామూహికంగానే ఉంటుంది. అవసరమైతే ప్రారంభంలో వారికి బాబా ధన సహాయం కూడా చేస్తానన్నారు. ఈ ఆదేశాలకు లోబడి కొంతమంది అనుచరులు ఢిల్లీలోని కే.కే. దేశాయ్ యింటిలో నేతి వ్యాపారం ప్రారంభించి నడిపారు. అది నష్టంతోనే అంతమైంది. జీవితం గడుపుతూ ఉండటానికి ఏ విధానాన్ని ఎంచుకున్నా సరేకాని సహచరులు బాబా నుండి ఏవిధమైన లాభాన్ని గాని, ఆయన (నజర్) కృపను గాని ఆశించ రాదు. అవసరమైనప్పుడు మాత్రమే తల్లి, భార్య, సోదరి, కుమార్తెలను తప్ప ఏ స్త్రీని తాకరాదు. వైద్యవృత్తిని స్వీకరించిన వారు అవసరం ప్రకారం చికిత్స కొరకు వచ్చే స్త్రీలను తాకవచ్చు. రాజకీయాలలో ప్రవేశించరాదు. మాటలలో, చేతలలో ఎవరి యెడల కోపాన్ని వ్యక్తం చేయరాదు. ఏ పరిస్థితులలోను అబద్ధమాడరాదు. ఎవరినుండి మర్యాదలు, జోహార్లు స్వీకరించరాదు.

తనతో ఉండిపోయిన సహచరులతో బాబా హరిద్వార్, ఋషీకేశ్ ప్రాంతాల్లో మస్తుల, సాధు సత్పురుషుల సాంగత్యం చేసి తన కార్యక్రమాన్ని కొనసాగించారు. ఎన్నో ఇబ్బందుల కోర్చి బాబా ప్రతిరోజు డెహ్రాడూన్ నుండి గాని, మోతీచూర్‌లో రాత్రి మకాము చేసిన రోజుల్లో మోతీచూర్ నుండి హరిద్వార్‌కు వెళ్ళి గాని ఈ కార్యక్రమాన్ని నెరవేర్చారు.

1950 సంవత్సరం ఏప్రిల్ మాసంలో హరిద్వార్‌లో కుంభమేళా జరిగింది. లక్షలాది ప్రజలు గంగానదిలో స్నానం చేయడానికి వచ్చారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని బాబా అక్కడికి వచ్చిన దాదాపు 10000 మంది సాధు సత్పురుషులకు ప్రతివారికి వంగి నమస్కారం చేశారు. అక్కడికి వచ్చిన లక్షల జనంలో తిరిగి తన ఆధ్యాత్మిక కార్యాన్ని నెరవేర్చారు. నవజీవనం, తర్వాత స్వేచ్ఛామయ జీవితం ఆ తర్వాత జ్యోతిర్మయ స్వేచ్ఛాజీవితం అనే వివిధ దశల్లో నవజీవనం గడిపి దానిని 1952 ఫిబ్రవరిలో ముగించేశారు. 16.10.1950 తేదీన నవజీవనం ప్రారంభించి సరిగ్గా ఒక సంవత్సరం గడిచిన సందర్భంగా మహాబలేశ్వర్‌లో సమవేశమేర్పరచారు. ఆ రోజు బాబా 'సెర్మన్' అనే ఉపదేశాన్ని ఇచ్చారు. ఆ రోజు బాబా ప్రేమికులందరికీ ఆయనను దర్శించుకునే భాగ్యాన్ని







కలుగజేయడమే గాక బాబా చేయబోయే పేదల కార్యక్రమానికి విరాళాలు కూడా స్వీకరించారు. ఆ రోజు బాబాను దర్శించిన వారిలో హమీర్‌పూర్ వాస్తవ్యులైన పుకార్ కూడా ఉన్నారు. ఆయన బాబాను మొట్టమొదటి సారిగా దర్శించుకున్నారు. ఆయనను బాబా 'నా హనుమాన్' అని చెప్పేవారు. ఆజాను బాహువు, ధృఢకాయుడు అయిన పుకార్ కమ్యూనిస్ట్ భావాలు కలవాడు. ఆంగ్లేయుల పాలనకు వ్యతిరేకంగా పోరాటం సల్పి పుకార్ అనే పత్రికను హిందీ భాషలో నడపేవాడు. శ్రీపతి సహాయ్ అనే అతని ద్వారా మెహెర్‌బాబా గురించి విని 'మనిషి

భగవంతుడెలా అవుతాడు? బాబా 'నేను భగవంతుడ' నని చెప్పడం డంబమని, ఆ మోసాన్ని బట్ట బయలు చేసి ప్రజలకు చూపిస్తా' నని బాబాను ముఖా ముఖిగా చూచి ప్రశ్నించడానికి బాబాను హరిద్వార్ నుండి వెంటాడాడు.

పుకార్ హరిద్వార్‌లో ఒక మేడపై బాబా నిలబడి ఉండడం చూచాడు. అది ఒక సత్రం. వెంటనే పుకార్ అక్కడికి వెళ్ళి విచారించాడు. బాబా క్రితం రోజునే వెళ్ళి పోయారని చెప్పాడు ఆ సత్రం యజమాని. వారి సత్రపు రిజిష్టర్‌లో వ్రాయబడిన సమయాన్ని చూపించాడు. తన కళ్ళతో తాను చూచినందున పుకార్ నమ్మలేకపోయాడు. దీనితో బాబా గురించిన శోధన తీవ్రమైనది. ఎక్కడా ఆయనకు బాబాను చూచే అవకాశం లభించలేదు. 16.10.1950వ తేదీన మహాబలేశ్వర్‌లో బాబా దర్శనం చేసుకున్నాడు. ఆ రోజు బాబా క్రొత్తవారి నెవరినీ హాలులోనికి పంప రాదని ఆదేశించారు. వారు ఏవైనా నియమాలనుల్లంఘిస్తే దానికి బాధ్యులైన వారికి బదులు తానే శిక్ష ననుభవించాల్సి వస్తుందని చెప్పారు. మండలి వారందరిలోకి వయోవృద్ధుడైన గుస్తాద్‌జీ రావడం చూసి గేటు వద్ద నున్న వారు హాలు తలుపులను మూయడంలో కొంత ఆలస్యం చేశారు. ఈలోగా ఇద్దరు కొత్తవాళ్ళు హాలులోనికి ప్రవేశించారు. వారు నేరుగా బాబా వద్దకు వెళ్ళి బాబా పాదాలకు ప్రణమిల్లారు. బాబా ఆదేశాల ననుసరించి ఎవ్వరూ బాబా పాదాల వద్ద ప్రణమిల్లకూడదు. అందుకని బాబా వారి పాదాలకు మ్రొక్కారు. మళ్ళీ వారు బాబా పాదాలకు మ్రొక్కారు. మళ్ళీ బాబా వారి పాదాలకు మ్రొక్కారు. వెంటనే ఈరుచ్ వచ్చి వారిని బాబా పాదాలకు మ్రొక్కకుండా వారించి ఆపివేశాడు. దానికి బాధ్యులెవరని బాబా విచారించి వారికి బదులుగా తానే శిక్ష ననుభవించాలని చెప్పి గట్టిగా తన చెంప పైన కొట్టుమని ఆదేశించారు. వెంటనే ఆ ఆదేశాన్ని పొందిన శిష్యుడు బాబా చెంపపై గట్టిగా కొట్టాడు. స్నిగ్ధ సుకుమారమైన బాబా చెక్కిలి కందిపోయి ఎర్రగా మారింది. బాబా ఆ తర్వాత వెళ్ళి కుర్చీలో కూర్చుని దర్శనం యిచ్చారు. దర్శనం కోసం వరుసలో నిలబడియున్న పుకార్ అంతవరకూ జరిగిన సంఘటన, బాబా స్వయంగా శిక్షననుభవించి దృశ్యం కళ్ళారా చూడగానే ఆయన కళ్ళు

అశ్రుపూరితాలయ్యాయి. బాబాపై ఆయనకు గల వ్యతిరేక భావం అక్కడ జరిగిన సన్నివేశం చూడగానే మంచులా కరిగి పోయింది. అంత సహనం కలిగిన మహత్తర వ్యక్తి మోసగాడు కాదు. కావున బాబా చెప్పిన మాటల్లో అసత్యం ఉండదు. ఆయన చెప్పినట్లు బాబా సాక్షాత్తు భగవంతుడే అనే విశ్వాసం కలిగింది. కొన్ని మాసాలుగా పుకార్ బాబాను కలుసుకోవడానికి చేసిన ప్రయత్నం ఈ రకంగా ఫలించింది. బాబా మండలిలో నొకడై ముమ్ముందు జీవితాంతం బాబా సేవ చేసుకునే భాగ్యానికి నోచుకున్న పుకార్ మనస్సులో అంతవరకూ చోటుచేసుకున్న వ్యతిరేక భావాన్ని మాటయైనా మాట్లాడకుండా అలాంటి సన్నివేశాన్ని కల్పించి తద్వారా పుకార్ హృదయం లోని ప్రేమను మేల్కొల్పారు బాబా.

ఆ రోజు ప్రేమికులు ప్రేమతో యిచ్చిన డబ్బును బాబా బీహార్ రాష్ట్రంలో సంభవించిన వరద బాధితులకు స్వయంగా ఆ గ్రామాలకు వెళ్ళి పంచిపెట్టి ప్రభుత్వ సహాయం అందని ఎన్నో కుటుంబాల నాదుకున్నారు. అలాగే గూడూరు, మద్రాసు, హైదరాబాదు పట్టణాలలో బాగా బ్రతికి ఆర్థికంగా చితికిపోయి దుర్భర జీవితం గడిపే పేదవారికి ధనసహాయం చేశారు. నిత్యం భిక్షమడిగే వారికి కాక బాగా బ్రతికి కాలక్రమేణా బీదవార్రై, జీవనాధారం లేక భిక్షమడగటానికి మనసొప్పక దుర్భర జీవితం గడిపే వారికి చేసిన దానం యుక్తమైనది నిజమైన దానం అన్నారు బాబా. వారి హృదయాంతరాళాల నుండి చేసే ఆర్తనాదం సర్వ హృదయజ్ఞుడైన బాబాకు విన్పించకుండా ఎలా ఉంటుంది. బాబా ఆదుకున్న అలాంటి కుటుంబాలకు సంబంధించిన రెండు సంఘటనలు ఇక్కడ వివరించబడినవి.

బాబా మద్రాసు వద్ద గల గూడూరు నగరం వెళ్ళి రైలు స్టేషన్‌లో కూర్చుని ఈరుచ్‌ను అలాంటి కుటుంబం నివసిస్తున్న అడ్రసు తీసుకొని రమ్మన్నారు. అక్కడి భాష రాదు. అలాంటి కుటుంబం వారి ఊరు పేరు తెలియదు. మరి కనుక్కోవడమెలా? ఈ జగన్నాటక సూత్రధారియైన బాబా వద్ద సర్వము అర్పణ చేసి జీవితం గడుపుతున్న ఈరుచ్ బాబా తన పని ఎలా నెరవేర్చుకుంటాడో తెలుసు

కావున బయలుదేరి వెళ్ళి ఒక టీ అంగడి వద్ద టీ త్రాగడానికి వెళ్ళి నిలబడ్డాడు. అక్కడే నిలబడిన యిద్దరు ఎక్కువ భాగం ఇంగ్లీషులో మాట్లాడుకుంటున్న సంభాషణ విన్నాడు. వారు బాగా బ్రతికి మోసపోయి చితికి పోయిన ఒక కుటుంబం గురించి మాట్లాడుకుంటున్నారు. వారినర్థించి ఆ కుటుంబం యొక్క వివరాలు తెలుసుకున్నాడు. ఆయన ఒక కాంట్రాక్టర్. అతని భాగస్వామి చేసిన మోసానికి బలియై తన ఆస్థినంతా పోగొట్టుకున్నాడు. పెద్ద బంగళా ఉండేది. అది కూడా ఆ భాగస్వామి స్వాధీనం చేసుకొని ఆయనను నిరాశ్రయుడిగా చేశాడు. ఇప్పుడు మోసం చేసిన భాగస్వామి ఆ బంగళాలో ఉంటుంటే అసలైన ఆ యజమాని పూరిగుడిసెలో చావలేక బ్రతకలేక జీవన సమరం సాగిస్తున్నాడు. ఆయనకు వివాహానికి ఎదిగిన ఒక కూతురు కూడా ఉంది. ఈరుచ్ ఆ బంగళా వద్దకు వెళ్ళి అతని అడ్రస్ అడిగితే ఆ భాగస్వామి వచ్చి తనకు తెలియదు పొమ్మని కోపంతో గేటువేసుకొని వెళ్ళిపోయాడు. వెంటనే ఒక చిన్న కుర్రవాడు లోపలినుండి వచ్చి ఈరుచ్‌కు ఆ వీధి చివరలో వారుండే గుడిసెను చూపించి వెళ్ళిపోయాడు. ఈరుచ్ స్టేషన్‌కు వెళ్ళి బాబాను తీసుకొని బాబా ఆదేశానుసారంగా ఒక బక్కెట్‌లో నీరు తీసుకొని ఆ పూరిగుడిసె వద్దకు వెళ్ళారు. వీరు వెళ్ళిన సమయంలో ఆ ఆభాగ్యుని కూతురు కృష్ణవిగ్రహం ముందు ప్రణమిల్లి 'కృష్ణా! దీపావళి రోజు కనీసం దీపం వెలిగించడాని నూనె కూడా లేని దుర్భర దారిద్ర్యంలో ముంచి వేశావు. పాల ముంచినా, నీట ముంచినా నీదే భారం' అని ఏడుస్తోంది. ఈరుచ్ వెళ్ళి విషయం ఆమెకు చెప్పి ఆమె తండ్రిని లేపి కూర్చోబెట్టాడు. ఆ అమ్మాయి ఆంగ్లంలో చాల చక్కగా మాట్లాడింది. బాబా నీళ్ళతో ఆయన పాదాలు కడిగి ప్రేమ హృదయాలు యిచ్చిన దైవదక్షిణ స్వీకరించమంటూ ఆయన చేతిలో 500 రూపాయల పొట్లం ఉంచారు. ఆ అమ్మాయి ఊహించకుండా అవసరానికి అందిన ఆ డబ్బును చూసి ప్రేమాతిశయంతో కృష్ణుడే తన మొఱ ఆలకించి ఈ రూపంగా వచ్చి తమ నాదుకున్నాడని భావించి మళ్ళీ కృష్ణ విగ్రహం ముందుకు వెళ్లి మోకరిల్లింది. వచ్చింది సాక్షాత్తు కృష్ణుడే అని ఆమెకేమి తెలుసు? అని తలుస్తూ బయటికి నడిచాడు ఈరుచ్.

హైదరాబాద్‌లో కోటీశ్వరుడైన ఒక నవాబు ఉండేవాడు. ఆయనకు సరుకులు చేరవేసే రైలు పెట్టెలు కూడా ఉండేవి. పెద్ద వ్యాపారం ఉండేది. ఆయన మరణిస్తూ తన కుమారుని పిలిచి 'మూడు తరాల వరకూ తిన్నా తరగని ధనాన్ని కూడబెట్టాను. నీ యిష్టం వచ్చినట్లు ఖర్చుచేసినా లోటు ఉండదు' అని చెప్పి చనిపోయాడు. కుమారుడు తనకు సంక్రమించిన ఆస్తిని జూదం, గుర్రపు పందాలు మొదలగు ఎన్నో వ్యసనాలలో యిష్టం వచ్చినట్లు ఖర్చుచేశాడు. కాలక్రమేణా ఆస్తులన్నీ పోయాయి. కూర్చుని తింటే కొండలైనా కరిగిపోకుండా ఉంటాయా! దుర్దశ దాపురించింది. భోగలాలసమైన జీవితాన్ని గడిపిన అతడు భార్యాబిడ్డలను పోషించలేని దుస్థితికి చేరుకున్నాడు. దానికి తోడు అనారోగ్యం పీడించసాగింది. మందులకు కూడా డబ్బులేక పోవడంతో ప్రభుత్వ ఆసుపత్రికి మందుకై ఆయన భార్య వెళ్ళింది. ఆ సమయంలో బాబా ఆ వ్యక్తి వద్దకు వెళ్ళారు. ఆయనను లేపి కాళ్ళు కడిగి చేతిలో దైవ దక్షిణగా డబ్బు పెట్టారు. ఆ డబ్బును చూచి నమ్మలేక ఆశ్చర్యంతో స్పృహ తప్పిపడిపోయాడు. అంతలోనే ఆయన భార్య అక్కడికి వచ్చి తన భర్తనేం చేసారు? చచ్చి పోయాడు కాబోలు అని రోదించసాగింది. చుట్టుపక్కల వాళ్ళు వచ్చి బాబాను బాబా సహచరులను దూషించసాగారు. కొంతసేపటికి మూర్ఛ పోయిన వ్యక్తి లేచిన తర్వాత అసలు విషయం తెలుసుకొని క్షమించమని కోరుతూ అందరూ ఎవరి దారిన వారు వెళ్ళిపోయారు. ఆయన భార్యకు కూడా మందుల కోసం బాబా యింకా కొంచెం డబ్బు యిప్పించి అక్కడి నుండి వెళ్ళిపోయారు.

బాబా ఈ కార్యక్రమాలకై ప్రేమికులు యిచ్చిన డబ్బుకు సరియైన లెక్క వ్రాయడంలో చాల శ్రద్ధ వహించి అనుచరులలోని ఒకరికా పని పురమాయించి ప్రతి ఖర్చుకు సరియైన లెక్క వ్రాయించారు. బాబా బీదల కోసం, మస్తుల కార్యక్రమం కోసం, వేల రూపాయలు ఖర్చు చేసినా తనకు తన అనుచరులకు మాత్రం చాల స్వల్పంగా ఖర్చు చేసేవారు. కనీసావసరాలకు మాత్రం సరిపోయే ఖర్చు చేయించే వారు. ఎవరికీ తెలియకుండా ఏ ప్రచారం లేకుండా

నిరాడంబరంగా ఆర్తులైన వారికి ఈ రకంగా సహాయం చేయడమే గాక ప్రేమ పూరిత హృదయాలను ప్రేరేపించి వారి ద్వారా సేకరించిన ధనాన్ని దుర్భర దారిద్ర్యంలో మ్రగ్గుతున్న అనేక మంది ఆర్తులకు సహాయాన్నందించే పని యుగావతారుడు, ప్రేమమూర్తి, కరుణామయుడైన మెహెర్ బాబాకు దప్ప అన్యులకు సాధ్యమవుతుందా?

## మనోనాశన కార్యక్రమం

నవజీవనం తర్వాత కొనసాగిన స్వేచ్ఛాజీవితంలో బాబా హైదరాబాద్‌లో నొనరించిన మనోనాశన కార్యక్రమం ఎంతో మహత్తరమైనది. అంతకు పూర్వం కూడా మస్తుల కార్యక్రమంలో చాలా సార్లు హైదరాబాద్‌లో ఉన్నారు. నీలి బస్సుల్లో చేసిన పర్యటనలలో భాగంగా 09.12.38 నుండి 18.12.38 వరకు హైదరాబాద్‌లో మకాము చేసి విశ్వ ఆధ్యాత్మిక కేంద్ర స్థాపనకు అనువైన స్థలం గురించి హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో అన్వేషణ సాగించారు. తరువాత 1945, 1947, 1949, 1950 సంవత్సరాలలో అనేక సార్లు హైదరాబాద్‌లో బస చేసారు. 1950వ సంవత్సరం జనవరి 16వ తేదీనుండి చాలా కాలం హైదరాబాద్ కేంద్రంగా మకాము చేసి పనిచేసారు. ఎందరో మస్తులను హైదరాబాద్‌లో కలుసుకొని సాంగత్యం చేశారు. 1951వ సంవత్సరం అక్టోబర్ 16వ తేదీ నుండి 23వ తేదీ వరకు బాబా హైదరాబాద్ నగర శివార్లలో గల ఖోజాగూడా అనే గ్రామం ప్రక్కన గల ఒక కొండపైన ఏకాంత వాసం చేసి ఈ మనోనాశన కార్యక్రమాన్ని చేశారు. ఈ కార్యక్రం కోసం బాబా 1951 జూన్ మాసంలోనే మండలివారితోను, ప్రేమికులతోను ఒక సమావేశమేర్పరచి ఈ కార్యక్రమానికి కావలసిన ఏర్పాట్లగురించి చర్చించారు. సమావేశం ఆఖరి రోజు 30.06.1951 తేదీన పబ్లిక్ గార్డెన్ లో పచార్లు చేస్తూ బాబా ఇలా అన్నారు – “హైదరాబాద్ యొక్క ఆధ్యాత్మిక వాతావరణం అంటే నాకు ఇష్టం. ప్రత్యేకంగా ఆధ్యాత్మికమైన విషయాల్లో హిందువులకు, ముస్లిములకు గల ఏకాభిప్రాయం వల్ల హైదరాబాదంటే నాకు యిష్టం”. ఇంకొక సందర్భంలో హైదరాబాద్ గురించి ప్రస్తావన రాగా

హైదరాబాద్‌లో ఉన్నంత మంది మస్తులు ప్రపంచంలోని మరే ప్రాంతంలోను లేరని బాబా చెప్పారు. జూన్ 1951లో జరిగిన సమావేశాల్లో మనోనాశన కార్యక్రమాలకు చేయవలసిన ఏర్పాట్ల గురించి బాబా చర్చించారు.

హైదరాబాద్ నగరానికి అనతి దూరంలో ఒక గ్రామానికి దగ్గరలో కొండపైన ఇరువైపులా రెండు జలాశయాలు కన్పించే విధంగా ఉండి ఆధ్యాత్మికంగా ప్రఖ్యాతిగాంచిన పవిత్ర క్షేత్రాలతో పరివేష్ఠింపబడిన స్థలంలో తన పని చేయాలని బాబా సూచించారు. ఈరుచ్ మొదలగు మండలివారు చాలా స్థలాలను చూచి తుదకు కస్తూరి లింగయ్య అనే కలప వ్యాపారి సాయంతో ఈ ఖోజాగూడా ప్రక్కన గల కొండను ఎంచుకొన్నారు. ఖోజాగూడా పాత బొంబాయి రోడ్డులో దర్గా తరువాత ఎడమ వైపున ఉంది. ఈ స్థలానికి బాబా చెప్పిన షరతులన్నీ సరిపోయాయి. కొండపైకి ఎక్కగానే ఒక ప్రక్కన 14వ శతాబ్దంలో నివసించిన హజ్రత్ బాబా ఫక్రుద్దీన్ అనే మహమ్మదీయ సాధు పురుషుని దర్గా మరియు ఇంకొక ప్రక్కన దిగున భాగంలో పురాతన వైభవం గలిగిన అనంత పద్మనాభ స్వామి దేవాలయం ఉన్నాయి. కస్తూరి లింగయ్య శ్రద్ధాభక్తులతో ఆ కొండపైన విస్తరించియున్న ఒక రాతికి ఒక వైపున గోడ కట్టి గుహగా నిర్మించి, ఆ కొండ ఎక్కడానికి మెట్లదారిని కట్టించాడు. ఈ గుహలో బాబా చేసే మనోనాశన కార్యక్రమానికి ముఖ్యమైన మతాలకు సంబంధించిన ప్రార్థనా మందిరాల నమూనాలను ప్లాస్టర్ అఫ్ ప్యారిస్‌తో తయారు చేయించి తెప్పించారు. హిందువుల మందిరం, మసీదు, చర్చి, అగ్ని దేవాలయం, పగోడాలు ఈ నమూనాలుగా చేయించబడ్డాయి. గుహలో బాబా చేసిన ఏకాంత వాసంలో 16.10.51 నుండి 24.10.51 వరకు ఈ నమునాలను తన సమక్షంలో నుంచుకొని వాటి స్థానాలను మరుస్తూ తనతోనే ఉంచుకున్నారు. బాబా ఈ కార్యక్రమాన్ని చేపట్టిన రోజున హైదరాబాద్‌లోను ఇతర స్థలాల్లోను అన్ని మతాలకు చెందిన ఆలయాల్లో, మసీదుల్లో ఆయా మతాలకు చెందిన తన శిష్యులతో ప్రార్థనలు చేయించారు.

మనస్సనగా సంస్కారముల నిలయం. అది పరిమితమైన అహంకారము

ద్వారా ప్రకటితమౌతుంది. సంస్కారములు లేకుండా చేస్తే పరిమితమైన మనస్సుయొక్క అహంకారం నశించి 'అహం బ్రహ్మాస్మి' అనే సత్యాన్ని అనుభవ పూర్వకంగా తెలుసుకుంటుంది. అదే అన్ని జీవాత్మల గమ్యం. బాబా సనాతనుడు, అవతారుడు కాబట్టి ఆయనకు తనదంటూ ఏ సంస్కారముండదు. ఆయన పని యావత్ప్రపంచానికి, జీవాత్మల కోసమే గాని ఆయన కొరకు గాదు. ఈ మనోనాశన కార్యం కూడా ద్వంద్వాలకు బద్ధులైన మానవాళిని ద్వంద్వాతీతమైన నిజ స్వరూపాన్ని తెలుసుకొనే దారిలోనికి మళ్ళించడానికి, భౌతికం నుండి ఆధ్యాత్మికం వైపు మానవాళి మనస్సును త్రిప్పడానికి ఉద్దేశించినదే.

హైదరాబాద్‌లో ఈ మనోనాశన కార్యక్రమం ముగిసిన తరువాత బాబా హైదరాబాద్ నుండి మెహెరాజాద్ కు గుస్తాద్‌జీ, బైదుల్, పెండు, ఈరుచ్ మరియు దౌలత్ సింగ్ అనే ఐదుగురు అనుచరులతో 24.10.1951 మధ్యాహ్నం ప్రయాణమయ్యారు. కాలినడకతో వెళ్ళాలని నిశ్చయించిన ఆ ప్రయాణం అవసరాన్ని బట్టి బస్సు, లారీ, ఎద్దుల బండి మొదలగు వాహనాలలో కూడా సాగింది. మెహెరాజాద్ వెనకాల గల తెంబి కొండ (ఏకాంత వాసపు కొండ) చేరడానికి నెల రోజులు పట్టింది. ఈ ప్రయాణం లింగంపేట, జోగీపేట, సదాశివపేట, చిటగోప, హుమ్నాబాద్, గుల్బర్గా, యాదగిర్, తుమ్కూర్, పైఠాన్, నాందేడ్ మొదలగు పలు గ్రామాలు, పట్టణాల మీదుగా సాగింది. అస్వస్థత కారణంగా దౌలత్‌సింగ్‌ను ఔరంగాబాద్‌లో విడిచి వెళ్ళారు.

మెహెరాజాద్ కొండకు చేరక ముందు ఆఖరి మజిలీ బాబా ఇమాంపూర్ మసీదులో చేసారు. అది పాడు పడిపోయి వాడుకలో లేని పురాతన కట్టడము. ఈరుచ్ నేలను శుభ్రపరిచి గొంగళి పరిచి బాబా పడుకోవడానికి ఏర్పాటు చేశాడు. బాబా విశ్రమించగానే పై కప్పునుండి ఏదో శబ్దం వచ్చింది. బాబా ఈరుచ్‌ను పిలిచి అదేదో చూడమన్నారు. అక్కడొక పక్షి ఉంది. దాని రెక్కల కదలిక వల్ల ఆ శబ్దం వచ్చింది. ఆ పక్షిని బయటకు తోసెయ్యమన్నారు బాబా. అలాగే చెయ్యడానికి ఈరుచ్ పక్షి గూటిలో చెయ్యి పెట్టాడు. వెంటనే బాబా చప్పట్లు కొట్టి ఈరుచ్‌ను

పిలిచి ‘అ పక్షిని బయటకు తోసేశావా’ అని అడిగారు. ‘లేదు బాబా’ అన్నాడు ఈరుచ్. ‘భగవంతుని దయ వల్ల ఆ పని జరుగక పోవడం మంచిదయ్యింది. నవజీవన నియమాల ప్రకారం మనం ఏ జీవికి హాని తల పెట్టరాదు గదా! మరిచి పోయావా! ఆ విషయం నాకెందుకు గుర్తు చేయలేదు’ అని బాబా ఈరుచ్‌ను మందలించారు. ‘పోనీలే! ఆ పక్షిని దాని గూటినుండి బయటికి త్రోసివేయలేదు. అలా జరిగి ఉంటే నవజీవన ఘట్టం యావత్తు నిష్ప్రయోజనం అయిపోయేది’ అన్నారు బాబా.

మరునాడుదయం బాబా సహచరులను సమావేశ పరిచి ఈరుచ్ ద్వారా రాత్రి జరిగిన సంఘటన వివరాలు తెలియజేశారు. ఆ తప్పిదానికి శిక్ష తానే వహిస్తానని చెప్పి ఈరుచ్‌ని పిలిచి అతని పాదరక్షతో తన చెక్కిలిపై కొట్టమన్నారు. దానికి తాను కూడా కారణభూతుడైనా బాబా ఆదేశానుసారం అలాగే కొట్టాడు ఈరుచ్. బాబా తన చెవులను తానే మెలి వేసుకున్నారు. సహచరులందరినీ తనపై ఉమ్మివేయమన్నారు. బాబా ఆజ్ఞలను తు.చ. తప్పక పాటించాలి కాబట్టి అనుచరులు బాబా ఆజ్ఞాపించినట్లు చేసారు. అప్పుడు వారు పొందిన మనస్తాపమును వర్ణించలేము కాని అది కేవలం బాబాకు మాత్రమే గోచరమయ్యేది. అనివార్య కారణాల మూలంగా తన అనుచరుల ద్వారానే అట్టి అవమానానికి తనను గురి చేసుకోవడం భావి తరాల వారికి ఒక ఆదర్శాన్ని ఏర్పరచి ఎట్టి పరిస్థితులలోను జీవరాసులన్నింటిలో గల మనుగడను, అవిభాజ్యమైన ప్రాణాన్ని వినయంగా, దయతో గౌరవించాలనే పాఠాన్ని నేర్పారని తోస్తుంది.



23.11.1951 నాడు మెహెరాజాద్‌లోని ఆశ్రమం వెనుక గల తెంబి కొండపైన నిర్మించిన తన కుటీరానికి నేరుగా నడిచి వెళ్ళారు బాబా. 14.12.1951 వరకు ఆ కొండపైన

ఏకాంతవాసంలో ఉండి తన విశ్వకార్యాన్ని నెరవేర్చారు. ప్రత్యేకమైన తన విశ్వకార్యక్రమం కోసం ఆ కొండపైన బాబా చేసిన ఏకాంత వాసం వల్ల, ఆయన దివ్య స్పర్శ వల్ల తెంబికొండ పైన గల ప్రతి రాయి పునీతమై ఆయన కార్యానికి ప్రతీకగా నిలిచాయి. నేటికీ ప్రేమికులా కొండపై గల రాళ్ళను తీసుకొని వెళ్ళి బాబా స్పర్శతో పునీతమైన వాటిని తన నివాసాల్లో భద్రపరుచుకొంటున్నారు. 15.12.1951 తేదీ నుండి మనోనాశ్ కార్యక్రమంలోని ఆఖరి ఘట్టం మెహెరాబాద్ కొండ దిగువ భాగంలో ఏర్పరచిన క్యాబిన్‌లో ప్రారంభమైనది. ఐదు మతాలయాల నమూనాలను ఎవరూ ముట్టుకోకుండా బాబా తన ప్రక్కనే ఉంచుకున్నారు. వాటిని మనోనాశ్ కార్యక్రమం ముగిసే వరకు తన సాన్నిధ్యంలోనే ఉంచుకున్నారు. ఆ కార్యక్రమం ద్వారా అన్నిమతాలలో నిగూఢమై ఉన్న ఆధ్యాత్మిక విలువలను బహిర్గతం చేసి పునరజ్జీవింప జేయడమే అవతారుడైన మెహెర్ బాబా చేసిన విశ్వకార్యక్రమం యొక్క ఉద్దేశ్యంగా తోస్తుంది. 31.01.1952వ తేదీన బాబా ఈరుచ్ చేత వర్తులాకారంలో ఒక చిన్న గొయ్యి తీయించి తన స్వహస్తాలతో ధుని వెలిగించారు. ఈరుచ్‌తో ఒక కాగితంపై 'ప్రపంచంలోని మతాలన్నింటిలో గల కర్మ కాండలు ఇందు మూలంగా అగ్నికి ఆహుతి చేయబడుతున్నాయి' అని వ్రాయించి ఆ మాటలను బిగ్గరగా ఈరుచ్‌తో చదివించి బాబా తన చేతులతో ఆ కాగితాన్ని చించి ముక్కలు చేసి ధునిలో వేసి భస్మం చేసారు. అగ్ని చల్లారిన తర్వాత ఆ బూడిదను తన చేతులతో ఎత్తి డబ్బాలలో నింపించి భద్రపరిచారు. గోతిని పూడ్చి వేసారు. ఆ బూడిదను దేనికీ వాడకూడదని చెప్పి డబ్బాలలో భద్రపరిచి ఉంచారు. ఆ మతాలయాల నమూనాలు కూడా మెహెరాబాద్ మ్యూజియంలో భద్రపరచబడి ఉన్నాయి.

నవజీవనానికి ముందు బాబా తన అనుచరులను సందర్భానుసారంగా భగవంతుని ఏ నామాన్నైనా స్మరించమని చెప్పేవారు. కాని నవజీవన ఘట్టం తరువాత మెహెర్ బాబా అనే తన ప్రస్తుత అవతారనామాన్ని స్మరించమని అందరికీ ప్రత్యేకగా తనకు సన్నిహితులైన ప్రేమికులకు సూచించి ఆ నామం ఇహ పరాలకు సంబంధించిన ఏ సమస్యనైనా తీర్చే కల్ప వృక్షం' అని చెప్పారు.

బాబా ప్రారంభించిన నవజీవనం మనోనాశ ఘట్టంతో ముగిసింది. బాబా నవ జీవన సందేశంలో సూచించినట్లుగా కులానికి, మతానికి, సంప్రదాయానికి, కర్మ కాండలకు ప్రాముఖ్యత నీయక, ద్వంద్వాల కతీతమైన జీవనాన్ని గడిపే వారి వల్ల నవజీవనం గడుప బడుతుంది. ఆ జీవనం గడిపే వారెవ్వరు లేకున్నా శాశ్వతంగా అది తనకు తాను మన గలుగుతుంది. బాబా ఆచరించి చూపిన నవజీవనం సాధకులకు మార్గదర్శిగా నిలచి పరిమితమైన స్వార్ధ బంధనాలను తొలగించుకొని ప్రియతమునికి ప్రీతిపాత్రమైన నిజాయితీ గల జీవితాన్ని గడిపే స్థైర్యాన్ని కలుగజేస్తుంది. వర్షంతో మొదలైన నవజీవనం కర్మకాండలను భస్మం చేయడం కోసం వెలిగించిన ధుని యొక్క అగ్ని జ్వాలతో ముగిసింది. బాబా చేసిన కార్యక్రమాల అంతరార్థం తెలియరానిది గదా!

మనోనాశ్ కార్యక్రమం గురించి బాబా ఈ విధంగా చెప్పారు – 'మనోనాశ్ వల్ల అనేకత్వం పోయి ఏకత్వం వస్తుంది. అజ్ఞానం పోయి జ్ఞానం కలుగుతుంది. బంధనాలు తొలగి స్వేచ్ఛ వస్తుంది. మనమందరం అపారమైన అనంత జ్ఞాన సముద్రంలో ఉన్నాము. కాని అజ్ఞానానికి మూలమైన మనస్సు శాశ్వతంగా మాయమయ్యే వరకు అనంతమైన అజ్ఞానంలో మునిగి ఉంటాము. మనస్సు పోగానే అజ్ఞానం సమసిపోతుంది. అజ్ఞానం పోయి జ్ఞానోదయం కలిగే వరకు ఆధ్యాత్మిక సంబంధమైనదంతా ఆకాశ కుసుమమే అవుతుంది. మన కంటికి కనిపించని దేవుని సత్యము అంటున్నాము. కంటితో చూచే ఈ ప్రపంచాన్ని లేనిదనీ, మాయయనీ అంటున్నాము. అనుభవంలో మనకు ఉంది అని తోచేది నిజంగా లేనిది; మనం లేనిదని అనుకున్నది నిజంగా ఉన్నది – మనం మనలను కనుగొనాలంటే మనం మనలను పోగొట్టుకోవాలి. అందుచేత నష్టమే మనకు లాభమన్నమాట. దేవునిలో జీవించడానికి మనము మన జీవాత్మకు చనిపోవాలి. ఆ విధంగా మరణం అంటే జీవిత మన్నమాట. మన లోపల మనం (నేను అనేది) పూర్తిగా ఖాళీ అయిపోతే మన హృదయాన్ని దేవుడు నిండుగా ఆక్రమిస్తాడు. పూర్తి ఖాళీ అంటే నిజంగా నిండుతనం అన్నమాట – జీవాత్మకు మనం నగ్నంగా మారాలి. మనది (నాది)

అన్నదేది మిగుల కూడదు. అంతా దేవుని అనంతత్వంలో లీనమవ్వాలి. అందుచేత శూన్యమే సర్వమన్నమాట. మనస్సు ఎప్పుడూ అర్థం చేసుకోలేనిదాన్ని మనస్సుతో అర్థం చేసుకుందామని ప్రయత్నించడం వ్యర్థం, భాషల శబ్దాలలో సర్వోత్కృష్టమైన ఆత్మస్థితిని వ్యక్త పరచాలని చూడడం అంతకన్నా వ్యర్థం. ఆ స్థితిని అనుభవించి జీవించిన వారు చెప్పగలిగినది, చెప్పేది ఏమిటంటే అబద్ధపు ఆత్మ పోగానే అసలైన ఆత్మజ్ఞానం కలుగుతుంది. అసత్యపు 'నేను' మరణిస్తేనే సత్యమైన నేను కనుగొన బడుతుంది. మనకు మనం చనిపోవడం, మరణం అన్నింటినీ అంతమొందించే నిజమైన మరణం ఒక్కటే శాశ్వత జీవనానికి మార్గం. అంటే మనస్సు ఎప్పుడైతే కోరికలతోను, వాంఛలతోను, అభిలాషతోను దివ్యప్రేమాగ్నిలో ఆహుతి అయిపోతుందో అప్పుడు అనంతము, అవినాశము, అవిభాజ్యము, శాశ్వతము అయిన ఆత్మ వ్యక్తమవుతుంది. ఇదే మనోనాశ్. అసత్యమైన, పరిమితమైన, దుఃఖ భాజనమైన, అజ్ఞానయుతమైన, నశ్వరమైన 'నేను' స్థానే నిజమైన నేను రావాలి. ఈ నిజమైన 'నేను' అనంత జ్ఞానానికి, ప్రేమకు, శక్తికి, శాంతికి, ఆనందానికి, వైభవానికి మార్పులేని అస్థిత్వంలో శాశ్వతంగా నిలిచి ఉంటుంది.

## మిర్టిల్ బీచ్ కేంద్రం – అమెరికా

1941వ సంవత్సరంలోనే బాబా తన ప్రేమికులైన ఎలిజబెత్ పాటర్సన్, నొరీనాలకు అమెరికాలో తన పనికోసం కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి అనువైన స్థలాన్ని వెదకమని ఆదేశించారు. ప్రశాంతమైన సమతుల్యమైన వాతావరణం, ప్రకృతి రమణీయత, మంచి నీటి సరస్సులు కలిగి సముద్ర తీరాన ఉన్న ఎవ్వరూ వాడని 500 ఎకరాల భూమిని ఎంచుకోవాలని బాబా చెప్పారు. ఆ భూమిని తన పని కోసం హృదయ పూర్వకంగా దాని యజమాని యివ్వాలని బాబా సూచించారు. ఆ స్థలంలో అవసరమైతే వ్యవసాయం చేసి అక్కడ ఉండే వారికి కావలసిన ఆహారం పండించుకునే సానుకూలత ఉండాలి. బాబా ఆదేశానుసారం అమెరికాలో 500 ఎకరాల స్థలంలో బాబా సెంటరును ఏర్పాటు చేయడానికి ఎలిజబెత్ పాటర్సన్

నొరీనా, కిట్టిదేవి తదితరులు ఎంతో ప్రయత్నించారు. ఆ స్థలం ఎవ్వరూ వాడనిదై ఉండాలి. సముద్ర తీరాన ఉండాలి. ప్రకృతి దృశ్యాలు రమణీయంగా ఉండాలి. అలా అన్ని షరతులకు సరిపడే అలాంటి స్థలం దొరకడం కష్టసాధ్యమైన పనే కదా! ఆఖరికి ఎలిజెత్‌కు తన తండ్రికి చెందిన స్థలం సౌత్ కారో లీనాలో మిర్టిల్ బీచ్‌లో ఉన్నది కదా అనే విషయం స్ఫురణకు రావడంతో ఆ స్థలాన్ని బాబా కేంద్రం కొరకు యివ్వవలసిందిగా తన తండ్రిని అర్థించింది. బాబా యిచ్చి ఉంటే ఏ ఆటంకము లేకుండా అన్ని పనులు సానుకూలిస్తాయి గదా! ఎలిజబెత్ తండ్రి మిస్టర్ సిమియా చాపిన్ వెంటనే ఒప్పుకున్నాడు. ఆ స్థలాన్ని తన కూతురికి ఇచ్చాడు. ఆమె దానిని బాబా కేంద్రానికి యిచ్చింది. వారిరువురూ హృదయ పూర్వకంగా ఆ స్థలాన్ని బాబా కోసం ఇచ్చారు. సర్వజ్ఞుడైన బాబా ఆ స్థలంలో తన కేంద్రం రాబోతుందని తెలిసే దానికి సరిపోయే అన్ని షరతులు విధించారు కాబోలు. ఆ స్థలంలోనే నేడు మిర్టిల్ బీచ్ కేంద్రంగా పిలువబడుతున్న బాబా సెంటర్ అతి మనోహరంగా నిర్మించబడింది. దట్టమైన అడవులతో మంచినీటి సరస్సులతో సముద్ర తీరాన వెలసిన మిర్టిల్ బీచ్ కేంద్ర స్థలం ప్రకృతి సౌందర్యానికి, ప్రశాంత వాతావరణానికి నిలయమై దర్శనార్థుల హృదయాలను దోచుకునే ఆహ్లాదకరమైన ప్రదేశంగా పేరు పొందింది. దానిలో బాబాకు ప్రత్యేకంగా ఒక యిల్లు నిర్మించారు. దీనిని బాబా యిల్లు అంటారు. ఆ కేంద్రంలో బస చేసే ప్రేమికుల నివాసానికి సమావేశాలకు కావలసిన యిళ్ళు కూడా నిర్మించారు. ఆ కేంద్రం నిర్మించ బడిన తర్వాత బాబా అమెరికాకు వెళ్లలేదు. ఆయన రాక కోసం అమెరికా లోని బాబా ప్రేమికులు ఎన్నాళ్ళుగానో వేచి చూశారు. ఎట్టకేలకు తన నవజీవన కార్యక్రమం ముగియగానే 1952వ సంవత్సరంలో అమెరికాకు రాగలనని అమెరికాలోని బాబా ప్రేమికులకు, ఎలిజబెత్ మొదలగు వారికి బాబా తెలియజేశారు.

18.04.1952 తేదీన బొంబాయిలో బయలుదేరి బాబా న్యూయార్క్‌లో 20.04.1952 నాడు విమానం దిగి ఆ రాత్రే సౌత్ కారోలీనాలోని ఫ్లొరెన్స్‌కు రైలులో వెళ్ళారు. అక్కడినుండి తిన్నగా మిర్టిల్ బీచ్‌కు వెళ్ళారు. 21.04.1952

తేదీన మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో బాబా మిర్టిల్ బీచ్ చేరుకున్నారు. మిర్టిల్ బీచ్‌లో బాబా యిల్లును, యితర కట్టడాలను ప్రేమతో కట్టించి సుందరంగా తీర్చిదిద్ది నందులకు బాబా చాలా సంతోషించారు. 'తన కోసం నిర్మించిన గృహాలన్నిటిలోకి, తాను సందర్శించిన వాటిలో దీనిని తానమితంగా ప్రేమిస్తున్నాని ఈ స్థలాన్ని విడిచి వెళ్ళనని బాబా చెప్పారు. యుగాలకు పూర్వం ఈ స్థలంలో ఉండి సంచరించానని, సముద్రం సరస్సులు, వనాలు, నిండియున్న ఈ స్థలం విశిష్టమైన వాతావరణంతో కూడి యున్నదని అన్నిటి కంటే మిన్నగా ఈ స్థలం యిచ్చిన వారి హృదయ పూర్వకమైన ప్రేమకు సంతసించి ఈ కానుకను స్వీకరించానని బాబా చెప్పారు. మిర్టిల్ బీచ్ సెంటర్‌కు విచ్చేసిన ప్రేమికులకు పాతవారికి, క్రొత్తవారికి బాబా వ్యక్తిగతంగాను, సామూహికంగాను దర్శన మిచ్చారు. 17.05.1952 తేదీన సార్వత్రిక దినంగా ఏర్పాటు చేసారు. ఆ రోజు ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు దాదాపు 1500 మంది వచ్చి బాబాను దర్శించుకున్నారు. దర్శనార్థులంతా బాబాను చూచి ఆయనచేతిని స్పృశించి వెళ్ళిపోవాలి. బాబాకు కుడివైపున కూర్చున్న ఎలిజబెత్ 'ఇంత త్వరగా వెళ్ళేవారికి మీరెలా సహాయం చేస్తారు బాబా!' అని అడిగింది. 'ఇంకా కొంచెంసేపు ఆగితే వారి మనస్సు పనిచేయడం ప్రారంభిస్తుంది. నేను వారి హృదయాలను స్పృశించాలని కోరుతున్నాను' అన్నారు బాబా. హృదయం కంటె వేగంగా పనిచేసే మనస్సును స్థంభింపజేసి హృదయాన్ని త్వరితంగా పని చేసేలా చేయడమే బాబా పని. ఆ రోజు జాన్‌బాస్ అనునతడు కూడ కూర్చుని యున్నాడు. 'నా జీవితంలో యిది గొప్ప అనుభవం. లైబ్రరీలోని పుస్తకాలన్నీ చదివితే వచ్చే జ్ఞానం కంటె బాబాను దర్శించే వారిని చూస్తూ బాబా సమక్షంలో కూర్చొనడం ద్వారా నేను ఎక్కువగా నేర్చుకున్నాను' అన్నాడు జాన్‌బాస్. ఆ రోజు ప్రవాహంలా బాబా దర్శనానికై వచ్చిన స్త్రీలు, పురుషులు, పిల్లలు బాబా ముందునుండి ఆయన దర్శనం చేసుకొని వెళ్ళారు. బాబా కన్నులనుండి వెలువడే దయ, ప్రేమలతో చలించిన కొందరు దర్శనార్థుల అశ్రుధారలతో నిండిన చెక్కిళ్ళతో విలపిస్తూ వెళ్ళిపోయారు.

## కారు ప్రమాదం

మిర్టిల్ బీచ్ సెంటర్‌లో 20.05.1952వ తేదీ వరకు గడిపి 21.05.1952వ రోజున రెండు కార్లలో కాలిఫోర్నియాకు బయలుదేరారు. బాబా కారును ఎలిజబెత్ పాటర్సన్ నడిపింది. ముందు సీటులో ఎలిజబెత్ ప్రక్కన బాబా కూర్చున్నారు. వెనుక సీటులో మెహెరా, మణి, మెహెరూ ముగ్గురు స్త్రీమండలి వారు కూర్చుకున్నారు. రెండవ కారు సరోష్ నడిపాడు. ఆ కారులో కిట్టీదేవి, రానో, డా.గోహెర్, డెలియా కూర్చున్నారు. బయలుదేరే ముందు బాబా ఎలిజబెత్‌ను కారు ఇన్సూరెన్స్ పాలసీ తెచ్చి కారులో పెట్టుకొమ్మని చెప్పారు. ఆమె అలాగే చేసింది. కాని బాబా ఇన్సూరెన్స్ పాలసీ ఎందుకడిగారో ఆమెకు అర్థం కాలేదు.

1932వ సంవత్సరంలో అమెరికాకు బాబా వచ్చినప్పుడు మే నెల 24వ తేదిన గులాబీ పువ్వునిచ్చి ఆ తేదీని గుర్తుపెట్టుకోవలసిందని ఎలిజబెత్‌కు చెప్పారు. 20 సంవత్సరాల ముందే బాబా 24.05.1952 నాడు జరుగబోయే ప్రమాదాన్ని సూచించారు. ఎలిజబెత్ తన బైబిల్‌లో ఆ పువ్వును భద్రపరిచి ఆ తేదీని వ్రాసిపెట్టుకుంది కాని కాలక్రమేణా మరచిపోయింది.

13.05.1952 రోజున మిర్టిల్ బీచ్ సెంటర్‌లో బాబా చుట్టూ స్త్రీమండలి వారు, పాశ్చాత్య స్త్రీలు కూర్చుని ఉన్నారు. బాబా తన మనస్సులో 1 నుండి 22 వరుకు గల అంకెలలో ఒక దానిని కోరుకున్నానని అది ఎవరైనా చెప్పండి చూద్దాం అని అడిగారు. అందరూ తలా ఒక అంకె చెప్పారు కానీ ఏదీ బాబా కోరుకున్న అంకె కాలేదు. ఆఖరున ఆడిల్ అనునామె ఆ సంఖ్య 11 అని చెప్పింది. ఔను అదే అంకె అని బాబా చెప్పారు. ఆ రోజునుండి సరిగ్గా 11వ రోజునే ప్రమాదం సంభవించింది. ప్రయాణంలో బాబా అనుచరులందరికీ చూడవలసి ప్రదేశాలన్నీ చూపిస్తూ వెళ్లారు. 21.05.1952 రోజున నార్త్ కారోలీనాలోని కొలంబియాలోను, 22.05.1952 రోజున మర్ఫీ అనే చోట, 23.05.1952 తేదీన రుబీ జలపాతం చూసి రాక్ సిటీలో బస చేసారు. 24.05.1952 తేదీన తిరిగి ప్రయాణం సాగించారు.

ఆ రోజు బయలు దేరే ముందు బాబా అదోలా కనిపించారు. కొంచెం సేపు ముంగిట్లో నిశ్చలంగా నిలబడ్డారు. వెనకాలే రెండవ కారులో వచ్చే సరోష్ బృందానికి ఒక క్షణం కూడా తన కారు నుండి దూరంగా వెనకాలే ఉండి పోకూడదని హెచ్చరించారు. కారు బయలు దేరిన తర్వాత మార్గ మధ్యంలో రెండు సార్లు కారు ఆపి రోడ్డు ప్రక్కన పచార్లు చేసారు బాబా. కారు 64వ రహదారిలో వెళుతుంది. రాత్రి వర్షం కురిసిన కారణంగా రోడ్డు తడసి ఉంది. కొండదారి, రోడ్డు విశాలంగా లేదు. ఎదురుగా ఒక కారు రాకూడని ప్రక్కన వస్తుంటే ఎలిజబెత్ తన కారు వేగాన్ని తగ్గించింది. అయినా ఎదురుగా వచ్చే కారు వేగంగా వచ్చి బాబా కారును గుద్దుకుంది.

ఆ కారులో వచ్చే వ్యక్తి కొరియా యుద్ధంలో కాలు పోగొట్టుకున్న క్షత్రగాత్రుడు. ఆ కారు ఆయనకోసం ప్రత్యేకంగా తయారు చేయించుకొని ఆ రోజే మొదటిసారిగా నడుపుతున్నాడు. ఆయనతో ఇంకా ఇద్దరు కారులో ఉన్నారు. వారెవ్వరికీ గాయాలు తగలలేదు. బాబా క్రింద పడిపోయారు. తలకు గాయమై రక్తం స్రవించసాగింది. బాబా ముంజేయి, కాలు ఎముకలు చిట్లిపోయాయి. మెహెరా మరియు మెహెరూ కూడ కారులో నుండి క్రింద పడ్డారు. వారికి కూడా గాయాలైనాయి. కారు నడుపుతున్న ఎలిజబెత్ చేతి ఎముకలు, ఛాతీలోని ఎముకలు చిట్లిపోయిన గాయాలతో స్టీరింగ్‌పైననే పడిపోయింది ఒక్క మణి (బాబా గారి చెల్లెలు) మాత్రం ఏ గాయాలు లేకుండా బయటపడింది. వెనకాల కారులో వస్తున్న సరోష్ బృందం వారు ప్రమాద సమయంలో తోడుగా లేకుండా వెనకాలే ఉండిపోయారు. బాబా హెచ్చరిక చేసినా దారిలో 'కూల్ డ్రింక్స్' త్రాగడానికి ఆగిపోయారు. ఎదురుగా వచ్చిన ఒక కారు యజమాని 7 కి.మీ. దూరంలోగల ఓక్లహోమా లోని ప్రేగ్ ఆసుపత్రికి తన భార్యను ప్రసవానికి తీసుకొని వెళ్తున్నాడు. ఈ ప్రమాదాన్ని చూచి రెండు అంబులెన్స్‌లను తెప్పించి గాయపడిన వారిని అంబులెన్స్‌లలో ఎక్కించే సమయానికి సరోష్ బృందం వారు వచ్చే కారు ప్రమాద స్థలానికి చేరింధి. ఆ దృశ్యాన్ని చూచి వారి పొరపాటుకు కలిగిన ఆవేదన

వర్ణించరానిది. బాబాకు, గాయపడిన వారికి ప్రేగ్ ఆసుపత్రిలో చికిత్స చేసారు. వారక్కడ 13 రోజులున్నారు. మెహెరాకు గాయాలు తగిలినందుకు బాబా తన చింతను వ్యక్తం చేస్తూ దాని వల్ల తన బాధ తీవ్రమైందన్నారు. ఆసుపత్రి నుండి 1500 కి.మీ. దూరంలో గల మిర్టిల్ బీచ్‌కు మళ్ళీ అంబులెన్స్‌లో వెళ్ళారు. నెమ్మదిగా అందరూ కోలుకున్నారు.

'నేను ముందుగానే ఊహించి చెప్పిన ప్రమాదము నా భౌతిక కాయాన్ని గాయపరచి అమెరికా నేలపైన రక్తం చిందేటట్లు చేసింది. నా తలకు, చేతికి, కాలుకు బాహ్యంగా తగిలిన గాయాలే గాక మానసిక బాధను కూడా కలుజేసింది. దైవేచ్ఛ ప్రకారంగా అది అమెరికాలో జరుగవలసి ఉంది. నేను చెప్పినట్లుగానే జరిగింది'.

కొందరు అమెరికావాసులు బాబా అవతారుడైతే ఆయన ఇలా అసహాయుడై ప్రమాదంలో ఎలా చిక్కుకున్నాడనే సందేహాన్ని వెలిబుచ్చారు. జీసస్ క్రీస్తు కావాలని తానే శిలువ వేయించుకో లేదా! మానవాళి కోసం తన రక్తాన్ని చిందించడం దైవీ మానవుడైన అవతారునికి మామూలే కదా! ఆయన అనుసరించే విధానం మామూలు మానవుల మనస్సున కర్థం అవుతుందా?

బాబా అమెరికా నేలపై తన రక్తాన్ని చిందించడంలో ప్రాముఖ్యత కలదు. భారత దేశం తర్వాత బాబా ననుసరించే వారిలో ఎక్కువ మంది అమెరికాలో నున్నారు. అమెరికాలో కేంద్రీకృతమైన శక్తినుపయోగించి నవమానవాళి ఆవిర్భవించడానికి బాబా చేసే పనిని తీసుకుని వచ్చే మార్పుకు అమెరికా ఖండాన్ని ఎంచుకాన్నారు. ఆ సందర్భంగా బాబా ఈ సందేశమిచ్చారు.

ఇస్లాము మరియు దాని 'సూఫీయిజమ్'; క్రైస్తవ మతము దాని 'మిస్టిసిజమ్'; ప్రాక్దేశాలు వాటి వేదాంత తత్వము; బుద్ధ మత తత్వము; జొరాష్ట్రియనిజమ్; జైన తత్వము అన్నింటితో మెహెర్ బాబాకు సమాన సంబంధము కలదు. అన్ని తత్వాలు ఒకే దివ్య సత్యాన్ని సూచించి ఆ గమ్యం వైపుకే అందిరిని నడిపిస్తాయి. మెహెర్‌బాబా దేనికి అంటకుండా అన్ని మార్గాల కతీతంగా ఉంటారు. మతావలంబకులందరినీ

వారివారి మతాలలోని అసలు సారాన్ని గుర్తించి అవి చెప్పబడిన అసలు ఉద్దేశాల ప్రకారం ఆచరించేలా మేల్కొల్పి నూతనోత్తేజాన్ని కలిగించడమే బాబా పని. ఆ మేరకే బాబా 'సూఫీయిజమ్'ను విశ్వవ్యాప్తంగా ఆమోదించ బడునట్లు, ఆ సంస్థ కధిపతిగా నున్న ముర్షీదా ఐ.వి. డ్యూస్ కోరిక మేరకు వారి చార్టర్ నియమావళిని పునవ్వ్యవస్థీకరించారు.

బాబా మిర్టిల్ బీచ్ నుండి 14.07.52న బయలుదేరి న్యూయార్క్‌కు వెళ్ళి అక్కడ రెండు వారాలున్నారు. న్యూయార్క్‌లో 18.07.52 నుండి 20.07.52 వరకు 3 రోజులు ఐ.వి.డ్యూస్ అపార్ట్‌మెంట్‌లో బాబా దర్శన కార్యక్రమాలు జరిగాయి. ఎందరో బాబా దర్శనం చేసుకున్నారు. బాబా దర్శనం చేసుకొని ఆ గది నుండి బయటకు వచ్చే దర్శనార్థులలో అధిక సంఖ్యాకులు బాబా మృదు మధురమైన ప్రేమ స్పర్శతో కలిగిన ఆనందాతిశయంతో చెమ్మగిల్లిన అశ్రుపూరిత నయనాలతో కనిపించారు.


కారు ప్రమాదంలో కలిగిన గాయాల నొప్పులన్నీ మటుమాయమైనట్లుగా సూచిస్తున్నట్లు బాబా ముఖంలో వెల్లి విరిసిన ఆనందం, ప్రకాశం గోచరించాయి. డాన్ స్టీవెన్స్ ఈ సందర్భంగానే బాబాను మొదటిసారిగా దర్శనం చేసుకున్నాడు. బాబా సంజ్ఞలతో ముగ్ధుడై అంతరంగంలో బాబా దివ్యత్వం గురించిన గుర్తింపు కలిగి బాబా వద్దకు ఆకర్షింపబడ్డాడు. 20.07.52నాడు జరిగిన సమావేశంలో ఐ.వీ.డ్యూస్ మరియు డాన్ స్టీవెన్‌లకు సూఫీయిజమ్ పునర్వ్యవస్థీకరణ గురించి సూచనలిచ్చి 'భగవద్వచనము' (గాడ్ స్పీక్స్) ఆంగ్లంలో ముద్రించే పనిని వారికప్పగించారు. 25.07.52 రోజున గాబ్రియల్ పాస్కల్ అనే హాలీవుడ్ సినిమా ప్రపంచానికి సంబంధించిన వ్యక్తి బాబా దర్శనం చేసుకున్నాడు. బాబా సాహచర్యంలో కలిగిన అనుభూతి వల్ల బాబా ఏది ఆజ్ఞాపిస్తే అది చేయుటకు తాను సిద్ధంగా ఉన్నానని అతడు చెప్పాడు.

బాబా న్యూయార్క్ నుండి లండన్‌కు వెళ్ళారు. అక్కడ ఆరు రోజులున్నారు. అక్కడి నుండి స్విట్జర్లాండ్, జెనీవాలకు వెళ్ళి బాబా దర్శనానికై తపించే ఆయా దేశాల

ప్రేమికులకు దర్శన భాగ్యం కలుగజేసి ఆగష్టు 23వ తేదీన బొంబాయి చేరుకొని తక్షణమే మెహెరాబాదుకు తిరిగి వచ్చారు.

## పశ్చాత్తాప ప్రార్థన

మెహెరాబాద్‌లో 07.11.52 నుండి 09.11.52 వరకు 3 రోజులు సహవాసం ఏర్పాటు చేసారు. దాదాపు 300 మంది బాబా ప్రేమికులు ఈ సహవాసంలో పాల్గొన్నారు. ఈ సహవాసంలో అనగా 08.11.52వ తేదీన బాబా పశ్చాత్తాప ప్రార్థన ఆంగ్లంలో చెప్పారు. ఆ పశ్చాత్తాప ప్రార్థన చదివే సమయంలో బాబా స్వయంగా నిలబడి ఆ పశ్చాత్తాప ప్రార్థనలో పాల్గొన్నారు. అందరూ బాబాతో బాటు పశ్చాత్తాప ప్రార్థన చేయడంలో పాల్గొన్నారు. తనకు సంబంధించిన వారందరి కోసం బాబా స్వయంగా పశ్చాత్తాప ప్రార్థన చేసారు. ఉర్దూ, మరాఠీ భాషలలో కనువదింపబడిన పశ్చాత్తాప ప్రార్థన సమాధులలోను, దర్గాలలోను చదివించబడింది. తరువాత ఈ పశ్చాత్తాప ప్రార్థన ప్రపంచంలోని పలుభాషలలోకి అనువదింపబడింది.



ఈ పశ్చాత్తాప ప్రార్థన యొక్క తెలుగు అనువాదం ఈ పుస్తకంలోని అను బంధంలో ప్రచురింప బడింది. అనుదినం బాబా ప్రేమికులందరూ ఉదయం, సాయంత్రం 7 గంటలకు పర్వర్దిగార్ ప్రార్థనతోబాటు ఈ పశ్చాత్తాప ప్రార్థన చేస్తారు.

నవజీవనం ప్రారంభించిన తర్వాత 1949వ సంవత్సరం నుండి అవకాశం లభించక బాబా దర్శనం కోసం తపించిపోయే వారికి అవకాశం కల్పిస్తూ బాబా 1952వ సంవత్సరం డిసెంబర్ మాసం నుండి 1953 జనవరి మాసం వరకు



మహారాష్ట్రలోని ఔరంగాబాద్, అమరావతి, నాగపూర్, సావెనీర్ మొదలగు పట్టణాలలో, గ్రామాలలో పర్యటించి దర్శనాలిచ్చారు. బాబా వెళ్ళిన అన్నిచోట్లలో ప్రజా దర్శనాల కనుమతించారు. ప్రేమికులు, భక్తులు కాలినడకన, ఎద్దుల బళ్ళలో, ఇతర వాహనాలలో ప్రయాణం చేసి బాబా వెళ్ళిన చోటల్లా తండోపతండాలుగా చేరి ఆయన దర్శనం చేసుకున్నారు. బాబా చాలా చోట్లకు వెళ్ళి దర్శనం యిచ్చారు. అలాగే మస్తుల సాంగత్యం కూడా కొనసాగించారు. అమరావతిలో బాబా గౌరవార్థం బ్రహ్మాండమైన ఏర్పాట్లు చేయగా బాబా యిలా అన్నారు – 'నేను భాగ్యవంతులలో కెల్లా భాగ్యవంతుడను, ఏకకాలంలో పేదవారిలో కెల్లా పేదవాడిని. నాకు బీదలతో, మస్తులతో, ప్రజలతో సాంగత్యం చేయడమంటే ఇష్టం'.

అమరావతిలో బాబా ఆర్ట్సుకాలేజీకి వెళ్ళి ఆ కాలేజీలో రమణ మహర్షి పేరుతో నిర్మించిన ఒక హాలుకు ప్రారంభం చేసి ఆ హాలులో రమణ మహర్షి చిత్రపటాన్ని ఆవిష్కరించారు.

## హమీర్‌పూర్ జిల్లాలో పర్యటన

ఆంధ్ర నా మస్తిష్కమైతే హమీర్‌పూర్ నా హృదయం అన్నారు మెహెర్ బాబా. 1952వ సంవత్సరం నవంబర్ మాసంలో బాబా హమీర్‌పూర్ జిల్లాలో పర్యటించారు. హమీర్‌పూర్, ఇంగోటా, మౌధా, మహేవా, నౌరంగా, యిచ్ఛోరా మొదలగు స్థలాలలో బాబా దర్శనం ఇచ్చిన తేదీలలో ఇప్పటికీ మేలాలు, ప్రేమిక సహవాస్‌లు, ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నారు. హమీర్‌పూర్‌లో కారులో వెళుతూ బాబా పుకార్‌కు కొన్ని పొలాలు చూపించారు. దానిలో ఏ పంట వేయబడిందని

బాబా అడుగుతున్నారేమోనని అనుకున్నాడు పుకార్. కాని ఆ స్థలంలోనే 25 ఎకరాలలో నేడు మెహెర్ పురి అని పిలువబడే ఆలయ సముదాయం నిర్మంచబడింది. బాబా ఆ రోజే సూచిస్తే పుకార్‌కు హమీర్‌పూర్ నిర్మాణం చేపట్టిన తర్వాత గాని బాబా 1952లో చేసిన సూచన అర్థం కాలేదు. ప్రేమికుల సహాయాన్ని అర్థించి ఎన్నో సంవత్సరాలుగా మెహెర్‌పురి ఆలయ నిర్మాణం కొనసాగింది. మెహెర్‌పురిలో బాబా పాలరాతి విగ్రహం ప్రతిష్టించారు. బాబా ముందు సమావేశానికి హాలు, క్రింద సెల్లారులోను బాల్కనీలోను ప్రేమికులు బస చేయడానికి గదులు ఏర్పాటు చేసారు. ఆలయం వెనుక వైపున గల యిళ్ళలో పాఠశాల నడుపుతున్నారు. బాబా ఆలయానికి కుడి వైపున, వెనుక వైపున బాబా ప్రేమికుల నివాసాలకై స్థలాలు యిచ్చారు. ఆలయం ముందు భాగాన విశాలమైన స్థలాన్ని ఉంచారు. అహర్నిశలు మెహెర్‌పురి నిర్మాణానికై కృషి చేసి దేశంలోని ప్రేమికులనందరినీ అందులో పాలు పంచుకొనేలా సో. పరమేశ్వరి దయాల్ నిగమ్ (పుకార్) ఇరువురూ చేసారు. ఆంధ్ర దేశంలో కూడా ఆయన గులాబ్ దాస్ పాంచాల్‌తో కలిసి పలుమార్లు పర్యటించారు. బాబా యొక్క హనుమాన్‌గా పేరొందిన పుకార్ మెహెర్ పురి నిర్మాణం లోనే తన కాలాన్ని వెచ్చించి అవతారుని సేవలో తుది శ్వాస విడిచాడు.

బాబా బొంబాయిలో 2 రోజులు గడిపి అక్కడి నుండి బయలుదేరి 19.11.52 నాడు హమీర్‌పూర్ చేరుకున్నారు. హమీర్‌పూర్‌లో దర్శనం యిచ్చారు. 20.11.52 రోజు ఇంగోటా వెళ్ళి దర్శనం యిచ్చారు. అచ్చట దాదాపు 5000 మంది బాబా ఇచ్చిన ప్రసాదం స్వీకరించారు. పుకార్ తన భుజాలపైన ఒక భక్తుని కూర్చోబెట్టుకొని బాబా దర్శనం కోసం తీసుకువచ్చాడు. అది చూచి బాబా 'నీవు హనుమంతుని లాగా కనబడుతున్నావు' అని అన్నారు. బాబాయే రాముడని, ఇప్పుడు ఈ యుగంలో మళ్ళీ మెహెర్ బాబాగా అవతరించాడనే అనుభూతి పుకార్‌కు కలిగింది. పుకార్‌కు తనతో గతావతారాల నుండే సన్నిహిత సంబంధాలున్నాయని బాబా చెప్పారు.

అక్కడి నుండి బాబా తన పర్యటన కొనసాగించి మహేవా అనే గ్రామానికి

వెళ్ళారు. గ్రామ పరిసరాల్లో, ఒక చిన్న ఎత్తైన కొండగా కనపడే చోటులో దట్టంగా పెరిగిన చెట్ల మధ్య మట్టిగోడలతో నిర్మించిన కుటీరంలో బాబా మూడు రోజులున్నారు. ఉదయం, సాయంకాలం ప్రేమికులకు, భక్తులకు బాబా దర్శనమిచ్చారు. బాబా దర్శనానికి ఏర్పాట్లు చేసిన వారిలో కేశవ నారాయణ్ నిగమ్ ముఖ్య కార్యకర్త. అతని తమ్ముడు ముకుంద్ కుష్ఠువ్యాధితో బాధపడుతున్నాడు. వ్యాధి బాగా ప్రబలి అతనిని కబళించి వేస్తోంది. కాన్పూరు ఆసుపత్రిలో చికిత్స చేయించారు. అయినా నయం కాలేదు. అతను కొద్దిరోజుల్లో మృత్యువాత పడవల్సిందేనని నిశ్చయించారు. కేశవ నారాయణ్ నిగమ్ మరియు ఇతర కార్యకర్తలు బాబాను ఆహ్వానించడానికి మెహెరాబాద్ వెళ్ళారు. ముకుంద్ తనను కూడా తీసుకొని వెళ్ళమని అభ్యర్థించాడు. అతనిని వెంట తీసుకొని వెళ్తే అతని వ్యాధిని నయం చేయమని బాబాను అడిగినట్లు అవుతుందని, అది బాబా ఆదేశాలను ఉల్లంఘించి నట్లవుతుందని వారతనిని తమ వెంట తీసుకు వెళ్ళడాని కంగీకరించ లేదు. మెహెరాబాద్‌లో వారి వెంట తను బాబా వద్దకు రానని ఎవ్వరికీ కనబడకుండా దూరంగా కూర్చుని బాబా దర్శనం చేసుకుంటానని వేడుకున్నాడు. చివరికి వారితో కలిసి మెహెరాబాద్‌కు వెళ్ళాడు. మెహెరాబాద్‌లో బాబా దగ్గరికి వెళ్ళకుండా ఆవరణలో దూరంగా కాంపౌండ్ ప్రక్కన ఒక చెట్టు క్రింద కూర్చున్నాడు. అక్కడి నుండే బాబాను దర్శించుకున్నా చాలని మృత్యుముఖంలో నున్న తనకు ఆ దర్శన భాగ్యం కలిగితే చాలని భావించాడు. సర్వజ్ఞుడైన బాబాకు తెలియని దేముంది? బాబా బయటకు వచ్చినప్పుడు హమీర్‌పూర్ నుండి వచ్చిన దర్శనార్థుల నుద్దేశించి దూరంగా ఆ చెట్టు క్రింద కూర్చున్న వ్యక్తి గురించి అడిగి తెలుసుకొని అతనిని తన దగ్గరకు తీసుకురమ్మన్నారు. ముకుంద్‌కు దర్శనమిచ్చి తను మహేవా గ్రామానికి వచ్చే రోజుకు ముందు రోజు 24 గంటలు ఉపవాసం చేసి తన దర్శనం చేసుకోమన్నాడు. బాబా ఆదేశానుసారం ముకుంద్ 24 గంటలు ఉపవాసం చేసి బాబా దర్శనం చేసుకున్నాడు. బాబా ఒక ఆపిల్ పండు తన ప్రసాదంగా అతనికిచ్చి తినమన్నాడు. ఆ పండు తిని తన ఉపవాసాన్ని ముకుంద్ ముగించాడు. మహేవాలో బాబా ముకుంద్‌ను పిలిచి 15.04.53 నాటికి నీ వ్యాధి

నయమవుతుందని అతని ననునయించాడు. ముకుంద్ బాబా కుటీరంలోనే ఉంటూ బాబా స్మరణలో రోజులు గడుపుతున్నాడు. కాని వ్యాధి నయమయ్యే సూచనలేవీ కనబడలేదు. పైగా అతని ఆరోగ్యం దినదినం క్షీణంచసాగింది. 14.04.53 తేదీ వరకు వేచి చూసాడు. ఏమీ మార్పు కనబడలేదు. తన దుర్దశకు బాధపడి దుఃఖించి నిరాశతో పడుకున్నాడు. ఆ రోజు అతనికి బాగా నిద్ర పట్టింది. మరునాడుదయం లేచి చూచుకొని ఆశ్చర్యపడ్డాడు. వ్యాధి సోకిన లక్షణాలు లేకుండా ఒంటిపై ఎట్టి మచ్చలు లేకుండా నిగనిగలాడే చర్మ సౌందర్యంతో కొత్త శరీరం పొందిన వాడిలా లేచాడు. క్రితం రోజు వరకు పీడించిన అనుమానం వల్ల బాబా మాట యిచ్చినా కూడా తన వ్యాధి తగ్గడంలేదని విలపించాడు. కాని బాబా మాట వృధాఅవుతుందా! కుష్ఠువారి పాదాలు కడిగి, వారి కాళ్ళకు ప్రణమిల్లి, వారికి స్నానాలు చేయించి బాబా చేసిన పనికి పర్యవసానంగా కుష్ఠు రోగులకు ఆధ్యాత్మికంగాను, భౌతికంగాని కలిగే ప్రయోజనానికి నిదర్శనమే ఈ సంఘటన, సామాన్య మానవుడు అవతారుడు చేసే పనియొక్క అంతరార్థాన్ని ఎలా గ్రహించ గలడు? ముకుంద్ బాబా కుటీర పరిసరాలను శుభ్రంగా ఉంచుతూ అక్కడే తన జీవితాన్ని గడిపి చివరకు 1979వ సంవత్సరం ఆగష్టు నెలలో మృతి చెందాడు.

23.11.52వ తేదీన బాబా మండలితో పరివేష్ఠితుడై కూర్చొనియుండగా అందరినీ తనను (బాబాను) ఏ రకంగా భావిస్తున్నారని అడిగారు. కేశవ నారాయణ నిగమ్ ఆయన నడిగినప్పుడు నేడు మెహెర్ చాలీసాగా గానం చేయబడే కవిత్వాన్ని చదివి వినిపించాడు. మళ్ళీ 1954వ సంవత్సరంలో హమీర్‌పూర్ జిల్లాలో పర్యటిస్తూ బాబా మహేవాకు వెళ్ళారు. ఆ గ్రామంలోనే మెహెర్ చాలీసా వ్రాసిన కేశవనారాయణ నిగమ్ ఉండేవారు. నేడు మెహెరస్థాన్‌గా పిలువబడే స్థలంలో బాబాకు వసతి ఏర్పాటు చేసారు. ఎత్తైన ప్రదేశంలో దట్టంగా పెరిగి అడవిలాగా కనిపించే చెట్ల మధ్యలో ఒక కుటీరం నిర్మించారు. ఆ కుటీరంలో బాబా ఉన్నారు. ఆ కుటీరం బయట కాపలాగా నిగమ్ ఉన్నాడు. క్రితం రోజున అస్వస్థతతో బాధపడుతున్న అతని మరదలు తానెలాగూ బ్రతకనని, ఆఖరు క్షణంలో బాబా దర్శనానికై అవకాశం కల్పించమని ఆమె నిగమ్‌కు తన కోరికను తెలియజేసింది.

ఆమె బాబా కుటీరం వద్దకు వచ్చి దర్శనం చేసుకునే స్థితిలో లేదు. బాబాను తన యింటికి వచ్చి జబ్బుతో ఉన్న తన మరదలును చూడమని బాబాను అడుగుటకు సాహసించలేక పోయాడు నిగమ్. మరుసటి రోజు నిగమ్ బాబా కుటీరం బయట కాపలాగా ఉన్న సమయంలో ఆయన భార్య కంగారుగా పరిగెత్తుకొని వచ్చి తన చెల్లెలు కదలడం లేదని, మరణించిందేమోనని, భయం వేస్తోందని, వెంటనే ఒక మారు వచ్చి చూడమని భర్తను ప్రార్థించింది. 'బాబా అనుమతి లేనిదే ఎలా వస్తాను, గొడవ చేస్తే బాబా పనికి భంగం కలుగుతుంది. మాట్లాడకుండా వెళ్ళిపొమ్మ'ని చెప్పాడు నిగమ్. అదే సమయంలో బాబా చప్పట్లు కొట్టి నిగమ్‌ను పిలిచారు. బాబా సర్వజ్ఞుడు , కరుణా మయుడు గదా! నిగమ్‌ను 'ఏమిటి సంగతి' అని బాబా అడిగారు. 'ఏమీ లేదు బాబా' అని నిగమ్ బదులు పలికాడు. 'సందేహించకు – అసలు విషయమేమిటో చెప్పు' అన్నారు బాబా. భార్య వచ్చి చెప్పిన విషయం బాబాకు చెప్పాడు నిగమ్. 'ఆమె ఎక్కడ ఉన్నది' అని అడిగారు బాబా. 'తన యింట్లోనే' అని నిగమ్ చెప్పాడు. నిగమ్ యింటికి వెళ్ళడానికి బయలుదేరారు బాబా. ఆయన వెనకాలే కేశవ నారాయణ నిగమ్, ఆయన భార్య బయలుదేరారు. ఇంట్లోకి వెళ్ళగానే 18 ఏళ్ళ వయస్సు గల కేశవ్ మరదలు నిశ్చలంగా మంచంపై పడివుంది. కేశవ్ భార్య ఆమెపై పడి ఏడ్వడం ప్రారంభించింది. అప్పుడు బాబా ఇలా అన్నారు 'ఎందుకు ఏడుస్తావు? నీ చెల్లెలు చనిపోయిందనేనా? పోతేపోయింది – మరణం అందరికీ ఉంది కదా! దాని కంత దుఃఖమెందుకు? ఏమీ విచారించకండి, భగవంతుని లీలలు ఎవరికీ అర్థం కావు' అని ఆ అమ్మాయి శరీరంపై నిమిరి బాబా తన కుటీరానికి వెళ్ళిపోయారు. ఆమెకు చేయవలసిన చికిత్స మరియు ఇవ్వవలసిన ఆహారం బాబా సూచించారు. మామూలుగా అవి ఇస్తే ఆ వ్యాధితో బాధ పడేవారు వెంటనే మరణిస్తారని వైద్యుల అభిప్రాయం. బాబా ఆదేశం ప్రకారం చేసింది కేశవ్ భార్య. బాబా తన కుటీరానికి వెళ్ళిపోయిన తర్వాత చనిపోయిందని భావించిన ఆ అమ్మాయి లేచి కూర్చుంది. కేశవ్ భార్య తన కళ్ళను తానే నమ్మలేకపోయింది. ఆమె ఆనందానికవధుల్లేవు. బాబా కుటీరం వద్దకు పరుగెత్తుకుంటూ వెళ్ళి బాబా పాదాలపైబడింధి. 'నా చెల్లెలుని బ్రతికించారు' అని ఆనందంతో ఏడ్వసాగింది.

బాబా ఆమె ననునయించి యింటికి పంపించారు. ఇనుమడించిన విశ్వాసంతో ఆ కుటుంబం వారే గాక ఆ ప్రాంతంలోని బాబా ప్రేమికులందరు ఆ సంఘటనతో ప్రభావితులైనారు.

బాబా చేసిన ఈ పర్యటనలలో భాగంగా అమీర్‌పూర్ అనే గ్రామానికి వెళ్ళారు. ఆ గ్రామంలో దర్శన కార్యక్రమం ముగియగానే తర్వాత కార్యక్రమానికి ఇంకొక గ్రామానికి బయలుదేరారు. ఊరి బయటకు రాగానే బాబా కారును ప్రక్క దారిలోకి మళ్ళించారు. కార్యకర్తలు వెళ్ళాల్సిన దారి అది కాదని చెప్తుతున్నా బాబా కారును ప్రక్కదారిలో నుండి పోనివ్వమని చెప్పి ఊరికి దూరంగా నున్న ఒక గుడిసే వద్దకు వెళ్ళారు. కారు దిగి ఆ గుడిసే ముందు నిర్మించియున్న ఒక ఎత్తైన గద్దెపై కూర్చున్నారు. ఆ గుడిసెలో నివసించే వృద్ధ దంపతులను దీవించారు. కన్నీటి ధారతో తన్మయత్వంలో ఆ వృద్ధదంపతులు బాబాకు ప్రణమిల్లారు. వారి ఆనందానికి మేర లేదు. వారు చాలా బీదవారు. నిమ్న జాతి వారు. బాబాను తమ గుడిసెకు రావలసిందిగా ఆహ్వానించే ధైర్యం లేక వారి ప్రేమకు బాబా కృపకు పరీక్షగా వారు తమ గుడిసె ముందు ఒక గద్దెను నిర్మించి వారి ప్రేమ నిష్కళంకమైతే కరుణా మయుడైన బాబా దానిని గుర్తిస్తే ఆయనే స్వయంగా వచ్చి ఆ గద్దెపైన కూర్చుండి తమకు దర్శనమిస్తాడనే విశ్వాసంతో వేచి చూస్తున్నారు. సర్వజ్ఞుడైన బాబా వారి ప్రేమకు వశుడై వారి వాంఛితాన్ని ఈడేర్చారు. హమీర్‌పూర్ జిల్లాలోని పర్యటనలో భాగంగా బాబా రాఠ్ అనే పట్టణంలో 27.11.52 రోజున బి. ఎస్.వి. ఇంటర్ కాలేజీ మైదానంలో దర్శనమిచ్చారు. ఆ సందర్భంగా బాబా ఈ క్రింది సందేశాన్ని యిచ్చారు.

'మనము జాతీయ స్వేచ్ఛను పొందాము. ఇప్పుడిక ఆధ్యాత్మిక స్వేచ్ఛను పొందడానికి శ్రమిద్దాము. అది లేనిదే ఏ ఇతర స్వేచ్ఛయున్నా అది బంధనమే అవుతుంది. కామము, పదవి, ఆశ, కోపము, ద్వేషము, అసూయ అనే నీచమైన కోరికల బంధాలలో చిక్కుకున్న మనకు ఆధ్యాత్మిక స్వేచ్ఛ కరువైపోయింది. ఎప్పుడు ఈ బంధాలు పటాపంచలౌతాయో అప్పుడే అనంత శక్తి, జ్ఞానము, శాంతి, ప్రేమ,

ఆనందము కలుగుతాయి. ఈ స్వేచ్ఛ పొందడానికి దీనికి మూలమైన భగవంతుని తెలుసుకోవాలి. భగవంతుని తెలుసుకోవడానికి ఆయన అనంతాత్మలో మనలను పోగొట్టుకొని ఆయనను ప్రేమించాలి. ఆయనలో ఐక్యం కావాలన్న తీవ్రకాంక్షతో, తపన ద్వారా ఆయనను ప్రేమించగలుగుతాం. మనతోటి మానవులను ప్రేమించడం వల్ల దేవుని ప్రేమించగలం. మన సుఖాన్ని కూడా వదలుకొని యితరులకు సుఖం కలుగజేయడం వల్ల పీడిత ప్రజల కోసం నిస్వార్థసేవ జేయడానికి మన జీవితాలంకితం చేసుకుని భగవంతుని ప్రేమించగలిగినప్పుడు మన ఆత్మయే పరమాత్మయని తెలుసుకుంటాము'.



హమీర్‌పూర్ పర్యటన తర్వాత 29.11.52 రోజున బాబా ఢిల్లీ వెళ్ళారు. అక్కడ బాబా వాసుదేవ్ కేన్ అను ప్రేమికుని ఇంట్లో నెం.16, రాష్ట్రపతి ఎస్టేట్‌లో ఉన్నారు. ఠాకూర్ రోడ్డులో నెం. 10 లో దర్శనం ఇచ్చారు. ఢిల్లీలో అనేక మంది ప్రముఖులు బాబా దర్శనం చేసుకున్నారు. 2.12.52 తేదీన బాబా ఢిల్లీ వాసులకు బహిరంగ దర్శనం ఇచ్చారు. న్యూఢిల్లీ టౌన్‌హాల్‌లో బహిరంగ సభ జరిగింది. ఆ సాయంకాలం నిరంజన్ సింగ్ అనే ప్రిన్సిపాల్ యాజమాన్యంలో నడుపబడుతున్న క్యాంప్ కాలేజీలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో దాదాపు రెండు వేల మంది విద్యార్థులు, అధ్యాపకులు బాబా దర్శనం చేసుకున్నారు. బాబా ఆ సందర్భంగా యిచ్చిన సందేశములోని కొంత భాగము ఇలా ఉంది. –

'భగవంతుని మనలో సాక్షాత్కరింప జేసుకొనుటయే మన మానవ జీవితము

యొక్క పరమ ఉద్దేశ్యము. మన ప్రాపంచిక విధులను నిర్వర్తిస్తూనే ఈ ఉద్దేశ్యాన్ని నెరవేర్చవచ్చును. దైనందిన చర్యలలో చేసే అనేక కార్యాలను ప్రియతముడైన దేవుని కంకితమొనర్చి వాటి కంటకుండా అనాసక్తులమై జీవితాలు సాగించాలి. ప్రజలు తమ ఆహారం కోసం పాటుబడటానికై నేడు చాలా ప్రాధాన్యమివ్వ బడుతున్నది. వారి మనసుల నిప్పుడు దేవుని వైపుకు మరల్చాల్సి ఉంది. బీదవారికి, పీడిత ప్రజానీకానికి సంక్రమించిన దుఃఖాలు, దురదృష్టాలను సత్యం కోసం సంఘర్షణ పడటానికి ఆయుధాలుగా చేసుకోవాలని తెలియజెప్పాలి. ఈ క్లేశాలన్నిటినీ దేవుని కృప వలన కలిగిన కానుకలుగా భావించి వాటిని ధైర్యముతో ఎదుర్కొంటే అవి శాశ్వత సౌఖ్యానికి మార్గంగా పరిణమిస్తాయి.'

క్యాంప్ కాలేజీలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆ కాలేజీ ప్రిన్సిపాల్ నిరంజన్ సింగ్ కారకుడు. అతడు నిరీశ్వరవాది. అతని భార్య పరమ భక్తురాలు. ఆమెను తీసుకొనివెళ్ళడానికి ఆలయాలకు, సాధు సత్పురుషుల వద్దకు వెళ్ళిన ఆయన బయటనుండే వచ్చేసేవారు. ఢిల్లీలో బాబా దర్శనం ఇచ్చిన రోజు వాసుదేవ్ కేన్ ఆహ్వానం మేరకు తన భార్యను తీసుకొని వెళ్ళారు. ఆయన జేబులోని ఒక పేపరును చూపిస్తూ అది ఏమిటని బాబా అడిగి దానిలోని ప్రతి ప్రశ్నకు రేపు జవాబు ఇస్తానని చెప్పారు. ఆ మరునాడు నిరంజన్ సింగ్ తన భార్యతో బాబా దర్శనానికి వచ్చారు. ఆయన భార్య సిక్కుమతాచారాలకు కట్టుబడిన స్త్రీ. ఆ క్రితం రాత్రి బాబా ఆమెకు స్వప్నంలో దర్శనమిచ్చి తన దివ్యత్వానుభూతిని కలుగజేసారు. అందరూ వరుసలో వచ్చి బాబా దర్శనం చేసుకున్న తర్వాత దర్శనం ఆపుజేసి బాబా అక్షరఫలకం ద్వారా కొన్ని సందేశాలిచ్చారు. నిరంజన్ సింగ్ బాబా ఎదురుగా సాష్టాంగప్రణామం జేసారు. బాబా మళ్ళీ ఆయన జేబులోని కాగితం గురించి దానిలోని ప్రశ్నల గురించి అడిగారు. వాటికి జవాబులు దొరికాయని ఆయన చెప్పారు. బాబా ఆయన జేబులోని కాగితంలో గల ప్రశ్నలను చూడకుండానే వాటికి సందేశాల ద్వారా జవాబులు ఇచ్చారు. అది నిరంజన్‌సింగ్‌కు మాత్రమే తెలుసు. బాబా సర్వజ్ఞుడని అందరి హృదయాలు, మనస్సుల నెరిగిన వాడనే దృఢ విశ్వాసం నిరంజన్ సింగ్‌కు కలిగింది. అందుకే తన కాలేజీలో దర్శనం ఏర్పాటు చేసి బాబాను

ఆహ్వానించి విద్యార్థులకు, అధ్యాపకులకు బాబా దర్శన భాగ్యం కలుగజేసాడు.

బాబా 1952 డిసెంబర్ మరియు 1953 జనవరి మాసాల్లో చేసిన పర్యటనలలో భాగంగా 1953లో ఆంధ్రదేశానికి వచ్చారు. నాగపూర్ వద్ద సావనీర్‌లో బాబాను మొదటిసారిగా కలుసుకున్న వారిలో వీర్‌సింగ్ కల్చూరి ఒకరు. భావు కల్చూరిగా పిలువబడే అతడే బాబా మండలిలో నొకడై నేడు అవతార్ మెహెర్ బాబా ట్రస్ట్ యొక్క ఛైర్మన్‌గా ఉన్నారు. సమగ్రమైన బాబా చరిత్ర 'లార్డ్ మెహెర్' పేరుతో వెలువడే సంపుటాల రచయిత ఇతడే.

## ప్రధమాంధ్ర దేశ పర్యటన

16.01.1953 తేదీన మద్రాసు నుండి బయలుదేరి బాబా ఆంధ్ర దేశం పర్యటనకు వచ్చారు. మద్రాసు నుండి కాకినాడ ప్యాసింజర్ రైలులో ప్రయాణించి సాయంకాలం విజయవాడ స్టేషన్‌లో దిగి ఆ రాత్రి స్టేషన్‌లోనే బసచేసి మరునాడు రైలులో తాడేపల్లి గూడెం వెళ్ళారు. బాబా ఆదేశానుసారం బాబాతో ప్రయాణించే ప్రేమికులు బాబా బృందంతో విజయవాడలో చేరారు. అందరూ 59 మంది బృందం బాబాతో పర్యటించారు. 17.01.53 తేదీన తాడేపల్లి గూడెం స్టేషన్‌లో డా. ధనపతి రావు, ఇతర ప్రేమికులు పుర ప్రముఖులు బాబాకు ఘన స్వాగతం ఇచ్చారు. నింగి నుండి దేవతలు పుష్ప వృష్టి కురింపిచారేమోనన్నట్లుగా ఒక వానజల్లు కురిసింది. బాబా ప్రభుత్వ రహదారి బంగాళాలో బస చేసారు. 18.01.53 తేదీన బాబా ధనపతి



రావు ఇంటిలో ఏడుగురు బీదలకు కాళ్ళు కడిగి వారి పాదాలపై తన శిరస్సు నానించి ఒక్కొక్కరికి రూ.51/- దక్షిణగా ఇచ్చారు. అలాగే 16 సంవత్సరాల వయస్సు గల మురళీధర్ రావు అనే ఒక బాలునికి పాదాలు కడిగి రూ. 14/- దక్షిణగా ఇచ్చారు. వి.వి. నారాయణ రావు గారి అబ్బాయి జగత్ కుమార్‌కు కూడా యిచ్చారు. 'నమో మెహెర్ బాబా' అనే గీతాన్ని బాల గోపాల భాస్కరరాజు బాబా ముందు గానం చేసారు. ఆయన అన్నగారైన రామభద్ర రాజు గారు గీతాన్ని వ్రాసారు. ఆ కీర్తన విని బాబా ఆనందించారు. ఆంధ్రలో సర్వసాధారణంగా ఈ గీతంతో భజనలు ప్రారంభం చేయడం పరిపాటి అయ్యింది. బాబా ధనపతిరావు ఇంటినుండి 50 గజాల దూరం నడిచి ఒక ఎరుకలవారి యింటి ముందు 2 నిమిషాలు కూర్చున్నారు. వారి అదృష్టమేమో తెలియదు గదా! 19.01.53 తేదీన ఉదయం డా. ధనపతిరావు ఇంటిలో విశ్రమించారు. పిదప ప్రజా దర్శన కోసం వేసిన పందిరిలో దర్శనం ఇచ్చారు. ఆ రోజు దాదాపు 30 వేల మంది బాబా దర్శనం చేసుకున్నారు. యోగి శుద్ధానంద భారతి మద్రాసు నుండి వచ్చి బాబా దర్శనం చేసుకున్నారు. రాత్రి భజన గాత్ర కచేరీలు జరిగాయి. బాబా సప్త భూమికలు మొదలగు విషయాలపై ప్రవచనాలిచ్చారు. చిత్ర లేఖనం, కవిత్వం, గానం ఇత్యాది కళలతో బాటు ఆధ్యాత్మిక చింతన కలిగి బాబా ప్రేమికుడైన బాలగోపాల భాస్కరరాజును బాబా అభినందించారు. 20.01.53 తేదీన బాబా ప్రేమికుల ఇళ్ళకు వెళ్ళారు. తాడేపల్లిగూడెంలో బస చేసిన ఆ రోజుల్లో ఒక రోజు ఉదయం 4 గంటలకు బాబా ఆకస్మికంగా ఈరుచ్‌ను పిలిచి స్నానానికి వేడి నీళ్ళు కావాలని అడిగారు. ఆ సమయంలో బాబాకు వేడి నీళ్ళు ఎలా ఏర్పాటుచేయాలా అని ప్రయాస పడుతున్న ఈరుచ్‌కు గేటు ఎదుట ఎవరో వ్యక్తి కనబడ్డాడు. వెళ్ళి విచారించగా అతడు బందేలి బాపిరాజని తేలింది. ఎవరూ అడగకుండానే అతడు అంత ఉదయమే లేచి వేడి నీళ్ళు కాచి బిందెలో పోసుకొని తలపై పెట్టుకొని వచ్చాడు. ఈరుచ్‌కు చిత్రంగా తోచింది. అయినా బాబా అనుమతి లేకుండా ఎవ్వరినీ రానివ్వకూడదు. కావున ఈరుచ్ వెళ్ళి బాబాకు విషయం తెలియజేసాడు. బాబా అనుమతినిచ్చారు. అతనిని లోపలికి తీసుకొని వెళ్ళి అతను తెచ్చిన

వేడినీళ్ళతో బాబా స్నానానికి ఏర్పాటుచేసాడు ఈరుచ్. ఎన్నడూ లేని విధంగా ఆకస్మికంగా వేడి నీళ్ళు అడగటం, అదే సమయానికి బాపిరాజు మనస్సులో వేడినీళ్ళు బాబాకు తీసుకొని వెళ్ళాలనే ఆలోచన కలుగజేయడం, జగన్నాటక సూత్రధారి, ఆర్తత్రాణపరాయణుడైన బాబాకే చెందింది. ఈ రకంగా బాపి రాజుతో సేవ చేయించుకొని అతనిని బాబా ఏర్పాటు చేసిన ట్రస్ట్‌లో శాశ్వత లబ్ధిదారుడిగా నమోదు చేసారు. జీవనోపాధి లేక అవస్థ పడే బాపిరాజుగారికి మిగతా జీవిత కాలం ట్రస్ట్ నుండి వచ్చే డబ్బుతో జీవితం సాఫీగా సాగింది. అతనెప్పుడు తలపై గులాబీ రంగు గల టోపీ ధరించేవాడు. నీ తల మొండెం వేరైనా ఎప్పుడూ ఆ టోపీని ధరించాలని బాబా ఆదేశించారు.

21.01.53 తేదీన బాబా పెంటపాడు, పిప్పర మరియు నిడదవోలు గ్రామాలకు వెళ్ళి దర్శనమిచ్చారు. పిప్పరలో బాబా సందేశము ఇస్తూ 'భగవంతుని నిజాయితీతో ప్రేమిస్తే మన సందేహాలు, చింతలు అన్నీ అదృశ్యమైపోతాయి, ప్రేమ ద్వారా నన్ను ప్రతివారిలో చూడగల్గుటకు ఆశీస్సులిస్తున్నా' నని బాబా చెప్పారు. పెనుగొండలో శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఇచ్చిన దర్శనంలో 800 మంది బాబా దర్శనం చేసుకున్నారు. 22.01.53 తేదీన బాబా నిడదవోలు వెళ్ళారు. దారిలో కాపవరం వద్ద కారు ఆపి సుబ్బయ్య అనే సాధువు సమర్పించిన పళ్ళు స్వీకరించారు. నిడదవోలులో బోర్డు ఉన్నత పాఠశాల ఆవరణలో వేసిన పందిట్లో ప్రజాదర్శనం ఇచ్చారు. అనేక వేల మంది బాబా దర్శనం చేసుకున్నారు. బాబా వారికి ప్రసాదం పంచి పెట్టారు. నిడదవోలులో బాబా తాడిమేటి కుటుంబ శాస్త్రి, ఇవటూరి చిన మల్లికార్జున రావు గార్ల ఇళ్ళకు వెళ్లారు. వారి కుటుంబ సభ్యుల నాశీర్వదించారు. నిడదవోలు నుండి కొవ్వూరు వెళ్ళారు. కొవ్వూరులో బాబా రామలింగేశ్వర రావు, న్యాయవాది కుమార్తె వివాహానికి వెళ్ళి వధూవరుల నాశీర్వదించారు. కోడూరి కృష్ణారావు ఇంటికి వెళ్లి వారి ఆతిథ్యము స్వీకరించారు. 22.01.53 తేదీన సాయంత్రం కొవ్వూరులో ఉన్నత పాఠశాల ఆవరణలో వేసిన పందిట్లో అనేక వేల మందికి బాబా దర్శనమిచ్చారు. సాయంత్రం రాజమండ్రికి

వెళ్ళి నవభారత గురుకులంలో క్రొత్తగా నిర్మించిన కార్యనిర్వాహక భవనాలకు ప్రారంభోత్సవం చేసారు. రాజమండ్రికి వెళ్ళే దారిలో గోదావరి నది వద్ద కారు ఆపి, గోదావరి జలాల్లో తన కాళ్ళు చేతులు ముంచి ఆ జలాలను పునీతం చేసారు. ఆ రాత్రి గురు కులంలో బస చేసారు. 23.01.53 తేదీన గురుకులంలో దర్శనమిచ్చారు. ఆ రోజే తెలంగాణాలో బాబా నామాన్ని విస్తృతంగా వెదజల్లి బాబా ప్రేమికులకు ఆప్తుడైన రెంటాల సూర్యనారాయణమూర్తి బాబా దర్శనం చేసుకున్నారు. బాబా ఇచ్చిన అరటి పండు ప్రసాదంగా స్వీకరించారు. ఆనందాశ్రువులు ప్రవహించగా బాబా శిరస్సు వెనకాల ప్రకాశించే కాంతి చక్రాన్ని చూచి తన తండ్రి చెప్పిన మాటలు గుర్తుకు రాగా మొదటి దర్శనంలోనే బాబా దివ్యత్వంలో అచంచలమైన విశ్వాసమేర్పడింది. నిజామాబాద్ కేంద్రంగా తెలంగాణాలో అనేకానేక బాబా కేంద్రాలను స్థాపించి ప్రేమికులను తయారుచేసిన మూర్తిగారు నిస్వార్థ ప్రేమికులు.

23.01.53 తేదీన బాబా ప్రత్యేక రైలు పెట్టెలో మధ్యాహ్నం రాజమండ్రి నుండి ఏలూరు వెళ్ళారు. అన్ని స్టేషన్లలోను ప్రజలు తండోప తండాలుగా వచ్చి బాబా దర్శనం చేసుకున్నారు. ఏలూరు స్టేషన్ ఇసుక వేస్తే రాలనంత జనంతో నిండిపోయింది. వై.వి. రంగారావు, ఆర్. వి. రామారావు, పంగిడి గూడెం రాజు గారు ఎంతో మంది ప్రేమికులు బాబాకు స్టేషన్‌లో స్వాగతం పలికారు. ఏలూరులో కట్టా సుబ్బారావు తోటలో ప్రకృతి సౌందర్యంతో నిండిన మామిడితోపులోని చెట్ల నీడలోని ఇళ్ళలో బాబా బస ఏర్పాటు చేసారు. కట్టా సుబ్బారావు బాబాకు, మండలి వారికి, బాబా ప్రేమికులకు ఇచ్చిన ఆతిథ్యం చిరస్మరణీయమైనది. 24, 25, 26 తేదీలలో ప్రజాదర్శనం కార్యక్రమాలు ఏర్పాటు చేయబడ్డాయి. 26.01.53 తేదీన రామకోటి తీర్థంలో సాయంత్రం జరిగిన దర్శన కార్యక్రమాల్లో వేల మంది బాబా దర్శనం చేసుకున్నారు. 'ఆధ్యాత్మికంగా ఎండిపోయిన నదులలోకి ప్రేమ మహా సముద్రం నుండి ప్రేమ వెల్లువలై ప్రవహించే సమయ మాసన్నమైనది. నేను వేల మందికి పంచి ఇచ్చే ప్రసాదం ద్వారా నా ప్రేమ ప్రవాహం మానవాళికి అందజేయబడుతుంది' అని సమావేశానంతరం చెప్పారు. 27.01.53 తేదీన బాబా

ఏలూరు జిల్లా జడ్జిగారి ఆహ్వానం మేరకు వారి ఇంటికి వెళ్ళారు. అక్కడ బాబా నిజాయితీ గురించి ఈ సందేశం యిచ్చారు.

'మనం భగవంతుని నిజాయితీతో ప్రేమిస్తే ఆయనలో ఐక్యం అవుతాము. అక్రమం, మోసం, కపటం నేడు ప్రబలినట్లు ప్రపంచంలో ఇది వరకెప్పుడూ ప్రబలియుండలేదు. మన ఆలోచనలలోను, మాటలలోను, చేతలలోను లేశమాత్రమైనా కపటం ప్రవేశిస్తే మనలోని పరమాత్మ మరుగున పడతాడు. కపటం వేయి పడగలు గల ఒక విష సర్పం వంటిది. ఈ రోజున సాధువులని పిలువబడే వారు అనేకులు ప్రజలను నిజాయితీగా ఉండమని చెప్తూనే పచ్చి మోసగాళ్ళుగా ప్రవర్తిస్తున్నారు. నా దివ్యాధికారంతో చెప్తున్నాను. నేను మీ అందరిలో ఉన్నాను. భగవంతుని నిజాయితీగా ప్రేమిస్తే ఆయన నన్నిచోట్ల చూడగలరు. భగవంతుని ప్రేమించ లేక సాధుజీవితం గడపలేకపోతే పోనీయండి గాని అలాంటి జీవితం గడుపుతున్నట్లు నటించవద్దు. అలాంటి కపట సాధువుల కంటె నిజాయితీ పరులైన నిరీశ్వర వాదులే మేలు'.

27.01.53 తేదీ సహచరులందరు బాబా ఆజ్ఞ ప్రకారం జాగరణ చేసారు. 28.01.53 తేదీ మండలి వారి నుండి ప్రేమికుల నుండి 56 మందిని ఎన్నుకొని ఎప్పుడూ ఉండే 56 మంది జీవన్ముక్తులకు (మజ్జూబ్‌లకు) వారిని ప్రతినిధులుగా చేసి వారి పాదములంటి ప్రణమిల్లారు. ఈ క్రింది సందేశం ఇచ్చారు.

'మనమందరం ఒక్కటే. మనమందరం సమానమే. హెచ్చు తగ్గులు లేవు. అనంతమైన ఆ యేక పదార్థమే అందరిలోను అవిభాజ్యంగా ఉంది. అవికారము, అవినాశము, అనంతము, సత్యము అయిన ఆ ఏకైక పదార్థమునకు ప్రతినిధులుగా తలంచి మీకందరకు సామూహికంగాను వ్యక్తిగతంగాను ప్రణమిల్లుతున్నాను'.

తర్వాత పశ్చాత్తాప ప్రార్థన చేయించి బాబా అందరినీ ఆశీర్వదించారు. బాబా ధర్మాజీ గూడెం, గుండు గొలుసు గ్రామాలు దర్శించి బెజవాడకు వెళ్ళి అక్కడినుండి 28.01.53 తేదీన తిరుగు ప్రయాణమై వెళ్ళిపోయారు.

ఏలూరులో కట్టా సుబ్బారావు తోటలో వచ్చిన మొదటి రోజు ఒక చెట్టు క్రింద కొంతసేపు కూర్చున్నారు. ఆ స్థలంలోనే నేడు మెహెర్ నిలయం అనే బాబా ఆలయం నిర్మించారు. బాబా బస చేసిన కుటీరం కూడా నేటికీ అలాగే ఉంది. బాబా వాడిన వస్తువులను కూడా ఆ కుటీరంలో ప్రజల దర్శనార్థం భద్రపర్చి ఉంచారు. ఈ ఆలయ స్థలంలో కూర్చున్న సందర్భంగా బాబా ఆ స్థలాన్ని 'మక్కా ఆఫ్ ది ఈస్ట్' అనగా ప్రాగ్దేశాలకు మక్కా వంటిదని సూచించారు. ఆ ఆలయాన్ని 25.12.88 తేదీన క్రిస్మస్ రోజున ప్రారంభించారు. బాబా ఆంధ్ర దేశ పర్యటనలో తనతో వచ్చిన ప్రేమికులను కార్యకర్తలను ప్రత్యేకంగా సమావేశ పరచి ఆంధ్రాలో జరిగే కార్యక్రమాలపై వారి వారి అభిప్రాయాలను నిస్సందేహంగా వెలిబుచ్చమని అందరినీ కోరారు. అందరూ ఇతరులతో కలిసి సమైక్యతా భావంతో పని చేయడానికి కృషి చేయాలని సూచించారు. బాబా కార్యక్రమాలను రాబోయే ఆంధ్ర పర్యటనలో నిర్వహించడానికి కె.డి.ఆర్.యమ్ (KDRM) గ్రూపును అనగా కుటుంబ శాస్త్రి, ధనపతిరావు నాయుడు, రంగారావు, మల్లికార్జునరావు అనబడే నలుగుర్ని నియమించారు.



1953వ సంవత్సరం ఫిబ్రవరి నెలలో బాబా డెహ్రాడూన్ మరియు ఋషీకేశ్‌లకు వెళ్ళారు. మార్చి 23వ తేదీన డెహ్రాడూన్ మరియు ఋషీకేశ్‌లకు వెళ్ళారు. మార్చి 23వ తేదీన డెహ్రాడూన్‌లో కిషన్‌సింగ్ ఇంటి వద్ద అనేక మందికి దర్శనమిచ్చారు. సిక్కులు చాలా మంది బాబా దర్శనానికి వచ్చారు. వారిలో ఒకరితో గురునానక్ గీతాన్ని పాడించుకొని దానిలోని అంతరార్థాన్ని విశదీకరించారు. ఆ రోజు శ్రీరామనవమి. ఆ రోజు బాబా దర్శనం చేసుకున్న వారు బాబాయే రాముడుగా గతావతారంలో వచ్చారనే అనుభూతి పొంది విశ్వసించారు. బాబా కటాక్ష వీక్షణాల నుండి వెలువడే

కాంతి పుంజాలకు ఆయన నుండి ప్రసరించే దివ్యప్రేమ ప్రభావానికి ముగ్ధులై చలించి కన్నీటి ధారలతో ఆనందానుభూతిని పొంది తన్మయులైనారు. బాబా ఈ క్రింది సందేశం ఇచ్చారు.

'పెరిగి పెద్దవారమైన తర్వాత కూడా పసిపిల్లలవలె కాగలిగితే భగవంతుని ప్రేమించగలుగుతాము. ఎందుకంటే భగవంతుని ప్రేమించుటచే భగవంతునితో ఏకమైపోవాలన్న కోరిక తప్ప వేరే కోరికలుండగూడదు. అందువలన మనం చిన్న పిల్లలవలె కాగలిగితే నిజాయితీతో భగవంతుని ప్రేమించగలం. భగవంతుని అన్ని చోట్ల చూడగలుగుతాము'. జీవితమంటే ఏమిటని ఒక ప్రేమికుడడుగగా బాబా ఇలా చెప్పారు –'జీవితం ఒక పెద్ద తమాషా. ఇది తెలుసుకొన్న వానిని ఇతరులు తెలుసుకోలేరు. వారి భ్రాంతిలో పడి ఉంటారు. ఈ సమస్య గురించి రాత్రింబవళ్ళు ఆలోచించినా ఆవగింజంత అయినా పరిష్కారం దొరకదు. ఎందుచేతనంటే ప్రజలు జీవితాన్ని గంభీరంగా తీసుకుంటారు. దేవుణ్ణి తేలికగా తీసుకుంటారు. కాని మనం దేవుణ్ణి గంభీరంగాను, జీవితాన్ని తేలికగా తీసుకోవాలి. అప్పుడు మనం ఎప్పుడూ ఒక్కలాగే ఉన్నామని, ఉంటామని తెలుసుకుంటాము. అసలు ఈ తమాషా సృష్టించింది మనమే ననే జ్ఞానం హేతువాదం వల్ల పొందలేము, అనుభవం మీదనే వస్తుంది'

1953 సంవత్సరం జులై 10వ తేదీన బాబా మౌనం ప్రారంభించి 28 సంవత్సరాలు నిండాయి. ఆ రోజు ఉదయం 4 గంటల నుండి 5 గంటల వరకు హృదయ పూర్వకంగా ముస్లింలు 'అల్లా హో అక్బర్' అని, హిందువులు 'పరబ్రహ్మ – పరమాత్మ' అని, పార్శీలు 'అహూరమజ్దా' అని, ఇరానీలు 'యజ్‌దాన్' అని, క్రైస్తవులు 'గాడ్ ఆల్‌మైటీ' అని వినబడేలాగా ఉచ్చరించాలని ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు మంచి నీరు మాత్రం తీసుకొని 12 గంటల ఉపవాసం చేయాలని ఆదేశించారు. డెహ్రాడూన్‌లో బాబా రాజ్‌పూర్ రోడ్డులోని 101 నెంబర్ యింటిలో మకాము చేసారు. ఆ దగ్గరలోనే నేడు మెహెర్ ధామ్‌గా పిలువబడే బాబా కేంద్రాన్ని నిర్మించారు. ప్రతి సంవత్సరం మార్చి 22, 23 తేదీలలో ఇక్కడ ప్రేమిక సహవాసం జరుగుతుంది.

## ప్రభు స్తుతి – పర్వర్దిగార్ ప్రార్థన

డెహ్రాడూన్‌లో ఉండే రోజుల్లో ఆగష్టు మాసంలో పర్వర్దిగార్ ప్రార్థనను బాబా తన అక్షర ఫలకంపై చూపించి వ్రాయించారు. ఆగష్టు 13వ తేదీ నుండి సెప్టెంబర్ 2వ తేదీ వరకు రోజూ ఈ ప్రార్థనను తన సమక్షంలో చదివించుకున్నారు. తర్వాత ఈ ప్రార్థనను అన్ని భాషలలోకి అనువదించారు. అవతారుడు స్వయంగా వ్రాయించి ఆ ప్రార్థనలో స్వయంగా తాను పాల్గొన్నందున అది విశిష్టమైంది. 'పర్వర్దిగార్ ప్రార్థన, పశ్చాత్తాప ప్రార్థన రెండింటిలోని ప్రతి అక్షరంలో మహత్తు నిండి ఉంది. ఈ ప్రార్థనలు ఎవ్వరు చేసినా ఎప్పుడు చేసినా నా భౌతిక శరీరం త్యజించిన తర్వాత కూడా వారికి ఆధ్యాత్మిక ప్రయోజనం చేకూరుతుంది. ఈ ప్రార్థనలలో స్వయంగా నేను పాల్గొన్నాను గనుక వాటికి మహత్తు ఉంది' అని బాబా ఈరుచ్‌కు చెప్పారు.

## ఉన్నతోన్నతుడు
## (The Highest of the High)

డెహ్రాడూన్‌లోనే 1953 సంవత్సరం సెప్టెంబర్ 7 వ తేదీన బాబా ఉన్నతోన్నతుడను – ది హైయెస్ట్ ఆఫ్ ది హై అనే సందేశాన్ని అక్షర ఫలకం ద్వారా వ్రాయించి ఇచ్చారు. దానియొక్క తెలుగు అనువాదం ఈ పుస్తకం చివర రెండవ భాగంలోని అనుబంధంలో ప్రచురించబడింది. తాను ఉన్నతోన్నతుడనని మానవ రూపం దాల్చినందున మానవుడనని కాని మధ్యదారిలోని సాధు సత్పురుషులలో నొకడను మాత్రం కాదని చెప్పారు. ఆయన అసలు స్థితి ఋషులకు, మునులకు, మహాత్ములకు సైతం దురవగాహనమైనట్టిది. పండితులకు, విమర్శకులకు చిక్కనిది.

01.11.53 తేదీన తన నిజమైన దర్శనం అంటే ఏమిటో వివరిస్తూ బాబా ఈ క్రింది సందేశం ఇచ్చారు. ఆ రోజు బాబా 7 గంటలు దర్శనం ఇస్తూ కూర్చున్నారు. చాలా మంది ఆయన దర్శనం చేసుకున్నారు.


'నా నిజమైన దర్శనం పొందడం సులభం కాదు. దగ్గరి నుండి నన్ను

చూడడం, నాకు నమస్కారం చేయడం, పువ్వులు పండ్లు సమర్పించడం, నాకు వంగి ప్రణామం చెయ్యడం, మీ ఇళ్ళకు తిరిగి వెళ్ళడం – వీటి వల్ల నా దర్శనం చేసుకున్నట్లు కాదు. నా అసలు దర్శనం పొందడం అంటే నన్ను పొందడమే. అంటే నాలో మీ ఉనికిని కనుగొనడం. నాలో మీ ఉనికిని కనుగొనే విధానం నన్ను ప్రేమించడం. నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నట్లు మీరు నన్ను ప్రేమించాలంటే నా అనుగ్రహం పొందాలి. అది దివ్యప్రేమను మీకు ప్రసాదిస్తుంది. నా అనుగ్రహం పొందాలంటే అచంచలమైన విశ్వాసం అనే పునాదిపైన హృదయపూర్వకమైన విధేయతను నాయందు కలిగి ఉండాలి. మీ అంతట మీరు నేను కోరినట్లుగా నాకు సర్వార్పణ అయిపోతే విధేయులుగా నుండగలరు. అప్పుడు నా కోరిక మీకు ఆచరణీయమవుతుంది. నాప్రేమయే మిమ్ములను నిలిచేటట్లుగా చేస్తుంది. యుగయుగాలుగా చాలా మంది అటువంటి సమర్పణ కోసం ఆశిస్తారు గాని చాల కొద్ది మంది మాత్రం నేను కావాలన్నట్లు, నాకు సంపూర్ణంగా సమర్పణ మవ్వడానికి నిజంగా ప్రయత్నిస్తారు. అలాంటి వారిలో ఎవడు జయం పొందుతాడో అతడు చివరకు నన్ను పొందడమే గాక జీవిత గమ్యాన్ని పొందుతాడు. తాను నేనే అయిపోతాడు. మీలోని ఇంతమందిలో ఏ ఒక్కరైనా నేను తెలుసుకోమని కోరేది అవగాహన చేసుకుంటే నేను మీ మధ్యకు రావడం సార్థకం అవుతుంది. మీ అందరికీ నా ఆశీస్సులు'.

ఆ రోజుల్లో బాబా డెహ్రాడూన్‌లో నుండగా అక్టోబర్ మొదటి వారంలో అసాధారణ రీతిలో హిందువులు, మహమ్మదీయులు, క్రిస్టియన్లు, సిక్కులు, పార్శీలకు చెందిన ఆలయాల్లో రాత్రి 12 గంటలు ఒంటి గంట మధ్య కాలంలో వాటి అధికారుల నుండి అనుమతి పొంది దర్శించేవారు. 'అన్ని మతాలను ఒక దారంలోని పూసలవలె సన్నిహితం చేయడమే తన పని' అని చెప్పిన బాబా తన పనిలోని భాగంగానే ఈ కార్యక్రమాలు నిర్వహించారని తోస్తుంది. 18.11.53 తేదీన బాబా డెహ్రాడూన్ నుండి ఢిల్లీ వెళ్ళారు. ఆ మరునాడు ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ, రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆధ్వర్యంలో ఆడిన క్రికెట్ మ్యాచ్ చూడటానికి వెళ్ళారు. ఆట ప్రారంభమైన తర్వాత బాబా నెహ్రూ గురించి చెప్తుతూ 'అతడు చాలా ఉదాత్తమైన వ్యక్తి' యని క్రికెట్ ఆటగాని వలె తన పాత్రను చక్కగా పోషిస్తున్నా' డని చెప్పారు. బాబా తలపై హేట్, కళ్ళకు నల్లని అద్దాలు పెట్టుకొనియున్నా నెహ్రూ ఆయన వైపు పదేపదే చూడడం కన్పించింది. బాబా కూడా నెహ్రూవైపే తన దృష్టి

కేంద్రీకరించారు. తర్వాత ఆటలో అందరూ మునిగి యుండగా 'నా పని అయిపోయింది, పదండి వెళదాము' అని బాబా బయలుదేరారు. బాబాతో పాటు అనుచరులందరూ లేచి ఆయనను అనుసరించారు. నెహ్రూ మరణానంతరం 27.05.64 తేదీన బాబా నెహ్రూ గురించి చెబుతూ 'నెహ్రూ మరణంతో భారతదేశం మొదటి ప్రధానమంత్రినే గాక దేశసేవకంకితమైన వారిలో రత్నంలాంటి మొదటి వ్యక్తిని కోల్పోయింది, మళ్ళీ అలాంటి వ్యక్తిని పొందడం కోసం 700 సంవత్సరాలు వేచి యుండా' లని చెప్పారు.

బాబా 01.02.1954 తేదీన మహాబలేశ్వర్ నుండి మళ్ళీ హమీర్‌పూర్ జిల్లాలో పర్యటనకు వెళ్ళారు. బాబాతో తొమ్మిది మంది మండలి వారు, శిష్యులు బయలుదేరివెళ్ళారు. వీరే గాక ఇంకా 14 మంది దారిలో అక్కడక్కడా బాబా బృందంలో డెహ్రాడూన్ వరకు చేరారు. ఒరాయిలో రైలు దిగి ఇచ్ఛోరాకు వెళ్ళారు. అది అలహాబాద్‌లో జరిగే కుంభమేళా ఉత్సవంలో జరిగే పూర్ణకుంభ దినము.



లక్షలాది ప్రజలు త్రివేణీ సంగమంలో స్నానాలు చేసారు. ఇక్కడ బాబా ఇచ్ఛోరాకు ఎద్దుల బండిలో వెళ్తూ నది మధ్యలో ఆపి బేత్వా (వేత్రవతి) నదిలో తన కాళ్ళు చేతులు ముంచి కడుగుకొని ఆ నదీ జలాలను పునీతం చేసారు. ఇచ్ఛోరా చేరిన తర్వాత బేత్వా నదీ జలాలను తెప్పించుకొని స్నానం చేసారు. 03.02.54 తేదీన ఇచ్ఛోరాకు వెళ్ళేముందు దారిలో బాబా టీకర్ అనే గ్రామానికి వెళ్ళి ఈ గ్రామంలో ఒక మఱ్ఱిచెట్టు క్రింద కూర్చుని దర్శనం ఇచ్చారు.

ఒక తల్లి పుట్టు గ్రుడ్డివాడైన తన బాలుని తీసుకొనివచ్చి బాబా ఆశీస్సులు

కోరింది. బాబా ఆ బాలుని ఆశీర్వదించారు. బాబా ఏ మహత్యాలు చేయనని ఎప్పుడూ చెప్పేవారు. అయినా ఆయనను దర్శించుకొన్న భక్తులకు, ప్రేమికులకు కలిగిన అనుభవాలు లెక్కించ రానివి. వర్ణన కతీతాలైనవి. ఆ బాలునికి బాబా దర్శన భాగ్యంతో దృష్టి వచ్చింది. అనుగ్రహింప బడిన ఆ బాలుని అదృష్టానికి బాబా దివ్యప్రేమాశీస్సులకు అక్కడి వారందరూ ఆశ్చర్యపడి బాబాను కీర్తించారు.

ఇచ్ఛోరా గ్రామంలో వర్ణనాతీతంగా బాబా ప్రేమాశీస్సులు వెల్లువలై ప్రవహించాయి. ఇచ్ఛోరా తన రాకతో పునీతమైనదని చెప్పి బాబా ఇచ్ఛోరాకు 'ప్రేమ తీర్థము' అని నామకరణం చేసారు. ఆ రోజు మాఘమాసం అమావాస్య రాత్రి. ఆ రోజు తానొక ప్రత్యేకమైన ఆధ్యాత్మిక కార్యం తలపెట్టి చేయదలిచానని, ఆ రోజు రాత్రి ఊరిలోని వారందరూ పూర్ణ మౌనం పాటించాలని బాబా ఆదేశించారు. అందరు అలాగే చేసారు. అడవిలోనికి ఆ రాత్రి కట్టెలకై వెళ్ళిన కొందరు ప్రకాశవంతమై కన్నులు మిరుమిట్లు గొలిపే కాంతి కిరణాలు ఆకాశం నుండి ఆ ఊరిపై ప్రసరిస్తున్నట్లు చూసి నిర్ఘాంతపోయారు. బాబా రాఠ్, ధనౌరీ, ఛలీ గ్రామాలను దర్శించి హమీర్‌పూర్ వెళ్ళారు. హమీర్ పూర్ నుండి బయలుదేరి 09.02.54 తేదీన మహేవాకు చేరుకున్నారు. ఆ రోజు 09.02.54 వ రోజు అందరినీ మెలకువగా ఉండి జాగరణ చేయమన్నారు బాబా. రాత్రి 9 గంటల నుండి 11.40 ని.ల వరకు పాట కచేరీ జరిగింది. అజీజ్, అమర్‌దాస్ వామన్ అనువారు పాటలు పాడారు. 11.40 ని.లకు అందరినీ కాళ్ళు, చేతులు, ముఖం కడుక్కొని రమ్మన్నారు. బాబా కూడా తన చేతులు కడుక్కొన్నారు. రాత్రి 12 గంటలకు ఆంగ్లంలో, ఉర్దూలో, మరాఠీలో ఈరుచ్, రంజూ, ధాకే పశ్చాత్తాప ప్రార్థన చదివారు. బాబా తన అక్షర ఫలకంపై 'అవతార్ మెహెర్ బాబా కీ జై' అని చూపించి అందరితో జయజయధ్వానాలు చేయించారు.

అంతకు పూర్వమే బాబా తానవతారుడనని సందర్భానుసారంగా చెప్పినా 10.02.54 రోజు (09.02.54 రాత్రి) తానవతారుడనని ప్రత్యేకంగా తన దివ్యాధికారంతో అక్షర ఫలకంపై 'అవతార్ మెహెర్ బాబా కీ జై' అనే మాటలను

చూపించి తన చేతులను పైకెత్తి చాటి చెప్పారు. ఆ తర్వాత 'అవతార్' అనే పదం బాబా పేరులో భాగమైపోయి 'అవతార్ మెహెర్ బాబా' యని పిలువబడింది. సద్గురు మెహెర్ బాబా, శ్రీ మెహెర్ బాబా అనే పేరుతో ఆ తర్వాత వచ్చే ఉత్తరాలను సైతం బాబా సెక్రటరీ అయిన అదీ. కె. ఇరానీ త్రిప్పి పంపి అవతార్ మెహెర్ బాబా అని వ్రాయాలని సూచించేవారట. ఆనాడు మెహెర్‌స్థానాలో ఉత్సవం జరుపుకొన్నారు. కుస్తీ పోటీలు నిర్వహించారు. బృంద గానాలు, నాట్యాలు, కోలాటాలు ఆడారు. ఆ ఉత్సవంలో పాల్గొన్న వారి ఆనందానికి మేర లేదు. 700 సంవత్సరాల తర్వాత వచ్చినప్పుడు మళ్ళీ మెహెర్‌స్థానాకు వస్తానని బాబా చెప్పారు. బాబా కార్యకర్తలను సమావేశ పరచి వారి అభిప్రాయాలను విన్న తర్వాత ఇలా చెప్పారు

'మీ బలహీనతలను నేను బహిర్గతం చేస్తాను. మిమ్మల్ని నేను ప్రేమిస్తాను కావున అలా చేస్తాను. నిజాయితీగా ఉండండి. బలహీనతలు అందరిలో ఉన్నాయి. మీరు బలహీనతల గురించి భయపడకండి. అవినీతి గురించి బాధపడకండి'.

## ద్వితీయాంధ్ర దేశ పర్యటన

1953 సంవత్సరంలో జరిగిన ప్రథమ పర్యటనతో తృప్తి చెందని ఆంధ్ర ప్రేమికుల కోరిక మేరకు బాబా 19.02.54 తేదీన ఉదయం 10 గంటలకు ద్వితీయాంధ్ర పర్యటనకు మహాబలేశ్వర్ నుండి కారులో వచ్చి నేరుగా పూనా రైలు స్టేషన్‌కు వెళ్ళి రైలులో విజయవాడకు బయలుదేరారు. పూనా స్టేషన్‌లో ఎంతో మంది ప్రేమికులు, ప్రజలు, రైల్వే అధికారులు, ఉద్యోగులు బాబా దర్శనం చేసుకున్నారు. సోదరులు కె.కె. రామకృష్ణన్ కూడా ఆ రోజే బాబా దర్శనం దూరం నుండి చేసుకున్నారు. ఆస్ట్రేలియా నుండి వచ్చిన ప్రముఖ కవి ఫ్రాన్సిస్ బ్రాబజాన్ కూడా బాబా ననుసరించిన మండలి సభ్యులలో నున్నాడు. ఈ పర్యటన వివరాలను అతడు 'జర్నీ విత్ గాడ్' అనే పుస్తకంలో వ్రాసాడు. కురుద్వాడి రైలు స్టేషన్‌లో మండలి సభ్యుడైన బాలనాటు కూడా రైలు ఎక్కి బాబా అనుచర బృందంతో చేరారు. ఆయన కోరిక మేరకు బాబా వెయిటింగ్ హాలులో కూర్చుండి ప్రజలకు

దర్శనమిచ్చారు. అందరికీ కనబడడం కోసం బాబా పళ్ళ దుకాణంలోని కౌంటర్ పైకి ఎక్కారు. మళ్ళీ అక్కడున్న చిన్న చెక్క బీరువాపైకి ఎక్కి బాబా దర్శనం ఇచ్చారు.

20.02.54 రోజున రాత్రి 8 గంటల 20 ని.లకు బాబా విజయవాడ రైలు స్టేషన్‌లో దిగారు. ఈ ప్రయాణంలో బాబా అప్పుడప్పుడు మండలి వారు కూర్చున్న మూడవ తరగతి పెట్టెలోకి వచ్చి కూర్చునేవారు. మాజేటి రామమోహనరావు, చింతా సర్వారావు, మాణిక్యాల రావు మొదలగు ప్రముఖ బాబా ప్రేమికులు బాబాకు స్వాగతం చెప్పి పూలమాలను వైచి, 'అవతార్ మెహెర్ బాబా కీ జై' అనే నినాదాలు ప్రతిధ్వనించగా తీసుకొని వెళ్ళారు. ఆంధ్ర పర్యటన ఆద్యంతము బాబాకు కారు, మండలి వారికి బస్సు, వారి సామాన్లకు ఒక లారీ ఏర్పాటు చేసారు. బాబా మాజేటి రామమోహన్ రావు గారింట్లో బస చేసారు. 'అందరు కార్యకర్తలు 02.03.54 రోజున రాజమండ్రిలో సమావేశము కావాలని అన్ని చోట్ల చెప్ప' మని బాబా ఆదేశించారు. బాబా మండలివారు స్థానిక కన్యకా పరమేశ్వరి సత్రంలో బసచేసారు.

21.02.54 తేదీన బాబా మండలి వారితో సహా విజయవాడ నుండి గుంటూరుకు బయలుదేరి వెళ్ళారు. బాబా ప్రయాణించిన కారును దాని యాజమాని ఇంజనీర్ ధర్మారావు గారే నడిపారు. బాబా పర్యటన కార్యక్రమాన్ని కె.డి.ఆర్.ఎమ్ (కుటుంబ శాస్త్రి, ధనపతిరావు నాయుడు, రంగారావు, మల్లికార్జున రావులకు సంక్షిప్త నామము) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసారు. బాబా గుంటూరులో మద్ది సుదర్శనం గారింట్లో బస చేసారు. వారింట్లో బాబా దర్శనం యిచ్చారు. వారి పూజా గదిలోకి వెళ్ళారు. అక్కడ బాబాకు హారతులిచ్చారు. ఆ పూజా గదిలోని తన చిత్రపటాన్ని బాబా స్పృశించి పునీతం చేసారు. స్థానిక సాయి సమాజ్ భవనానికి వెళ్ళి పునాది వేయడానికి ఒక రాయిని, ప్రతిష్ఠించడానికి తెచ్చిన షిరిడీ సాయిబాబా చిత్ర పటాన్ని బాబా తన చేతులతో స్పృశించారు. అక్కడ పందిట్లో సమావేశమైన ప్రజలకు దర్శనమిచ్చారు. ప్రతి ప్రజాదర్శన కార్యక్రమంలో తన కేర్పాటు చేసిన ఆసనంపై కూర్చునే ముందు బాబా దర్శనార్థులతో పాటు నేలపై కూర్చునేవారు.

'మనమందరం ఒక్కటే. ప్రతి ఒక్కరిలోపల అనంతుడైన దేవుడే ఉన్నాడు. నేను మీ అందరిలో నొక్కడినని మీరు భావించాలని నేను ముందర నేలపై కూర్చున్నాను' అని చెప్పారు బాబా. బాబా అరటి పళ్ళు ప్రసాదంగా పంచి పెట్టారు. దాదాపు 5000 మంది బాబా చేతులతో ప్రసాదం తీసుకున్నారు. ప్రతి దర్శన కార్యక్రమంలో బాబాకు పూలదండలు వేయడం, హారతులివ్వడం, సన్మాన పత్రాలు చదవడం చేసేవారు. బాబా వాటి అవసరం లేదని, వాటికి ప్రాముఖ్యతలేదని చెప్పినా కరుణామయుడైనందున అజ్ఞానంతో చేసిన ఆ తంతులన్నీ భరించి అందరినీ సంతోషపెట్టారు. ప్రసాదం ఇవ్వడానికి మాత్రం బాబా ప్రాముఖ్యతనివ్వడమే గాక చాలా సమయాన్ని వెచ్చించేవారు. భోజనం తర్వాత గుంటూరు నుండి విజయవాడ తిరిగి వెళ్ళారు. దారిలో సీతారామ క్షేత్రానికి, ఓంకార క్షేత్రానికి వెళ్ళారు. సాయంత్రం విజయవాడలో ప్రజాదర్శనం ఏర్పాటు చేసిన పందిట్లోకి వెళ్ళి అక్కడకు వచ్చిన దాదాపు 50 వేల మందికి దర్శనమిచ్చారు. దర్శన కార్యక్రమానికి వెళ్ళేముందు మాజేటి రామమోహన రావు యింటిలో టీ ఇవ్వగా కొంచెం మాత్రం త్రాగి మిగిలినది ఆయన కుమారుడు సంపత్ బాబాకు యిచ్చారు. మాజేటి రామమోహన రావు బాబాను తన యింటిలోని ప్రతి గదిలోకి తీసుకువెళ్ళి ఆయన పాద స్పర్శ కలిగించాలని అనుకున్నాడు కాని ఆయన ప్రజా దర్శనం జరిగే పందిట్లో ఉండి యింటికి రాలేక పోయారు .అయినా సర్వజ్ఞుడు, కరుణా మయుడు అయిన బాబా తానే స్వయంగా అన్ని గదులలోకి వెళ్ళి తన పాద స్పర్శ కలిగించారు.

ప్రజాదర్శనం తర్వాత బాబా తిరిగి బస చేసిన మాజేటి రామమోహనరావు యింటికి వెళ్ళారు. పెండాలులో జనం రద్దీ పెరిగి గందరగోళంగా ఉన్నందున బాబా ప్రసాదం పంచి పెట్టడం ఆపి వెళ్ళిపోయారు. దానితో కంగారుపడిన మాణిక్యాలరావు బాబా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమం గురించి మరిచిపోయాడు. అక్కడ చాలా మంది ప్రజలు దాదాపు 1500 మంది బాబా రాకకై ఎదురుచూస్తూ కూర్చున్నారు. బాబా తన గదిలోనికి వెళ్ళి విశ్రమించిన తర్వాత ఆ విషయాన్ని కొందరు కార్యకర్తలు వచ్చి చెప్పితే గాని మాణిక్యలరావుకు జ్ఞాపకం

రాలేదు. అప్పటికే మండలి అంతా వెళ్ళిపోయారు. బాబాను మళ్ళీ దర్శనానికి తీసుకొని వెళ్ళడం సాధ్యంగా తోచలేదు. అయినా కరుణామయుడైన బాబా రాత్రి 10.30 గంటల సమయంలో కూడా దర్శనానికి మండలి వారు లేకున్నా ఈరుచ్ వారించినా బయలుదేరి వెళ్ళారు. బాబా కోసం తెచ్చిన భోజనంలోని అన్ని పదార్థాలను కలిపి ముద్ద చేసి బాబా మాణిక్యాల రావుకు యిచ్చారు. బాబా ఆ రోజు భోజనం చేయలేదు. ఈ రోజు బాబాకు సద్రాను తొడిగే అవకాశం కూడా మాణిక్యాల రావుకు బాబా యిచ్చారు. బాబా మాణిక్యాల రావుకు మూడు షరతులను విధించి వాటిని పాటిస్తేనే దర్శనమిస్తానని అన్నారు. 1. అవతార్ మెహెర్ బాబాకీ జై అని అరవ కూడదు. 2. బాబా పాదాలు ఎవ్వరూ స్పృశించ రాదు. 3. బాబాకు పూలదండలు వేయరాదు, కానుకలివ్వరాదు. అలాగే మాణిక్యాల రావు అందరికీ ఆ షరతులు తెలియజేసి వారి అంగీకారంతో బాబా దర్శన భాగ్యం కలుగజేసారు.

బాబా 22.02.54 రోజు మచిలీపట్నం (బందరు) వెళ్ళారు. దారిలో రైల్వే పోలీస్ సూపరింటెండెంట్ ఆఫీస్ వద్ద కారు ఆపారు. దానికి కారణం సర్వజ్ఞుడైన బాబా ఒక్కరికే తెలుసు. పి.ధన్‌రాజ్ నాయుడు జిల్లా రైల్వే పోలీస్ సూపరింటెండెంట్, సకుటుంబముగా రోడ్డుపై బాబా కోసం వేచి యున్నాడు. బాబాకు ఆయన కుటుంబం వారు రోడ్డుపైననే హారతి యిచ్చారు. ఆ తర్వాత బాబా అక్కడ వుయ్యూరు వద్ద వీరమ్మ అమ్మవారి జాతరలో రంగుల రాట్నం ఎక్కి తిరిగారు. విశ్వాన్ని రంగుల రాట్నంగా తన కనుసన్నలతో త్రిప్పే జగన్నాటక సూత్రధారి కిది సరదా కలిగించిందేమో! పామర్రులో రహదారి బంగళాలో ఏర్పాటు చేసిన దర్శన కార్యక్రమంలో పాల్గొని ప్రసాదాన్ని చేతితో తాకి అందరికీ పంచమని చెప్పి బందరు వెళ్ళిపోయారు. బందరులో బాబా పి. లోక్‌నాథ్ (బర్మా షెల్ కంపెనీ ఏజెంట్) యింటిలో బస చేసారు. బాబా బందర్‌లో ఎమ్.ఎస్.ఆర్.శాస్త్రి న్యాయవాది యింటికి వెళ్ళారు. ఆయన కోసం చేయించిన కుర్చీలో కూర్చున్నారు. బాబా కేంద్రం కోసం చేసిన తన ఫోటోకు బాబా స్వయంగా ప్రణమిల్లి పూలదండ వేసారు. ఆ సందర్భంగా బాబా ఈ సందేశం ఇచ్చారు.

'నేను ప్రణమిల్లడానికి నేను తప్ప ఇంకెవరూ లేరు. అన్నిటిలో నేనే ఉన్నాను. మీరు శాశ్వతంగా నా వారైనట్లే, నన్ను మీ వాడిని చేసుకుంటే నేను భౌతికంగా ఇక్కడికి రావడము ఈ కేంద్రానికి ప్రారంభం చేయడం సార్థకం అవుతాయి. మీరంతా నా వారు. నన్ను మీ వాడిని చేసుకోండి. భగవంతుడొక్కడే సత్యమని, శాశ్వతమని అందరు తెలుసుకొనేలా జేసి నా ప్రేమ సందేశం వ్యాప్తి చెయ్యగలిగితే ఈ కేంద్రం యోగ్యమైనదవుతుంది. మీ అందరికీ నా ప్రేమాశీస్సులు'.

బందరులో బాబా సాయి సమాజానికి వెళ్ళి దానిని నడిపే సత్యవతమ్మను దీవించి తనకిచ్చిన పళ్ళ రసాన్ని కొంచెం త్రాగి మిగిలినది ఆమెకు త్రాగమని యిచ్చారు. సాయంత్రం మునిసిపల్ టౌన్ హాలులో వేయించిన పందిట్లో ప్రజా దర్శనమిచ్చారు. అక్కడ సన్నాయి మేళం వాద్యం చేసిన పాటలు, గానం చేయబడిన భక్తి పాటలు విని, 'తనకు సంగీత మంటే చాలా యిష్టమని యుగాల క్రిందట తానాలపించిన ఆది గీతం వల్లనే ఈ సృష్టి జనించిందని ఈ సంగీతాలు వింటే తన ఆది గీతం స్ఫురణకు వస్తుంది' అని బాబా చెప్పారు. ప్రజా దర్శనం తర్వాత బాబా ఎస్. ఎస్. మూర్తి, వెంకట రత్నం నాయుడు గార్ల యిళ్ళకు వెళ్ళారు. వెంకట రత్నం నాయుడు గారింటికి వెళ్ళేముందు వారి యింటి చేరువలోనే ఉన్న ఒక గుడిసెలోకి వెళ్ళి నేల మీద కూర్చున్నారు. అక్కడొక బల్ల ఉన్నా దానిపై కూర్చోలేదు. తాపీ పని చేసుకునే లక్ష్మడు అనే ఆ గృహస్థు బాబా కెదురుగా కూర్చుని ఆశ్చర్యంలో ఉండిపోయాడు. అతడు తన భార్యతో బాబా సంపన్నులకే గాని బీదవారికి కాదని చెప్పాడు. సర్వజ్ఞుడు ప్రేమ స్వరూపుడు అయిన బాబా నిర్మలమైన ప్రేమ గల చోటుకు వెళ్ళకుండా ఎలా ఉండగలడు? ఆ తర్వాత వెంకట రత్నం గారింటిలోకి వెళ్ళి జబ్బుతో నున్న అతని శరీరం నిమిరి పాదాలొత్తారు.

రాత్రి భోజనాల తర్వాత బాబా గుడివాడ మీదుగా ఏలూరు వెళ్ళారు. గుడివాడ సమీపంలో నుండగా బాబా తన కారును హఠాత్తుగా ఆపమన్నారు. కారణం ఎవరికీ తెలియదు. వెనకాలే వస్తున్న వాహనాలన్నీ నిలిచిపోయాయి. పదిహేను నిమిషాల దాకా నిలిచిపోయాయి. ఎవరికీ బాబాను కారణం అడిగే ధైర్యం లేక అలాగే

ఉండిపోయారు. అంతలో కొంతమంది బీద గ్రామీణులు, స్త్రీలు పిల్లలతో కలిసి ఆ దారినే వెళ్ళే బాబా దర్శనం చేసుకుందామని త్వరత్వరగా నడుస్తూ కొన్ని మైళ్ళు ప్రయాణం చేసి ఆయాసంతో వచ్చారు. తమ కోసం కారు ఆపుకొని బాబా రోడ్డుపై వేచియున్నారని తెలుసుకొన్న వారి ఆనందాని కంతులేదు. తన్మయత్వంతో వచ్చిన వారు బాబా కాళ్ళను కన్నీళ్ళతో తడుపగా బాబా వారిపై ప్రేమ వృష్టి కురిపించారు. బాబా వెంటనే ప్రయాణం సాగించారు.

గుడివాడ పట్టణంలో దాహంగా ఉందని, సోడా కావాలని బాబా అడిగారు. దాని కోసం కారు ఆపారు. సరిగ్గా అదే చోట ఒక వృద్ధుడు ఒక చేతిలో అరటి పళ్ళు, ఒక చేతిలో లాంతరు పట్టుకుని యున్నాడు. బాబాను చూడగానే ముందుకు వచ్చి అరటి పళ్ళు బాబా చేతిలో పెట్టాడు. బాబా ఆ కానుకను స్వీకరించి అతనికి దర్శనం యిచ్చారు. తనకు ప్రియమైన వారి కోర్కెలను ఎలా తీరుస్తారో ఎంత సహజంగా కలుగజేస్తారో మన ఆలోచనలకు కూడా అందని విషయం. ఆ వృద్ధుడు ఎంత సేపటి నుండి నిలబడ్డాడో అతని హృదయంలో ఎంత ప్రేమ ఉందో సర్వజ్ఞుడైన బాబాకు మాత్రమే తెలుసు కదా! కొంచెం ముందుకు వెళ్ళిన తర్వాత దుర్గా కూల్ డ్రింక్స్ షాపు ముందు ఆపి బాబాకు సోడా తెచ్చి ఇచ్చారు. ఆ షాపు యజమాని బాబాకు ప్రణమిల్లి సోడాకు డబ్బు పుచ్చుకోనంటే బాబా తమ ప్రసాదంగా తీసుకొమ్మని యిచ్చారు. మండలి వారందరు అలా చల్లని పానీయాలు త్రాగారు. బాబా దిగి ఆ షాపులోకి వెళ్ళి వచ్చారు. బాబా పనికి ఆయన ఎన్నుకున్న మార్గాలు మనకవగతం కావు గదా! ఈ రాత్రి 22.02.54 రోజు రాత్రి 11 గంటల తర్వాత బాబా ఏలూరు చేరుకున్నారు. కట్టా సుబ్బారావు తోటలోనే క్రిందటి మాదిరిగా అన్ని ఏర్పాట్లు చేయబడ్డాయి.

23.02.54 రోజు ఉదయం కట్టా సుబ్బారావు తోటలో అక్కడికి వచ్చిన వారికి దర్శనమిచ్చారు. బాబా సందేశాలు విని భజనలు పాడారు. సాయంత్రం రామకోటి వద్ద వేయించి అలంకరించిన పెద్ద పందిరిలో బాబా దర్శనమిచ్చారు. రాత్రి 8

గంటలకు కళాశాల విద్యార్థినులు దశావతారాలు మొదలైన నాట్యాలు ప్రదర్శించారు. మండపాక గంగాధరం అను కళాకారుని ఈల పాటలు కూడా విని బాబా ఆనందించారు. ఒక మౌన స్వామి ఏలూరులో బాబా 1953లో వచ్చినప్పుడు బాబా కుటీరము వద్ద సేవ చేస్తూ ఉంటానని చెప్పి అచ్చట తనకు సరియైన సదుపాయాలు కల్పించలేదని ఏలూరు విడిచి వెళ్ళిపోయాడు. తన ఆదేశాలు పాటించనందుకు బాబా అసంతృప్తిని వెలిబుచ్చగా ఆ స్వామి విలపించాడు. బాబా అతని నాలింగనం చేసుకొని మళ్ళీ తన ఆదేశాల నిచ్చారు.

24.02.54 రోజు ఉదయం ఏలూరులో 60 మంది ప్రేమికుల యిళ్ళకు వెళ్ళారు. కార్యక్రమం ప్రకారం వెళుతూ మధ్యలో బాబా తన కారును దారి మళ్ళించి ఒక స్కూల్‌లోనికి తీసుకొని వెళ్ళారు. అందరూ బాబా వెనకాలే వెళ్ళారు. బాబా ఎక్కడికి వెళుతున్నారో ఎవరికీ తెలియదు. ఏలూరు పట్టణంలోని దారులు బాబాకు తెలియవని కార్యకర్తలు అనుకున్నారు కాని సర్వజ్ఞుడైన బాబాకు తెలియనిదేది? అన్నీ తెలసి బాబా ఏమీ తెలియనట్లుంటారు. స్కూల్ లోనికి వెళ్ళగానే బాబా కారు దిగి నడిచి వెళ్ళి ఒక తరగతి గది ముందు నిలబడ్డారు. తరగతి గదిలో నుండి దాదాపు 8 సంవత్సరాల వయస్సు గల ఒక కుర్రవాడు పరుగున వచ్చి బాబాపై వాలాడు. బాబా ఆ కుర్రవానిని ఎత్తుకొని ముద్దాడి అక్కున చేర్చుకున్నాడు. ఆ పిల్లవాని ఆనందాని కంతులేదు. ప్రవహించే కన్నీటి ధారతో విలపించాడు. ఆ కుర్రవాడు క్రితం రోజున బాబా కార్యక్రమాల గురించి అచ్చు వేయించి పంచిపెట్టిన కరపత్రాన్ని ఒక దాన్ని చూచి బాబా ముఖంలోని తేజస్సుకు ఆకర్షించబడి తన తండ్రిని బాబా దర్శనానికి తీసుకొని వెళ్ళమని పట్టుబట్టాడు. ఛాందస బ్రాహ్మణుడైన ఆ తండ్రి నేను దేవుడనని చెప్పుకునే ఒక పార్సీ దేవుడి వద్దకు తీసుకొని వెళ్ళడం యిష్టం లేక ఆ కుర్రవాడిని మందలించాడు. ఆ కుర్రవాడు మాత్రం బాబా దర్శనానికి తీసుకొని వెళ్తేనే గాని భోజనం చేయనని మారాం చేసాడు. అయినా ఆ తండ్రి తన పట్టు విడువలేదు. రాత్రి భోజనం చేయకుండా పడుకున్నాడు. ఉదయాన్నే బాధతో తన తండ్రి వైఖరి అర్థం గాక హృదయంలో బాబా దర్శనానికై

తపన దహించివేసే ఆ పసివాడు విచలిత మనస్కుడై పాఠశాలకు వెళ్ళాడు. వాడి మనస్సంతా బాబాపైనే ఉంది. పాఠశాలలో చెప్పే పాఠాలేవీ వాని మనస్సులోకి వెళ్ళడం లేదు. సర్వజ్ఞుడు, కరుణామయుడైన బాబా స్వయంగా ఆ పాఠశాలకు వెళ్ళి తన దర్శనానికై తపించే ఆ పసివాడిని తన ఒడిలో చేర్చుకొని తన ప్రేమ సాగరంలో ముంచెత్తాడు. ప్రహ్లాదుని వలె ఆ పరాత్పరుని తన వద్దకే రప్పించుకొన్న ఆ పసివాని ప్రేమ ఎంత మహత్తరమై యుండునో గదా! ఆ పాఠశాలలోని అధ్యాపకులు, విద్యార్థులందరూ ఆ పసివాని కారణాన బాబా దర్శన భాగ్యం పొందారు.

బాబా ఏలూరులో ఇంకా ఎంతో మంది ప్రేమికుల ఇళ్ళకు, వారి షాపులకు, కొన్ని పాఠశాలలకు, సాయిబాబా మందిరానికి వెళ్ళారు. వేలాది మంది బాబా దర్శనం చేసుకున్నారు. తన స్పర్శతో పంచిపెట్టే ప్రసాదం ద్వారా బాబా తన ప్రేమను పంచిపెట్టారు. అర్హతలను బట్టి అందరూ బాబా ప్రేమను స్వీకరించారు. తెలియని ఆనందానుభూతిని పొందారు. బాబా కూడ తన సంతృప్తిని వ్యక్తం చేసారు. ఏలూరులో కట్టా సుబ్బారావు బాబాకు మండలి వారికి ప్రేమతో అన్ని ఏర్పాట్లు చేసి ఆప్యాయతతో మండలి వారికి రక రకాల పదార్థాలను చేయించి తినిపించాడు. నిజంగా కట్టా సుబ్బారావు అవతారుని సేవ నిండు హృదయంతో చేసుకున్న ధన్యజీవి.

ఆ రాత్రి (24.02.54) గం. 8.30ని.లకు ఏలూరు నుండి బయలుదేరి భీమడోలు వెళ్ళి అక్కడ ప్రజా దర్శనం యిచ్చి తాడేపల్లి గూడెం వెళ్ళారు. బాబా యిచ్చిన మాట ప్రకారం రాత్రి 11.30 గం.లకు బయలుదేరి పెనుగొండకు వెళ్ళి అక్కడ ఇంకా వేచియున్న ప్రజలకు రాత్రి ఒంటి గంటకు దర్శనమిచ్చి ఉదయం గం. 3.25 ని.లకు మళ్ళీ తాడేపల్లి గూడెం తిరిగి వచ్చారు. ఆ రోజు రాత్రి బాబా అందరినీ జాగరణ చేయమన్నారు. పెనుగొండ కార్యక్రమానికి వెళ్ళి రావడంలో అది అప్రయత్నంగానే జరిగిపోయింది. మేలుకొలిపే వానికోసం ఆ రోజు రాత్రి అందరూ మేలుకొని ఆయన సాన్నిధ్యంలో గడిపారు.

## బాబాకు షష్ట్యబ్ది పూర్తి

అరవై సంవత్సరాలు నిండిన వారు షష్ట్యబ్ది ఉత్సవం చేసుకుంటారు. జనన మరణాల కతీతుడైన అవతారునికి కూడా షష్ట్యబ్ది పూర్తి ఉత్సవం చేసే మహదావకాశం ఆంధ్రులకు, తాడేపల్లిగూడెం ప్రేమికులకు ప్రత్యేకంగా డా. ధనపతిరావు దంపతులకు కలుకజేసారు బాబా. 25.02.54 ఉదయం బాబా రాగానే వారు బాబాకు ఎదురేగి పూలదండలు వైచి సాదరంగా ఆహ్వానించారు. ఆ కొద్దిసేపు అక్కడ ఉన్న వారికి బాబా పాదాలకు ప్రణామం చేయడానికి అనుమతించారు. తరువాత యింటిలోనికి వెళ్ళి కూర్చున్నారు బాబా. సరిగ్గా 5 గంటలకు ఈరుచ్ ఆంగ్లంలో, రంజూ ఉర్దూలో, ఢాకే మరాఠీలో బాబా ఆజ్ఞ ప్రకారం పశ్చాత్తాపప్రార్థన చదివారు. బాబా తాను స్వయంగా అందరి బలహీనతలను క్షమించమని అడిగానని, అందరు క్షమించబడ్డారని ఆ రోజు నుండి ఎవరి చేతలకు వారే బాధ్యులని చెప్పారు. డా. ధనపతిరావు దంపతులు బాబా




పాదాలను తేనె, పాలు, నెయ్యి మొదలగు పంచామృతాలతో కడిగారు. 'త్వరగా నీళ్ళుపోసి నా కాళ్ళు కడగండి లేకపోతే చీమలు పట్టుకుంటాయి' అని బాబా హాస్యం చేసి అందరినీ నవ్వించారు. 'కాళ్ళు కడిగిన నీటిని ఎవ్వరూ త్రాగరాదు. తలపై పోసుకోరాదు, బయట పోయించండి' అని చెప్పారు. పిళ్ళై అనే రిటైర్డ్ ఇంజనీర్ గారి అమ్మాయిలు మీరా, వీణా ఇద్దరూ బాబాకు ప్రక్కన నిలబడ్డారు. వారిని బాబా ఆశీర్వదించారు. ఉదయం గం. 5.30 ని.లకు బాబా బయట ఏర్పాటు చేసిన పందిట్లో కూర్చున్నారు. ఆంత ఉదయాన్నే బాబా దర్శనం

కోసం దాదాపు 500 మంది వచ్చి కూర్చున్నారు. ఎవరూ తన పాదాలు తాకకూడదని ఆజ్ఞాపించారు. చింతాక్రాంతులై యున్న కోడూరు కృష్ణారావు దంపతులకు గోదావరి జలాలతో తన కాలి వ్రేళ్ళను కడగటానికి మాత్రం బాబా అనుమతించారు. వారు సంతోషించారు. సావనీర్ నుండి వచ్చిన అబ్దుల్ మజీద్ ఖాన్ ప్రార్థన చేసాడు. బాబా అనుమతితో ఆయన మెడలో పూలదండ వేసాడు. బాలగోపాల భాస్కరరాజు మొదలగు వారు పలు భాషలలో బాబా హారతి గానం చేసారు. ఉదయం గం. 7.30 లకు రహదారి బంగాళాలో ప్రారంభించి మేళతాళాలతో, నృత్యాలతో బాబాను ఊరేగింపుతో పుర వీథులగుండా ధనపతిరావు యింటి వరకు తీసుకొని వెళ్ళారు. అక్కడ ప్రత్యేకంగా అలంకరింపబడిన పందిట్లో బహిరంగ సభ, సమావేశం జరిగింది. వివిధ భాషలలో ప్రార్థనలు చదివారు. రంజూ, అబ్దుల్లా 'అల్లా హో ! అక్బర్' అని ఇస్లాం సాంప్రదాయానుసారంగా ప్రార్థన చేసాడు. షష్ఠ్యబ్ది పూర్తి మహోత్సవానికి బాబా యిచ్చిన ప్రత్యేక సందేశాన్ని రంజూ చదివి వినిపించాడు. దాని తెలుగు అనువాదాన్ని ఈ క్రింద విధంగా జగన్నాథంగారు చదివి వినిపించారు.

'నేనెప్పుడూ జన్మించ లేదు. ఎప్పుడూ మరణించను. అయినా ప్రతి క్షణం అనేకమైన జనన మరణాలను పొందుతుంటాను. మానవ చైతన్యము పరిపూర్ణంగా వికసించడానికి అవసరమైన ప్రగతి క్రమంలోని అసంఖ్యాకమైన ఘట్టాలే మాయాన్వితమైన ఈ జనన మరణాలు. ఇవి అసలైన మరణము, జననము పొందుటకు ముందు అవసరమైన ఘట్టాలు. నిజమైన మరణము అహాన్ని పోగొట్టుకున్నప్పుడు, నిజమైన జననము అహంకార నాశన ఫలితంగా ఎరుకతో భగవంతుని శాశ్వత జీవనాన్ని అనుభూతి పొందడంలో కలుగుతుంది. నేను ఎల్లప్పుడు నా అనంత స్థితిలో నిరాకారుడనై సర్వోపగతుడనై యున్నను, సాకారుడనై మీ మధ్య జన్మించుట జనన మనియు, ఈ భౌతిక రూపాన్ని విసర్జించుట మరణమనియు చెప్పబడుతున్నది. ఈ విధంగా నేను అరవై సంవత్సరాల క్రితం జన్మించాను. నా విశ్వకార్యం పూర్తి కాగానే మరణిస్తాను. ఈనాడు మీరు నాషష్ఠ్యబ్ది

పూర్తి మహోత్సవం ప్రేమతోను, ఉత్సాహం తోను, శ్రద్ధతోను జరపడం నన్ను గాఢంగా చలింప జేసాయి. మరియు మనమందరం ఒక్కటేయని, భగవంతుడే సత్యమని తదితరమంతా అసత్యమని తుదకవగాహన చేసుకొనుటకు మీకు నా ఆశీస్సుల నిచ్చునట్లు చేసింది'.

బాబా షష్ఠిపూర్తి ఉత్సవాలు దేశవిదేశాలలో కూడా చేసుకున్నారు. అందరికీ బాబా తనసందేశాన్ని, ప్రేమాశీస్సులను కేబుల్స్‌ద్వారా పంపించారు. మంచెం బుచ్చి లింగప్ప శాస్త్రి రచించిన పద్యములను చదివాడు. ఇతడు బాబా ప్రార్థనను గేయ రూపంగా వ్రాసాడు. హారతి చేసే సమయంలో హారతి పళ్ళెము బాబా స్వయంగా తన చేతులతో పట్టుకొని తిప్పారు. మళ్ళీ మధ్యాహ్నం గం. 3. 30ని. లకు పందిట్లో దర్శనమిచ్చారు. బాబా తాడేపల్లి గూడెంలో పలుప్రేమికుల యిళ్ళకు వెళ్ళారు. బాలగోపాల భాస్కర రాజు యింటికి వెళ్ళినప్పుడు అతడు ఇంట్లో లేడు. బాబా తిరిగి వస్తుండగా ఎదురయ్యాడు. బాబా అతనిని కరుణించి రెండవ మారు అతనింటికి వెళ్ళి అడిగి ఒక పాట పాడించుకున్నారు. ఆ సందర్భం కోసం ప్రత్యేకంగా వ్రాసిన 'మరచితి నా మందిరంబు' అనే పాటను భాస్కరరాజు గారు పాడి బాబాకు వినిపించారు. బాబా షష్ఠిపూర్తి ఉత్సవం జరుగుతున్న సమయంలో ధనపతిరావు యింటిలో పనిచేసే రావలక్ష్మమ్మ అనే ఆమె బాబా పాదాలను స్పృశించి ఆయన దర్శనం చేసుకోవాలని ఎంతో ఉబలాట పడింది కాని ఆ రోజు బంధుమిత్రుల సందోహంలో డాక్టర్ గారు ఆమెను విస్మరించారు. ఈయన కూడా ధనవంతుల దేవుడేనేమో తనలాంటి నిరుపేదలకు ఆయన దర్శన భాగ్యం కలుగదేమోననే బాధతో తీరని ఆశతో కలిగిన దుఃఖాన్ని దాచుకుంటూ వెళ్ళి తన గుడిసెలో పడుకుంది. ఏమీ తోచని స్థితిలో భారంగా లేచి ఏదో పని కోసం లోపలికి వెళ్ళింది. ఆ సమయంలో ధనపతిరావు యింటి నుండి రహదారి బంగళాకు కారులో వెళ్ళవలసిన బాబా కారు యెక్కకుండా కాలినడకన బయలుదేరారు. వెళ్ళి అనతి దూరంలో గల రావలక్ష్మమ్మ గుడిసెలో ప్రవేశించి మంచంపై కూర్చున్నారు. ఆ దృశ్యము చూసి రావలక్ష్మమ్మ నిశ్చేష్టురాలైంది. బాబా మోకాళ్లపై తన తలనానించి వెక్కివెక్కి ఏడ్వసాగింది. తన మనస్సులోని కోరికను తెలుసుకొని తానే స్వయంగా





తన నిరుపేద గుడిసెలోనికి వచ్చి దర్శనమిచ్చిన బాబా సర్వజ్ఞత్వానికి, కరుణకు ఆనందాతిశయంతో పొంగి పోయింది. సర్వ హృదయజ్ఞుడైన బాబాకు తెలియని దేముంది? ఆయనకు కావలసినది నిర్మలమైన ప్రేమయే గాని పేద, ధనిక ఆడంబరాలు గావని ఆమెకు, అందరికీ తెలియజేసారు బాబా.

బాబా 26.02.54 రోజు మధ్యాహ్నం తాడేపల్లిగూడెం నుండి బయలుదేరి రామచంద్రాపురం వెళ్ళి అక్కడ రామభద్రరాజు గారింట్లో దర్శనమిచ్చి అక్కడి నుండి గోపాలపురం వెళ్ళారు. అక్కడ ప్రత్యేకంగా వేసిన పందిట్లో కూర్చుని దర్శనమిచ్చారు. ప్రారంభంలో బాబాకు హారతి యివ్వగానే వర్షం కురిసింది బాబా వేదికపై నిలబడి అందరినీ కూర్చోమని చెప్పారు. వేల జనం చుట్టు ప్రక్కల గ్రామాల నుండి వచ్చారు. సాయంత్రం గం.4.30లకు గోపాలపురం నుండి నిడదవోలు వెళ్ళారు. నిడదవోలులో దాదాపు 5000 మంది బాబా దర్శనం చేసుకున్నారు. బాబా కొంత మంది ప్రేమికుల యిళ్ళకు కూడా వెళ్ళారు. కె.డి.ఆర్.ఎమ్ లో సభ్యులైన మల్లికార్జున రావు మరియు కుటుంబ శాస్త్రి యిళ్ళకు వెళ్ళారు. నిడదవోలు కార్యక్రమం వాళ్ళే ఏర్పాటు చేసారు. బాబా ఏర్పరచిన ట్రస్ట్‌కు బాబా నియమించిన మొదటి ఛైర్మన్ కుటుంబ శాస్త్రి గారే. నిడదవోలు నుండి బాబా కొవ్వూరుకు వెళ్ళారు. రాత్రి 8 గంటలకు కొవ్వూరు చేరుకున్నారు. కొవ్వూరులో రామలింగేశ్వర రావు, న్యాయవాది యింటిలో ప్రత్యేకంగా వేసిన పందిట్లో అక్కడికి చేరిన వారికి బాబా దర్శనమిచ్చారు. ఆంధ్ర పర్యటనలో రామలింగేశ్వరరావు బాబాను అడిగి ఆయన అనుమతితో ప్రైవేట్ సెక్రటరీగా వ్యవహరించారు. తరువాత గోదావరి దగ్గర మెహెర్ స్థాన్ నిర్మించిన స్థలం దగ్గర వేసిన పందిట్లో బాబా రాత్రి గం.9.30లకు దర్శనమిచ్చారు. ప్రకాశంతో వెలిగిపోతున్న సుందర వదనాన్ని చూచి చాలా మంది ఆకర్షితులైనారు. బయట బాణా సంచా పేల్చుతున్నా పందిరివదిలి ఎవరూ వెళ్ళలేదు. బాబావైపు చూస్తూ కూర్చున్నారు. ఆ తర్వాత మండలి వారికి, బాబాకు మూడు ప్రత్యేకమైన లాంచీలలో రాత్రి బస ఏర్పాటు చేసారు. అందరూ ఎక్కిన తర్వాత లాంచీలను గోదావరిలో రాజమండ్రి వైపుకు తీసుకొని వెళ్ళారు. కొవ్వూరు రేవులో ఉంటే క్రొత్త దర్శనార్థులందరూ బాబాకు

విశ్రాంతి లేకుండా చేస్తారనే ఉద్దేశంతో అలా చేసారు. మండలి వారు చాలా సంతోషపడి గోదావరిలో లాంచీలలో నిద్రపోయే ఏర్పాటుకు ఆనందించారు. మెహెర్ స్థాన్ నిర్మించిన శ్రీ కోడూరు కృష్ణారావుగారే ఈ ఏర్పాటు చేసారు. 27.02.54 తేదీన ఉదయం గం. 8.30 లకు బాబా లాంచీనుండి దిగి పందిట్లోకి వెళ్ళి అక్కడ చేరిన దాదాపు 200 మందికి దర్శనం యిచ్చి ప్రసాదం పంచిపెట్టారు. కొవ్వూరులో బాబా కొంతమంది ప్రేమికుల యిళ్ళకు వెళ్ళారు.

27.02.54 మధ్యాహ్నం బాబా కొవ్వూరు నుండి రాజమండ్రికి వెళ్ళారు. అక్కడ బాబా బస గురుకుల విద్యాలయాశ్రమంలో ఏర్పాటు చేసారు. సాయంత్రం 4 గంటలకు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన దర్శన కార్యక్రమానికి వెళ్ళారు. పురజనులు, ప్రముఖులు, సబ్ కలెక్టర్ మొదలగు ఉన్నతాధికారులు, ఉద్యోగులు అందరూ దాదాపు 6000 మంది దర్శనం చేసుకున్నారు. 'ఆలయాలు, చర్చిలు, మసీదులు నిర్మించుకునే బదులు హృదయంలో ప్రియతముడైన దైవానికి ఆలయ మేర్పరచుకుంటే, యాంత్రికంగా చేసే కర్మకాండలకు బదులు తోటి మానవులకు ప్రేమతో నిస్వార్థంగా అందరిలో ఉన్న భగవంతునికి చేస్తున్నామనే భావనతో సేవజేస్తే నాపని పూర్తి అయినట్లే' నని చెప్పారు బాబా. మరునాడు అనగా 28.02.54 రోజు గురుకుల విద్యార్థులతో కొంత సమయాన్ని గడిపి వారికి తన దర్శనం యిచ్చి కొన్ని సందేశాలను యిచ్చారు. ఆ తర్వాత గం 8.55 ని.లకు బయలుదేరి అమలాపురం వెళ్ళారు. దారిలో ధవళేశ్వరంలో కెనాల్స్ సూపరింటెండెంట్ ఇంజనీర్ నరంబునాథన్ పిళ్ళై యింటికి వెళ్ళారు. అక్కడ ఉన్న వారికి దర్శనమిచ్చి అమలాపురం బయలు దేరారు. దారిలో బాబా బాగా ఆకలి వేస్తోందన్నారు. 'పప్పు, అన్నం కావాలి' అని అడిగారు. బొబ్బర్లంక గ్రామం వద్ద ఆపి అన్నం వెదకటం కోసం బయలుదేరారు. ఒక గుడిసె ముందు నిలబడి యున్న ఒక వృద్ధ స్త్రీని, అప్పుడే వండిన అన్నం చూసి కుటుంబ శాస్త్రిగారు వెళ్ళి 'జీసస్ క్రీస్తు కొరకు కొంచెం అన్నం పెడతావా' యని అడిగి తీసుకొచ్చారు. బాబా ఆ అన్నం రెండు ముద్దలు తిని ఆ స్త్రీని కౌగిలించుకొని ఆమె అదృష్టవంతురాలని చెప్పారు. తన ప్రియతమ ప్రభువును కలవాలనే తపన ఆమెలో గుర్తించాడేమో బాబా